# స్వరాజ్యం

## ప్రజాహక్కుల పత్రం

**లోక్ సత్తా**

ప్రజలే ప్రభువులు

# స్వరాజ్యం

## లోక్‌సత్తా

ఈ గ్రంథంలోని భాగాలను సందర్భోచితంగా స్వేచ్ఛగా ఉదహరించవచ్చును. అయితే ముందుగా ప్రచురణకర్తలకు తెలిపి మూలాన్ని ఉటంకించి మాత్రమే వాడుకోగలరు.

ప్రథమ ముద్రణ 1998
సవరణలు, అదనపు సమాచారంతో రెండవ ముద్రణ
సెప్టెంబర్ 1, 2007
ప్రతులు 5000

**ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్**

407, టులిప్స్ అపార్ట్‌మెంట్స్
సివిల్ సప్లైస్ భవన్‌లేను
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ముద్రణ :
**కళాజ్యోతి ప్రాసెస్**
ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్,
హైదరాబాద్ - 20

# ముందుమాట

సేవ ద్వారా ప్రజలకు చేరువ కావటం లోక్‌సత్తా/పార్టీ విధానం. అందుకే లోక్‌సత్తా/పార్టీ కార్యాలయాల్ని 'పౌరసేవా కేంద్రాలు'గా రూపుదిద్దింది. పౌరుల హక్కుల్ని, రోజువారీ జీవితంలో ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థల నుంచి వారికి కావలసిన వివిధ సేవల్ని ఎలా పొందాలో లోక్‌సత్తా / పార్టీ పౌరసేవా కేంద్రాలు స్పష్టమైన సమాచారం అందిస్తాయి. ఆ ప్రజాహక్కులకు పుస్తకరూపం ఇది. పౌరులకు విశేషమైన శక్తినిచ్చే ప్రజాదండం, వజ్రాయుధం ఈ పుస్తకం. పాలన నుంచి పౌరులకు అందాల్సిన విభిన్న సేవలకు సంబంధించి వాస్తవ సమాచారాన్ని ఇందులో సూటిగా, సరళంగా, ఉపయోగకరమైన రీతిలో అందించాం. ప్రజాసేవల సమాహారంలో మీకు వివరిస్తున్న అంశాల్లో కొన్ని - వివిధ సర్టిఫికెట్లు పొందటం ఎలా? భూ సంబంధ అంశాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఓటుహక్కు, పౌర సమస్యలు, ప్రజాప్రయోజనాలు, పౌరహక్కులు, హక్కుదారుల అధికారాలు...

ఒకే నాణానికి రెండు పార్శ్వాలు హక్కులు, బాధ్యతలు. ఒకరి హక్కు మరొకరి బాధ్యత అవుతుంది. కాబట్టి ఆ కోణంలో కూడా సమాచారాన్ని అందివ్వటం జరిగింది.

- ప్రజాసౌకర్యాలు/సేవలు పొందటానికి పౌరుడు చేయవలసిందేమిటి?
- ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థ చేయవలసినదేమిటి?
- సరైన సేవలు లభ్యంకాని పరిస్థితిలో పరిష్కారం ఏమిటి?

అన్ని అంశాల విషయంలోనూ చట్టబద్ధంగా సరైన సమాచారాన్ని అందించటానికి తగు జాగ్రత్తల్ని పాటించాం. చూడటానికి, చదవటానికి చాలా సులువుగా అనిపించే ఈ పుస్తకంలో ఉన్న అంశాల వెనక ఎంతో గజిబిజి, గందరగోళం దాగి ఉన్నాయి. పద్మవ్యూహాన్ని తలదన్నే ప్రభుత్వ కార్యాలయాల నుంచి, సంస్థల నుంచి విషయాలను సేకరించి - వాటిని సరళంగా, సూటిగా పొందుపరిచి విలువైన సమాచారం అందివ్వటం ఎంతో శ్రమతో కూడిన విద్య. ప్రజాసంక్షేమం పట్ల చెదరని అనురక్తే నిరంతర ఇంధనంగా పనిచేయించింది. ఇందులో ఇచ్చిన సమాచారమంతా చట్టబద్ధమే. ఆయా అంశాలకు సంబంధించిన అధికారిక ఫారాలను కూడా జతపర్చటమైనది. ఆంగ్ల ఫారాలకు అధికారిక తెలుగు అనువాదాలు లేనందున వాటిని తెనిగించి మీకు అందిస్తున్నాం. వీటిలో కొన్ని ఫారాలలోని పద ప్రయోగాలను, వాక్య నిర్మాణాలను చూస్తే చాలా వరకు ప్రభుత్వ పనులు ఎంత నిర్లక్ష్యంగా ఉంటాయో తెలుస్తుంది.

**పౌర హక్కుల పత్రం**

- ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలు చిన్నవి, పెద్దవి కలిపి వందల్లో ఉంటాయి. వీటిలో ముఖ్యమైన, తరచూ అవసరమైనవి ఎంపికచేసి ఈ పుస్తకంలో అందించాం. ఆచరణాత్మకంగా ప్రభుత్వం నుంచి పౌరులు పొందగలిగిన కీలక సేవలన్నిటినీ ఇందులో ఇచ్చాం.
- పౌరులకు సమాచారం తెలియాలని, తెలుసుకుని వారు సమిష్టిగా నిలదీసి ప్రభుత్వం నుంచి, ఉద్యోగుల నుంచీ సరైన సేవలను పొందగలగాలనేదే లోక్‌సత్తా/పార్టీ తపన. ఈ సేవల్ని ప్రజలకు చేరువ చేయటంలో

పార్టీ కార్యాలయాలు వేదిక కావాలన్నదే మా ప్రయత్నం.

- ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా సాధ్యమైనంత సూటిగా, సులువుగా పుస్తకాన్ని రూపొందించేందుకు కృషి చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంతో విడిచిపెట్టిన బాధ్యతను నెరవేర్చటానికి, మా వంతు ప్రయత్నం చేశాం. కొన్ని కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ఈ దిశగా కొన్ని ప్రయత్నాలు చేసినా అవి చెదురుమదురుగా, గందరగోళంగా తయారయ్యాయి. లోక్‌సత్తా /పార్టీ ఈ లోపాల్ని చాలా వరకూ సవరించగలిగింది. పూర్తి పౌర అధికారాలతో, అంచనావేయగలిగిన పనితీరు ప్రమాణాలతో, ప్రజాసేవకై నిర్దేశించిన ప్రమాణాలను అందించలేనప్పుడు నష్టపరిహారంతో సమగ్ర పౌరహక్కుల పత్రాన్ని ప్రభుత్వాలు వెలువరించటానికి మనదేశంలో ఇంకా సమయం పడుతుంది.

- ప్రజాస్వామ్యంలో ప్రజలే నిజమైన ప్రభువులు... పన్నులు కట్టే ఆ పౌరునికి, ప్రభుత్వం, ప్రభుత్వ సేవకులు జవాబుదారీగా ఉండేలా చేసేందుకు చేసిన ప్రయత్నం ఇది. దీన్ని అన్ని వర్గాల ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్రయోజనం పొందాలని లోక్‌సత్తా /పార్టీ ఆశిస్తోంది. పౌరులు సంఘటితంగా పరిజ్ఞానంతో నిలదీసినప్పుడు మాత్రమే ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయగలరు. అందుకు ప్రభుత్వ సేవలపై ప్రజల నిరంతర అజమాయిషి కావాలి. అదే లోక్‌సత్తా / పార్టీ లక్ష్యం.

- ఈ పుస్తకంలో సమాచారం ఇచ్చేటప్పుడు చాలా వరకూ కఠిన పదాలను తొలగించటం జరిగింది. పరిపాలనాసంబంధ పదాలకు అర్థాలను పుస్తకం చివర పదకోశంలో ఇచ్చాం. సందర్భోచిత కార్టూన్లు పుస్తకానికి అదనపు విలువను అందించింది. పునర్ముద్రణకు అనుమతించిన ప్రముఖ కార్టూనిస్టు ఆర్.కె. లక్ష్మణ్‌గారికి లోక్‌సత్తా /పార్టీ సదా రుణపడి ఉంటుంది.

- అలాగే చిక్కుముడిలాంటి పాలనా యంత్రాంగం కబంధ హస్తాల నుంచి, నిబంధనల కీకారణ్యం నుంచి కావాలసిన సమాచారాన్ని రాబట్టడంలో శ్రమపడ్డ రిటైర్డ్ ప్రభుత్వ ఉన్నతాధికారులకూ లోక్‌సత్తా /పార్టీ కృతజ్ఞతలు తెలియచేస్తోంది. ఈ పుస్తకంలో ఒకవేళ తప్పులు ఉంటే వాటి బాధ్యత పూర్తిగా లోక్‌సత్తాదే వాటిని భవిష్యత్తు ముద్రణల్లో సరిదిద్దుకుంటాం. ఇంకొంత సమాచారం అవసరం ఉందని భావించినా, మరిన్ని సేవలు జతపరచాలని సూచించాలనుకున్నా లోక్‌సత్తా /పార్టీ కార్యాలయానికి తెలియచేయగలరని మనవి. వాటిని రానున్న ముద్రణల్లో చేర్చటానికి కృషి చేస్తాం.

- ఈ పౌరహక్కుల పుస్తకం మీ ముందు ఉందీ అంటే దాని వెనక, దేశ భవిష్యత్తు పట్ల ఎనలేని ఆరాటం ఉన్న ఎందరో పౌరుల అవిరళ శ్రమ, లోక్‌సత్తా / పార్టీ కార్యకర్తలు, అధికారుల కృషి ఎంతో... ఎంతెంతో ఉన్నాయి. ఈ పుస్తకాన్ని, సమాచారాన్ని సద్వినియోగం చేసుకుని మంచి సేవలు పొందటమే వీరందరి శ్రమకు ప్రజలు ఇచ్చే సరైన గుర్తింపు.

అభినందనలతో...

మీ

**డా॥ జయప్రకాష్ నారాయణ్,**

హైదరాబాద్, 22/08/2007

# విషయసూచిక


ముందుమాట

కృతజ్ఞతలు | పేజి నం.

**1. స్వరాజ్యం** 7

**2. సర్టిఫికెట్లు**

1. ధృవీకరణ పత్రాలు (సర్టిఫికెట్లు) 11
2. నివాస సర్టిఫికెటు 15
3. జనన, మరణ సర్టిఫికెట్లు 18
4. ఆదాయ సర్టిఫికెటు 22
5. కుల సర్టిఫికెటు 25
6. వారసత్వపు సర్టిఫికెటు 28

**3. ఆస్తి సంబంధిత విషయాలు**

1. ఆస్తి సంబంధిత విషయాలు 30
2. పట్టాదారు పాసుపుస్తకము 32
3. హద్దులు, ఎల్లల ఏర్పాటు 34
4. సర్వేలోని తప్పుల సవరణ 37
5. భూమి కొనుగోలుకు ముందు తనిఖీ చేయవలసిన వివరాలు 39
6. ఆస్తి లావాదేవీల సర్టిఫికేటు 41
7. అపార్టుమెంటు కొనుగోలుకు ముందు సరిచూడవలసిన అంశాలు 43
8. విక్రయ దస్తావేజుల రిజిస్ట్రేషను 44
9. పట్టాబదిలీ-మ్యుటేషన్ 47

**4. ప్రజా పంపిణీ విధానం**

1. రేషను కార్డులు 50
2. చౌకధరల దుకాణాల అజమాయిషీ 53
3. చీకటి బజారులో అమ్మకాల నిర్మూలన 55

**5. ఓటు హక్కు**

1. ఓటు హక్కు 57
2. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు 59
3. ఓటరు గుర్తింపు కార్డు 61
4. ఓటు వేసే ముందు తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు 63

**6. సేవలు, అవసరాలు**

1. పౌర అవసరాలు 66
2. మంచినీరు - మురుగు పారుదల 67

3. విద్యుచ్ఛక్తి కనెక్షను 70
4. భవన నిర్మాణానికి అనుమతి 72
5. ఆస్తిపన్ను నిర్ధారణ 74

**7. పౌర హక్కులు**

1. పౌర హక్కులు 77
2. పోలీసులకు ఫిర్యాదులు 81
3. వారెంటు లేకుండా అరెస్టు 84
4. పోలీసు నిర్భంధం 87

**8. సేవల అవసరం ఉన్న పౌరులు**

1. లబ్ధిదారుల అజమాయిషీ 90
2. వార్డు కమిటీలు 94
3. సాగునీటి సంఘాలు 96
4. వ్యవసాయ మార్కెట్ 102
5. విద్యా కమిటీలు 107

**9. రైతు సంబంధిత విషయాలు**

1. వ్యవసాయ అవసరాలు 113
2. విత్తనాలు 115
3. ఎరువులు 119
4. క్రిమి సంహారక మందులు 122

**10. ఆరోగ్య సంబంధిత విషయాలు**

1. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 126
2. కొన్ని ఆరోగ్య సూత్రాలు 130

**11. ఇతర విషయాలు**

1. వివాహ రిజిస్ట్రేషను 140
2. పాస్‌పోర్టు 142
3. డ్రైవింగు లైసెన్సు 144
4. ప్రమాదాలు - పౌరుల పాత్ర 148
5. తూనికలు - కొలతలు 151

**12. సమాచార హక్కు చట్టం - 2005 153**

**13. సంక్షిప్తంగా - సిటిజన్ చార్టర్లు (పౌర సేవా పత్రాలు) 157**

**తుది పలుకు 163**

**అనుబంధం - 1 164**

**అనుబంధం - 2 203**

# స్వరాజ్యం

★ మౌలిక ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల కోసం అంతులేని ఆత్మవిశ్వాసంతో, భవిష్యత్తు పట్ల మమకారంతో, శంకలే లేని స్థిరచిత్తంతో, భయం తెలియని ఉద్వేగంతో, ఆచరణాత్మకమయిన ఆదర్శంతో నడుం కట్టిన ప్రజా ఉద్యమం **లోక్‌సత్తా /పార్టీ** . ప్రజాస్వామ్యానికి పౌరుడు కేంద్రబిందువు. మనకోసమే మనచుట్టూ ఎన్నో సంస్థలని ఏర్పరచుకున్నాం. శాంతిభద్రతల నుంచి విద్య, ఆరోగ్యం వరకు మన ఉమ్మడి అవసరాలని తీర్చడం కోసం మనం ప్రభుత్వాన్ని ఎన్నుకుంటాం. మన ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ప్రభుత్వం ఉనికే పౌరుల సుఖసంతోషాల కోసం. ప్రజల సంతృప్తే ప్రభుత్వాల పనితీరుకి కొలబద్ధ. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం తన యజమాని అయిన పౌరుడికి జవాబుదారీగా ఉండటం, ప్రజలు నియమించిన ఉద్యోగులు తమకు పన్నుల డబ్బుతో పోషిస్తున్న ప్రజల ఆకాంక్షలకి ప్రతిస్పందించటం ప్రజాస్వామ్యంలో మౌలిక సూత్రాలు.

★ ఈనాడు ఏ పౌరుడయినా, ఎంతటిస్థాయివాడైనా, ఏ ప్రభుత్వ కార్యాలయానికయినా, తనకు హక్కుగా గల ఏ చిన్న పనికయినా వెళితే అక్కడ అతనికి ఎదురయ్యేది ఏమిటి? అవమానం, అసహనం, అవినీతి, అలసత్వం, అసమర్థత, అలక్ష్యం, ఉపేక్ష, తృణీకారం, తిరస్కారం, వేధింపు... ఇవీ ప్రభువైన పౌరుడికి సేవకులిచ్చే బహుమానాలు. అందుకే ఎక్కడ చూసినా ఏ పాపం ఎరుగని అమాయక జనం వేదనకి గురయి విలవిల్లాడిపోతున్నారు. మనకి రక్షణ కల్పించవలసిన పోలీసు కానిస్టేబుల్ని చూస్తే ఎండుటాకులా వణికిపోయే సామాన్యులు! లంచం ఇవ్వకపోతే ప్రభుత్వ కార్యాలయంలోకి ప్రవేశించటం కూడా సాధ్యం కాని ప్రజలు! ప్రభుత్వ పాఠశాలలో కనీసం పిల్లలకి నాలుగు అక్షరం ముక్కలు చెప్పించుకోలేని తల్లిదండ్రులు! రేషన్ షాపులో నిత్యావసరాలు అందుకోలేని నిర్భాగ్యులు! నిర్భయంగా, స్వేచ్ఛగా కనీసం ఓటు వేయలేని పౌరులు! ఆరోగ్యకేంద్రంలో టీకాలు కూడా వేయించుకోలేని పిల్లలు! చేతికందిన పంటని సరయిన ధరకి స్వేచ్ఛగా అమ్ముకోలేక విలపించే రైతులు! సకాలానికి గమ్యం చేరుకోలేని ప్రయాణీకులు! ప్రజావసరాల ద్వారా సౌకర్యాలు పొందలేక పోయినా విపరీత వ్యయానికి గురై వాపోయే వినియోగదారులు! గతిలేక కోర్టుల నాశ్రయిస్తే

సకాలంలో న్యాయం కూడా దొరకక, కండబలానికి బండన్యాయానికి దాసోహమౌతు అలమటించే బాధితులు! ఇలా ఎక్కడ చూసినా, ఏం విన్నా అంతటా అసంతృప్తి సెగలు, ఆందోళన జ్వాలలు, ఏమి చేయలేని నిస్సహాయతా, ఆవేశాన్ని అణగద్రొక్కే అశక్తత, ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యం రసహీనమై, నిరర్థకమై, ఒక తంతులాగా మారిపోయింది. పాలన రాజ్యాంగ బద్ధమైన దోపిడీగా రూపొందింది.

★ పాలకుల అహంకార చేష్ఠలతో, అసమర్థ పాలనా యంత్రాంగం నీడలో పౌరుల స్వేచ్ఛకి నిరంతరం ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. సేవకోసం నియమించుకుని మన డబ్బుతో పోషిస్తున్న వారి దుశ్చర్యలని, అసమర్థతని మౌన ప్రేక్షకుల లాగా మనం చూడవలసివస్తోంది. దాంతో మన స్వపరిపాలన హాస్యాస్పదమయింది. ప్రజాస్వామ్యం బతికి బట్ట కట్టాలంటే పౌరుల స్వయం నిర్ణయాధికారం, ప్రభుత్వ సేవలపైన నిరంతరం అజమాయిషీ ఆ సేవల అవసరం ఎవరికుందో వారికే అధిపత్యం ఉండి తీరాలి. అప్పుడే మనకి సరయిన సేవలందుతాయి. ఎన్నికయిన ప్రతినిధులు, ఎంపికయిన ఉద్యోగులు ప్రజల చేతిలోనే నిజమయిన అధికారం, సార్వభౌమత్వం ఉందని గౌరవించిన నాడు, తామంతా కేవలం ప్రజల సేవ కోసం నియుక్తులయిన వ్యక్తులమని వినమ్రంగా గుర్తించిన నాడు ప్రజాస్వామ్యం సార్థకమవుతుంది. ప్రజల పాత్ర నామమాత్రమయి, పాలన పౌరులకి సుదూరమై, నిర్ణయాలు నిగూఢమైనప్పుడు విశృంఖలమైన వివక్షకి, చిత్తానుసార ప్రవర్తనకి, పక్షపాత ధోరణులకి అంతం ఉండదు. పౌరులు పరిజ్ఞానంతో మెళకువతో ప్రవర్తించినప్పుడే చట్టబద్ధమయిన పాలన సాధ్యమవుతుంది.

★ పౌర సేవా కేంద్రాలను ప్రభుత్వాలు లోక్‌సత్తా /పార్టీ ప్రారంభిస్తోంది. ఇప్పటికే మన ఆకాంక్షలని, అవసరాలని త్రోసి రాజని, దిశ తెలియని పెనుభూతంగా, అన్నింటా వేళ్ళుపెట్టి వికటాట్టహాసం చేస్తోంది. ప్రజాస్వామ్యంలో రారాజైన పౌరుడు ఈ ప్రభుత్వాన్ని మచ్చిక చేసుకోలేని అసహాయుడై పోయాడు. ఎక్కడయినా పొరపాటున కొందరు పౌరులు సరైన సేవలు అందాలని నిలదీస్తే మనకర్థం గాని నిబంధనల కీకారణ్యంలో మనల్ని కట్టేసి బలిపశువుల్ని చేస్తోంది. పాలనా యంత్రాంగం ఎన్నో సందర్భాలలో జీతం తీసుకుంటున్న ఉద్యోగులకే

అంతుబట్టనివి ఈ నియమనిబంధనలూ, పద్ధతులను, వివిధ దరఖాస్తులను పరిశీలిస్తే ఎంత గందరగోళంగా, తికమకగా వీటిని రూపొందించారో బోధపడుతుంది. ఎన్నో నిబంధనలకి కాలదోషం పట్టింది. అయినా వాటిని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వసేవలకి సంబంధించిన ప్రాధమిక సమాచారాన్ని పౌరులు తెలుసుకుని రహస్యాలని ఛేదించి, గుట్టురట్టు చేస్తే తప్ప పొంతన లేని ప్రభుత్వాన్ని ఒక దారికి తేలేం. పరిజ్ఞానం ఉన్న పౌరులే ప్రజాస్వామ్య విజయానికి పునాదులు.

★ మనం నంగినంగిగా, చేతులు నలుపుకుంటూ, బలహీనుల్లాగా, భీరువుల్లాగా ప్రవర్తిస్తే పెద్ద బండరాయి లాంటి పాలనా వ్యవస్థ జడత్వంలోంచి చైతన్యంలోకి తేలేం. నిజమైన ప్రభువులుగా మనం ప్రభుత్వాన్ని, పాలనాయంత్రాంగాన్ని శాంతియుతంగా శాసించటం నేర్చుకోవాలి. నిరంతరం జాగురకతతో మనం ప్రభుత్వ యంత్రాంగాన్ని నిలదీసినప్పుడే ప్రభుత్వ పనితీరు, మనకందే సేవలు ఆశించిన రీతిలో మెరుగుపడతాయి. మనం అందరం కలిసి నియమించిన ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి తలవంచాలి. ప్రభుత్వ సేవలని ఆశించే పౌరుడు చేయిచాచి అర్థించే యాచకుడు కాదు, సేవకులని నిలదీసి తన హక్కుని వినియోగించే ప్రభువు కావాలి.

## గాంధీజీ మంత్రం

★ సంఘటితంగా, పరిజ్ఞానంతో పౌరులు నిలదీయటమే పౌరసేవా కేంద్రాల ఉద్యమం వెనక ఉన్న మౌలిక సూత్రం. పౌరసేవా కేంద్రాలు అనే అర్థవంతమయిన పదాన్ని మనం అసందర్భంగా అతిగా వాడి దాని భావాన్ని విస్మరించాం. అక్రమార్జనకి అంకితమైన ప్రతినిధులతో కూడిన అసమర్థ ప్రభుత్వాలని ఎన్నుకోవటమే పౌరసేవా కేంద్రాలు కాదు. లోపభూయిష్టమయిన ఎన్నికలలో కండబలాన్ని, ధనపిశాచాన్ని వినియోగించటం, నోరు పెగలని అమాయక జనాన్ని మాయమాటలతో, బూటకపు వాగ్దానాలతో మభ్యపెట్టటం, వాటి ఆసరాగా గద్దెనెక్కి ప్రజా ప్రయోజనాలని పణంగా పెట్టడం **'స్వ'రాజ్యం** కాదు. అనితర సాధ్యమయిన తన శైలిలో, జాతిపితమహాత్ముడు హృద్యంగా, భావగర్భంగా **స్వరాజ్యాన్ని** ఇలా నిర్వచించారు.

**మీకొక మంత్రాన్ని ప్రసాదిస్తాను. మీకు ఎప్పుడయినా ఏదైనా పని చేయాలా వద్దా అని సందేహం కలిగితే, శంకలు మిమ్మల్ని అమితంగా బాధిస్తుంటే, ఈ**

క్రింది పరీక్ష పెట్టుకోండి.

**జీవితంలో మీరు ఇంతవరకు చూసిన అత్యంత బీద, బలహీన వ్యక్తి ముఖాన్ని గుర్తుకు తెచ్చుకోండి. మీరు చేయతలపెట్టిన పని వల్ల అతనికి ఏం ప్రయోజనం చేకూరుతుందని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. దానివల్ల అతడికేమైనా లాభం చేకూరుతుందా? ఆ పని వల్ల అతడు తన జీవితం మీద, భవిష్యత్తు మీద మరింత పట్టు పెంచుకుని, తన కాళ్ళమీద తాను నిలబడగలుగుతాడా? మరో మాటలో చెప్పాలంటే మీ సంకల్పం వారికి నిజమైన స్వరాజ్యాన్ని ప్రసాదిస్తుందా?**

ఈ ప్రశ్నలకి సమాధానం వెతుక్కుంటే మీ సందేహాలు, మీ శంకలు పటాపంచలయిపోతాయి.

★ ఏ వాగాడంబరం, శబ్దగాంభీర్యం లేకుండానే తమ సహజప్రవృత్తితో గాంధీజీ పౌరుడికి తన జీవితంపైన పట్టునిచ్చేది, అతనికి భవిష్యత్తు మీద అధికారాన్నిచ్చేది **'స్వరాజ్యం'** అని భాష్యం చెప్పారు. అందుకే నిజమయిన స్వపరిపాలనలో పౌరుడు పరాధీనుడవరాదు. ప్రభుత్వానికి తల ఒగ్గిన బానిసకారాదు. ప్రభుత్వ సేవల పైన పూర్తి అజమాయిషీ పౌరుడికుండాలి. పాలనా యంత్రాంగం అదుపు తప్పినా, ప్రభుత్వ సేవలు క్షీణించినా, వాటి మెడలు వంచి, సక్రమమార్గంలో పెట్టి, దుష్పరిపాలనని అంతమొందించే అధికారం పౌరుడి చేతిలో ఉండాలి. అదే నిజమయిన **స్వరాజ్యం.**

## ప్రస్తుత రాజకీయ సంస్కృతి ఇదా!



" మీరు రాజకీయాల నుంచి వెంటనే తప్పుకోవాలి. మిమ్మల్ని చూసి వీడు చెడిపోతున్నాడు. అబద్ధాలు ఆడినా, మోసం చేసినా చెల్లుతుంది. అనుకుంటున్నాడు, చూడండి!"

## 2.1 ధృవీకరణ పత్రాలు (సర్టిఫికెట్లు)

- ★ జన్మతేది, నివాసస్థలం, కులం, ఆదాయం, చట్టరీత్యా వారసత్వం మొదలైనవి నిరూపించడానికి, మనకి దైనందిన జీవితంలో వివిధ రకలైన ధృవీకరణపత్రాలు (సర్టిఫికెట్లు) అవసరమౌతాయి.
- ★ ఉదాహరణకు బడిలో చేరే సమయంలో, ఉద్యోగంలో ప్రవేశించే సమయంలో జన్మతేది సర్టిఫికెటు అవసరమౌతుంది. అదేవిధంగా పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్సు లేదా వృద్ధులకు విమాన ప్రయాణంలో రాయితీలు పొందడానికి కూడా వయస్సు నిర్ధారించే సర్టిఫికెట్లు అవసరమౌతాయి.
- ★ కళాశాల ప్రవేశాల్లో, ప్రభుత్వ లేక ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగాలలో విద్యార్థి ఉపకారవేతనాల్లో (స్కాలర్ షిప్పులు) వున్న రిజర్వేషన్లు వినియోగించుకోవడానికి 'కులధృవీకరణ' పత్రం అవసరం.
- ★ పాఠశాల రుసుముల్లో లేదా విద్యార్థి వేతనాల్లో రాయితీలు పొందడానికి ఆదాయ ధృవీకరణ పత్రం కావాలి. తక్కువ ఆదాయపు రుజువు చూపడం వల్ల ప్రభుత్వ సబ్సిడీలు, పేదలకు రేషన్‌కార్డులు, ఉచితవైద్య సేవలు పొందవచ్చును.
- ★ ఆంధ్రప్రదేశ్‌లో వృత్తి విద్యా కళాశాలలతో సహా అన్ని కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో ప్రవేశానికి నివాసధృవీకరణ పత్రం తప్పనిసరి. గ్రూపు II, III, IV వంటి కొన్ని స్థాయిల్లోని ప్రభుత్వోద్యోగాల్లో నియమాకం జిల్లా/ ప్రాంతాల ప్రాతిపదికన వున్నప్పుడు నివాస ధృవీకరణ పత్రం కావాలి. రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని ఉద్యోగాలకి రాష్ట్రంలో నివాస సర్టిఫికెటు కావాలి.
- ★ పదవీ విరమణ చేసిన ఉద్యోగి మరణించినప్పుడు కుటుంబ పింఛను అందుకోవడానికి వారసత్వ సర్టిఫికెటు అవసరం. ఉద్యోగంలో వున్న వ్యక్తి మరణించినప్పుడు ప్రత్యేక సానుభూతితో ఉద్యోగమివ్వవలసిన సందర్భంలో ఈ సర్టిఫికెటు ఆధారపడుతుంది. ఏ పౌరునికైనా మరణానంతరం ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు అతని వారసునికి చెల్లిస్తారు.
- ★ ఈ ధృవీకరణ పత్రాలలో చాల వరకు సంబంధిత మండల రెవెన్యూ అధికారి (ఎమ్.ఆర్.ఓ) ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ 1128 మండలాలకు ఒక్కొక్క మండలాధికారి/తహశీల్దారు వున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఒక మండలంలో

సాధారణంగా సగటున 60-70 వేల వరకు నివసించే జనాభా వుంటుంది. పట్టణాలు, నగరాలలో మొత్తం పట్టణం గాని, నగర విభాగానికి గానీ ఒక తహశీల్దారు వుండవచ్చును.

- ★ ధృవీకరణ పత్రం కోసం సాధారణంగా అందుకు నిర్దేశించిన దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేయవలసి వుంటుంది. ఆ ఫారాలు ఈ పుస్తకం ఆయా శీర్షికల కింద జతపరచి వున్నాయి. వాటిల్లోని అంశాలను తెల్ల కాగితాలపై చక్కగా టైపు చేసి అవసరమైనప్పుడు దరఖాస్తు ఫారాలుగా ఉపయోగించవచ్చును.
- ★ సాధారణంగా దరఖాస్తు ఫారంతో రెండు రూపాయల కోర్టు రుసుము స్టాంపు అతికించవలసి వుంటుంది. సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం లేదా తహశీల్దారు అమ్ముతారు.
- ★ షెడ్యూల్డు కులాలు (ఎస్.సి), షెడ్యూల్డు జాతులు (ఎస్.టి) కు చెందిన అభ్యర్థులకి ఈ స్టాంపు అతికించే అవసరం సాధారణంగా వుండదు.
- ★ చివరి తేదీ వరకు ఆగకుండా, చాలా ముందుగానే ఇటువంటి దరఖాస్తులు పెట్టడం మంచిది. దరఖాస్తుదారు తెలిపిన వివరాలను విచారించి, సర్టిఫికెటు జారీ చేయడానికి అధికారులకు సాధారణంగా ఒకటి, రెండు వారాల వ్యవధి అవసరముంటుంది. పాఠశాల, కళాశాల ప్రవేశ సమయాల్లోను, వివిధ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షల సమయంలోను, కొన్ని వందల మంది సర్టిఫికెట్ల కొరకై దరఖాస్తు చేస్తుంటారు. దీనివల్ల జాప్యం జరుగుతుంది. కొన్నిసార్లు అభ్యర్థికి సకాలంలో సర్టిఫికెటు దొరకక పోవచ్చును.
- ★ దరఖాస్తుదారు ముందే తగు జాగ్రత్తతో ఈ పుస్తకంలో వివరించిన పద్ధతిని పాటించి, అవసరమైన సమాచారాన్ని సంపూర్ణంగా అందిస్తే, వారికి ఇబ్బందిలేకుండా సర్టిఫికేటు లభించే అవకాశం వుంటుంది.
- ★ ఆలస్యంగా దరఖాస్తు చేయడం, అసంపూర్ణమైన వివరాలు ఇవ్వటం, నిబంధనలను సక్రమంగా పాటించకపోవడం, తప్పుడు సమాచారం ఇవ్వడం వంటివి జరిగితే లంచాలు అడిగే ప్రమాదం ఎక్కువైపోతుంది.
- ★ పౌరులకు ఈ విషయాలలో ఏమైనా ఇబ్బందులుంటే తగిన సమాచారం, సహాయం కోసం స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖను సంప్రదించవచ్చును. రోజువారి జీవితంలో ప్రభుత్వం నుండి మెరుగైన సేవలు పొందేటట్లుగా చూసేందుకు మీ నివాస ప్రాంతంలోని ఇరుగు పొరుగు పౌరుల బృందమే లోక్‌సత్తా /పార్టీ.

- ★ సరిఫికెట్లు అనేవి చాలా విలువైన పత్రాలు అవి పోగొట్టుకోకుండాను, వాటిలో మార్పులు చేసి చెడగొట్టకుండానూ జాగ్రత్తపడాలి. తగినన్ని జిరాక్స్ కాపీలు తీయించుకుని, ముందు అవసరాలకై వాటిని భద్రపరచుకోవడం మంచిది. వీటికోసమై తరచుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అగత్యం తప్పుతుంది.
- ★ అభ్యర్థుల నివాసం, కులం, ఆదాయం గురించిన గెజిటెడ్ అధికారుల రుజువు ముందుగా చూపవలసిందిగా నిబంధనలలో వుంటుంది. సామాన్య పౌరులకు చాలా ఇబ్బందికరమైన విషయం కాబట్టి ఈ నిబంధనను తీసివేయాలి. ప్రభుత్వ గెజిటెడు అఫీసరు ఒక హోదాకు చెందిన అధికారి. దాదాపుగా ఆఫీసర్ స్థాయిలో వున్న వారంతా గెజటెడ్ హోదా కలిగినవారే. ఉదాహరణకు ప్రభుత్వ వైద్యులు, ఇంజనీర్లు, పశువైద్యులు, వ్యవసాయ అధికారులు, పాఠశాలలో సీనియర్ హెడ్‌మాస్టర్లు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎమ్.ఆర్,ఒ, ఎమ్.డి.ఒ (మండల అభివృద్ధి అధికారులు) వీరంతా గెజిటెడ్ అధికారులే.
- ★ దొంగ సర్టిఫికేటు పొందడం నేరం. అలా చేసిన వ్యక్తిపై కేసుపెట్టి శిక్షవేయవచ్చును. తద్వారా ఉద్యోగము, కాలేజీ సీటు కూడా పోగొట్టుకుంటారు. ఉదాహరణకు ఎవరైనా తప్పుడు కుల ధృవీకరణ పత్రం పొంది, ఆ కులానికి కేటాయించిన ఉద్యోగాన్ని పొందితే ఆ ఉద్యోగం పోతుంది.
- ★ దొంగ సర్టిఫికెటు యిచ్చిన అధికారికి కూడా జవాబుదారీ వుంటుంది. అతడూ శిక్షను ఎదుర్కోవాలి.
- ★ చట్టరీత్యా విధించే శిక్షలు పడడమే కాక, కులం, ఆదాయం, నివాసస్థలం, జన్మతేదీలను గురించి తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా ప్రయోజనాలు పొందడం సిగ్గుచేటు. ఇది పచ్చిమోసం, న్యాయంగా హక్కులున్న మరో వ్యక్తి ఆ ప్రయోజనం పొందకుండా అన్యాయం చేసినట్టవుతుంది. ఆత్మగౌరవమున్న ఏ వ్యక్తి కూడా ఇటువంటి పనికి దిగకూడదు.
- ★ సమాజంలో ఎవరైనా దొంగ సర్టిఫికెటు ద్వారా మోసం చేస్తే సమాజంలోని యావన్మందికి నష్టం జరుగుతుంది. మనమంతా నిలబడి ఐక్యంగా దాన్ని వ్యతిరేకించాలి. బద్ధకం చేతనో, నిర్లక్ష్యంతోనో అన్యాయాన్ని ఆమోదించటం వలన అనర్హుడైన ఒక వ్యక్తి ప్రభుత్వోద్యోగం పొందడానికి , మనం కట్టిన పన్నుల సొమ్ము దుర్వినియోగం కావడానికి దోహదం చేస్తున్నట్లే. ఏ విధంగా చూసినా పౌరులుగా మనం నష్టపోతాము.
- ★ మనకు మనం సాయం చేసుకుంటే ప్రభుత్వోద్యోగులు చాల వరకు మనకి

సాయపడగలరు. నిర్దేశించిన నిబంధనలను పాటించాలి. మన దరఖాస్తు అందినట్టు రశీదును అడిగి పుచ్చుకోవాలి. దరఖాస్తుల పరిశీలన విషయంలో ఒక క్రమం, వరుస పద్ధతి పాటించాలి.

★ మనం వరుసక్రమాన్ని అతిక్రమించి మధ్యలో దూరి పోవాలనుకుంటే ఇతరులు ఆ పని చేయగలరని గుర్తుంచుకోండి. సక్రమమైన మార్గంలో పనులు జరగటం, అసాధ్యమేమీ కాదు.

★ మనం సంఘటితంగా, పరిజ్ఞానంతో ఉద్యమిస్తే యంత్రాంగమూ స్పందిస్తుంది. కదులుతుంది.

## 2.2 నివాస సర్టిఫికెట్లు

★ ఒక పట్టణం, గ్రామం లేక ఒక వార్డు మీ శాశ్వత నివాసాన్ని రుజువుచేసేది నివాస ధృవీకరణ పత్రం. ఒక ప్రదేశంలో మీరు నివాసమున్న కాలాన్ని బట్టిగానీ, శాశ్వతమైన ఉద్యోగాన్ని బట్టిగానీ ఇది జారీ చేస్తారు.

**ఇది ఎప్పుడు అవసరమౌతుంది?**

- o కళాశాలల్లో ప్రవేశం
- o వృత్తి విద్య ప్రవేశానికై జరిగే పోటీ పరీక్షలకు హాజరయ్యేటప్పుడు
- o ప్రభుత్వ లేక స్థానిక సంస్థల్లో ఉద్యోగం పొందడానికి
- o రేషనుకార్డు పొందేందుకు
- o ఓటరుగా పేరు నమోదు చేసుకోవడానికి

**ఆంధ్రప్రదేశ్‌లో నివాసానికి సంబంధించిన నిబంధనలు ఏమిటి?**

- o చాల వరకు, ప్రభుత్వోద్యోగాలలో, కళాశాలల్లో సీట్లకోసం మనకు నివాసధృవీకరణ పత్రం అవసరం.
- o గ్రూపు 1 సర్వీసు వంటి ఉన్నత ఉద్యోగాలకు రాష్ట్రంలో ఎక్కడైనా నివాసం వుండవచ్చును.
- o వృత్తివిద్య, ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశానికి రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించారు. అవి:
  - ♦ పాత ఆంధ్రవిశ్వవిద్యాలయం - అంటే కోస్తా ఆంధ్రాలో శ్రీకాకుళం నుంచి ప్రకాశం వరకు జిల్లాలు
  - ♦ పాత ఉస్మానియా విశ్వవిద్యాలయం - తెలంగాణా జిల్లాలు
  - ♦ పాత వెంకటేశ్వర విశ్వవిద్యాలయం - నెల్లూరు, రాయలసీమ జిల్లాలు
- o ఆ ప్రాంతాల్లోని జిల్లాల్లో నివసిస్తూ, కనీసం ఏడు సంవత్సరాల పాటు అక్కడి పాఠశాలల్లో చదివిన విద్యార్థులను మాత్రమే ఆయాప్రాంతాల్లోని కళాశాలల్లో చేర్చుకుంటారు.
- o గ్రూపు II, III, IV సర్వీసుల్లోని ఉద్యోగాలకు అభ్యర్థులు ఆయా జిల్లాలు/

జోనుల్లో నివసించే వారై వుండాలి. ఆయా జిల్లాలు లేదా జోనులు 'కోటా' ఉద్యోగాలకు మాత్రమే వారు అర్హులౌతారు. మరో చోట వారు పోటీపడే వీలులేదు.

- పాఠశాల ఉపాధ్యాయులను జిల్లాల వారీగా ఎంపిక చేస్తారు. ఏ జిల్లాలో వారు ఉద్యోగం కోరుతున్నారో, ఆ జిల్లాలో నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరి.
- ప్రభుత్వంలోని కొన్ని క్రిందిస్థాయి ఉద్యోగాలకు నియామకాలు కూడా జిల్లాల ప్రాతిపదిక పైన జరుగుతాయి.
- ఇతర నాన్‌గెజిటెడ్ ఉద్యోగాల ఎంపిక ప్రాంతాల (జోన్‌లు) ప్రాతిపదికన జరుగుతుంది. ఇందుకోసం రాష్ట్రాన్ని క్రింద పేర్కొన్న ప్రాంతాలుగా విభజించారు.

| **జోన్‌లు** | **జిల్లాలు** |
|---|---|
| ♦ జోన్ I | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం |
| ♦ జోన్ II | తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా |
| ♦ జోన్ III | గుంటూరు, ప్రకాశం, నెల్లూరు |
| ♦ జోన్ IV | కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు |
| ♦ జోన్ V | వరంగల్లు, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ |
| ♦ జోన్ VI | రంగారెడ్డి, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, హైదరాబాద్ |

- జోన్‌ల వారి విభజన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైనది. రాష్ట్రంలోని ప్రాంతీయ సమస్యల పరిష్కారానికై అమలు చేసే ఆరుసూత్రాల ప్రణాళిక ఫలితమే ఇది.
- అఖిల భారత కోటా క్రింద ఇతర రాష్ట్రాలలో వైద్య, ఇంజనీరింగు కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొనే అవకాశం ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులకు లేదు. ఆంధ్రప్రదేశ్‌కు ఇతర రాష్ట్రాలకు మధ్య పరస్పర ఒప్పందం లేనందువల్ల ఇది సాధ్యం కాదు. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశార్హత లేనట్లే, మన రాష్ట్రంలోని విద్యార్థులు ఇతర రాష్ట్రాలలో ప్రవేశానికి పోటీపడే అవకాశం లేదు.
- ఆంధ్రప్రదేశ్ లోపల కూడా వైద్య, ఇంజనీరింగు కళాశాలల్లో ఒక ప్రాంతం విద్యార్థులను మరో ప్రాంతంలో 'బయటివారు'గా పరిగణిస్తారు. సాధారణంగా 15 శాతానికి మించని 'సాధారణ కోటా'లో వీరిని చేర్చుకోవచ్చును.

## నివాస ధృవీకరణ పత్రం పొందటం ఎలా?

- o గ్రామ పంచాయితీలో ధృవీకరణ పత్రం జారీ చేస్తారు. నిర్దేశించిన ఫారంలో మీ పంచాయితీలో దరఖాస్తు చేసుకోవాలి. (దరఖాస్తు ఫారం కోసం ఈ పుస్తకంలోని 165 పేజీ చూడండి). ఫారాన్ని సక్రమంగా, సంపూర్ణంగా పూర్తిచేయాలి.
- o దరఖాస్తు ఫారంతో పాటు ఈ క్రింద చూపిన వివరాలు జతపరచాలి.
  - ♦ రెండు రూపాయల కోర్టు ఫీజు స్టాంపును దరఖాస్తు ఫారంపైన అంటించాలి. (ఎస్.సి, ఎస్.టి. వారికి దీని నుంచి మినహాయింపు ఉంది.)
  - ♦ ఇద్దరు రాష్ట్రప్రభుత్వ గెజిటెడు ఆఫీసర్ల నుండి, నివాసాన్ని రుజువు చేసే రెండు ధృవీకరణ పత్రాలు (165 పేజీ చూడండి)
  - ♦ గత ఏడేళ్లలో మీరు చదివిన పాఠశాల, కళాశాలల నుండి విద్యాభ్యాస ధృవీకరణ పత్రాలు
  - ♦ మీ పాఠశాల లేక కళాశాల యిచ్చిన బదిలీ సర్టిఫికేటు (టి.సి)
  - ♦ రేషను కార్డు కాపీ (ఒకవేళ రేషను కార్డు లేకపోతే మీ నివాసాన్ని ధృవపరచే డ్రైవింగు లైసెన్సు, పాసుపోర్టు, మునిసిపల్ పన్ను రశీదు, పంచాయితీ పన్ను రశీదుల కాపీలు ఏవైనా జతపరచవచ్చును.)
- o జతపరిచిన కాగితాలతో సహా దరఖాస్తు ఫారాన్ని పంచాయితీలో నియమిత అధికారికి దాఖలు చేయాలి. రెండు రోజులలో ఈ ధృవీకరణ పత్రాన్ని ఇవ్వాలి. చిక్కుకేసులైతే ఇంకా సమయం పట్టవచ్చును. మీ దరఖాస్తు, ఇతర పత్రాలను గురించి స్థానిక రెవెన్యూ అధికారుల విచారణ వుంటుంది. పంచాయితీ ఇచ్చే సర్టిఫికేటు ఈ పుస్తకంలో 166 పేజీలో చూపిన ఫారంపైన వుంటుంది. సర్టిఫికేటు పొందిన తరువాత సరిచూచి, అందులో ఏమి తప్పులు లేవని నిర్ధారించుకోండి.
- o స్థానిక అధికారులు ఎవరైన విచారణ జరుపుతుంటే మీరు వారితో సహకరించాలి. నిర్ణీత వ్యవధిలోపుగా సరైన సమాధానం రాకపోతే ఇ.ఓ (పీ.ఆర్.& ఆర్.డి) (విస్తరణాధికారీ పంచాయితీ రాజ్ & రూరల్ డవలప్‌మెంట్)ని కలుసుకోండి.
- o ప్రభుత్వోద్యోగుల నుండి సక్రమంగా సేవలు అందకపోతే సలహా సహాయాల కొరకు మీ స్థానిక లోక్‌సత్తా /పార్టీ పౌరసేవా కేంద్రాన్ని/శాఖను సంప్రదించండి.

## 2.3 జనన మరణ సర్టిఫికెట్లు

★ ఒక వ్యక్తి జీవితంలో జనన ధృవీకరణ పత్రం బహుశా అత్యంత ముఖ్యమైనది. జన్మతేదీ, వయస్సు, తల్లిదండ్రులెవరు అనేవి నిర్ధారించడానికి ఈ సర్టిఫికెటు అవసరం.

★ జన్మ ధృవీకరణ పత్రం ఈ క్రింద చెప్పిన సందర్భాలతో పాటు అనేకసార్లు అవసరమౌతుంది.

- ♦ పాఠశాల ప్రవేశం
- ♦ కళాశాల ప్రవేశం
- ♦ ఉద్యోగం
- ♦ పాస్‌పోర్టు
- ♦ వయస్సు నిర్దారించడానికి జరిగే కోర్టుకేసులు
- ♦ వివాహ రిజిస్ట్రేషను
- ♦ డ్రైవింగు లైసెన్సు
- ♦ విమాన ప్రయాణ రాయితీ కోసం వృద్దాప్య వయస్సు రుజువు
- ♦ వృద్దులకున్న ప్రత్యేక రాయితీలు
- ♦ ఓటరు రిజిస్ట్రేషను

★ ఒక బిడ్డ పుట్టినప్పుడు, జన్మించిన ప్రాంతం పంచాయతీ అయితే గ్రామ రెవెన్యూ అధికారి (వి.ఆర్.ఓ.) కి, ఇతర ప్రాంతాలలో మునిసిపాలిటీ, కార్పొరేషను అధికారులకు పూర్తి వివరాలతోసహా తెలియపరచటం తల్లిదండ్రుల విధి. అలాగే ప్రతి మరణాన్ని ఆ అధికారులకి తెలియపరచాలి.

★ గ్రామంలో లేక మునిసిపాలిటీలో పుట్టిన లేదా మరణించిన వెంటనే రిజిస్ట్రేషను కాపీ పొందితే ఉపయోగంగా వుంటుంది. ఆస్పత్రిలో జరిగే కాన్పుల విషయంలో అన్ని జననాలను గురించి తెలియజేయటం చట్టరీత్యా ఆస్పత్రి అధికారుల విధి. ఆస్పత్రి నుంచి ఒక సర్టిఫికెటు పొంది, జాగ్రత్త పరచడం వలన ఉపయోగం వుంటుంది.

★ పాఠశాల రికార్డులలో తరచుగా జనన తేదీ తప్పుగా వేస్తుంటారు. ఇది పొరపాటు వల్ల గాని బుద్ధి పూర్వకంగా అబద్ధపు రికార్డు వ్రాయడం వల్లగానీ జరుగుతుంది. ఒక బిడ్డ బడిలో చేరినప్పుడు, గ్రామోపాధ్యాయుడు ఏదో ఒక తేదీ స్వయంగా

అనుకొని వేసేయడం తరచుగా జరిగేది. నమోదు చేసిన వయస్సు. నిబంధనలకు అనువుగా వుండేట్లు కొన్నిసార్లు ఇలా చేస్తారు. అందుకే చాలామంది ఉద్యోగుల అసలు వయస్సు రికార్డుల్లో వున్న దానికంటె తక్కువగా వుంటుంది.

★ ఇటీవలి కాలంలో విద్యావకాశాల్లో , క్రీడలలో వయస్సు దాచి ప్రయోజనాలు పొందేందుకు వీలుగా, కొందరు తల్లిదండ్రులు పిల్లల వయస్సులు తక్కువచేసి వేస్తున్నారు. ఇలా రికార్డుల్లో అబద్ధాలు జొప్పించడం వల్ల చివరకు పిల్లలకు ఏ లాభమూ చేకూరదు. దీనిని గట్టిగా ఖండించి ఇలా చేయకుండా నివారించాలి.

★ బిడ్డపేరు, జనన తేదీ ఆస్పత్రిలోను, మున్సిపల్ రికార్డుల్లో సక్రమంగా నమోదయేటట్లు తల్లిదండ్రులు మంచి శ్రద్ధ వహించాలి. పేరు పెట్టకపోతే బిడ్డ ఎన్నోది (ఒకటవ, రెండ బిడ్డ) అని వ్రాయిస్తే, ఆ తర్వాత గుర్తింపు తేలికగా నమ్మకంగాను జరుగుతుంది.

★ పాఠశాల రికార్డుల్లో జననతేదీ, పేరు (నిర్ధిష్టంగా) తప్పులు లేకుండా వ్రాయించి, ధృవపరచుకోవాలి. పాఠశాల వదిలేసిన తర్వాత రికార్డుల్లో పొరపాటు దిద్దటం చాలా కష్టం, వాస్తవానికి దాదాపు అసంభవం కూడా.

★ కుటుంబంలో మరణం సంభవించినప్పుడు, అర్హత గల వైద్యుడి నుంచి సర్టిఫికెటు పొందాలి. మరణ సమాచారాన్ని మునిసిపాటిలీ, కార్పొరేషను, లేదా పంచాయతీ తెలియపరచాలి.

★ మరణ ధృవీకరణ పత్రం అనేక సందర్భాలలో అవసరమౌతుంది అవి:
  - ♦ చట్టరీత్యా వారసత్వ ధృవీకరణ పత్రానికి
  - ♦ కోర్టువారిచ్చే వారసత్వ పత్రం
  - ♦ కుటుంబ పింఛను, ఇతర ప్రయోజనాలకు
  - ♦ బ్యాంకు లావాదేవీలు
  - ♦ వ్యాపార లావాదేవీలు
  - ♦ వారసత్వం లేక వీలునామా ఆధారంగా ఆస్తిమార్పిడి

★ ఒక వ్యక్తి చనిపోయిన తరువాత ఆపేరు ఓటర్ల పట్టికలోంచి, రేషనుకార్డులోంచి తీసివేయాలి. మృతుని పాసుపోర్టు, డ్రైవింగు లైసెన్సు, సంబంధిత అధికారులకు అప్పగించాలి.

★ జననం లేదా మరణం జరిగిన సమయంలో ఏ కారణం చేతనైనా నమోదు చేయించకపోతే, రిజిస్ట్రేషను జరగలేదని ఒక ధృవీకరణ పత్రాన్ని పంచాయితీ మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ అధికారుల నుండి పొందవచ్చును.

**జనన లేక మరణ ధృవీకరణ పత్రం పొందటం ఎలా?**

- నిర్ధారిత ఫారంపైన తగిన అధికారికి దరఖాస్తు చేయాలి. (ఫారం కోసం పేజీ 167 చూడండి). దరఖాస్తులో జనన తేదీ లేక మరణ తేదీ / ప్రదేశము/ బిడ్డ లేదా వ్యక్తి పేరు / తల్లితండ్రుల పేర్లు / ఆడ, మగ అనే వివరాలు సక్రమంగా ఇవ్వాలి.

- సంబంధిత అధికారులు రికార్డులు పరిశీలించి సర్టిఫికెటు జారీ చేస్తారు. సాధారణంగా ఈ సర్టిఫికెటు రెండు రోజుల్లో పంచాయితీలలో లేదా ఐదు రోజులలో (మున్సిపాలిటీలలో) స్వల్ప వ్యవధిలో ఇవ్వవచ్చును. ఒకవేళ ఆలస్యం అయితే, వారికి గుర్తు చేయవచ్చును. సర్టిఫికెటు పరిశీలించి, అందులో తప్పులేవీ లేకుండా జాగ్రత్తపడండి. ఒకవేళ జననం గానీ, మరణం గానీ నమోదు కాకపోతే, సంబంధిత అధికారి 'నాన్ రిజిస్ట్రేషను' సర్టిఫికెటు ఇస్తారు.

**రిజిస్టరు కాని జననం లేక మరణాన్ని నమోదు చేయడం ఎలా?**

- సంబంధిత అధికారి నుండి ముందుగా 'నాన్‌రిజిస్ట్రేషను' సర్టిఫికెటు పొందాలి. ఆ తర్వాత మునిసిపాలిటీని లేదా స్థానిక పంచాయతీ వారిని లేదా యమ్.ఆర్.ఓ.ని తమ రికార్డుల్లో జనన /మరణ వివరం చేర్చవలసిందిగా ఆదేశించిమని మీ రెవెన్యూ విభాగంలోని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటు (సబ్‌కలక్టరు లేదా ఆర్.డి.ఓ) కు దరఖాస్తు చేయాలి. జనన, మరణ రుజువుగా ఆస్పత్రి రికార్డులు, సాక్షుల కథనాలు (స్టేట్‌మెంట్లు) డాక్టరు సర్టిఫికెటు మొదలైనవి దరఖాస్తుతో సమర్పించాలి.

- అధికారులు మీరు చెప్పే విషయాన్ని సరిచూస్తారు. అప్పుడు అధికారులకు పూర్తి సహకారం యివ్వాలి. జననం/మరణం మీరు తెలియపరచిన విధంగా జరిగిందని వారికి సంతృప్తి కలిగితే, ఆ విషయం రికార్డులో నమోదు చేయవలసిందిగా ఆదేశిస్తారు.

- జనన /మరణ రిజిస్ట్రేషను చేయనపుడు, ఆ వివరం తెలియపరచి నమోదు చేయించడానికి సబబైన వ్యవధి ఒక మాసంగా అనుకోవచ్చును. ఒకవేళ నెల రోజులకంటే ఎక్కువ ఆలస్యం అయితే సబ్‌కలెక్టరు లేదా ఆర్.డి.ఓ.కి తిరిగి గుర్తుచేయవచ్చును.

o ఈ విషయంలో తగిన సహాయం అందకపోతే స్థానిక లోక్‌సత్తా /పార్టీ వారి జోక్యం, సహకారాన్ని మీరు కోరవచ్చును.

## ఔరా! ప్రస్తుత రాజకీయ సంస్కృతి!




“ఈ ఫోటో ఎందుకంటే -ఎన్నికల సభల్లో తానెంత నీతిమంతుడో చెప్పుకోవటానికి!’’

## 2.4 ఆదాయ సర్టిఫికెటు

★ పేదలకి, దారిద్ర్య రేఖ దిగువ వున్న కుటుంబాలకు ఉద్దేశించిన రాయితీలు పొందడానికి ఆదాయ ధృవీకరణ పత్రం అవసరమౌతుంది. వేలంపాటలో తమ అర్హత నిరూపించుకోవడానికి కాంట్రాక్టర్లకు అప్పులు తీర్చే శక్తి (సాల్వెన్సీ) వున్నదనే సర్టిఫికెటు కొన్నిసార్లు అవసరమౌతుంది.

**ఎప్పుడు అవసరం (ఉదాహరణకి)**

- రేషనుకార్డు (తెలుపు)
- ప్రభుత్వ సబ్సిడీలు
- ఇళ్ల స్థలాల కేటాయింపు
- బలహీన వర్గాలకు గృహవసతి
- విద్యార్థి వేతనాలు (స్కాలర్ షిప్పులు)

★ ఆదాయ ధృవీకరణ పత్రాలు ఆదాయం పన్ను విషయంలో ఉపయోగించడానికి వీలులేదు. సర్టిఫికెటు ఇచ్చేటప్పుడు అన్నిరకాలుగా వచ్చే ఆదాయాన్ని పరిగణిస్తారు. వనరులు, ఆదాయమూలాలు ఈ క్రింది విధాలుగా వుండవచ్చును.

- భూమి
- వ్యాపారం
- శ్రమకూలి
- ఉద్యోగం
- భవనాలు (అద్దెలు)
- ఇతరములు
- వృత్తి

★ రేషనుకార్డులు, సబ్సిడీలు లేక ఇళ్లస్థలాల కేటాయింపు పొందడం కోసం తరచుగా తక్కువ ఆదాయం చూపే తప్పుడు సర్టిఫికెటును ఉపయోగిస్తుంటారు. పేదవారి కోసం ఉద్దేశించిన ప్రయోజనాలను, అనర్హులైన వ్యక్తులు పొందే ఈ అలవాటును గట్టిగా ఖండించాలి. అలాంటి చర్యలకు పాల్పడేవారిని నివారించాలి. నిజంగా అవసరం వున్న పేదలకు అన్యాయం చేసే సిగ్గుచేటు పని ఇది.

**ఆదాయ ధృవీకరణ పత్రం పొందడం ఎలా?**

★ ఆదాయ ధృవీకరణ పత్రం మంజూరుకు గ్రామ పంచాయితీ సిఫారసు చేస్తుంది. పత్రాన్ని మంజూరుకై సిఫారసు గ్రామ పంచాయితీ (2 రోజులు) చేస్తుంది.

★ ధృవీకరణ పత్రాన్ని జారీ చేయడానికి అర్హుడైన అధికారి తహశీల్దారు /ఎమ్మార్వో (1 రోజు) ఇందుకు నిర్దేశించిన దరఖాస్తు ఫారం వున్నది (ఫారం కొరకు 167

పేజీ చూడండి) ఈ ఫారాన్ని మీరు సరైన సమాచారంతో పూర్తిచేయాలి. రెండు రూపాయలు కోర్టు రుసుము స్టాంపును అతికించాలి. దరఖాస్తు ఫారాన్ని ఈ క్రింది కాగితాలతో సహా దాఖలు చేయాలి.

- ♦ రేషను కార్డు కాపీ
- ♦ నిర్ణీత ఫారాలపైన గజిటెడు ఆఫీసర్లు యిచ్చిన రెండు ఆదాయ రుజువులు (167 పేజీలో ఫారం చూడండి)
- ♦ పాఠశాల లేదా కళాశాల నుండి (బోనఫైడ్) విద్య సర్టిఫికెటు
- ♦ వివిధ వనరుల నుంచి మీకు వచ్చే ఆదాయ వివరాలు ప్రకటిస్తూ, నోటరీ సంతకం పెట్టిన అఫిడవిట్ పదిరూపాయల స్టాంపు పేపరుమీద ఇవ్వాలి. (ఎమ్.ఆర్.ఓ. ఆఫీసు లేక సబ్‌ట్రెజరీ, సబ్‌రిజిస్ట్రారు ఆఫీసు సమీపంలో నోటరీలుగా గుర్తింపు పొందిన లాయర్లు, మరే ఇతరులైన) (సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాల దగ్గర, లైసెన్సు పొందిన విక్రయదారుల దగ్గర స్టాంపు పేపరు దొరుకుతుంది.)
- ♦ మీరు ఉద్యోగంలో ఉన్నట్లయితే, మీ యజమాని ఇచ్చిన జీతం సర్టిఫికెటు
- ♦ మీ భార్య / భర్త కూడా ఉద్యోగం చేస్తోంటే, వారి యజమానులిచ్చిన జీతం సర్టిఫికెటు
- ♦ రెవెన్యూ అధికారులు దరఖాస్తును, సర్టిఫికెటు పత్రాలను సరైనవో కావో పరిశీలిస్తారు. మీరు వారికి పూర్తి సహకారం అందించాలి. సరైన సమాచారాన్ని పొందుపరచాలి. సాధారణంగా ఆదాయం సర్టిఫికెటు రావటానికి 3 రోజులు పడుతుంది.
- ♦ వాస్తవాలను పరిశీలించిన తర్వాత తహశీల్దారు/ఎమ్.ఆర్.ఓ. నిర్దేశితఫారంలో సర్టిఫికెటు జారీ చేస్తారు. (ఫారం కోసం 168పేజీ చూడండి.) నిర్ణీత సమయంలోగా సర్టిఫికెటు జారీ కాకపోతే, మీరు ఎమ్.ఆర్.ఓ. తహశీల్దారుకు గుర్తు చేయవచ్చు. మీకు సరైన సమాధానం లభించని పక్షంలో, సంబంధిత ఆర్.డి.ఓ ను గాని సబ్‌కలెక్టరు ను గానీ కలవవచ్చు.

## సాల్వెన్సీ సర్టిఫికెటు

★ 'అప్పులు తీర్చగలరు' అనే సాల్వెన్సీ సర్టిఫికెటు కావాలంటే, దానికొక నిర్దేశిత ఫారం వుంది. దానికి నిర్ణీత ఫీజు చెల్లించాలి. మీ ఆస్తులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందుపరచాలి. మీ భూమి, భవనాల విలువను ప్రభుత్వం

నిర్ణయించిన మార్కెట్ రేట్లకే అనుగుణంగా అంచనావేస్తారు. ఆ తర్వాత మీ మొత్తం ఆస్తుల విలువను తెలుపుతూ సర్టిఫికెటు ఇస్తారు.

★ మీకు సరైన సేవలు అందనట్లైతై, సహాయ సహకారాల కోసం స్థానిక లోక్‌సత్తా/ పార్టీ విభాగాన్ని సంప్రదించవచ్చు.

## 2.5 కుల ధృవీకరణ పత్రాలు

★ షెడ్యూల్డు కులం (ఎస్.సి), షెడ్యూల్డు తెగ (ఎస్.టి) లేక వెనుకబడిన తరగతి (బి.సి)గా ఆయా పట్టికలలో చేర్చిన కులం లేక ఉపకులానికి మీరు చెందిన వారైతే, చట్టప్రకారం ఆ వర్గాలకే కేటాయించిన ప్రయోజనాలను పొందాలంటే కులధృవీకరణ పత్రం అవసరమౌతుంది.

★ మీరు ఆ కేటాయింపు పొందదలచు కోకపోతే ఏ దరఖాస్తు ఫారంలోనైనా 'కులానికి' సంబంధించిన వివరాన్ని పూర్తి చేయవలసిన అవసరం లేదు.

**కులధృవీకరణ పత్రం ఎప్పడు అవసరమౌతుంది.**

- ♦ పాఠశాల ప్రవేశం
- ♦ కళాశాల హాస్టళ్ళ ప్రవేశం ఉపకార వేతనం వగైరా ప్రవేశం
- ♦ కేటాయించిన తరగతులలో ఉద్యోగం
- ♦ ప్రభుత్వ సబ్సిడీలు
- ♦ గృహము, స్వయం ఉపాధి పథకాలు
- ♦ ఇళ్ల స్థలాల (మంజూరు) కేటాయింపు
- ♦ భూమి కేటాయింపు
- ♦ ఎన్నిక (అభ్యర్థిగా)

★ ఎస్.సి., ఎస్.టి, బి.సిలను విద్య, ఉద్యోగాల విషయాలలో ప్రత్యేకంగా పరిగణించాలని రాజ్యాంగంలోను, చట్టాలలోను నిబంధనలు పెట్టి సౌకర్యాలు కల్పించారు. ఎవరైనా తప్పుడు అభ్యర్థనలు, ధృవీకరణ పత్రాల ద్వారా ఈ ప్రయోజనాలను పొందితే నిజంగా అర్హత గలవారు, అవసరం వున్నవారు నష్టపోతారు. దొంగ సర్టిఫికెటు పొందటం, జారీ చేయడాన్ని ఖండిస్తూ పేదలు, అవసరంలో వున్నవారికి న్యాయం జరిగేట్లు మనం జాగ్రత్తపడాలి.

★ ఒకే మాదిరిగా ధ్వనిస్తూ వుండే కులాలు, వేర్వేరు తరగతులకు చెందడం సాధారణంగా జరుగుతుంటుంది. మీ కుల ప్రతిపత్తిని గురించి కచ్చితంగా తెలిసివుండాలి. వివిధ ఉపకులాలు, వివిధప్రాంతాలలో, వేర్వేరు ప్రతిపత్తి కలిగి వుండవచ్చు. ఒకే ప్రతిపత్తి, వృత్తి, వ్యాపకం కల ఉపకులాలు కూడా వివిధ ప్రాంతాలలో వేర్వేరు పేర్లు కలిగి వుండవచ్చును. ప్రాంతాలను బట్టి కూడా ప్రతిపత్తి మారుతూ వుంటుంది.

★ రెండు విభిన్న కులాలకు చెందిన తల్లిదండ్రులకు పుట్టిన బిడ్డలు, కేటాయింపుల విషయంలో సాధారణంగా తండ్రి కులాన్నే పరిగణిస్తారు. కానీ ఇటువంటి కేసులలో నిబంధనల్లో తేడాలు వుంటాయి. అలాంటి పిల్లల కుల ప్రతిపత్తిని రుజువు పరచేందుకు అనుసరించవలసిన విధానాలకు సంబంధించి సవివరమైన నిబంధనలు, సూచికలు వున్నాయి.

★ కుల విధానము, కేటాయింపులు అనేవి హిందువులకే సాధారణంగా వర్తిస్తాయి. కానీ ఉపకులాల ప్రాతిపదికగా సిక్కులకు, ముస్లింలకు కూడా కొన్ని కేటాయింపులకు అర్హత ఉంది. క్రైస్తవులుగా మతం మార్చుకొన్నవారికి, మార్పిడి ముందున్న వారి కులాన్ని బట్టి, ఆంధ్రప్రదేశ్‌లో బి.సి. ప్రతిపత్తి ఉంది. బౌద్ధమతానికి మార్చుకున్న షెడ్యూల్డు కులాల వారు కొన్ని రాష్ట్రాల్లో కేటాయింపులకు అర్హులే. కొందరు మహ్మదీయ వృత్తి వర్గాలవారు కుల వ్యవస్థలో అంతర్భాగమై పోయారు. సాధారణంగా వారికి కూడా బి.సిల వలె కేటాయింపులకు అర్హత వుంటుంది.

★ ఒక కుటుంబంలోని ఒక వ్యక్తికిచ్చిన కులధృవీకరణ పత్రం, దరఖాస్తు దారుడికి బలమైన సాక్ష్యం అవుతుంది. కానీ ఈ కారణంచేత , కులధృవీకరణ పత్రం దరఖాస్తు దారుకి ఖచ్చితంగా అందుతుందన్న హామీ వుండదు.

★ షెడ్యూల్డు కులాల జాబితాలు, షెడ్యూల్డు తెగల జాబితాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సాధారణంగా ఒకే విధంగావుంటాయి. ప్రత్యేకమైన ప్రయోజనాలుండే ఆదివాసుల జాతుల (పి.టి.జి) విషయంలో షెడ్యూల్డు తెగగా ప్రతిపత్తి ధృవీకరించే విషయంలో ఎంతో వివరమైన విధానాలున్నాయి.

★ వెనుకబడిన తరగతుల (బి.సి) జాబితాల విషయంలో మండల కమీషన్ వివిధ రాష్ట్రాల కోసం తయారుచేసిన కేంద్ర జాబితాకు, రాష్ట్రాలలోని జాబితాలకు మధ్య వ్యత్యాసం వున్నది. ఇటువంటి సందర్భాలలో ప్రస్తుత విధానం ఏమిటంటే రాష్ట్రంలో కూడా బి.సి ఉపకులాలుగా వర్గీకరించిన వాటికి మాత్రమే కేంద్ర ప్రభుత్వోద్యోగాలు కేటాయిస్తారు.

**కులధృవీకరణ పత్రం పొందడం ఎలా?**

★ కుల ధృవీకరణ పత్రం మంజూరుకు గ్రామ పంచాయితీ సిఫారసు చేస్తుంది. (2 రోజులు)

★ ఈ ధృవీకరణ పత్రం జారీ చేయడానికి తగిన అధికారి ఎమ్.ఆర్.ఓ. తహశీల్దారు నిర్దేశించిన దరఖాస్తు ఫారంలో మీ మండలంలోని తహశీల్దారుకు దరఖాస్తు

చేయాలి. (దరఖాస్తు ఫారం కొరకు 169 పేజీ చూడండి) దరఖాస్తు ఫారాన్ని సంపూర్ణంగా సక్రమంగా పూర్తిచేయాలి.

★ రెండు రూపాయల కోర్టు రుసుము స్టాంపు దరఖాస్తు ఫారానికి అతికించాలి (ఎస్.సి, ఎస్.టి లకు మినహాయింపు)

★ దరఖాస్తు ఫారంతోపాటు, ఈ క్రింది కాగితాలు విధిగా జతపరచాలి.

- ♦ పాఠశాల లేక కళాశాల నుండి బదిలీ సర్టిఫికెటు (టి.సి)
- ♦ లోగడ మీ కుటుంబ సభ్యులకిచ్చిన కుల ధృవీకరణ పత్రం
- ♦ వయస్సు గురించి అఫిడవిట్ (మీ జన్మ తేదీ, వయస్సు తెలుపుతూ మీ తల్లి లేక తండ్రి యిచ్చిన అఫిడవిటు పైన వీలుంటే నోటరీ సంతకం చేయించి జతపరచవచ్చును.)
- ♦ రేషను కార్డు కాపీ (మీకు రేషను కార్డు లేకపోతే, ఓటరుకార్డు వంటి మరేదైనా రుజువును గుర్తింపుకై జతపరచవచ్చును)
- ♦ ఇద్దరు రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడు ఆఫీసర్లు ఇచ్చిన రెండు సర్టిఫికెట్లు (ఫారం కొరకు 170 పేజీ చూడండి)

★ తహశీల్దారు/ఎమ్.ఆర్.ఓ. ధృవీకరణ పత్రం జారీ చేయడానికి నిర్ణీత వ్యవధి 5 రోజులు స్థానిక రెవెన్యూ అధికారులు మీ దరఖాస్తును పరిశీలిస్తారు. ఈ పరిశీలన, విచారణ జరిపేటప్పుడు రెవెన్యూ ఇన్‌స్పెక్టరు (ఆర్.ఐ) లేక గ్రామ రెవెన్యూ అధికారికి (వి.ఆర్.ఓ.) మీరు పూర్తిగా సహకరించాలి.

★ నిర్ణీత, సబబైన వ్యవధిలోగా, సర్టిఫికెటు జారీ కాకపోతే, ఎమ్.ఆర్.ఓ.కి గుర్తు చేయండి. వారి నుంచి జవాబు లేకపోతే సంబంధిత ఆర్.డి.ఓ. లేక సబ్ కలక్టర్‌ను కలవండి. ఎమ్.ఆర్.ఓ. యిచ్చే కులధృవీకరణ పత్రం 170 పేజీలో చూపిన ఫారం మీద వుంటుంది. సర్టిఫికెటు పొందిన తర్వాత అందులోని మీ వివరాలు, కులం సరిగా వున్నట్లుగా ధృవపరచుకోవాలి.

★ సరైన సేవలు అందని పక్షంలో సహాయ సహకారాల కోసం స్థానిక లోక్‌సత్తా / పార్టీ విభాగాన్ని సంప్రదించండి.

## 2.6 వారసత్వపు సర్టిఫికెటు

★ సాధారణంగా ఒక ఉద్యోగి పదవీ విరమణ చేసిన తర్వాత లేదా ఉద్యోగంలో వున్నప్పుడు మరణించినట్లయితే, చట్టరీత్యా వారసునికి ధృవీకరణ పత్రం అవసరమవుతుంది. పింఛనుదారు మరణించిన పక్షంలో కుటుంబ పింఛను ప్రయోజనాలు చట్టపరమైన వారసునికి దక్కుతాయి. సాధారణంగా ఒక వ్యక్తికి ప్రభుత్వంగానీ, స్థానిక సంస్థలు గానీ చెల్లించవలసిన బకాయిలను ఆ వ్యక్తి మరణానంతరం అతని చట్టపరమైన వారసునికి చెల్లిస్తారు. పింఛన్లు, గ్రాడ్యుయిటీ, ప్రావిడెంటు ఫండు, కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో ఉద్యోగం వంటివి చట్టరీత్యా వారసునికి లభించే రాయితీలు.

★ ఒక వ్యక్తి వీలునామా రాయకుండా చనిపోయినట్లయితే, ఆస్తి బదలాయింపునకు బ్యాంకులు, ఆర్థిక సంస్థల లావాదేవీలు, కోర్టు వివాదాల వంటి విషయాల్లో చట్టపరమైన వారసునిగా ధృవీకరణ పత్రం పనికిరాదు. అందుకు కోర్టు వారిచ్చే వారసత్వ పత్రం కావాలి.

★ బ్యాంకులు, బీమాసంస్థలు, ఆర్థిక సంస్థలతో లావాదేవీలు జరిపేటప్పుడు, ఒక వ్యక్తిని సాధారణంగా కుటుంబంలోని సభ్యుణ్ణి ముందుగానే నామినేట్ చేసి వుంటే, అప్పుడు కోర్టువారి వారసత్వ పత్రం అవసరం వుండదు. అందుచేత ముందు జాగ్రత్తగా ఈ చర్య తీసుకోవటం మంచిది.

★ చట్టరీత్యా వారసుని సర్టిఫికెటులో సాధారణంగా మరణించిన వ్యక్తి కుటుంబంలోని మిగిలిన వ్యక్తుల పేర్లు, వయస్సులు, మృతునితో వారికి గల బాంధవ్యం, వైవాహిక హోదా పేర్కొనబడి వుంటాయి. ఇందుకోసం మరణించిన వ్యక్తి మృతికి సంబంధించిన రుజువులు చూపే సర్టిఫికెటు కావలసి వుంటుంది.ఈ సర్టిఫికెటు ను వ్యక్తి మృతి చెందిన చోట మునిసిపాలిటీ, కార్పొరేషను, రెవెన్యూ అధికారీ జారీ చేస్తారు. వివరాల కోసం 172, 173 పేజీలు చూడండి.

### ఈ సర్టిఫికెటు పొందటం ఎలా?

★ ఈ సర్టిఫికెటు ఇచ్చేందుకు తహశీల్దారు/ఎమ్.ఆర్.ఓ. తగిన అధికారి. నిర్దేశిత ఫారంలో ఎమ్.ఆర్.ఓ. కు మీరు దరఖాస్తు పెట్టుకోవాలి. (దరఖాస్తు ఫారం కోసం 171 పేజీ చూడండి.) ఆ ఫారాన్ని సక్రమంగా, సంపూర్ణంగా నింపాలి. దరఖాస్తు

ఫారానికి రెండు రూపాయలు కోర్టుఫీజు స్టాంపును జతపరచాలి: (ఎస్.సి, ఎస్.టి వారికి మినహాయింపు). దరఖాస్తు ఫారంతో పాటు ఈ క్రింద చెప్పిన పత్రాలను జతపరచాలి.

- ♦ కుటుంబ సభ్యుల నుండి వ్యక్తి మరణించినట్టుగా రుజువు చూపే మరణ సర్టిఫికెటు. (వివరాలకు 171 పేజీ చూడండి)
- ♦ మరణించిన వ్యక్తి పింఛను పొందుతున్న వాడైతే అతని పింఛను చెల్లింపు వివరాలు (ఎకౌంటెంట్ జనరల్ జారీ చేసినది.)
- ♦ మరణించిన వ్యక్తి ఉద్యోగం చేస్తూవుంటే, అతని సర్వీసు సర్టిఫికెటు. (కార్యాలయ శాఖాధిపతి జారీచేసినది.)
- ♦ కుటుంబ సభ్యుల వివరాలు మరియు ఫొటోలు

★ సర్టిఫికెటు జారీకి కాలపరిమితి వివాదం లేదా పోటీ హక్కుదారు వున్నచోట ఇంకా ఎక్కువ సమయం పట్టవచ్చు. సాధారణంగా రెండో పెళ్ళి చేసుకున్న సందర్భాల్లో ఈ పోటీ హక్కు తలెత్తుతుంది.

★ మీ దరఖాస్తు ఫారాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు పరిశీలించి సరిచూస్తారు. సాధారణంగా మరణించిన వ్యక్తిని గానీ, అతని / ఆమె కుటుంబాన్ని ఎరిగిన ఒక ప్రభుత్వోద్యోగి వివరణను నిర్దేశిత ఫారంలో నమోదు చేసుకుంటారు. (ఫారం కోసం 173 పేజీ చూడండి). వాస్తవాలను ధృవీకరించుకునేటప్పుడు, విచారణ సమయంలో దయచేసి అధికారులతో సహకరించింది.

★ మీకు ఇచ్చే సర్టిఫికెటు 174పేజీలో చేసిన విధంగా వుంటుంది. అందులోని వివరాలని జాగ్రత్తగా సరిచూచుకుని, పొరపాట్లు ఉంటే వెంటనే మార్పులు చేయించుకోండి. వారంలోగా సర్టిఫికెటు. అందకపోతే తహాశీల్దారు / యమ్. ఆర్.ఓని ఆలస్యమయితే అర్.డి.ఓ.ని లేదా సబ్ కలెక్టరుని కలవండి.

★ సరైన సేవలు అందకపోతే మీ స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖని సంప్రదించండి.

*"భయం తలుపు తట్టింది*
*ఆత్మవిశ్వాసం తలుపు తీసింది*
*భయం దడుసుకుని పారిపోయింది* - మార్టిన్ లూథర్‌కింగ్

## 3.1 ఆస్తి సంబంధిత విషయాలు

★ భూమి, భవనాల రూపంలో స్థిరాస్తి ఉన్నట్లయితే, ఆ భూమి/స్థలానికి సంబంధించిన సమస్యల విషయంలో అడపాదడపా ప్రభుత్వాధికారుల దగ్గరకు వెళ్లే అవసరం పడుతుంది.

★ భూమి యాజమాన్యం విషయంలో మార్పు జరిగినపుడల్లా, భూమి రికార్డుల్లో నమోదు చేయవలసి వుంటుంది. ప్రతి ఏడాది సాగు, అనుభవం గురించి భూమి వినియోగం వివరాలను, రెవెన్యూ అధికారులు భూమి రికార్డుల్లో చేరుస్తారు. భూమి రికార్డుల్లో హక్కుదారు / యాజమాన్యం వంటి శాశ్వతమైన వివరాలు వ్రాసి వుంటాయి.

★ భూమి మొత్తం సర్వే జరిపి, చట్టప్రకారం (సర్వే, సరిహద్దుల చట్టం) ఉపవర్గీకరించి రికార్డుని నిర్దిష్టంగా జాగ్రత్తగా ఉంచుతారు. ప్రతి ఒక్క భూమి పటం గీసి, సర్వే నెంబరు, వార్డు, గ్రామం వారీగా ఆ పటాలను (మ్యాపులు) తయారుచేస్తారు. మ్యాపులు ఎమ్.ఆర్.ఓ., తహశీల్దారు వద్ద లేక ప్రతి జిల్లాలోని సర్వే భూమి రికార్డుల అసిస్టెంటు డైరెక్టరు వద్ద లేదా హైదరాబాద్‌లోని సర్వే భూమి రికార్డుల డైరెక్టరు వద్ద లభిస్తాయి.

★ ఈ రికార్డులను పరిశీలించటం ద్వారా సరిహద్దు సమస్యలేవైనా పరిష్కరించుకోవచ్చును. సరిహద్దు తగాదాల పరిష్కారానికి, భూమి రికార్డుల పరిశీలన ఒక విశ్వసనీయమైన మార్గం. భూమిని కొనేముందు, అమ్మకందారు చట్టరీత్యా హక్కుదారు అని రూఢి పరచుకోవడానికి భూమి రికార్డులు సరిచూసుకోవడం మంచిది.

★ కొన్నిసార్లు భూమి యాజమాన్యం గురించి సందేహం లేకపోయినా, భూముల సరిహద్దులను ప్రత్యక్షంగా గుర్తించడం సమస్య కావచ్చును. దీనికి భూమి రికార్డుల పరిశీలన సమాధానం అవుతుంది.

★ ఒకవేళ బ్యాంకు లేక ఆర్థిక సంస్థలకు తనఖా పెట్టవలసి వస్తే, ఆ భూమి యాజమాన్యం గురించి అదివరకటి లావాదేవీల గురించి సరిచూచుకోవడం అవసరం.

★ భూమి రికార్డుల నుండి రుజువు పరచుకునే పద్ధతులు తెలియక చాలామంది

మోసపోతుంటారు. తెలంగాణా ప్రాంతంలో సమగ్రమైన సర్వే లేక ఈ సమస్య మరింత చిక్కుల మయంగా ఉండవచ్చు. పూర్వపు బ్రిటిషు భారతదేశంలో (సర్కారు ఆంధ్ర, రాయలసీమ) భూమిని సక్రమంగా సర్వే జరిపి సాధారణంగా నిర్దిష్టమైన రికార్డులే నిర్వహిస్తున్నారు.

★ పేదలకు కేటాయించిన ప్రభుత్వ భూములను కొనడం చట్టవిరుద్ధం. అలాగే భూపరిమితిలోని మిగులు భూమిని కొనడం చట్టవిరుద్ధం. (వ్యవసాయ లేదా పట్టణ మిగులు భూమి ఏదైనా సరే.) ఆస్తిని అమ్మే హక్కు విక్రయదారునికి వుండి, అమ్మకం చట్టసమ్మతమైనదైతే తప్ప భూమిని కొనడం, రిజిస్ట్రేషన్‌చేయడం వలన భూమిపైన యాజమాన్యం గానీ, హక్కుగానీ రాదు.

★ మీ ఆస్తులను, ప్రయోజనాలను, డబ్బుని కాపాడుకోవాలంటే భూసంబంధమైన నిబంధనలు పూర్తిగా అర్థం చేసుకోవడం చాలా అవసరం.




" శుభవార్త సార్! అసలు పరిపాలనలో ఎవ్వరికీ, ఏ విషయం పైనా ఏ బాధ్యతా లేదని ఎంక్వైరి రిపోర్టులో తేల్చేశారు.

## 3.2 పట్టాదారు పాసుపుస్తకము

★ పట్టాదారు పాసుబుక్కు (పి.పి.బి) అనేది, ఒక ఆసామి (పట్టాదారు)కి వున్న భూమి వివరాలన్నీ వ్రాసిన బైండు చేయబడిన చిన్న పుస్తకం, పి.పి.బి.ని హక్కుల రికార్డు చట్టం (ఆర్.ఆర్.యాక్టు) ప్రకారం రెవెన్యూ అధికారులు తమంతట తామే జారీ చేస్తారు. రైతు పాసుపోర్టు సైజు ఫొటో, సంతకం లేక వేలిముద్ర అధికారులకు అవసరం.

★ పి.పి.బి లో నాలుగు విభాగాలుంటాయి. ఇతర వివరాలతో బాటుగా, ఈ క్రింద చూపిన వివరాలుంటాయి.

- ♦ భూమి యాజమాన్యం వివరాలు
- ♦ కౌలుదార్లు ఎవరైన వుంటే వారిపేర్లు
- ♦ పట్టాదారు ఫొటో గుర్తింపు
- ♦ తనఖాలు, గుత్తలు మొదలైన ఆస్తి లావాదేవీల వివరాలు
- ♦ రుణాలు
- ♦ యాజమాన్యంలో మార్పులు

★ దీనికి సంబంధించిన చట్టం రాష్ట్రపతి (కేంద్రప్రభుత్వం) ఆమోదాన్ని పొందింది. కనుక భూమి సంబంధమైన విషయాలన్నిటికీ చెల్లుబడి అయ్యే చట్టబద్ధమైన పుస్తకం పి.పి.బి. ఈ పాసు పుస్తకాన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు చట్టప్రకారం భూమి యాజమాన్యానికి రుజువుగా ఆమోదించాలి. అయినప్పటికీ అతి జాగ్రత్త కోసం, ఆస్తిని అప్పు కింద హామీగా అంగీకరించే ముందు, ఇతర పత్రాలు కూడా ఇవ్వాలని పట్టుబడతారు.

★ ఏదైనా కారణం చేత మీ పి.పి.బి. దొరకక పోతే, రెవెన్యూ అధికారుల నుంచి అది పొందేటట్లు చూసుకోవాలి.

### పట్టాదారు పాసుబుక్కును పొందడం ఎలా?

★ పి.పి.బి.ని జారీ చేయడానికి ఎమ్.ఆర్.ఓ., తహశీల్దారు తగిన అధికారి. నిర్ణీత ఫారంపైన దరఖాస్తు చేయాలి. (ఫారం 1ఎ) (ఫారం 1ఎ కోసం 175పేజీ చూడండి) ఈ ఫారాన్ని తగు వివరాలతో స్పష్టంగా, జాగ్రత్తగా పూరించి మూడు సెట్లు తయారుచేయాలి. అవసరమని భావిస్తే ఒక సెట్టు వుంచుకోవచ్చు. పూర్తి

చేసిన ఫారాన్ని సంబంధిత ఎమ్.ఆర్.ఓ. కు గాని ఆర్.డి.ఓ.కు గాని దాఖలు చేయాలి.

★ ఈ క్రింద చూపిన ఆధారపత్రాలు దరఖాస్తుతో విధిగా జతపరచాలి.

- ♦ రిజిస్టరైన క్రయ / దానదస్తావేజు
- ♦ కౌలు ఒప్పందం
- ♦ తనఖా దస్తావేజు
- ♦ ఒకవేళ వారసత్వంగా హక్కు కోరుతుంటే మృతుడైన బంధువుకి ఎవరి నుంచి ఆస్తి సంక్రమించిందో, అతని మరణ ధృవీకరణ పత్రం.
- ♦ మీకు ఆస్తిని మరణ శాసన పూర్వకంగా వ్రాసిన రిజిస్టరైన / రిజస్టరు కాని వీలునామా కాపీ.

★ ఒక గ్రామంలో కంటే ఎక్కువ ప్రదేశాల్లో ఆస్థి వుంటే, మీకు భూములున్న ప్రతి ఒక్క గ్రామానికి, వేర్వేరు దరఖాస్తులు చేయాలి. మీ దరఖాస్తుతో జతపరచిన కాగితాలతో సహా మూడేసి కాపీలను ఎమ్.ఆర్.ఓ. లేక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కు దాఖలు చేయాలి.

★ సంబంధిత ఆస్థి పై ఏమైనా అభ్యంతరాలు ఎవరికైనా వున్నాయోమో తెలుసుకోవడానికి ఎమ్.ఆర్.ఓ. మీకు, సాధారణ ప్రజలకు ఒక నోటీసు జారీ చేస్తారు. మీ హక్కును గురించి విచారణ చేసే రెవెన్యూ అధికారులతో మీరు సంపూర్ణంగా సహకరించాలి.

★ పి.పి.బి. దరఖాస్తు యిచ్చిన తర్వాత ఒక నెలరోజులలో ఇవ్వాలి. వివరాలు సరిచూచి చట్టబద్ధ విచారణ జరపాలి. ఈ పద్ధతి చాలా వివరంగాను, ఒక్కోసారి సుదీర్ఘంగాను వుంటుంది. విచారణ జరిపిన తర్వాత, ఎమ్.ఆర్.ఓ మీ దరఖాస్తును గురించి సంతృప్తి చెందగానే, పి.పి.బి. జారీ చేస్తారు. మీ పట్టాదారు పాసుపుస్తకాన్ని అందుకోగానే, అందులోని వివరాలన్నీ సక్రమంగా వున్నాయో లేవో సరిచూచుకోండి. ఒకవేళ జాప్యముంటే, ఎమ్.ఆర్.ఓ.కి గుర్తుచేయండి. సరైన జవాబు రాకపోతే సంబంధిత ఆర్.డి.ఓ లేదా సబ్‌కలెక్టరును కలుసుకోండి.

★ మీకు సరైన జవాబు రాకపోయినా, సేవలు సరిగా లేకపోయినా, స్థానిక లోక్‌సత్తా / పార్టీ శాఖను సలహా, సహాయాల కోసం సంప్రదించండి.

## 3.3 హద్దులు, ఎల్లలు ఏర్పాటు

★ భూమి వివరాల రికార్డుల కోసం ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చు:

- ♦ గ్రామం - గ్రామ పరిపాలనాధికారి (వి.ఆర్.ఓ)
- ♦ మండలం - ఎమ్.ఆర్.ఓ/తహశీల్దారు
- ♦ జిల్లా - సర్వే భూమి రికార్డుల అసిస్టెంటు డైరెక్టరు - ( ఏ.డి.)
- ♦ రాష్ట్ర - సర్వే భూమి రికార్డుల డైరెక్టరు

★ ప్రతి రెవెన్యూ గ్రామానికి భూమి పటంగా గీచి వుంటుంది. గ్రామంలోని ప్రతి సర్వే నెంబరుకు, భూమి పటాలు (మ్యాపులు) వుంటాయి ప్రతి ఒక్క సర్వే నెంబరులో వున్న భూమి విస్తీర్ణంలో తేడా చాలా వుంటుంది. సాధారణంగా ఐదు ఎకరాలు, అంతకుమించి విస్తరించి వుంటుంది. మెట్టభూముల్లోను, తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలోను సర్వేనెంబరు ఇంకా పెద్దగా వుండవచ్చును. కొన్నిసార్లు తెలంగాణా ప్రాంతంలో పెద్ద విస్తీర్ణాలలోని సర్వేకాని (కొలతలు వేయని, సరిహద్దులు గుర్తించని) భూములు ఒక సర్వే నెంబరులో చేరివుండవచ్చును.

★ ఆంధ్రా, రాయలసీమ జిల్లాల్లో అన్ని భూములకు విశ్వసనీయమైన భూమి రికార్డులు, పటాలు ఉన్నాయి. తెలంగాణాలో భూమి రికార్డులు, పటాలు అంత నిర్దిష్టంగా లేవు. ఒక్కోసారి వాస్తవ పరిస్థితిలో ఎంతో తేడాగా ఉండవచ్చును.

★ భూమి సరిహద్దు గుర్తింపు ఈ క్రింది సందర్భాలలో అవసరమౌతుంది.

- ♦ భూముల గుర్తింపు
- ♦ కొనడం లేక అమ్మడం
- ♦ భూములు విభజన
- ♦ మార్పిడి లేక పట్టాబదిలీ
- ♦ భూమి తగాదాలు
- ♦ ప్రభుత్వ భూములపై దురాక్రమణ
- ♦ సరిహద్దు తగాదాలు
- ♦ కొలతల్లో పొరపాట్లు
- ♦ భూమి రికార్డుల్లో పొరపాట్లు

## భూమి సరిహద్దుల ఏర్పాటుకై దరఖాస్తు చేయడం ఎలా?

★ సరిహద్దు సర్వే, గుర్తింపు అనేది చట్టరీత్యా విద్యుక్తమైన ఒక నియమబద్ధమైన పద్ధతి. ఏదో వాడుక పద్ధతిలో, భూమిని కొలతలు వేయడం మాత్రమే కాదు. సరిహద్దుల గుర్తింపుకై మీరు ఎమ్.ఆర్.ఓ., తహశీల్దారు కి తెల్ల కాగితంపైన ఒక దరఖాస్తు చేయాలి. మీ దరఖాస్తులో మీకు సరిహద్దు గుర్తింపు కావలసిన సరైనసర్వే నెంబరు రిజిష్టరైన సబ్‌డివిజను నెంబరు ఇవ్వాలి. (ఆ వివరాలు వి.ఆర్.ఓ వద్ద దొరుకుతాయి.)

★ సదరు భూమి పైన మీకు ప్రమేయము, హక్కులు వున్నట్లు ప్రామాణికమైన పత్రాలు దాఖలు చేయాలి. ఆ పత్రాలు ఏవంటే...

♦ రికార్డు ఆఫ్ రైట్స్ (ఆర్.ఓ.ఆర్)
♦ పట్టాదారు పాసుపుస్తకం (పి.పి.బి)
♦ ధృవీకరించిన 'పహనీ' లేదా 'అడంగళ్' కాపీ (గ్రామ లెక్కల నుండి)
♦ రిజిస్టరయిన క్రయ దస్తావేజు

(వి.ఆర్.ఓ. వద్ద ఆర్.ఓ. ఆర్.పహనీ వంటి ప్రామాణిక పత్రాలు లభిస్తాయి.)

★ ఒక సబ్‌డివిజను గుర్తింపు, సరిహద్దులు స్థిరము చేయడానికి రుసుము చలాన ద్వారా కట్టవలెను.

మీకు సమీపాన వున్న సబ్‌ట్రెజరీలో ఈ క్రింది ఖాతాలో చలానా కట్టవలెను.

♦ ఎమ్.హెచ్.0029 - భూమి శిస్తు (Land Revenue)
♦ ఎస్.హెచ్.106 - సర్వే సెటిలుమెంటు వ్యవహారాల లెక్కలలో ఖాతా (Receipt on Account of Survey and Settlement operations)
  ♦ ఎస్.హెచ్.(01) - సర్వే భూమి రికార్డుల సంబంధమైన వ్యవహారాలలో ఆదాయం ఖాతా (Receipts in connection with Survey and Land Records Operations)

★ ఈ దరఖాస్తును, జత పరిచిన కాగితాలు, చలానా రశీదులతో సహా, తెల్లకాగితం మీద, సంబంధిత తహశీల్దారు/ఎమ్.ఆర్.ఓ. ను ఉద్దేశించి వ్రాయాలి. అప్పుడు ఈ పనిని ఒక సర్వేయరుకు అప్పగిస్తారు. తర్వాత సర్వేయరు, దరఖాస్తు దారుకు నోటీసు యిచ్చి, ఆ స్థలాన్ని సందర్శించి దరఖాస్తు దారు సమక్షంలో సరిహద్దును ఏర్పాటు చేస్తారు.

★ కొన్ని ప్రత్యేకమైన కేసులలో ఎ.డి. స్వయంగా పొలం వద్దకి వచ్చి పర్యవేక్షించాలని వ్రాత పూర్వకంగా కోరవచ్చును.

ఇదా అభివృద్ధి



" అబ్బో ఈ గ్రామం చాలా అభివృద్ధి చెందిందయ్యా - ఇది కూడా పెద్ద సిటీలాగా అయిందండయ్యా - ఇక్కడ కూడా నీళ్ళు, కరెంటు ఉండవండయ్యా

## 3.4 సర్వేలోని తప్పుల సవరణ

### తెలంగాణా ప్రాంతం

★ తెలంగాణ ప్రాంతంలోని భూమి రికార్డులలో సర్వేల తప్పులు సవరించడానికి ఏర్పాటువున్నది.

★ తెలంగాణ ప్రాంతంలో సర్వే సెటిల్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతపు భూమి శిస్తు చట్టం 1317 ఫస్లి ప్రకారం జరుగుతాయి. ఈ చట్టంలోని 87వ సెక్షను ప్రకారం నిర్వహణలో గమనించిన భూమి రికార్డుల తప్పులను సవరించవచ్చును.

★ తెలంగాణాలో జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఆయనకు సహాయం చేసే స్పెషల్ గ్రేడు డిప్యూటీ కలక్టర్ అయిన జిల్లా రెవెన్యూ ఆఫీసరు (డి.ఆర్.ఓ) సర్వే తప్పులను సవరించడానికి తగిన అధికారి. పూర్తి వివరాలనిస్తూ, తప్పులను సవరించమని తెల్లకాగితంపైన డి.ఆర్.ఓ.కి దరఖాస్తు చేయాలి. దరఖాస్తు రుసుము ఏమీలేదు.

★ తప్పుల సవరణకై డి.ఆర్.ఓ.కి ఇచ్చే దరఖాస్తులన్నీ సంబంధిత గ్రామాన్ని గురించిన సెటిలుమెంటు ప్రకటన వెలువడిన రెండు సంవత్సరాలలోగానే ఇవ్వాలి. ఒకవేళ ఇందులో జాప్యం జరిగితే, అందుకు గల కారణాలు లిఖితపూర్వకంగా ఇవ్వాలి. దరఖాస్తు ఇవ్వడంలోని మీ ఆలస్యాన్ని డి.ఆర్.ఓ. మాఫీ చేయవచ్చును.

★ ఒకవేళ భూమి రికార్డులకి, ప్రస్తుత భూమి ఆధీనము వివరాలకి మధ్య కొత్త రిజిస్ట్రేషన్ లేక విభజన వల్ల వ్యత్యాసాలుంటే, మీరు హక్కు సంపాదించిన వివరాలనిస్తూ, పదిరూపాయల నాన్ జ్యూడిషియల్ స్టాంపు కాగితం పైన అఫిడవిట్ (ప్రమాణం పత్రం) దాఖలు చేయాలి. ధృవీకరించబడిన సర్వే సెటిలుమెంటు రికార్డు నకళ్లు, ఆధారంగా వున్న ఇతర పత్రాలు, దరఖాస్తుతో పాటు దాఖలు చేయాలి.

★ దరఖాస్తు వివరాలు విచారించి, మీరిచ్చిన పత్రాలు కూడా డి.ఆర్.ఓ. పరిశీలిస్తారు. ఈ విచారణ, పరిశీలన జరిగేటప్పుడు, మీరు అధికారులతో సంపూర్ణంగా సహకరించాలి. నిజంగానే సవరించబడిన తప్పు వున్నదని సంతృప్తి చెందాక, పరిస్థితులను బట్టి డి.ఆర్.ఓ. తప్పులను సరిద్దివలసిందిగా సర్వే, భూమి రికార్డుల డైరెక్టరు లేక కమీషనరుకు సిఫారసు చేస్తారు.

**ఆంధ్రాప్రాంతం**

★ ఆంధ్రాప్రాంతంలోని నిర్వహణలో గమనించిన చిన్నచిన్న తప్పులు మినహా సర్వే తప్పులు సరిదిద్దడానికి అవకాశం లేదు. సవివరమైన పట్టణ సర్వే జరిపిన ఆంధ్రప్రాంతంలోను, జంటనగరాల్లోని కొన్ని భాగాలలోను పెద్దగా సర్వే తప్పులు వుండే అవకాశం లేదు. ఆ క్రింది స్వల్పమైన లోపాలని మాత్రం సవరించవచ్చును:

- ♦ కొలతల్లో చిన్న పొరపాట్లు
- ♦ పాత సర్వే నెంబరు గుర్తింపులలో తప్పులు
- ♦ 1923 ఏ.పి. సర్వే సరిహద్దుల చట్టం క్రింద సర్వే జరిపి శాశ్వతమైన 'ఏ' రిజిష్టరులో సబ్‌డివిజను గుర్తింపులలో పొరపాట్లు.
- ♦ ఈ విషయంలో మీకు ఏదైనా ఇబ్బంది వుంటే సంబంధిత అధికారులను గానీ, వారిపై ఉన్నతాధికారులను గాని కలుసుకోండి.
- ♦ సరైన సేవలు అందని యెడల, స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖవారిని సలహా సహకారాల కోసం సంప్రదించండి.



" క్షమించండి సార్ , ఇంకా ఫైల్ రెడీకాలేదు. పరిపాలనా సంస్కరణల్ని అమలుచేశాక పని మరీ కష్టమయిపోయింది.

# 3.5 భూమి కొనుగోలుకు ముందు తనిఖీ చేయవలసిన వివరాలు

★ క్రయదస్తావేజు రిజిష్టరు చేసే ముందు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

- ♦ భూమి అమ్మకాలలో తరచూ మోసాలు జరుగుతుంటాయి. అందులోని సర్వే చేయని భూముల విషయంలో ఇది మరీ ఎక్కువ.
- ♦ అనేక సందర్భాలలో భూమిపై సరియైన హక్కులేని వ్యక్తులు అమ్మకాలు నిర్వర్తిస్తుంటారు. దీని వలన సదరు భూమి కొనుగోలు దారుకు చట్టపరమైన హక్కు ఏమి సిద్ధించదు.
- ♦ మన రాష్ట్రంలో ఒకే భూమికిదొంగ డాక్యుమెంట్లు సృష్టించి - ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు అమ్మడం సాధారణమైపోయింది.
- ♦ కొన్ని సందర్భాలలో అవతలి వ్యక్తులు పన్నే కుట్రలలో భాగంగా కూడా ఈ మోసాలు జరుగుతుంటాయి. ఇవి ఎక్కువగా భూమిపై ఏ విధమైన హక్కులు లేనప్పటికీ సదరు భూమి మాదేనని తేల్చుకోవడం కోసం ఏ ఇద్దరు వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా, ఆ భూమి కేసు పూర్తి అయ్యే వరకు క్రయవిక్రయ లావాదేవీలు జరపరాదు.

★ ఈ క్రింద చూపిన భూములని కొనుగోలు చేయటం చట్టవిరుద్ధం కాబట్టి హక్కు ఏమి సిద్ధించదు.

- ప్రభుత్వం దానం చేసిన భూములు (గ్రాంటులు / అసైన్డు)
- ఇనామ్ ద్వారా ధారాదత్తం చేసి ఇంకా సెటిల్‌మెంటు కాని భూములు
- భూ గరిష్ట పరిమితిని అతిక్రమించిన భూములు
- గవర్నమెంటు భూములు
- ఏజేన్సీ ప్రాంతంలో షెడ్యూల్డు తెగల వారికి కేటాయించిన భూములు

## స్థలం కొనుగోలు చేసేముందు దాని వివరాలు తనిఖీ చేసే విధానం

★ స్థలం/ఇల్లు/ఇతర స్థిరాస్థిని కొనుగోలు చేసే ముందు ఈ క్రింది అంశాలను పరిశీలించండి.

- ♦ స్థలం ఉన్న ప్రాంతం
- ♦ గ్రామ ఖాతాల్లోని స్థలం వివరాలు
- ♦ పంచాయతీ / పురపాలక సంఘాలలో ఈ స్థలం తాలూకు వివరాలు
- ♦ అమ్మకందారునికి భూమిని అమ్మేందుకు గల హక్కు

★ పోరంబోకు (ప్రభుత్వం భూమి) స్థలాలను విక్రయించరాదు. ప్రభుత్వం స్థలాలు మధ్యలో ఉన్న భూమి కూడా పోరంబోకు స్థలం అయ్యే అవకాశం ఉంది. కాబట్టి దాన్ని అమ్మరాదు. గ్రీన్‌బెల్ట్ లేదా రాస్తా (రోడ్డు) మొదలైన వాటికోసం కేటాయించిన స్థలాలను కూడా అమ్మరాదు. నగరాల్లో పట్టణాల్లో వినోదార్థం లేదా వాణిజ్య వినియోగార్థం కేటాయించిన స్థలాలను సూచించిన విధంగా మాత్రమే వినియోగించాలి.

★ మీరు భూమి కొనుగోలు చేసే ముందు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోండి.

- ♦ స్థలాన్ని వ్యక్తిగతంగా చూడండి.
- ♦ గ్రామ ఖాతాల్లో ఈ క్రింది రికార్డులను పరిశీలించండి

| | |
|---|---|
| - పొలం కొలతల పుస్తకం (ఎఫ్.ఎమ్.బి)<br>- 10(1) అకౌంట్<br>- గ్రామ మ్యాపు | వి.ఆర్.ఓ. లేదా తహశీల్దారు/ ఎం.ఆర్.ఓ వద్ద ఉంటాయి |
| - పట్టాదారు పాస్ పుస్తకం<br>- ఇదివరకటి విక్రయ పత్రాలు | భూమి స్వంతదారు వద్ద ఉంటాయి. |

- ♦ గత 12 సంవత్సరాలుగా స్థలానికి లింకు డాక్యుమెంట్‌లు ఉన్నాయో లేదో తనిఖీ చేయండి. ఇవి భూమి స్వంతదారు దగ్గర ఉండాలి.

★ అన్ని భూమి రికార్డులు మనకు అందుబాటులో ఉండాలి. వాటిని గ్రామ పంచాయితీ / తహశీల్దారు కార్యాలయాల నుంచి పొందవచ్చు. స్థలం కొనుగోలు చేసేముందు ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్‌ను (దయచేసి 176పేజీని చూడండి) తప్పక పొందాలి.

★ స్థలం మీకు అన్ని విధాలా నచ్చి, ఎటువంటి లావాదేవీలు, బాదరా బందీలూ లేవని భావిస్తే, స్థలం కొన్న తర్వాత మరెవరో వచ్చి ఆ స్థలం నాది అనరని నమ్మకం మీకు ఉంటే, అప్పుడే ఆ స్థలాన్ని కొనుగోలు చేయండి. ఏమన్నా సందేహాలు ఉంటే న్యాయ సలహా పొందండి.

## 3.6 ఆస్తి లావాదేవీలు సర్టిఫికెట్

★ భూమిపైన యాజమాన్యం, ఆస్తిపై ఇతర హక్కులను గురించి, గత పన్నెండు సంవత్సరాల వివరాలను ఎన్‌కంబ్రెన్సు సర్టిఫికెటు తెలుపుతుంది. పన్నెండేళ్ళ పాటు అంతరాయం లేకుండాను, తగాదాలు లేకుండాను ఒక వ్యక్తి లేదా వరుసగా ఆస్తి, కొందరు వ్యక్తుల ఆధీనంలో వుండి, వారికి రిజిస్ట్రేషను ద్వారా హక్కు మారినప్పుడు ప్రస్తుతమున్న యజమాని అమ్మడానికి హక్కు కలిగి వున్నాడని భావించవచ్చును. చిక్కులున్న కేసులలో న్యాయవాది సలహా అవసరం.

★ ఎన్‌కంబ్రెన్సు సర్టిఫికెటు, ఈ క్రింది సందర్భాలలో అవసరమౌతుంది.

- ♦ భూమి తనఖా
- ♦ భూమి కొనేముందు నిర్ధారణ కోసం
- ♦ ఆసామి హక్కుని పరిశీలించటం కోసం
- ♦ ఆస్తి పైన కోర్టులలో వివాదాలు

★ అమ్మకాలు, తనఖాలు మొదలైన వాటి రిజిస్ట్రేషనులన్నీ సంబంధిత సబ్ రిజిస్ట్రారు చేస్తారు. ఇటువంటి రికార్డులు సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో ఉంటాయి. రాష్ట్రంలో సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాల్లో కంప్యూటరీకరణ ఇప్పుడు జరుగుతున్నది. అయినప్పటికీ, , కంప్యూటరీకరించిన రికార్డుల ఏర్పాటుకు అనుగుణంగా కేంద్రచట్టాలు సవరించబడలేదు గనుక, ఇప్పటికీ పాతకాగితాల దస్తావేజులు, ఫైళ్లు అవసరమే.

### ఎన్‌కంబ్రెన్సు సర్టిఫికేటు (ఇ.సి) పొందడం ఎలా?

★ ఆ ప్రదేశానికి బాధ్యత, అధికారం గల సబ్‌రిజిస్ట్రారుకు దరఖాస్తు చేయాలి. ఆ తేదీకి ముందు గల పన్నెండు సంవత్సరాలకు ఇ.సి. ఇస్తారు. నిర్ణీత ఫారంపైన దరఖాస్తు చేయాలి. (176 పేజీలో ఉన్న ఫారం చూడండి) మీరు ఆస్తికి సంబంధించిన అన్ని వివరాలు ఇవ్వాలి.

★ ఫీజుగా మీరు ఈ క్రింది మొత్తాలు కట్టాలి.

- ♦ దరఖాస్తు రుసుము రు. 10/-
- ♦ మొదటి ఏడాదికి అన్వేషణ రుసుము : రూ 5/-

- ♦ ప్రతి ఒక్క అదనపు సంవత్సరానికి అన్వేషణ రుసుము : రూ 2 /-
- ♦ దరఖాస్తు చేసిన రోజునే మాకు ఇ.సి కావాలంటే మీరొక రూ.50/- అదనంగా అన్వేషణ రుసుముగా చెల్లించాలి.

★ ఇ.సి. జారీ చేయటానికి నిర్దేశించిన వ్యవధి 10-20 నిమిషాలు

★ రోజులు. ఐదు రోజులకు మించి ఆలస్యం జరిగితే, మీరు జిల్లా రిజిస్ట్రారును కలవవచ్చును.

- ♦ ఆలస్యంగానీ, వేధింపుగానీ ఉంటే, సక్రమమైన సేవలు అందకపోతే మీరు స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖను సలహా, సహాయాల కోసం సంప్రదించండి.




"ఈ ఆఫీసు ప్రతిష్ఠ మరీ దిగజారిపోతుందోయ్ ! ఇతను చూడు, ' ఇక్కడ లంచం ఎక్కడివ్వాలి?' అనడుగుతున్నాడు.!"

## 3.7 అపార్టుమెంటు కొనుగోలుకు ముందు సరిచూడవలసిన అంశాలు

- ఒక ప్లాటు కొనేముందు, భవంతిని కట్టే బిల్డరు పూర్వ చరిత్ర పరిశీలించాలి. అపార్టుమెంటు , సాముహిక కొనుగోలు పథకాన్ని హైదరాబాదు మున్సిపలు కార్పొరేషను, హైదరాబాదు నగరాభివృద్ధి సంస్థ (హుడా) , లేదా పట్టణాభివృద్ధి సంస్థ (యు.డి.ఎ.) ఆమోదించినదీ లేనిదీ సరిచూసి సంతృప్తి చెందండి. పర్మిటు నెంబరు, తేదీతో సహా మంజూరు జారీచేసిన ప్లానుకు, సాముహిక కొనుగోలుకు ఆమోదం వున్నాయని ధృవపరచుకోండి.
- అపార్టుమెంటు నిర్మాణం, మంజూరైన ప్లాను ప్రకారం వున్నదో లేదో, మొత్తం మీద కొలతలు ప్లానుతో సరిపోలుతున్నాయో లేదో, సరిజూచుకోండి.
- హైదరాబాదు మున్సిపలు కార్పొరేషను మునిసిపాలిటీ 'నివసించుటకు యోగ్యముగా' ('ఫిట్‌ఫర్ ఆక్యుపేషన్) వున్నదని ఖరారు పరుస్తూ యిచ్చిన ధృవీకరణ పత్రాన్ని, ప్రతి కొనుగోలుదారు, బిల్డరు నుండి అడిగి తీసుకోవాలి. ఈ ధృవీకరణ పత్రం, నిర్మాణము ప్లాను ప్రకారము జరిగినట్లుగాను, ఏ విధమైన అవకతవకలు, అతిక్రమణలు, లేనట్లు గ్యారంటీ యిస్తుంది. ఈ సర్టిఫికెటు లేకుండా ప్లాటు కొంటే తర్వాత కాలంలో, మున్సిపాలిటీ / కార్పొరేషను ద్వారా సమస్యలు ఎదుర్కోవలసి రావచ్చును.
- అపార్టుమెంటులో పిల్లలు తిరిగి ఆడుకోవడానికి (టాట్-లాట్) చోటు, వాహనాలు నిలుపుకునేందుకు (పార్కింగుకి, నీటి సరఫరా, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు, పారిశుధ్యానికి, చెత్త కుండీలకు సౌకర్యం వుండాలి.
- అపార్టుమెంటు స్థలాన్ని, నిర్మాణమైన ఫ్లాటుని భాగాలుగా విభజనని అనుమతించరు.
- పార్కింగు కోసం ఏర్పాటు చేసిన చోటు సరిపోతుందా అని సరిచూచుకోండి ఇంకా సరిచూడవలసిన ఇతర అంశాలు నిర్మాణ నాణ్యత, పై అంతస్థులలో పిల్లలకు భద్రత, నీరు కారకుండా వుండే పై కప్పు, సరైన నీరు, డ్రైనేజీ ఏర్పాట్లు
- సంబంధిత ఆస్తి, దాని హక్కుదారుని గూర్చిన పూర్తి వివరాలు సంతృప్తికరంగా వున్నట్లయితే, ఆ హక్కుదారునికి క్రయవిక్రయ అర్హతలున్నాయని నిర్ధారిస్తే, ఆస్తి కొనుగోలు చేయవచ్చు.

## 3.8 విక్రయ దస్తావేజుల రిజిస్ట్రేషను

★ భూములు, భవనాలు (స్థిరాస్తులు) అమ్మినప్పుడు, యాజమాన్య హక్కు మారినప్పుడు, చట్టప్రకారం క్రయదస్తావేజును రిజిష్టరు చేయాలి. అప్పుడే గట్టి చట్టబద్ధమైన హక్కులు నికరమౌతాయి.

★ రిజిస్ట్రేషనుకు ముందు, అమ్మే వ్యక్తికి ఆస్తిని అమ్మడానికి, బదిలీ చేయడానికి సంపూర్ణ యాజమాన్య హక్కు వున్నదా అనే విషయంలో కొనే వ్యక్తి అన్ని విధాలైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. (176పేజీలు చూడండి) అమ్మే వ్యక్తికి స్పష్టమైన, నిర్వివాదమైన హక్కు వున్నదని మీరు సంతృప్తి చెందిన తర్వాతే, క్రయధనాన్ని యిచ్చి దస్తావేజు రిజిష్టరు చేసుకోవాలి.

### రిజిష్టరు చేసుకోవడం ఎలా?

★ దస్తావేజులు వ్రాయడంలో అనుభవం కల వ్యక్తి చేత అన్ని వివరాలు చేరుస్తూ క్రయదస్తావేజు వ్రాయించి సబ్‌రిజిస్ట్రారుకు దాఖలు పరచాలి.

★ అమ్ముతున్న వ్యక్తి తానే స్వయంగా క్రయదస్తావేజు రిజిస్ట్రేషను సమయంలో సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో హాజరు కావాలి. కొనేవ్యక్తి తాను స్వయంగా హాజరు కావచ్చు. లేదా వేరెవరైనా తన ప్రతినిధిని తన పక్షాన పంపవచ్చును.

★ దస్తావేజులో చూపిన ఆస్తి యొక్క యదార్థమైన విలువ వ్రాశారా లేక స్టాంపు రుసుము తప్పించుకోవడానికి తక్కువ విలువ వ్రాశారా అనేది నిర్ధారించుకోవడానికి, సబ్‌రిజిస్ట్రారు స్వయంగా ఆస్తిని తనిఖీ చేయవచ్చును.

★ అనేక ప్రాంతాలకు, భూమి విలువను నిర్ణయించారు. ప్రాధమికమైన మూల్యం (విలువ) తెలిపే రిజిష్టరులు కార్యాలయములో వుంటాయి. ఒకవేళ తక్కువగా విలువకడితే సబ్‌రిజిస్ట్రారు, ప్రభుత్వం నిర్ణయించిన రేట్లప్రకారం విలువకట్టి, స్టాంపు రుసుమును వసూలు చేస్తారు. ఒకవేళ ప్రభుత్వం నిర్ణయించిన మూల్యం రేటుకంటే ఎక్కువ చూపిస్తే క్రయదస్తావేజు ప్రకారం రుసుమును వసూలు చేస్తారు.

★ అమ్మకం వెల లేక అమ్మేవారికి యివ్వవలసిన మొత్తాన్ని , సబ్‌రిజిస్ట్రారు సమక్షంలో క్రయదారునికి అందించాలి. అమ్మిన వ్యక్తి తనకి సొమ్ము అందినట్లు రశీదు యిచ్చిన తర్వాతనే దస్తావేజు రిజిష్టరవుతుంది. క్రయదస్తావేజు రిజిస్ట్రేషను జరిగే సమయంలోనే, ఆస్తిని కొన్న వారికి అప్పగిస్తారు. మామూలుగా ఆస్తి

అప్పగింత దస్తావేజుల మార్పిడి, లిఖిత పూర్వకంగా ఆస్తిని యిచ్చినట్లు, పుచ్చుకున్నట్లు అంగీకరించడం మూలకంగా జరుగుతుంది.

★ స్టాంపు రుసుము యీ క్రింది పద్ధతిలో విధిస్తారు.

♦ మున్సిపలు కార్పొరేషను, యితర సెలక్షను గ్రేడు పురపాలక ప్రాంతాలలో — విలువలో 13%

♦ ఇతర మునిసిపాలిటీలలో — విలువలో 12%

♦ పంచాయతీ ప్రాంతాలలో — విలువలో 11%

★ రిజిస్ట్రేషను సమయంలో, సబ్ రిజిస్ట్రారుకు, యీ క్రింది అదనపు రుసుము చెల్లించాలి.

♦ రూ. 50,000 విలువ వరకు - ప్రతి 1000/- కి రూ. 10/-

♦ రూ. 50 వేలకు పైబడి - ప్రతి 1000/- కి రూ. 5/- (ఆపైన వున్న మొత్తానికి)

కాపీయింగు ఫీజు - ప్రతి 800 మాటలకు రు.2/-

★ రిజిస్ట్రేషను ఖర్చును కొన్నవారు భరిస్తారు. స్టాంపు రుసుమునకు సరిపడిన నాన్ - జ్యుడిషియల్ స్టాంపు కాగితాలను కొని (యివి లైసెన్సు పొందిన అమ్మకం దారుల దగ్గర లభిస్తాయి.) ఆ కాగితాల మీద క్రయదస్తావేజును వ్రాయించాలి.

★ సబ్‌రిజిస్ట్రారు కార్యాలయములో కాపీ తీసుకున్న తరువాత ఒరిజనలు దస్తావేజు యిస్తారు. దానితో అమ్మకం పూర్తి అవుతుంది.

★ కొన్ని సార్లు క్రయదస్తావేజు వ్రాసుకునే ముందుగా ఇరు పక్షాల వారు ఒక అమ్మకం ఒప్పందానికి రిజిష్టరు చేయవచ్చును. దీనికి ప్రతి రూ.1000 విలువకు యాభై రూపాయలు స్టాంపు రుసుము వుంటుంది. ఐతే, క్రయ దస్తావేజు రిజిస్ట్రేషను సమయంలో, యీ సొమ్ము మినహాయింపబడుతుంది.

★ కొన్ని సందర్భాలలో, అమ్మకఒప్పందం వ్రాసుకున్న సమయంలో ధరలో కొంత భాగము పుచ్చుకుని ఆస్తిని కొన్నవారికి ఆధీనము చేయవచ్చును.

**రిజిష్టరు కానటువంటి లేదా తక్కువ విలువ చూపిన దస్తావేజులు**

★ ఎప్పుడైనా క్రయ దస్తావేజు రిజిష్టరు కాకపోయినా, లేదా ఆస్తి విలువ కంటే తక్కువ చూపుతూ రిజిష్టరయినా తన దృష్టిలోకి రాగానే, సబ్‌రిజిస్ట్రారు, ఆ దస్తావేజును స్వాధీనం చేసుకోవచ్చును.

★ ఈ విధంగా స్వాధీనం చేసుకున్న దస్తావేజును కలెక్టరు లేక ఆర్.డి.ఓ లేక

సబ్‌కలెక్టరుకు సరైన విలువ నిర్ణయించి, జరిమానా విధించమని పంపుతారు.

★ ఆర్.డి.ఓ. కేసు వివరాలను గురించి విచారణ జరిపి, అమ్మకం తేదీ నాటికి ఆస్తి విలువను నిర్ణయించి, చట్టప్రకారం జరిమానా విధిస్తారు. స్టాంపు రుసుమును, జరిమానాను వసూలు చేసిన తర్వాత ఆస్తి అమ్మకం రిజిష్టరవుతుంది.

★ విలువ కట్టడం విషయంలో ఏదైనా సందేహముంటే మూల్యముల ప్రాథమిక రిజిష్టరు కావాలని అడిగి, అందులో యిచ్చిన ఆస్తి విలువలు సరిచూచుకోవచ్చును. అన్ని సబ్‌రిజిస్ట్రారు కార్యాయలయాలలోను రికార్డులని కంప్యూటరీకరణ చేస్తున్నారు. అది పూర్తయ్యాక మీరు రిజిష్టరు చేసే భూమి విలువ, దానిపైన కట్టవలసిన స్టాంపు రుసుములని అడిగి కంప్యూటరు ప్రింటులో పొందవచ్చును. అయితే సంబంధిత చట్టాలని ఇంకా సవరించక పోవటంతో కంప్యూటరీకరణ జరిగాక కూడా ఇంకా కాగితాలమీద ఆధారపడాలి. చట్టం మార్చే వరకూ పాత పద్ధతిలోనే నకళ్ళు రాయాలి.

★ రిజిస్ట్రేషను ఏమయినా ఇబ్బంది కలిగితే జిల్లా రిజిస్ట్రారుని సంప్రదించండి.

★ సరైన సేవలు అందకపోతే, స్థానికంగా వున్న లోక్‌సత్తా /పార్టీ విభాగాన్ని లేదా జిల్లా శాఖను లేక కేంద్ర సంస్థను సంప్రదించండి.

# 3.9 పట్టాబదిలీ - మ్యుటేషన్

★ భూమి రూపంలో వున్న ఆస్తిని మీరు పొందగానే, పట్టా (భూయాజమాన్యపత్రం) బదిలీకి అవసరమైన పద్ధతిని అనుసరించాలి. అల్లాగే మీరు ఎవరికైన ఆస్తిని యిచ్చినప్పుడు (అమ్మకం , దానం లేక మరణం శాసనం ద్వారా సంక్రమణ) పట్టాబదిలీ అవసరమౌతుంది. రికార్డులలో చేసే శాశ్వతమైన ఈ మార్పు చేర్పులను 'మార్పిడి' (మ్యుటేషన్) అంటారు.

★ మార్పిడి ఈ క్రింది సందర్భాలలో అవసరమౌతుంది.

- ♦ వారసత్వం ద్వారా హక్కుదారు మారడం
- ♦ జాయింటు పట్టా విషయంలో జీవించివున్న వారి హక్కు (సర్వైవర్‌షిప్)
- ♦ వారసత్వం ద్వారా ఆస్తి సంక్రమణ
- ♦ ఆస్తి పంపకం /విభజన
- ♦ కొనుగోలు
- ♦ తనఖా
- ♦ దానం
- ♦ గుత్తగా కిరాయికివ్వడం (లీజు)
- ♦ యాజమానిగా, పట్టాదారుగా తనఖా లేక భూమి అనుభవం దారు లేక కౌలుదారుగా హక్కుని పొందినప్పుడు.

**మార్పిడి లేక పట్టా బదిలీకై దరఖాస్తు చేయడం ఎలా?**

★ కార్యాలయం రికార్డులలో పట్టాబదిలీ చేయడానికి లేదా మార్పిడి జరపడానికి తగిన అధికారి తహశీల్దారు /ఎమ్.ఆర్.ఓ. భూ సంబంధమైన ఆస్తిపై మీకు కొత్తగా హక్కులు వస్తే నిర్ణీత ఫారంపైన (ఫారం VI ఎ) ఎమ్.ఆర్.ఓ. కి ఆ సమాచారం తెలపాలి. ఫారం VI ఎ కోసం 177 పేజీ చూడండి.

★ సమాచారం ఇచ్చే 'ఫారం -ఎ' తో పాటు మీరు పొందిన హక్కుకు సంబంధించిన ఈ క్రింది పత్రాలలో అవసరమైన వాటిని తహశీల్దారు / ఎమ్.ఆర్.ఓ. కి దాఖలు చేయాలి.

- ♦ క్రయదస్తావేజు
- ♦ దానపత్రం
- ♦ తనఖా దస్తావేజు
- ♦ విభజన దస్తావేజు

- ♦ వీలునామా ♦ వారసత్వ ధృవీకరణ పత్రము

★ ఇటువంటి సమాచారం మీ నుంచి అందినట్టు తహశీల్దారు ఎమ్.ఆర్.ఓ లిఖిత పూర్వకంగా రశీదు ఇస్తారు. మీరు పేర్కొన్న భూ సంబంధమైన వివరాలలో రికార్డు ఆఫ్ రైట్స్ (ఆర్.ఒ.ఆర్) లో చేర్చబడిన పేర్లతో సహా సంబంధిత వ్యక్తులందరికీ నోటీసులు ఇస్తారు. మీరిచ్చిన సమాచారం వివరాలలోని నిజానిజాలను పరిశీలించి, విచారణ జరుపుతారు.

★ మీరిచ్చిన సమాచారంలో పొరబాట్లు లేవనీ, మీ హక్కు సక్రమమైనదనీ ఆయనకు సంతృప్తి కలగగానే, భూమి రికార్డులలో అవసరమైన మార్పులు చేస్తూ మ్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేస్తారు. మీహక్కు నిర్ధారించడానికి వీలు కాకపోతే, ఆయన మీ సమాచార లేఖను తోసిపుచ్చుతారు.

★ మార్పు చర్య ఆమోదిస్తే, భూమి రికార్డుల్లో చేసిన మార్పులను ఎమ్.ఆర్.ఓ. ఈ క్రింది ప్రదేశాలలో ప్రకటిస్తారు/ ప్రదర్శిస్తారు.

- ♦ గ్రామ చావిడి (రెవెన్యూ భవనం)
- ♦ గ్రామ పంచాయతీ
- ♦ గ్రామ పాఠశాల
- ♦ తహశీల్దారు/ఎమ్.ఆర్.ఓ. కార్యాలయం
- ♦ మండల ప్రజాపరిషత్తు కార్యాలయం
- ♦ గ్రామంలో టముకు (డప్పు చాటింపు / ప్రకటన)

★ ఈ విధానమంతా చాలా వివరంగా జాగ్రత్తగా చేయవలసిన పని కనుక, పద్ధతి ప్రకారం విచారణ కావాలి కనుక రికార్డుల్లో మార్పిడి చేయడానికి సుమారు 45 రోజులు పట్టవచ్చును. ఈ లోపుగా ఉత్తర్వులు జారీ చేయకపోతే, ఎమ్.ఆర్.ఓ.కి గుర్తుచేసి మరికొంత కాలం వేచివుండాలి. ఎమ్.ఆర్.ఓ. ఉత్తర్వు సంతృప్తికరంగా లేకపోతే చట్టరీత్యా సంబంధిత ఆర్.డి.ఓ.కి గానీ, సబ్‌కలెక్టరుకు గానీ అప్పీలు చేసుకోవచ్చును. అప్పీలు ఎమ్.ఆర్.ఓ. ఉత్తర్వుయిచ్చిన అరవై రోజుల్లోగా లిఖిత పూర్వకంగా చేయాలి,. ఆర్.డి ఓ ఉత్తర్వు కూడా సంతృప్తికరంగా లేకపోతే జిల్లా కలెక్టరుకు, పునఃపరిశీలన (రివిజను)కై విజ్ఞాపన చేయవచ్చును.

★ పట్టాబదిలీ, మార్పిడి అనేవి క్రింది కేసులలో అనుమతించారని గుర్తించండి.

- ♦ భూగరిష్ట పరిమితి చట్టానికి లోబడిన భూములు
- ♦ పట్టణ స్థలాల పరిమితి చట్టానికి లోబడిన భూములు

- ♦ షెడ్యూల్డు ప్రాంతాలలోని భూములు (ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు కాని వారికి వాటిని బదిలీ చేయటానికి వీలుకాదు)

★ ఏ స్థాయిలోనైనా అసాధారణమైన జాప్యం జరిగితే సంబంధిత అధికారికి గుర్తుచేయండి. సరైన జవాబు లేకపోతే, ఇంకా ఉన్నత అధికారిని కలుసుకోండి.

★ వేధింపు వున్నా, సక్రమమైన సేవ లభించకపోయినా, స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖను సలహా, సహాయాల కోసం సంప్రదించండి.



" నా బల్ల మీద ఫైళ్ళు పేరుకుపోకూడదని ఆర్డర్లు వచ్చాయి. అందుకే ఆ టేబులు అక్కడ పెట్టించి ఆ ఫైళ్ళు అన్నింటిని అక్కడికి చేర్పించాము.!"

# 4.1 రేషను కార్డులు

★ ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతమైన ప్రజాపంపిణీ వ్యవస్థ ఉంది. పేదల కోసం దాదాపు కోటి 69 లక్షల తెలుపు కార్డులు, 15.6 లక్షల అంత్యోదయ అన్న యోజన కార్డులు, ఇతరుల కోసం 39 లక్షల గులాబీ రంగు కార్డులు ఉన్నాయి.

★ వార్షిక ఆదాయం ఆరు వేల లోపు ఉన్నవారు తెల్ల కార్డులకి అర్హులు. ఒకటిన్నర ఎకరాల కన్నా తక్కువ మాగాణి భూమి ఉండి దానిని కాల్వ నీటి ద్వారా సాగుచేసేవారు., రెండున్నరలోపు ఎకరాల మాగాణిని చెరువు నీటి ద్వారా సాగుచేసేవారు, 3 ఎకరాలలోపు మెట్టభూమిలో వాణిజ్య పంటలు పండించే వారూ మాత్రమే తెలుపు కార్డులకి అర్హులు. వార్షిక కుటుంబ ఆదాయం ఆరు వేలకన్నా ఎక్కువ ఉన్నవారు గులాబీ రంగు కార్డులకి అర్హులు

★ ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శక సూత్రాల ప్రకారం ప్రతినెలా ఈ దిగువ తెలిపిన సరుకులను రేషన్ కార్డులు ఉన్నవారు రేషన్‌షాపుల నుంచి కొనుగోలు చేయవచ్చు.

★ రేషన్‌కార్డు వలన ఎన్నో ప్రయోజనాలున్నాయి.

## పౌర సరఫరాలు (రేషన్‌షాపు)

### రంగారెడ్డి & హైదరాబాద్ జిల్లాలు

| సరుకు పేరు | కార్డు రకము | లభించవలసిన సరుకు | కిలో ధర |
|---|---|---|---|
| బియ్యం | తెలుపురంగు కార్డుదారులు | ప్రతి కుటుంబ సభ్యుడికి 4 కిలోలు, మొత్తం 20 కిలోలు మించకుండా | రూ. 5-25 |
| | అన్న అంత్యోదయ కార్డుదారులు | నెలకి 35 కిలోలు | రూ. 3-00 |
| | గులాబి రంగు కార్డుదారులు | నెలకి 35 కిలోలు | రూ. 9-00 |
| | అన్నపూర్ణ లబ్దిదారులు | నెలకి 10 కిలోలు | ఉచితంగా |
| గోధుమలు | అన్ని రకాల కార్డుదారులు | నెలకి 10 కిలోలు | రూ. 7-00 |
| చక్కెర | తెలుపు రంగు కార్డు మరియు అన్న అంత్యోదయ కార్డుదారులు | నెలకి 1 కిలో | రూ. 13-50 |
| కిరోసిన్ (ఎల్.పి.జి. గ్యాస్ కనెక్షన్ లేనివారికి) | ఎమ్.సి.హెచ్ పరిధిలో రంగారెడ్డి | 10 లీటర్లు ( తెలుపురంగు కార్డు దారులకి)<br>6 లీటర్లు (మున్సిపాలిటీ పరిధిలో)<br>5 లీటర్లు (మండల పరిధిలో)<br>3 లీటర్లు మండల కేంద్రం కాని గ్రామీణ ప్రాంతాలు<br>2 లీటర్లు దీపం పథకం లబ్దిదారులు | రూ. 9-50 |

- రేషన్ దుకాణాల నుంచి నిత్యావసర వస్తువుల సరఫరా
- పాస్‌పోర్టు దరఖాస్తుతో పాటు జతచేయడానికి
- డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుతో పాటు జతచేయడానికి
- నివాస ధృవపత్రానికై దరఖాస్తు చేస్తున్నప్పుడు
- ఓటరుగా నమోదు చేసుకోవాల్సి వచ్చినపుడు
- మరెన్నో దరఖాస్తులతో పాటు జతచేయడానికి
- వ్యక్తిగత గుర్తింపుకి
- పేదలకి ప్రత్యేక వైద్య సహాయం అందించడానికి
- గ్యాస్ కనెక్షన్ పొందడానికి

**రేషన్ కార్డును పొందడం ఎలా?**

★ హైదరాబాద్, ఇంకా ఇతర పట్టణ ప్రాంతాల్లో రేషన్ కార్డు జారీచేసే అధికారి అసిస్టెంట్ సప్లయి ఆఫీసర్ (ఎ.ఎస్.ఓ) మిగిలిన ప్రాంతాల్లో మండల రెవెన్యూ అధికారీ జారీ చేస్తారు. డిక్లరేషన్ ఫారం రూపంలో దరఖాస్తు ఫారాన్ని ఎ.ఎస్.ఓ/ తహశీల్దారు, ఎం.ఆర్.ఓ. ల వద్దనుంచి స్వీకరించాలి. (డిక్లరేషన్ ఫారం కోసం 178 పేజీ చూడండి.) ఈ డిక్లరేషన్ ఫారం ఉచితంగా లభిస్తుంది. మీరు ఫారాన్ని జాగ్రత్తగా నింపి దానితో పాటు ఈ దిగువ తెలిపిన వాటిని నివాస ధృవీకరణగా చూపవచ్చు.

- ఆస్తి పన్ను రశీదు
- విద్యుత్ బిల్లు రశీదు
- నీటి పన్ను రశీదు
- ప్రస్తుతం అమలులో ఉన్న బ్యాంక్ ఖాతా పాస్‌బుక్
- అవకాశం ఉన్నచోట మీ యజమాని నుండి ఆదాయ ధృవీకరణ పత్రం

★ పైన పేర్కొన్న వాటిని జతచేసి డిక్లరేషన్ ఫారాన్ని నిర్దేశించిన అధికారికి అందచేయాలి. మీరు సమర్పించిన దరఖాస్తును, జతపరచబడిన వాటిని తహశీల్దారు/ ఎ.ఎస్.ఓ. పరిశీలిస్తారు. ఈ పరిశీలన సమయంలో మీరు అధికారులతో పూర్తిగా సహకరించాలి.

★ అవసరమైన వాటికంటే ఎక్కువగానే ప్రస్తుతం తెలుపు కార్డులున్నాయి. కొన్ని జిల్లాలో 80-90 శాతం వరకూ తెలుపు కార్డులు ఉండటం విశేషం. గణాంక వివరాలని బట్టి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 30-40 కన్నా తక్కువ శాతం

మాత్రమే పేదవారు ఉన్నట్టు తెలుస్తుంది. కాబట్టి తెలుపు కార్డును సంపాదించడం కష్టం. సరైన కారణాలు ఉంటే గులాబీరంగు కార్డు పొందడం సులువు.

★ మీరు వేరే పట్టణానికి /గ్రామానికి మారితే మీ రేషన్ కార్డును తహశీల్దారు/ ఎం.ఆర్.ఓకి సరెండర్ చేసి, సర్టిఫికెట్‌ను పొందాలి. దీన్ని మీరు కొత్తగా మారిన ప్రాంతంలోని ఎ.ఎస్.ఓ./తహశీల్దారు ఓ.కి డిక్లరేషన్ ఫారంతో పాటు దాఖలు చేయాలి.

★ పెళ్లి/స్థలం మార్పిడి కారణంగా మీరు కుటుంబం నుంచి వేరు పడుతుంటే కుటుంబ కార్డు నుంచి మీ పేరు తొలగింపుకై 'డిలీషన్ సర్టిఫికెటు' ఖచ్చితంగా ఆ ప్రాంత ఎ.ఎస్.ఓ / ఎం.ఆర్.ఓ కి సమర్పించాలి.

★ తెల్లరేషను కార్డుల కోసం, చేసే తప్పుడు ప్రయత్నాలను మీరు ప్రోత్సహించకూడదు. బియ్యంపైన లేదా ఇతర నిత్యావసర వస్తువుల పైనా ఇచ్చే సబ్సిడీలు మీరు చెల్లిస్తున్న పన్నుల నుంచి ఇస్తున్నారని గ్రహించండి. బోగస్ రేషన్ కార్డులను కనుగొంటే ఆ విషయాన్ని ఎ.ఎస్.ఓ./ తహశీల్దారుకి ఫిర్యాదు చేయవలసిన బాధ్యత మీది.

**రేషన్ కార్డులకి సంబంధించి వివిధ దశలకి పట్టే సమయం**

| క్ర.సం | పని | నిర్దేశించిన సమయం |
|---|---|---|
| 1 | పేరు తొలగింపు | రుజువు చూపితే అదేరోజు |
| 2 | పేరు చేర్పు | ఏడు రోజులలోపు |
| 3 | రేషను షాపు పరిధిలోనే చిరునామా మార్పు | అదేరోజు |
| 4 | చిరునామాతో పాటు రేషన్ షాపు మార్పు | ఏడు రోజులలోపు |
| 5 | బదిలీ/వేరేచోటకి మార్పు సందర్భంగా జారీ చేసే సరెండర్ సర్టిఫికెట్ కోసం | అదేరోజు |
| 6 | సరెండర్ సర్టిఫికెట్ ఉంటే కొత్త రేషన్ కార్డ్ జారీకి | ఏడు రోజులలోపు |
| 7 | రాష్ట్రం మారినపుడు కొత్త రేషన్ కార్డు కోసం | 2 వారాలు |

# 4.2 చౌకధరల దుకాణాల అజమాయిషీ

★ ప్రభుత్వాధికారులు ఎంపిక చేసి లైసెన్సు ఇచ్చిన డీలర్ల చౌకధర దుకాణాలను నడిపిస్తారు. రేషను దుకాణ దారులు ఏ ఇతర వ్యాపారమూ చేయరాదు. దుకాణదారు - సర్పంచ్, మండల పరిషత్తు సభ్యుడు వంటి ఇతర ఎన్నికైన పదవి వహించకూడదు. దుకాణదారులు ఏ ప్రభుత్వోద్యోగులకు ముఖ్యంగా రెవెన్యూ, పౌరసరఫరా శాఖలకు చెందిన వారికి బంధువులు కారాదు.

★ రేషను కార్డులున్నవారికి నిత్యావసర వస్తువులని ఈ దుకాణాలు సరఫరా చేస్తాయి. ఈ వస్తువులని రేషను షాపులకి ప్రభుత్వం అందిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణంలో, నియంత్రించిన (అదుపు చేసిన) ధరలకు, ఈ సరుకులన్నీ రేషన్ కార్డుపై సరఫరా చేయాలి.

★ దుకాణదారు ఈ క్రింది సూచనలు బోర్డులో ప్రదర్శించాలి:

- ♦ దుకాణం పనిచేసే సమయాలు
- ♦ తెల్ల, గులాబి కార్డుల సంఖ్య
- ♦ అన్ని వస్తువుల నిల్వలు
- ♦ అన్ని వస్తువుల ధరలు
- ♦ ఒక్కొక్క కార్డుపైన యిచ్చే పరిమాణాలు
- ♦ కీ రిజిష్టరు - కార్డు కలిగిన వారి పూర్తి వివరాలతో

★ రేషను దుకాణాల పనితీరును పర్యవేక్షిస్తూ స్టాకులు, ధరల, కార్డులు సంఖ్య సక్రమంగా సూచిస్తున్నట్లుగా రూఢి చేసుకోవలసిన విధి పౌరులకు వున్నది. 'కీ' రిజిష్టరును ఏ కార్డుదారైన పరిశీలించి సరిచూడవచ్చును. ఒకవేళ కొన్ని బూటకపు పేర్లున్నా, చినిగిపోయిన లేదా తరలి వెళ్లిపోయిన వ్యక్తుల పేర్లు తొలగించకపోయినా, ఆ సంగతులను దుకాణదారు దృష్టికి, సమీపాన వున్న తహశీల్దారు/ఎ.ఎస్.ఓ లేక వారి ఉద్యోగుల దృష్టికి తీసుకుని రావాలి. అధిక ఆదాయం కలవారికి తెల్లకార్డులిస్తే, ఆ వాస్తవాన్ని కూడా అధికారులకు తెలియబరచాలి.

★ సర్పంచ్ అధ్యక్షుడుగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు (ఆర్.ఐ), ఇంకా ఇతరులు సభ్యులుగా ప్రతి గ్రామానికి ఆహార సలహా సంఘం (ఎఫ్.ఎ.సి) వున్నది. ఆర్.డి.ఓ లేక సబ్‌కలెక్టర్ అధ్యక్షులుగా, మండలాధ్యక్షులు, జిల్లా పరిషత్తు సభ్యులు మొదలైన

వారు సభ్యులుగా, ప్రతి మండలానికి ఒక ఆహార సలహాసంఘం వున్నది.అలాగే కలెక్టరు అధ్యక్షులుగా జిల్లా పరిషత్తు, అధ్యక్షులు శాసన సభ్యులు , ఇంకా ఇతరులు సభ్యులుగా ప్రతిజిల్లాకు ఒక ఆహార సలహా సంఘం వున్నది.

★ రేషను దుకాణాల్లో ఈ క్రింది అక్రమాలు జరుగవచ్చును:

- ♦ కార్డుల సంఖ్య, స్టాకులు, ధరలు ప్రదర్శించకపోవడం
- ♦ దుకాణం వేళలు వ్రాసి వుంచకపోవడం
- ♦ వేళలు పాటించక పోవడం
- ♦ నిర్దేశించిన పరిమాణంలో వస్తువులు యివ్వకపోవడం, లేదా అసలు అమ్మకపోవడం.
- ♦ కీ రిజిష్టరు (కార్డు వివరాలు) లభ్యం కాకపోవడం
- ♦ కీ రిజిష్టరులో దొంగపేర్లు / లేని మనుష్యుల పేర్లు వుండడం
- ♦ అధికాదాయం ఉన్న వారి పేరున తెల్లకార్డు లివ్వడం
- ♦ కొలతలు, తూనికలు సరిగ్గా లేకపోవడం
- ♦ అధిక ధరలు వసూలు చేయడం

★ ఇవి, ఇంకా ఇటువంటి ఫిర్యాదులున్నప్పుడు గ్రామ, మండలస్థాయిల్లోని స్థానిక ఆహార సలహా సంఘాలకు పూర్తి వివరాలతో సహా, వెంటనే తెలియపరచాలి. పౌర సరఫరాల శాఖ నిఘా విభాగం వారికి ఈ విషయాలలో అధికారముంటుంది, కనుక వారికీ తెలియపరచవచ్చును. హైదరాబాదు నగరంలో ప్రధాన రేషను అధికారి రేషను షాపుల విషయాలు చూస్తారు.

★ సరుకు మళ్లించడాన్ని అరికట్టడానికై రేషను దుకాణాల ద్వారా నీలిరంగు కిరసనాయిలు సరఫరా చేస్తున్నారు. నీలిరంగు కిరసనాయిలు ఎక్కడైనా కనిపిస్తే ఆహార సలహా సంఘానికి లేదా అధికారులకు తెలియపరచాలి.

# 4.3 చీకటి బజారులో అమ్మకాల నిర్మూలన

**చీకటి బజారు అమ్మకాలు అంటే ఏమిటి?**

★ పలు అత్యవసర సరుకుల నిలువ, రవాణా, అమ్మకాలను క్రమబద్దీకరించేందుకు 'నిత్యావసర వస్తువుల చట్టం' అనే చట్టం వుంది. ఈ చట్టం కింద ఎన్నో నియంత్రణ ఉత్తర్వులు ఇందుకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి.

★ చీకటి బజారు అమ్మకాలలో సాధారణంగా దిగువ పేర్కొన్న పద్ధతుల్ని అనుసరిస్తారు.

- ♦ రేషను షాపులకోసం ఉద్దేశించిన సరుకుల మళ్లింపు
- ♦ ధరల పైన కంట్రోల్ వున్న సరుకులను అధిక ధరలకు అమ్మడం
- ♦ పెట్రోలు, డీజీల్ కల్తీ కోసం కిరసనాయిల మళ్లింపు
- ♦ అనుమతి లేకుండా సరుకులను నిలవచేయడం
- ♦ అనుమతి లేకుండా వేరే ప్రాంతాలకు రవాణా

**చీకటి బజారు కి శిక్షలు**

- ♦ ఇలాంటి సందర్భాలన్నింటిలోను, నల్లబజారు అమ్మకాలను నియంత్రించేందుకు కోర్టుకు సంబంధిత అధికారులకు ఎన్నో అధికారాలు వున్నాయి. మామూలుగా సరుకు నిల్వలను తనిఖీ చేసి, జప్తుచేస్తారు.
- ♦ ఆ కేసులను జిల్లా కలెక్టరు లేదా జాయింట్ కలెక్టరు విచారిస్తారు.
- ♦ అపరాధం చేసినట్లు రుజువైతే / నిల్వలను పాక్షికంగా కాని సంపూర్ణంగా కాని స్వాధీనం చేసుకునే అధికారాలు వున్నాయి.
- ♦ అలాగే నల్ల బజారు వర్తకులను క్రిమినల్ కోర్టులో విచారించి, శిక్షించవచ్చు.
- ♦ తీవ్రమైన అపరాధం జరిగిన కేసులలో, నేరస్తులను 'నల్లబజారు అమ్మకాల నిరోధ చట్టం' క్రింద ప్రభుత్వం లేదా జిల్లా కలెక్టర్లు ఆరు నెలల పాటు నిర్భంధంలో వుంచవచ్చు.
- ♦ ఈ చట్టాలు చాలా శక్తివంతమైనవి. అవసరమైనపుడు తప్పక ఉపయోగించాలి.

★ తీవ్రమైన అపరాధాలు తమదృష్టికి వచ్చినపుడు పౌరులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. నియంత్రణ కింద వున్న సరుకులపై యిచ్చే అన్ని రాయితీలు పన్నుల ద్వారా మనం కాని, నిర్భంధిత లెవీ ద్వారా రైతులు కాని చెల్లిస్తున్నవే. ఈ ప్రయోజనం అర్హులైన పౌరులకు చెందాలి. కాని, నల్లబజారు వర్తకులకు

అవినీతికి పాల్పడే సిబ్బందికి దక్కకూడదు. అందుకే నల్లబజారు అమ్మకాలను నియంత్రించేందుకు ప్రజలు అప్రమత్తంగా వుండడం అవసరం.



"ఎన్నికల ట్రిక్కులు! ఈసారి బాగా భయపడుతున్నట్టున్నారులే!"

# 5.1 ఓటుహక్కు

★ ప్రతి పౌరుడికి లోక్‌సభ, శాసన సభ, పంచాయితీ లేదా పురపాలక సంఘం వంటి ప్రతిస్థాయిలోని ఎన్నికలలో ఓటు వేసే హక్కు, బాధ్యత వున్నాయి. 18 ఏళ్ల వయస్సు పై బడిన భారత పౌరులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి.

★ రెండు తరగతుల పౌరులు మాత్రమే ఓటు వేయడానికి అనర్హులుగా ప్రకటించారు:

- ♦ మతిస్థిమితం లేనట్టు, న్యాయస్థానం నిర్ధారణ చేసిన వారు
- ♦ ఎన్నికలలో అక్రమాలకి సంబంధించిన చట్టాల ప్రకారం అనర్హులైనవారు.

★ ఒక వ్యక్తి ఒక సమయంలో ఒక్క నియోజకవర్గంలోనే రిజిష్టరు కాగలడు. అలాగే ఒక వ్యక్తి ఒక నియోజక వర్గంలో ఒక పోలింగు స్టేషనులో మాత్రమే నమోదు కావచ్చును. సాధారణంగా నివాసముండే ప్రాంతంలో ఓటరుగా నమోదు కావాలి.

★ ఎన్నికల అధికారులు ఓటర్ల జాబితాలు ఎప్పటికప్పుడు తయారుచేసి, సవరణలు చేస్తుంటారు.లోక్‌సభ, శాసన సభలకు జరిగే ప్రతి సాధారణ ఎన్నికకు ముందు మామూలుగా ఓటర్ల జాబితాను సవరిస్తారు. ఉప ఎన్నికకు ముందుగాని , ఎన్నికల కమీషనరు ఆదేశించినప్పుడు గానీ ఓటర్లు జాబితాలని సవరించవచ్చును.

★ 18 ఏళ్ళు మించిన వయస్సున్న తమకుటుంబ సభ్యుల పేర్లు ఓటర్ల జాబితాలో చేరేటట్లు పౌరులు జాగ్రత్త పడాలి.

★ స్థానిక తహశీల్దారు ఇతర రెవెన్యూ అధికారులు మామూలుగా ఓటర్ల జాబితా నమోదు చేసే అధికారులుగా వుంటారు హైదరాబాదు వంటి నగరాలలో మునిసిపల్ కార్పొరేషను అధికారులు ఓటర్లని నమోదు చేస్తారు.

★ ఎన్నికల అధికారులు ఆయా సమయాల్లో ఓటర్ల ముసాయిదా జాబితాలను ప్రకటించి, అభ్యంతరాలుంటే తెలపమని పత్రికలలో ప్రకటిస్తారు. ఆ సమయంలో పౌరులు ఓటర్ల జాబితాలను పరిశీలించే శ్రమ తీసుకుని, తమ తమ పేర్లు నమోదయినట్లు రూఢి చేసుకోవాలి. ఒక ప్రాంతం, వీధి, నివాస ప్రాంతంలోని ప్రజలు ఆయా స్థలాలలోని వారందరి పేర్లు సరిచూడటానికి ఒకరిద్దరు విజ్ఞులైన వ్యక్తులను పంపవచ్చును.

★ లోక్‌సత్తా /పార్టీ ప్రాథమిక శాఖలు యువసత్తా ఇంకా మహిళాసత్తా గ్రూపులు, అర్హత గలవారందరిపేర్లు ఓటర్ల జాబితాలో చేరేటట్లు చూడాలి. ఈ సంస్థలు, స్థానిక ప్రజలు, చనిపోయిన వారిపేర్లు నివసించకుండా పోయినవారి పేర్లు,

కల్పితమైన పేర్లు ఓటర్ల జాబితాల్లో చేర్చకుండా ఖాయం చేసుకోవాలి. ఇటువంటి పేర్లు చోటు చేసుకుంటే వాటిని తొలగించాలి.

★ ఎన్నికల రోజున, ఈ క్రింద చూపిన దుర్మార్గాలు జరగకుండా స్థానిక ప్రజలు స్వచ్ఛంద సంస్థలు అప్రమత్తంగా వుండాలి.

- ♦ ఓట్లకోసం డబ్బులివ్వడం
- ♦ కానుకలు
- ♦ మద్యం పంచడం
- ♦ కులం, మతం పేరిట అభ్యర్థించడం
- ♦ ప్రజలను భయపెట్టడం
- ♦ ప్రజలు ఓటువేయకుండా నిరోధించడం
- ♦ మరొక మనిషిగా నటించి దొంగపేర్లతో ఓట్లు వేయటం
- ♦ బ్యాలెట్ కాగితాలు బయటకు తీసుకునిరావడం
- ♦ ఓటర్లు కాక ఇతర వ్యక్తులు బాలెట్ పత్రంపైన గుర్తువేయడం
- ♦ పోలింగు బూతు లోపలగాని, దగ్గరగానీ ప్రచారం చేయడం
- ♦ ఇంటి నుండి పోలింగు కేంద్రానికి ప్రజలను రవాణా చేయడం
- ♦ ఉత్తర్వులు లేని మనుష్యులు బూత్‌లోకి ప్రవేశించడం
- ♦ పోలింగు స్టేషను ఆక్రమణ
- ♦ పోలింగు ఏజెంట్లను బెదిరించడం, వారిపై దాడి చేయడం
- ♦ ఏ వ్యక్తి అయినా గుర్తించిన బ్యాలెటు కాగితాన్ని చూపమని వత్తిడిచేయటం

★ ఓటింగు న్యాయంగా, స్వేచ్ఛగా జరిగేట్లు చూడాలంటే బాధ్యత గల పౌరులందరూ జాగరూకత వహించి, దుర్మార్గాలను అరికట్టాలి. ప్రతి ఓటరు వెళ్ళి విధిగా ఓటు వేయాలి.

★ లోక్‌సభకి, రాష్ట్ర శాసన సభకి ఓటర్ల జాబితా ఒకటే. పంచాయతీలకి, పురపాలక సంఘాలకి ఓటర్ల జాబితాలు వేరే ఉంటాయి. అయితే ఓటర్ల నమోదు అన్ని ఎన్నికలకి ఒకే తీరుగా ఉంటుంది.

# 5.2 ఓటర్ల జాబితాలో
# చేర్పులు, మార్పులు, తొలగింపులు

★ ఓటర్ల జాబితాలు చూచినప్పుడు మీ పేరు వాటిలో లేనట్లు కనుగొంటే అది చేర్చమని కోరవచ్చును అలాగే ఒక బూటకపు పేరుగాని, మీ గ్రామంలో/ పట్టణంలో నివసించని వ్యక్తి పేరుగానీ చేర్చినట్లుగా గమనిస్తే అవి తొలగించమని అడగవచ్చును.

**మార్పుల కోసం ఎలా దరఖాస్తు చేయాలి?**

♦ ఈ మార్పులన్నీ ఏ సమయంలోనైనా సాధ్యమే. ఒకసారి ఎన్నికల తతంగం ఆరంభమైందంటే, మార్పులు చేయడం కష్టం. ఎన్నికల నామినేషన్ల చివరిరోజు, ఓటర్ల జాబితాలో మార్పులు చేయడానికి తుది గడువు. ఓటర్ల జాబితాలో సవరణ చేసే తతంగానికి కనీసం ఒక వారం పడుతుంది. కాబట్టి ఎన్నికలకు చాలాముందుగానే మీరు ఓటరుగా రిజిష్టరు అయ్యేటట్లు జాగ్రత్తపడడం మేలు.

**ఓటర్ల జాబితాలలో ఈ క్రింది మార్పులు సాధ్యమౌతాయి:**

♦ దోషాల సవరణ (అక్షరదోషాలు, వయస్సు, స్త్రీ /పురుష భేదం మొదలైనవి.)
♦ నియోజక వర్గంలోనే పోలింగు స్టేషను మార్పు
♦ వేరే నియోజక వర్గానికి చెందిన పోలింగు స్టేషనులో నమోదు
♦ 18 ఏళ్లు నిండని వారి పేర్ల తొలగింపు
♦ మరణం వల్ల గానీ, వలస వెళ్లి పోయినందువల్లగానీ పేరు తొలగింపు
♦ కల్పిత పేర్ల తొలగింపు

**ఎన్నికల జాబితాలో మీపేరు చేర్చడం ఎలా?**

★ ఎన్నికల రిజిస్ట్రేషను అధికారి లేక నియమిత అధికారులు ఇందుకు బాధ్యులు మామూలుగా హైదరాబాదు నగరంలో మునిసిపల్ అధికారులకు పేర్లు చేర్చటానికి, తొలగించటానికి అధికారం వున్నది. స్థానిక అసిస్టెంటు కమీషనరు లేదా ఇతర పురపాలక సంస్థ అధికారులను కలుసుకోవాలి. మిగిలిన అన్ని జిల్లాల్లో పేర్లు చేర్చడానికి, తొలగించడానికి తహశీల్దారు /ఎమ్.ఆర్.ఓలు తగిన అధికారులు.

★ ఓటర్ల జాబితాలో సవరణల కోసం ఈ దిగువ పట్టికలో సూచించిన దరఖాస్తు ఫారాల ద్వారా రెండు కాపీలలో అర్జీ పెట్టుకోవాలి. అందుకు రుసుము లేదు.

| **ఫారం నంబరు** | **కావలసిన మార్పు** | **ఫారం వున్న పేజి నంబరు** |
|---|---|---|
| ఫారం - 6 | ఓటరుగా నమోదు | 179 |
| ఫారం -7 | జాబితాలో ఉన్న పేరుపై అభ్యంతరం | 180 |
| ఫారం -8 | పేరు, ఇతర వివరాలలో పొరపాటుని సరిదిద్దటం | 181 |
| ఫారం -8ఎ | పోలింగ్ స్టేషన్ మార్పు | 182 |
| ఫారం - 8బి | పేరు తీసివేయటం (మరణం, నివాసం మార్పు) | 183 |

★ అర్జీని తీనుకున్న నమోదు అధికారి (యం.ఆర్.ఓ. లేదా మునిసిపల్ అధికారి) దరఖాస్తు నకలుని తమ ఆఫీసుకు నోటీసు బోర్డులో ప్రదర్శించి, ఎవరికైనా ఈ మార్పు చేర్పులపైన అభ్యంతరాలుంటే వారంలోగా తెలపమని కోరతారు. వారం రోజుల గడువులో దరఖాస్తుదారునిపై ఏవైనా అభ్యంతరాలు వస్తే వాటిని పరిశీలించడం జరుగుతుంది. అర్జీ విచారణ జరిగే సమయంలో మీరు పూర్తిగా సహకరించి, నిర్దిష్టమైన సమాచారాన్ని ఇవ్వాలి. ఓటర్ల జాబితా సవరించటానికి సరైన ఆధారం ఉంటే అర్జీమీద ఆదేశాలని జారిచేస్తారు. ఒకవేళ దరఖాస్తును త్రోసిపుచ్చితే, రిజిస్ట్రేషను ఆఫీసరు నిరాకరణకు గల కారణాలను లిఖిత పూర్వకంగా తెలియపరచాలి.

★ ఈ తతంగాని కంతటికీ సుమారు రెండువారాల పాటు పట్టవచ్చును. సంబంధిత అధికారి ఎటువంటి చర్య తీసుకోకపోయినా, పెద్ద ఎత్తున అబద్ధపు ఓట్లు రిజిష్టరయినా, న్యాయమైన ఓటర్ల పేర్లు చేర్చి ఉండపోయినా, ఆయా జిల్లాల్లోని ఆర్.డి.ఓ. లేదా సబ్‌కలెక్టర్ లేదా అవసరమైతే జిల్లా కలెక్టరును కలుసుకోండి. హైదరాబాదు నగరంలో మునిసిపల్ కార్పొరేషను డిప్యూటీ కమీషనరు లేదా కమీషనరును కలుసుకోండి.

★ ఏ స్థాయిలోనైనా సరైన సేవ అందకపోతే స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖను సహాయ సహకారాల కోసం సంప్రదించండి.

# 5.3 ఓటరు గుర్తింపు కార్డు

★ ఎన్నికల సంఘం ప్రతి ఓటరుకు గుర్తింపు కార్డు యివ్వాలని ఐదేళ్ళ క్రితం నిర్ణయించింది. ఈ కార్డు మీద ఓటరు ఫొటో, ఇతర వివరాలు కూడా వుంటాయి. దొంగ ఓట్లు వెయ్యడం రిగ్గింగు చేయడం వంటి చట్టవిరుద్ధమైన పనులను అరికట్టేందుకు ఈ గుర్తింపు కార్డు చాలా అవసరం. ఈ కార్డులు బహుళ ప్రయోజన గుర్తింపు కార్డులుగా అనేక ఇతర అవసరాలకు వాడుకోవచ్చును.

★ అయితే రాజకీయ పక్షాలు, ప్రభుత్వాలు ఈ ఓటరు గుర్తింపు కార్డు పథకం పట్ల ఏ విధమైన ఆసక్తి చూపలేదు. ఫలితంగా అప్పటి ఎన్నికల ప్రధాన కమిషనర్ మారిపోవటంతో కార్డుల పంపిణీకి గానీ, పోలింగుకు వాటిని తప్పనిసరి చెయ్యడంపై గానీ ఎటువంటి చర్య తీసుకోలేదు.

**గుర్తింపు కార్డు పొందడం ఎలా?**

★ గుర్తింపు కార్డు కోసం మీ ఫోటో తీయటం జరిగినట్లయితే ఎన్నికల అధికారులు మీకు సీరియల్ నెంబరుతోను, పార్టు నంబరుతోను టోకెను యిచ్చివుంటారు. మీరు దయచేసి ఈ టోకెనుతో సంబంధిత ఎమ్.ఆర్.ఓ. లేదా మునిసిపల్ అధికారిని (హైదరాబాదులో) కలిసికొని ఫోటో గుర్తింపుకార్డు ఇవ్వవలసిందిగా పట్టుబట్టి అడగండి.

★ మీ ఫోటో ఇంకా తీసుకోని పక్షంలో దయచేసి ఈ అధికారులను కలసి ఫోటో తీయవలసిందిగా గట్టిగా అడగండి.

★ ఇంకా గుర్తింపుకార్డుల సరఫరా పూర్తికాలేదన్న సాకుతో ఎన్నికల సంఘం వాటిని ఎన్నికలలో తప్పనిసరి చేయటాన్ని మళ్ళీ మళ్ళీ వాయిదా వేస్తోంది.

★ ఈ గుర్తింపు కార్డులపై ఇప్పటికే మీ పన్నుల రూపంలో వసూలు చేసిన ప్రజాధనం ఎంతో ఖర్చయింది. ప్రజల డబ్బుని సద్వినియోగం చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనా, ప్రభుత్వాల పైనా ఉంది. ఇలా అసమర్థంగా, అసంపూర్ణంగా ఫలితం లేని పని చేసి, మన డబ్బుని వృధా చేయటం చాలా దారుణమైన విషయం.

★ ఓటర్ల గుర్తింపుకార్డులు అందరికీ అంది, ఓటు వేయటానికి విధిగా గుర్తింపు కావాలన్న నిబంధన విధించే వరకు ఎన్నికలలో అక్రమాలు, హింస, బూతుల ఆక్రమణ, రిగ్గింగు - వీటిని ఆపటం కష్టమవుతుంది.

★ కనీసం వచ్చే ఎన్నికలనాటికైనా అందరికీ గుర్తింపు కార్డులు అందేలాగా కృషి చేయటం అవసరం. అందుకు ప్రజలందరూ, స్వచ్ఛంద సంస్థలు, పత్రికలు గట్టిగా వత్తిడి తీసుకురావాలి.

★ మీకు ఈ విషయంలో ఏదైనా సమాచారం, సలహా, సహాయం కావాలంటే, మీ స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖ ప్రచారసంఘాన్ని, లేదా జిల్లాశాఖని, లేదా హైదరాబాదులోని ఎపెక్సు కార్యాలయాన్ని సంప్రదించండి.




"నీకు జనం ఓట్లేయలేదు, నువ్వోడిపోయావు, సరేనయ్యా, - కానీ ఇతనికి మాత్రం చాలా అన్యాయం జరిగింది. విపరీతంగా గూండాలని పెట్టి, బూతులు ఆక్రమించి, రిగ్గింగు చేసినా ఓడిపోయాడు, పాపం!"

## 5.4 ఓటు వేసేటప్పుడు తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు

★ ఓటు వేయడమనేది మీ హక్కు, బాధ్యత. ఓటువేయడం ద్వారా మీపై మీకున్న అధికారంలో కొంత భాగాన్ని అందరి సంక్షేమానికై ఎన్నుకునే ప్రతినిధికి తాత్కాలికంగా బదిలీ చేస్తున్నారు. మీరు ఓటింగులో పాల్గొనపోతే, నేరమార్గానగానీ, మోసగించిగానీ, బలాత్కారంగా గానీ, మీ అధికారాన్ని మీ నుం చి లాక్కుంటారు. మీరూ, సమాజం కూడా నష్టపోతాయి.

★ ఇంతవరకు మనదేశ చరిత్రలో జాతీయస్థాయిలో ఏ కేంద్ర ప్రభుత్వం కూడా మెజారిటీ ఓటుతో ఎన్నికకాలేదు. అత్యధిక మెజారిటీతో గెలిచిన పార్టీకి కూడా 50 శాతం కంటే తక్కువ ఓట్లే వచ్చాయి. పోలైన ఓట్లు 50 నుంచి 60 శాతం అని మనం అనుకుంటే గెలిచిన రాజకీయ పక్షాలకు లభించిన అత్యధికమైన మద్దతు అర్హత గల ఓటర్లలోని 25-27 శాతం ఓటర్ల నుంచి మాత్రమే. ఒక్కోసారి ఈ మద్దతు మొత్తం ఓటర్లలో 20 శాతాన్ని మించటం లేదు. చాలా సందర్భాల్లో నియోజక వర్గం స్థాయిలో గెలిచిన అభ్యర్థులు పోలైన ఓట్లలో 25 శాతం, ఇంకా తక్కువ కూడా ఓట్లు పొందారు. ధరావతు పొందడానికి అవసరమైన కనీస సంఖ్య ఓట్లు, అంటే పోలై చెల్లుబాటయ్యే ఓట్లలో ఆరవవంతు కంటే కూడా తక్కువ పొంది గెలిచిన అభ్యర్థులు వున్నారు.

★ ఎన్నికలో రానురానూ పోటీ పెరిగిపోయి రాజకీయంలో, సమాజంలో తీవ్ర పోటీ ఉన్నప్పుడు, వివేకం విషయపరిజ్ఞానం గల పౌరులు వేసిన 4,5 శాతం ఓట్లు కూడా ఎన్నికల ఫలితంలో గొప్ప తేడాను తీసుకువస్తాయి. కనుక మీరు వెళ్ళాలి. ఓటు వేయాలి. లేకపోతే స్థానిక గూండాలు పోలింగు బూతులను స్వాధీనపరుచుకుంటారు; ఎటూ మీ ఓటు వారేవేస్తారు.

★ మారుపేరుతో ఓట్లు వేయడం, బూటకపు ఓట్లు వేయించేందుకు ఏర్పాట్లు చేయడం తరచుగా పెద్దఎత్తున వుంటున్నది. అర్హత లేని పేర్లు ఓటర్ల జాబితాల్లోంచి తొలగింపచేసేటట్లు ముందుగా జాగ్రత్తపడండి.

★ మీ పోలింగుస్టేషను నెంబరు (విభాగం నెంబరు), వరుస నెంబరు, చిరునామా, ముందుగానే తెలుసుకోండి. ఏ పార్టీ నుంచి కానీ, అభ్యర్థి నుంచి గానీ రవాణా సౌకర్యం పొందవద్దు. మీ వరుస నెంబరు తెలియకపోతే, పోలింగు ప్రాంతంలో ఉండే మన అభ్యర్థుల ఏజెంట్ల సహాయాన్ని పొందవచ్చు.

★ మీ పేరు చెప్పుకొని వెళ్లి, మీ పేరున ఎవరో ఒకరు ఓటు వేయకుండా దయచేసి

తొందరగా వెళ్లండి. గుర్తుంచుకోండి. - ఒకవేళ మీ పేరు మీద ఎవరో ఒకరు ఓటువేస్తే దాన్ని లెక్కిస్తారు.

- ★ ఇటువంటి సందర్భంలో మీరేషను కార్డు , ఎన్నికల గుర్తింపు కార్డు, డ్రైవింగు లైసెన్సు, క్రెడిట్‌కార్డు, పాస్‌పోర్టు వంటివి చూపి, మీ గుర్తింపును ధృవపరిచి, 'టెండర్డు ఓటుకోసం అడగాలి. మీకిచ్చిన బ్యాలెటు పత్రంపైన ఓటుగుర్తు వేసి అధికారులకు అందజేయాలి. అయినప్పటికీ మీ ఓటును 'టెండర్డు ఓటు' అనే పేరుతో లెక్కలోకి తీసుకోరు. మన చట్టం ప్రకారం మీ పేరుతో వేసిన దొంగ ఓటు చెల్లుతుంది. కాని, మీరు వేసిన అసలు ఓటును లెక్కించరు. కాని అది ఎన్నికల పిటిషనుకు ఆధారం కావచ్చును.
- ★ 'టెండర్డు ఓట్లు' 2% సంఖ్యను మించిన సందర్భాల్లో విధిగా తిరిగి పోలింగును ఆదేశించవలసిందిగా ఎలక్షను కమీషనును లోక్‌సత్తా అంగీకరింపచేయగలిగింది.
- ★ ఫలానా పార్టీకి గాని, అభ్యర్థికి గాని ఓటువేయమని ఓటర్లను పోలింగు అధికారులు ప్రోత్సహిస్తుంటే, పోలింగు బూత్‌లను తరచు సందర్శించే జోనల్ అధికారులకు లిఖితపూర్వకమైన ఫిర్యాదు చేయండి. లేకపోతే రిటర్నింగు ఆఫీసరు లేక అసిస్టెంటు రిటర్నింగు ఆఫీసరుకు ఫిర్యాదుచేయండి. ఈ విషయంలో స్థానిక తహశీల్దారు లేక సబ్‌కలెక్టరును కలుసుకోవచ్చును.
- ★ ఒక క్రమమైన ఏర్పాటు ప్రకారం రిగ్గింగు, మారుపేర్లతో ఓటింగు, బూత్‌లను స్వాధీనపరచుకోవడం, ఓటర్లు ఓటువేయకుండా నిరోధించడం జరుగుతుంటే దయచేసి పైన చెప్పిన అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయండి. ఇటువంటి సందర్భాలలో, తగిన సాక్ష్యాధారాలుంటే తిరిగి పోలింగుకై ఉత్తర్వులిస్తారు.
- ★ ఓటింగు విషయంలో మీకేమైనా సహాయం కావలసివస్తే స్థానిక లోక్‌సత్తా / పార్టీ శాఖను దయచేసి సంప్రదించండి. స్థానికంగా లోక్‌సత్తా /పార్టీ శాఖ లేకపోతే, జిల్లాశాఖను గానీ, ప్రధాన సంస్థనుగానీ సంప్రదించి స్థానిక విభాగాన్ని ఏర్పాటు చేయండి.
- ★ నియోజక వర్గంలోని ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని పార్టీల అభ్యర్థులతో 'ప్రజావేదిక'లు నిర్వహించి ప్రజలు వేసే ప్రశ్నలన్నింటికీ బహిరంగంగా సమాధానాలు రాబట్టండి. ఈ విధంగా అందిన సమాచారాన్ని బట్టి అభ్యర్థుల్ని బేరీజు వేసుకొని ప్రజలు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది.
- ★ అభ్యర్థులను గురించిన సమాచారం, వారి రాజకీయ చరిత్ర, గుణగణాల వివరాలు సేకరించి వాటిని విస్తృతంగా ప్రచారం చేయండి.
- ★ 'ప్రజావేదికలు' ఏర్పాటు చేయడంలో, అభ్యర్థులను గురించిన సమాచార ప్రచారంలో, లోక్‌సత్తా /పార్టీ మీకు అన్ని విధాలా సాయపడుతుంది. ఈ సహాయాన్ని అందుకోండి.



"ఇక్కడ సంఘ వ్యతిరేక శక్తులు చాలా ఉన్నట్లున్నాయోయ్! తిండి, నీళ్ళు కరెంటు కావాలంటూ అక్కడ గొడవ చేసే వాళ్ళెవరో కాస్త కనుక్కో....



"సార్! మీరు విడుదలయ్యాక ఏ పార్టీ తరుపున పోటీ చేయబోతున్నారు?

# 6.1 పౌర అవసరాలు

★ పరిష్కారం కోసం స్థానిక పంచాయతీనో, మునిసిపాలిటీనో మరో ప్రజా ప్రయోజనాల సంస్థనో ఆశ్రయించవలసిన నిత్యావసరాలు మనకి ఎన్నో వుంటాయి. నీరు, విద్యుత్తు ,టెలిఫోన్ కనెక్షన్లు, ఇంటి నిర్మాణానికి  అనుమతి, ఆస్తిపన్ను మదింపు మనకి తరచు సమస్యలు సృష్టించే అంశాలు. ఈ అంశాలలో నియమనిబంధనలు, పద్ధతులు, స్లాబ్‌రేట్ల గురించి, సత్వరంగా సేవలు పొందడానికి మీరేం చేయాలనేదాని గురించి మీ వద్ద విశ్వసనీయమైన సమాచారం వుండి తీరాలి.

★ ఈ అంశాలలో గుత్తాధిపత్య పరిస్థితి వున్నందున, ప్రజాప్రయోజన సంస్థలలో స్పందన లోపించి, అవి మన సమస్యల పట్ల సత్వరం స్పందించవు.ఈ రోజున మీ పొరుగువారు ఎదుర్కొంటున్న సమస్య రేపు మీకే ఎదురుకావచ్చు. కనుక మెరుగైన సేవలు పొందడానికి మనమంతా ఏకమై సమిష్టిగా మన హక్కుల్ని సాధించుకోవాలి. ఒక పన్ను చెల్లింపుదారునిగా లేదా ఒక వినియోగదారునిగా సరైన సేవలు కోరేహక్కు మీకు వుంది.

★ పంచాయతీ లేదా మునిసిపాలిటీ వ్యవహారాలలో చురుకుగా ఆసక్తి చూపుతూ మీరు పన్నుగా చెల్లించే సొమ్ము ఎలా ఖర్చవుతుందో తెలుసుకోవాలి. అధికార వికేంద్రీకరణ కోసం, మీ ప్రాంతంలో 'వార్డ్ కమిటీ'ల  ఏర్పాటు కోసం లోక్‌సత్తా / పార్టీ ద్వారా మునిసిపాలిటీ లేదా కార్పొరేషన్‌పై ఒత్తిడి తేవాలి. అలా చేయడం వల్ల జరుగుతున్నదేమిటో తెలుస్తుంది. మనకు అందుబాటులో మన కవసరమయిన నిర్ణయాలు తీసుకోవటం, పనులు చేయటం సాధ్యమవుతుంది.

★ ఆస్తిపన్ను మదింపు వంటి అంశాలలో సులభమైనవి. దాపరికం లేనివి, ఒకే విధమైనవి రేట్లు, ప్రమాణాలు పాటించేలా పట్టు పట్టాలి. దయచేసి అన్యాయాన్ని, పక్షపాతాన్ని, మెతకదనంతో ఆమోదించకండి. పన్ను చెల్లింపుదారుగా స్థానిక ప్రభుత్వం మీకు జవాబు దారీ వహించేలా చేయగల సామర్థ్యం మీకుంది.

★ సమిష్టిగా వ్యవహరిస్తే మరింత శక్తివంతంగా బేరసారాలు సాగించే అవకాశం వుంటుంది. 'లోక్‌సత్తా /పార్టీ పౌర సేవా కేంద్రం పతాకం' మీరు సంఘటితం కావడానికి తోడ్పడి, మీకొక గుర్తింపుని, విశ్వసనీయతని కలిగిస్తుంది. మరొక లోక్‌సత్తా /పార్టీ శాఖని ప్రజాసంఘాన్ని  స్థాపించదలిస్తే స్థానిక లోక్‌సత్తా /పార్టీ యూనిట్‌ను లేదా జిల్లాశాఖ, లేదా ఎపెక్స్ కార్యాలయాలను సంప్రదించండి.

## 6.2 మంచినీరు/మురుగు పారుదల

★ మంచినీటి సరఫరా, మురుగు నీటి పరిష్కారం కూడా స్థానిక పంచాయతీ మునిసిపాలిటీ లేక కార్పొరేషను లాంటి స్థానిక ప్రభుత్వాల బాధ్యతే.

★ హైదరాబాదు నగరం విషయంలో, మంచినీటి సరఫరా, మురుగు నీటి పారుదల విషయాలలో బాధ్యత వహించే మహానగర నీటి సరఫరా, మురుగు నీటి పారుదల బోర్డు (ఎమ్.డబ్ల్యు, ఎస్. ఎస్.బి) ప్రత్యేకంగా ఉన్నాయి. వర్షపు నీరుపోయే కాలువల ఏర్పాటు హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషను వారిది.

**మంచినీటి కనెక్షను పొందడం ఎలా?**

★ గ్రామ పంచాయతీ, పురపాలక సంఘం, కార్పొరేషను లేక హైదరాబాదు మంచినీరు, మురుగునీటి పారుదల విషయాల బోర్డుకు దరఖాస్తు చేయాలి. స్థానిక ప్రభుత్వం నుండి గానీ, మీ ప్రాంతం బాధ్యత గల సెక్షన్ ఆఫీసరు నుండి గానీ దరఖాస్తు ఫారం పొందవచ్చు. హైదరాబాదు నగరం విషయంలో మంచినీరు మురుగునీటి పారుదల బోర్డుకు యిచ్చే దరఖాస్తు ఫారం కోసం 184 పేజీలు చూడండి. సాధారణంగా ఈ ఫారాలు ఉచితంగా ఇస్తారు.

★ వివిధ పట్టణాలు, నగరాలలో పద్ధతి వేరువేరుగా వుంటుంది. పూర్తి చేసిన దరఖాస్తులు యివ్వగానే, మామూలుగా స్థానిక సంస్థ (పంచాయతీ / మునిసిపాలిటీ / కార్పొరేషను) ఉద్యోగులు వచ్చి మీ దరఖాస్తులోని నిజానిజాలను విచారిస్తారు. మీ ప్రాంతంలోని మంచినీటి సరఫరా గొట్టాలు, వున్న సదుపాయాల ఆధారంగా స్థానిక ప్రభుత్వం లేక వారి అధికారులు, మీకు మంచినీటి కనెక్షను ఇస్తారు.

★ మంజూరు ఆర్డరుతో పాటు, మీరు చెల్లించవలసిన సర్వీసు ఛార్జీలు కూడా లిఖితంగా సూచిస్తారు. సర్వీసు ఛార్జీలు చెల్లించగానే కనెక్షను ఇస్తారు. ప్రధానమైన లైను నుండి, మీ ఇంటి వరకు వేసే గొట్టాల ఖర్చు మీరు భరించవలసి వుంటుంది.

★ ఎన్నో పట్టణాలు, నగరాలలో, ప్రధానమైన (మెయిన్) గొట్టం నుండి నీరు సరఫరా చేసే చోటులో నీటిమీటర్లు బిగించవలసి వుంటుంది. అలాంటి కేసులలో నీటిమీటరులో రికార్డయిన మంచినీటి వినియోగాన్ని బట్టి నీటి ఛార్జీలు వుంటాయి. నీటి మీటర్లు లేనిచోట నెలవారీ ఛార్జీలు నిర్ణయిస్తారు.

**హైదరాబాదు నగరంలోని పద్ధతి:**

★ మెట్రోపాలిటిన్ నీటి సరఫరా, మురుగు నీటిపారుదల బోర్డులోని సంబంధిత సెక్షను ఆఫీసరు నుండి గానీ జనరల్ మేనేజరు (ఇంజనీరింగు), ఆపరేషన్ మెయిన్‌టెన్సు (జి.ఎం. - ఇంజనీరింగ్ - ఒ. ఎమ్.) విభాగం నుంచి గానీ దరఖాస్తు ఫారాన్ని ఉచితంగా పొందండి. ఈ ఫారం 184పేజీలలో వున్నది.

★ దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేసి క్రింద చూపిన కాగితాలతో సహా, జనరల్ మేనేజరు (ఇంజనీరింగు - ఓ.ఎమ్) కార్యాలయంలో ఇవ్వండి.

♦ ట్రేసింగు బట్టపైన నీటి సరఫరా, డ్రైనేజీ ప్లాను మూడేసి కాపీలు

♦ స్థలానికి సంబంధించిన క్రయదస్తావేజు లేక కేటాయింపు ఆర్డరు

♦ నగర పాలక సంస్థపన్ను మదింపు కాగితం

♦ దరఖాస్తు ఫారంలో ఇచ్చిన కొలతల ప్రకారం 1:100 స్కేలులో ప్లాను వుండాలి.

★ జనరల్ మేనేజరు (ఇంజనీరింగు), డిప్యూటి జనరల్ మేనేజరు (డి.జి. ఎమ్) ఇంజనీరింగు వారికి దరఖాస్తును పంపిస్తారు. డి.జి.ఎమ్.ఇంటి స్థలాన్ని తనిఖీ చేసి సాంకేతికంగా సాధ్యపడే విషయంతో సహా, ఇతర అంశాలపై నివేదిక యిస్తారు. ఈ నివేదిక, ఇతర అంశాలు పరిశీలించిన తరువాత జనరలు మేనేజరు (ఇంజనీరింగు) గృహ సంబంధమైన మంచినీటి సరఫరా / మురుగు నీటి పారుదల సౌకర్యం గురించి కనెక్షను మంజూరు చేస్తారు. ఎంత మొత్తం కట్టాలో, మీకు వివరం తెలియబరుస్తారు.

**సర్వీసు ఛార్జీల చెల్లింపు**

★ అప్పుడు మీరు అవసరమైన మొత్తాన్ని మహానగర మంచినీరు, మురుగు నీటిపారుదల బోర్డు పేరుమీద తీసుకున్న డిమాండు డ్రాఫ్టు ద్వారా గానీ, వారి కార్యాలయంలోని క్యాష్ కౌంటరులో గానీ చెల్లించాలి.

★ మీరు కట్టిన సొమ్ము లేక డిమాండు డ్రాఫ్టు రశీదును చూపిస్తే, డిప్యూటీ జనరల్ మేనేజరు ఆ ప్రాంతపు సెక్షను ఆఫీసరుకు జారీ (విడుదల) ఆర్డరు పంపుతూ మీకు ఆ కాపీ ఇస్తారు. సెక్షను ఆఫీసరు బోరింగు స్లిప్ యిచ్చి ప్రధాన పైపులైను నుండి కనెక్షన్లు ఏర్పాటు చేస్తారు.

★ బోర్డుకి చెందిన ప్రధానమైన సరఫరా గొట్టంలో మంజూరు లేకుండా అనధికార రంధ్రం కొట్టి వుంటే మామూలు కనెక్షను ఛార్జీకి సరిసమానంగా జరిమానా వసూలు చేస్తారు.

★ నీటి ఛార్జీలు నీటి వినియోగాన్ని బట్టి దశల వారీగా (స్లాబ్) మారుతాయి. 15 మి.మీ మించిన గొట్టపు కనెక్షన్లకు, వేరే దరఖాస్తు ఫారాలు వున్నాయి. గృహ సంబంధమైన లేక పారిశ్రామిక వినియోగ కనెక్షన్లను బట్టి నీటి సరఫరా ఛార్జీలు మారుతాయి.

★ సాధారణంగా హైదరాబాదు వంటి మహానగరాల్లో మురుగు నీటి పారుదల ఖర్చులను నీటి బిల్లుతో సహా వసూలు చేస్తారు.

**అక్రమ కనెక్షన్లు**

★ అక్రమ కనెక్షన్లకు, మామూలు సేవా ఛార్జీలు, జరిమానా కాక మీటరు లేని వినియోగఛార్జీల రేటున, మూడేళ్ళపాటు వసూలు చేస్తారు.

★ నీటిని దొంగిలించటం, అక్రమ మురుగు నీటి కనెక్షనులు కలిగివుండటం తీవ్ర నేరం. వాడకం దార్లు న్యాయబద్ధమైన చెల్లింపులు వారి వాడకాన్ని బట్టి చేయనట్లయితే దానికి ఇతరులు ఎంతో ఇబ్బంది పడవలసి వస్తుంది. అక్రమాలని మీరు గుర్తించిన యెడల స్థానిక సంస్థలకు / సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేసి, దాన్ని అరికట్టేటట్లు చూడాలి.

★ నీరు మానవాళికి ప్రకృతి ఇచ్చిన అమూల్యమైన సంపద. నీటి సద్వినియోగానికై నడుము కట్టండి. నీరు మన ఇళ్ళకు చేరడానికి ఎంతో ఖర్చవుతుంది. ఎక్కడైనా నీరు వృధాగా కారిపోతుంటే వెంటనే దాన్ని సరిచేసే ప్రయత్నం చేయండి. స్థానిక ప్రభుత్వానికి తెలిపి వృధా అరికట్టండి.

★ పాత బట్టలు, ప్లాస్టిక్ పేపర్లు, శానిటరీ ప్యాడ్లు, పాత వస్తువులు, దూది మొదలగు వాటిని డ్రైనేజీ కాలువలో పడవేసి మురుగునీటిని స్థంభింప చేయకండి. అది డ్రైనేజీ గొట్టాలలో అడ్డుపడి మురుగునీరు రోడ్లమీద, ఇళ్ళల్లో ప్రవహిస్తుంది. దుర్వాసనతో పాటు అది ఆరోగ్యానికి చేటు తెస్తుంది. మన పరిసరాల శుభ్రత కోసం కనీస శ్రద్ధ పాటించండి.

★ మీకు సరైన సేవలు అందకపోతే లోక్‌సత్తా /పార్టీ శాఖ ని సంప్రదించండి. స్థానికంగా శాఖగా ఏర్పడి మంచి సేవలు అందేలా నిలదీయండి.

# 6.3 విద్యుచ్ఛక్తి కనెక్షను

★ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి-ట్రాన్స్ కో) ఒక్కటే రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి పంపిణీకి గల ఏకైక సంస్థ. విద్యుత్ కనెక్షను కోసం దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయి. దరఖాస్తులను ఆ ప్రాంతానికి బాధ్యుడైన అసిస్టెంటు ఇంజనీరు కార్యాలయం నుంచి పొందవచ్చును. (దరఖాస్తు కోసం 185 పేజీ చూడండి.)

★ దరఖాస్తును సక్రమంగా పూర్తి చేసి అసిస్టెంటు ఇంజనీరు కార్యాలయంలో సమర్పించాలి. దీనితో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపుల కార్యలయాల వద్ద రూ. 25/- ల ఫీజుని విద్యుత్ బిల్లుని కట్టే రెవెన్యూ కార్యాలయంలో చెల్లించాలి. విద్యుచ్ఛక్తి బోర్డు అధికారులు ప్రాంగణాన్ని పరిశీలించి, కనెక్షనుకు అనుమతిస్తారు. విద్యుచ్ఛక్తి సరఫరాకు కొత్తగా విద్యుచ్ఛక్తి స్తంభాలు వేయవలసివస్తే, అందుకయ్యే ఖర్చును వినియోగదారుని నుంచి వసూలు చేస్తారు. ఇంటి బయట చేసే వైరింగును లైసెన్సు వున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టరే చేయాలి.

★ విద్యుత్ కనెక్షను ఇచ్చేటప్పుడు ఈ క్రింది పేర్కొన్న ఛార్జీలు, డిపాజిట్లు చెల్లించవలసి వుంటుంది.

- ♦ సింగిల్ ఫేజు - ప్రోరేటా చార్జీలు - రూ. 1000/-
- ♦ 1 కె.వి. కంటే తక్కువ - సెక్యూరిటీ డిపాజిట్టు - రూ. 100/-
- ♦ మూడు ఫేజులు - ప్రోరేటా ఛార్జీలు - రూ. 5000/-
- ♦ 5 కె.వి. లోపు లైనుకు సెక్యూరిటీ డిపాజిట్టు - రు. 500/-

★ మూడు ఫేజులున్న మీటరుకు, వినియోగదారుడు మీటరును కొని ఇచ్చినట్లైతే విద్యుచ్ఛక్తి బోర్డు ఆ మీటరును పరీక్షించి, ఆ తర్వాత కనెక్షను ఇస్తారు. వినియోగదారుడు మీటరు కొనియివ్వని పక్షంలో, కనెక్షను ఇవ్వటంలో జాప్యం జరగవచ్చు. ఒకే ఫేజు గల మీటర్లను సాధారణంగా వారంలోగా ఇచ్చివేస్తారు.

★ కొత్త కనెక్షనుకు 30 రోజులు పడుతుంది.

**ముందు జాగ్రత్తలు**

★ మీటరు సరిగా పనిచేస్తున్నదీ లేనిదీ తరచూ సరిచూచుకోండి. మీటరు రీడింగు ప్రకారమే బిల్లుల వున్నాయనేది ధృవీకరించుకోండి. బిల్లులో రీడింగు తప్పుగా చూపితే, బిల్లుతో తెలిపిన అధికారిని కలుసుకోండి. బిల్లు ఎక్కువగా వస్తే వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేసి, సరిచేయించుకోండి. బిల్లులు సరిచూసేందుకు గతంలో

విద్యుత్ వినియోగాన్ని చూపే వివరాలు తోడ్పడతాయి.

★ ఫిర్యాదు నకలును మీ వద్ద ఉంచుకోండి. ఫిర్యాదులో వున్న బిల్లు మొత్తాన్ని చెల్లించవలసిందిగా విద్యుత్ బోర్డు పట్టుబట్టిన పక్షంలో, నిరసన తెలుపుతూనే బిల్లు చెల్లించి అటుపైన విషయాన్ని విడవకుండా చేపట్టండి.

★ మీటరుతో అవకతవకలకు పాల్పడటం నేరం. అదేవిధంగా విద్యుచ్ఛక్తి అక్రమ వాడకం కూడా తీవ్రమైన నేరం. ఇలా చేయడం విద్యుత్ చోరి చేయడమే. ఇది దొంగతనం కాక మరొకటి కాదు. ఇటువంటి దొంగతనం మీ దృష్టికి వస్తే, దయచేసి విద్యుత్ బోర్డుకి తెలియజేయండి. విద్యుత్ చౌర్యం వెంటనే కనిపెట్టేలా చూడండి. విద్యుచ్ఛక్తి అక్రమవాడకాన్ని అరికట్టకపోతే నిజాయితీ పరులైన వినియోగదారులు నష్టపోతారు.

★ ఉత్పత్తి చేసే విద్యుచ్ఛక్తి 18.5%శాతం, అక్రమ వాడకం వల్ల లేదా సాంకేతిక లోపాల వల్ల నష్టమౌతోందని ప్రభుత్వం, బోర్డు చెబుతోంది. ఫలితంగా వినియోగదారులకు విద్యుత్ కొరత, అధిక ఛార్జీలు చాలా మామూలైపోయాయి.

★ వాడకాన్ని బట్టి విద్యుత్ఛార్జీలు వివిధ రకాలుగా వుంటాయి. వాడకం ఎక్కువైన కొద్దీ యూనిట్ ధర ఎక్కువౌతుంది. దయచేసి మీకు సాధ్యమైన మేర విద్యుచ్ఛక్తిని పొదుపు చేయండి.

★ మీటరు రీడింగు లేని కనెక్షన్ల వల్ల చాల విద్యుచ్ఛక్తి వృథా అవుతుంది. కావలసిన దానికంటే అధిక సామర్థ్యం గల హార్సుపవర్ మోటరును వాడకండి. ఈ విధంగా వాడటం వలన మీరు విద్యుచ్ఛక్తిని వృథా చెయ్యటమే కాక భూమిలో నీటిమట్టాన్ని కూడా వేగంగా తగ్గించి వేస్తున్నారు. అప్పుడు నష్టపోయేది రైతులే.

★ విద్యుత్ కనెక్షను తదితర సేవలు పొందటంలో చిక్కులేమైనా వుంటే అంతకు పై అధికారిని సంప్రదించండి. మనమంతా పూర్తి వివరాలు తెలుసుకొని ప్రమాణాల మేరకు సేవలందకపోతే పరిహారం లభించేలా ఆ విధమైన పత్రాలే రూపొందించి ప్రకటించమని, విద్యుత్తు, తదితర సేవల విషయంలో వత్తిడి తేవాలి. ఇతర సేవల విషయంలో వత్తిడి తేవాలి.

★ మీకు సరైన సేవలు అందకపోతే సలహా సహాయాల కోసం మీ స్థానిక లోక్‌సత్తా / పార్టీ శాఖను సంప్రదించండి.

# 6.5 భవన నిర్మాణానికి అనుమతి

★ ప్రతి గృహ నిర్మాణానికి, స్థానిక ప్రభుత్వం - పంచాయతీ, మున్సిపాలిటీ, లేక కార్పొరేషను నుండి అనుమతి అవసరం. పలు అంతస్తుల కాంప్లెక్సులు లేదా విస్తృతమైన ఇళ్ళ స్థలాల వంటి ప్రత్యేకమైన కేసులలో ఆ ప్రాంతపు పట్టాణాభి వృద్ధి సంస్థ (ఉడా) అనుమతి అవసరం. ఉండవచ్చును.

★ భవన నిర్మాణనికై అనుమతి పొందడానికి ఇవి అవసరము:

- ♦ పూర్తి చేసిన దరఖాస్తు ఫారం (ధర రూ. 10). (ఫారము, 186 పేజీలో వున్నది)
- ♦ దరఖాస్తుతో యిచ్చిన సరిచూచే పట్టిక (చెక్‌లిస్టు)
- ♦ ఆస్తి క్రయదస్తావేజు (ఫోటో కాపీ)
- ♦ లింకు దస్తావేజు (లు) (ఫోటో కాపీ)... గత 12 లేక అంతకంటే ఎక్కువ సంవత్సరాల యాజమాన్య హక్కును సూచిస్తూ స్వంతదారు యొక్క హక్కును యిది ఖాయపరుస్తుంది.
- ♦ సబ్ రిజిస్ట్రారు జారీ చేసిన ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికెటు - ఆస్తి రుణగ్రస్తము కాదని
- ♦ పట్టణ స్థలాల గరిష్ఠ పరిమితి (యు.ఎల్.సి) సరిఫికెటు
  - ఇది హైదరాబాదు, వైజాగు, విజయవాడ నగరాలకు మాత్రమే
  - వెయ్యి చదరపు మీటర్ల విస్తీర్ణం మించిన స్థలాల విషయంలోనే యిది సాధారణంగా అవసరమౌతుంది.
  - ఈ నగరాల్లో ఈ సరిఫికెటుని యు.ఎల్.సి. ప్రత్యేకాధికారి యిస్తారు.
- ♦ 1000 చదరపు మీటర్లకు లోపున్న స్థలాల విషయంలో పట్టణ భూగరిష్ట పరిమితి (యు.ఎల్.సి) అఫిడవిట్
- ♦ గృహ నిర్మాణ సంఘం నుంచి 'అభ్యంతరం లేదు' అనే సర్టిఫికెటు (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ - ఎన్.ఓ.సి)
- ♦ గృహ నిర్మాణ సొసైటీ యొక్క లే అవుట్
- ♦ సొసైటీ నిబంధనలు
- ♦ జాతీయ విమానాశ్రయాల సంస్థ నుండి ఎన్.ఓ.సి (నో అబ్జెక్షన్ సర్టిఫికెటు)

- విమానాశ్రయం దగ్గరలోనే వుండి, యిట్టి స్థలం ఫన్నల్ ప్రాంతంలో వుంటే, భవంతి రెండు అంతస్తుల ఎత్తు మించితే, తప్పని సరిగా అవసరం

♦ భవంతిని గురించి అచ్చువేసిన ఏదైనా సమాచారపత్రం వుంటే ఆ కాపీ (సాధారణంగా ఫ్లాటులు, వాణిజ్య సౌధాల విషయంలో)

♦ స్వంత చిరునామా గల కవరు (రిజిష్టరు పోస్టు రశీదుతో)

♦ ఇంజనీరు /ఆర్కిటెక్ట్) తయారు చేసిన బ్లూప్రింటు ఇంటిప్లాను ఒక బట్ట కాపీ - 5 యితర కాపీలు.

♦ ఈ కాగితాలన్నిటినీ గెజిటెడు ఆఫీసరు (కాగితం, ముందు, వెనుక రెండు చోట్ల ధృవీకరించాలి.

★ స్థానిక అధికారులు నిర్ణయించిన రుసుము చెల్లించాలి. ప్రాంతాన్ని బట్టి, భవనం తరగతి, చదరపు అడుగులు విస్తీర్ణాన్ని బట్టి యిది వుంటుంది.

★ మామూలుగా, భవన నిర్మాణానికి అనుమతి, (గృహ నిర్మాణానికి -15 రోజులు) ఇతర నిర్మాణానికి - 30 రోజులు) యివ్వవచ్చును. ఇందులో ఆలస్యముంటే మున్సిపల్ అధికారిని కలుసుకుని, విషయాన్ని త్వరగా పరిష్కరించమని అడగండి. ఒకవేళ గడువు లోపుగా అనుమతి మంజూరు చేయకపోతే, అది జారీ అయినట్లుగానే సాధారణంగా భావించవచ్చును. ఐనప్పటికీ అధికారులు తరచుగా ఏదో ఒక కాగితం, సమాచారం అడిగి, చట్టరీత్యా వున్న యీ నిబంధన సమస్యను దాటేస్తుంటారు.

★ చట్టం నిబంధనల ప్రకారం అవసరమైనవన్నీ ఖచ్చితంగా అనుసరించినట్లు యిల్లు కట్టేముందే నిర్ధారించుకొంటే మంచిది. పెద్ద ఎత్తున నిబంధనలను ఉల్లంఘిస్తే ఆ తర్వాత విపరీతమైన చిక్కులు కలుగవచ్చును.

★ మీకు సరైన విధంగా సేవలు అందకపోతే, మీ దగ్గరున్న 'లోక్‌సత్తా'/పార్టీ శాఖను సహాయం కోసం సంప్రదించండి.

# 6.6 ఆస్తి పన్ను నిర్ధారణ

★ మన స్థానిక ప్రభుత్వానికి (పంచాయతీ, మునిసిపాలిటీ, కార్పొరేషనులకు) మనం చెల్లించే అత్యంత ముఖ్యమైన పన్ను ఇంటిపన్ను లేదా ఆస్తిపన్ను, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలతో పోల్చిచూస్తే, స్థానిక పరిపాలన సంస్థకు పన్ను చెల్లించడమే మేలు. స్థానిక సంస్థల విషయంలో మనం కట్టే పన్ను సొమ్ము ఎలా ఖర్చుపెడుతున్నారు, దానితో మనకి ఏయే సేవలు అందిస్తారనేది మనం బాగా అర్థం చేసుకోగలుగుతాము. ఆ విధంగా మనం స్థానిక పరిపాలనపై ఒక కన్ను వేసి వుంచి, సేవలు మెరుగు పరచమని వత్తిడి తీసుకురావచ్చును.

★ ఆస్తిపన్ను అనేది కొన్ని సామాన్య సూత్రాలపై ఆధారపడి ఉంటుంది. ఒకే తరగతికి చెందిన ఇళ్లకు, ఒకే విధమైన పన్నురేటు వుండాలి. పన్ను మదింపు అందరికీ వెల్లడి అయ్యేదిగా వుండాలి. పన్ను మొత్తం ఎలా నిర్ణయిస్తున్నారనేది మనకు తెలియాలి. ఆ విధంగా మదింపు సూత్రాల అమలు బహిర్గతంగా ఒకే తీరున వుండాలని మీరు పట్టుబడితే, మోసపోతున్నామనే భావం వుండదు.

### ఇంటిపన్ను ఏ విధంగా నిర్ధారణ చేస్తారు

★ ఇంటిపన్ను సాధారణంగా అద్దె విలువను బట్టి నిర్ణయిస్తారు. ఒకవేళ ఇల్లు అద్దెకు యివ్వకపోతే, ఎంత అద్దెకు అవకాశముంది అని నిర్ణయిస్తారు. దీనిని నెలసరి అద్దె విలువ (ఎమ్.ఆర్.వి) అంటారు. ఇల్లు అద్దెకు ఇస్తే ప్రత్యక్షంగా ఇస్తున్న అద్దెను పరిగణనలోకి తీసుకుంటారు.

★ 1992లో చట్టాన్ని సవరించారు. 1993 నుంచి, ఇంటి పన్ను నిర్ధారణ పద్ధతి మారింది. పన్ను మరింత ఏకరీతిన, న్యాయంగా, వెల్లడిగా వుండేందుకై ఈ మార్పులు వచ్చాయి. మూడు ముఖ్యమైన సూత్రాలను బట్టి స్థానిక పన్ను రేట్లు నిర్ణయిస్తారు.

### ఆస్తిని ఏ విధంగా ఉపయోగిస్తున్నారు

- ♦ గృహవసతిగా
- ♦ వ్యాపారం కోసం
- ♦ పారిశ్రామికంగా

**నిర్మాణం తీరు - కట్టడం ఏటువంటిది?**

- మట్టిగోడలు
- ఇటుక గోడలు
- పూరికప్పు
- సిమెంటు రేకులకప్పు
- మదరాసు కప్పు
- పెంకులకప్పు
- సాధారణ కాంక్రీటు
- ఖరీదైన కాంక్రీటు
- మొసాయిక్ నేల
- పాలరాతి నేల మొదలైనవి.

**ఇల్లు వున్న ప్రాంతం ఎటువంటిది**

- తక్కువ ఆదాయ ప్రాంతం
- ఖరీదైన గృహాలుండే ప్రాంతం
- నడిబొడ్డు ప్రదేశం
- ఎన్నో అంతస్తులో ఉంది (మూడు అంతస్తులు దాటి పైకి వెళితే పన్ను తగ్గుతుంది.)
- ఊరికి వెలుపల వున్న ప్రాంతం మొదలైనవి.

★ పై వివరాలనుబట్టి అందరికీ ఒకేవిధంగా వర్తించే దశల వారీ (స్లాబ్) రేట్లప్రకారం నెలసరి అద్దె విలువ (ఎమ్.ఆర్.వి) లెక్కిస్తారు. నెలసరి అద్దె విలువ నుంచి, సాలుసరి అద్దె విలువ లెక్కిస్తారు. పదిశాతం మొత్తాన్ని విలువ (డిప్రీసి యేషను) మరమ్మతులు, వగైరాలకై తీసివేసి, సాలుసరి నికర అద్దె విలువ (ఎ.ఆర్.వి)ను లెక్కిస్తారు. ఎ.ఆర్.వి. పైన 17 నుంచి 30 శాతం వరకు పన్నును నిర్ధారిస్తారు. ఈ కొత్త పద్ధతి రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు, నగరాలకు దాదాపు ఒకే మోస్తరులో అమలవుతుంది. భవనం చదరపు అడుగులను బట్టి పన్ను లెక్కిస్తారు.

★ మీ ఊరు/పట్టణంలో అమలయ్యే స్లాబు రేట్ల పద్ధతి ఏమిటో దయచేసి తెలుసుకోండి. మీ ప్రాంతంలో వున్న మీ బోటి ఇళ్లకు విధించిన పన్నులతో, మీ ఇంటికి విధించిన పన్ను సరిపోలి వున్నదని ఖరారు చేసుకోండి. ఏ సూత్రం పైన మదింపు చేస్తారో తెలిసింది. కనుక, మీ ప్రాంతానికి వర్తించే దశల వారీ (స్లాబ్) రేటు కనుక్కొని, విధించిన పన్ను మొత్తం ఆ ప్రమాణాలప్రకారం వున్నదో లేదో సరి చూచుకోండి. ఏకతీరుగా లేకుండా మున్సిపలు అధికారులు పన్నును నిరంకుశంగా నిర్ధారిస్తే సామూహికంగా ఒత్తిడి తీసుకువచ్చి, నిబంధనలను ఒకే విధంగా వర్తింపచేయాలని పట్టుబట్టండి. ఆస్తిపన్నులు ఐదేళ్ళకొకసారి సవరిస్తారు.

★ ఆస్తి పన్ను ఈ క్రింది విభాగాల రూపంలో వుంటుంది.

- ♦ సాధారణ పన్ను
- ♦ పరిసరాల పరిరక్షణ (కన్సర్వెన్సీ పన్ను)
- ♦ దీపాల పన్ను
- ♦ మురుగు పారుదల పన్ను (హైదరాబాదు నగరంలో వర్షపునీటి పారుదల)

**హైదరాబాదు నగరంలో ఆస్తిపన్ను :**

- ♦ కోర్టు వివాదాల కారణంగా హైదరాబాదు నగరంలో సవరించిన మదింపు విధానాన్ని అమలు జరపలేదు. అందుచేత చదరపు అడుగులు ప్రాతిపదికగా పన్ను లెక్కవేస్తున్నారు. భవనం వినియోగం, కట్టడం లక్షణం, ఉనికి ప్రాంతాన్ని బట్టి నగరాన్ని 90 విభాగాలుగా (జోన్లు) విభజించారు. ఈ 90 విభాగాలకు చదరపు మీటరు రేట్లు ప్రకటించారు. ఈ రేట్ల వివరాలు, క్రింది కార్యాలయాల్లో దొరుకుతాయి.
- ♦ మున్సిపలు కార్పొరేషను ఆఫీసు
- ♦ ....సర్కిలు ఆఫీసులు
- ♦ సికింద్రాబాదు డివిజను ఆఫీసు

★ మీ పన్ను ఏ విధంగా నిర్ధారిస్తారనేది మీకు చాలా ముఖ్యము. పన్ను ఏకరీతిగాను, న్యాయంగాను నిర్ణయమయేటట్లు జాగ్రత్తపడండి. పన్ను అన్యాయంగా నిర్ధారించినా, మీ ప్రాంతంలో మీ యింటిని పోలిన ఇతర గృహాల కంటే ఎక్కువగా వేసినా, మున్సిపలు కమిషనరుకు లిఖిత పూర్వకంగా మనవి చేయవచ్చును.

★ జరిమానాలు పడకుండా పన్నులు సక్రమంగా చెల్లించండి. మీకు 'డిమాండు' నోటీసు రాకపోయినా, సకాలంలో పన్ను కట్టడం మంచిది. మీరు వాయిదా వేస్తే ఆ తర్వాత కట్టవలసివచ్చినప్పుడు, పన్ను ఎంత, జరిమానాలు ఎంత అనే సమాచారం మీకు దొరకకపోవచ్చును. ఆస్తి అమ్మేముందు, పన్నుల బకాయిలన్నీ చెల్లించి, 'బకాయి లేదు' (నోడ్యూ) అనే ధృవీకరణ పత్రం పొందాలి. లేకపోతే ఆస్తి అమ్మకం రిజిష్టరు చేయడానికి వీలుకాదు.

★ మీకు ఏదైనా సహాయం అవసరమైతే 'లోక్‌సత్తా' /పార్టీ స్థానిక విభాగాన్ని సమాచారం సలహా కోసం సంప్రదించండి. స్థానికంగా లేకపోతే, మీ జిల్లా శాఖ లేక కేంద్ర సంస్థను సంప్రదించి ఒక శాఖను ఏర్పాటు చేయండి.

# 7.1 పౌరహక్కులు

★ ప్రజాస్వామిక సమాజనిర్మాణంలో వ్యక్తిస్వేచ్ఛ అతి ముఖ్యమైన పునాది. ఇతర వ్యక్తుల స్వేచ్ఛకు తన చర్యల వల్ల భంగం కలగనంత వరకు ప్రతిపౌరుడు తన యిష్టమైనది చేసుకునే స్వేచ్ఛ వున్నది.

★ ప్రతి ఒక్కరు ఈ స్వేచ్ఛను, వ్యక్తిగతమైన హక్కులను న్యాయమైన పద్ధతిలో, ఇతరులకు ఇబ్బంది లేకుండా అనుభవించటానికి, ఆ విధంగా ప్రజలందరి స్వేచ్ఛ విస్తరిల్లేటట్లు రూఢి పరచుకోవడానికి మనం ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకుంటాము. ఇతరుల స్వేచ్ఛను భంగపరచకుండా, మన స్వేచ్ఛను ఉపయోగపరచుకోవలెనంటే కొన్ని యుక్తమైన కట్టుబాట్లు వుండాలి. మనం ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు చేసే చట్టాల వల్ల ఇవి నిర్ధారణ అవుతాయి.

★ ప్రజలమైన మనం ఎన్నుకున్న లేక నియమించిన ఏ వ్యక్తి అయినా మనమిచ్చిన అధికారాన్ని దుర్వినియోగ పరచే అవకాశం వున్నది. కాబట్టి ప్రజాక్షేమం పేరుతో మనస్వేచ్ఛను అదుపుచేసే అధికారాన్ని ఏ వ్యక్తికైనా యిచ్చి సంపూర్ణంగా విశ్వసించడానికి  వీలులేదు. మనం ఎన్నుకున్న, లేదా ఎంపికయిన, వ్యక్తుల అధికారాలన్నీ కూడా రాజ్యాంగం లేదా లిఖిత న్యాయ చట్టం నుండే ఉత్పన్నమవుతాయి.  కాబట్టి మనం రూపొందించిన రాజ్యాంగం ప్రకారం లేదా మనం ఎన్నుకొన్న ప్రతినిధులు తయారుచేసే న్యాయచట్టాల ప్రకారం, యిచ్చిన అధికారాన్ని మించి మరి ఏ అధికారమూ ఎవరికీ లేదు.

★ దేశంలోని ప్రతి ఒక్కవ్యక్తి ఒకే న్యాయచట్టాలకు, మిగిలిన అందరి వలెనే బద్ధుడై వుంటాడు. చట్టానికి అతీతంగా ఎవరికీ ప్రత్యేక అధికారాలు లేవు.

★ ఎన్నుకున్న మన ప్రతినిధులందరూ, నియమించుకున్న ఉద్యోగులందరూ, ప్రజాసేవకులు, వారు మన పాలకులు గానీ, యజమానులుగానీ కారు. ప్రజాస్వామ్యంలో మనమే సార్వభౌములం. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, మంత్రులు, పార్లమెంటుసభ్యులు, శాసనసభ్యులు, ముఖ్యమంత్రులు, ప్రతిస్థాయి లోని అధికారులు, సాయుధబలగాలు, పోలీసులు, మేయర్లు, పురపాలక సంఘం అధ్యక్షులు, సర్పంచ్ - వీరిలో ప్రతి ఒక్కరు ప్రజలకు సేవకులే. (భారత రాజ్యాంగం -ఆర్టికలు-12 మరియు సి.పి.సి సక్షన్ 21 (ఐ.పి.సి))

★ వారందరూ మనం అప్పగించిన బాధ్యతలు నిర్వర్తిస్తూ, మన ఆమోదంతో చేసిన చట్టాల నుండే అధికారాన్ని పొందుతారు. కాబట్టి వారు మనకు, మనం ఏర్పాటు

చేసిన సంస్థలకు జవాబుదారీగా వుండాలి.

★ వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన చట్టాల విషయంలో ఎప్పుడైనా సరే ఒకవ్యక్తి స్వేచ్ఛను చట్టం ద్వారా అరికట్టవలసివస్తే, అందుకోసం నియమితుడైన ఉద్యోగి ద్వారా ఆ పని జరుగుతుంది. అటువంటి ప్రజాసేవకుడు తన బాధ్యతను ఖచ్చితంగా చట్టప్రకారం నిర్వర్తించాలి. పౌరులను రక్షించే బాధ్యత, ఇతరులకు హాని కలిగించే విశృంఖల స్వేచ్ఛను అరికట్టే బాధ్యత సాధారణంగా పోలీసుల మీద ఉంటాయి.

★ ఇటువంటి సందార్భాలన్నిటిలో, ఆ విధమైన స్వేచ్ఛా నియంత్రణ అవసరమా, కాదా అనే విషయం న్యాయస్థానాలు నిర్ణయించాలి. అందుచేతనే అరెస్టులన్నిటికీ కోర్టుల ఆమోదం ఉండాలి. లేదా సాధ్యమైనంత త్వరగా వాటికి తెలపాలి. ఈ కారణంగానే చట్టాలను ఉల్లంఘించేవారికి వేసే శిక్షలను నిర్ణయించే బాధ్యత కూడా న్యాయస్థానాలపై వుంది.

★ పోలీసులకు నేర విషయాల్లో మాత్రమే బాధ్యత వున్నది. ఈ విషయాలన్నీ చట్టంలో నిర్వచింపబడినాయి. ధనం, ఆస్తి, ఒప్పందాలు, నష్టపరిహారం మొదలైన విషయాలపై విబేధాలు, పౌర తగాదాలు సివిలు కోర్టుల్లో ఇరుపక్షాల వారు పరిష్కారం చేసుకోవాలి. ఈ విషయాల్లో పోలీసులకు బాధ్యత లేదు.

★ ఏ వ్యక్తి అయినా క్రిమినలు చట్టాన్ని ఉల్లంఘిస్తే, అతని నుండి ఇతర పౌరులను రక్షించేందుకు పోలీసులు చర్య తీసుకోవలసి వుంటుంది. పోలీసులు తమ విధులను నిర్వర్తించడంలో సహకరించవలసిన బాధ్యత మనందరికీ వుంది. మామూలుగా పోలీసులకు ఈక్రింది విధులలో బాధ్యత వుంది.

♦ శాంతి భద్రతలు, అల్లర్ల అదుపు
♦ నేర పరిశోధన
♦ ట్రాఫిక్ నిర్వహణ, గస్తీ మొదలైనవి
♦ ప్రజల ఆస్తుల పరిరక్షణ
♦ కొందరు వ్యక్తుల భద్రత

★ ఈ విధులన్నీ వేర్వేరుగా వుండి, ఒక్కొక్కటి విడివిడి సంస్థలకు అప్పగిస్తే బాగుంటుంది. కాని ప్రస్తుతం మన చట్టాలలో అన్ని బాధ్యతలని ఒకే పోలీసు యంత్రాంగం చూస్తోంది. ఇందువల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

★ పోలీసులకు సంబంధించిన మన చట్టాలు చాలవరకు చూడ్డానికి న్యాయంగా

కనిపించినా, వ్యక్తి స్వేచ్ఛను గౌరవించి, రక్షించే సంస్థలు, సాధనాలను మనమింకా సరిగ్గా ఏర్పరచుకోలేదు. చాలామందికి పౌరులను ఎప్పుడు అరెస్టు చేయవచ్చునో, వారిపట్ల పోలీసులు ఎలా ప్రవర్తించాలో తెలియదు. పోలీసులు సహాయం లేదా రక్షణ కోరేటప్పుడు వారితో ఎలా వ్యవహరించాలో తెలియక తికమకపడతాం. పైగా మనలో చాలామంది యూనిఫారం వేసుకున్న పోలీసులను చూస్తే భయపడతారు.

★ నేర పరిశోధన పూర్తిగా నిష్పాక్షికంగా వుండాలి. అమాయకులను రక్షించి నేరస్తులను విచారణకై న్యాయస్థానాల ఎదుట హాజరు పరిచేటట్లు చేసేందుకు మనమూ సంస్థలూ ఖచ్చితంగా గమనిస్తూ వుండాలి.

★ నేరాన్ని పరిశోధించి, నిందితులను సాక్ష్యాలతో సహా కోర్టు ముందర హాజరు పరచడం పోలీసుల కర్తవ్యం. శిక్షను కోర్టులు విధిస్తాయి. ప్రజలను శిక్షించే బాధ్యత గానీ, అధికారం గానీ పోలీసులకు లేవు.

**బలప్రయోగం**

★ చట్టప్రకారం అవసరమైతే తప్ప పౌరుల మీద పోలీసులు బలప్రయోగం చేయరాదు. ఈ క్రింది సందర్భాలలో బలాన్ని ప్రయోగించవచ్చు.

- ♦ బలవంతంగా ఒక చట్టాన్ని బుద్ధిపూర్వకంగా ఉల్లంఘించే వారు, లేదా ఏ చట్టాన్నయినా అమలు పరచనివ్వకుండా అడ్డుకునేవారు, లేదా నేరం చేసే ఉద్దేశ్యంతో గుమిగూడిన ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువమంది గుంపును లేదా చట్ట విరుద్ధమైన సమావేశాన్ని చెదరగొట్టేందుకు
- ♦ దొమ్మీ, దహనకాండ మొదలైన సందర్భాలలో
- ♦ అరెస్టు కాకుండా ముద్దాయి ఎదిరించినప్పుడు
- ♦ ఆత్మరక్షణ కోసం

★ ఈ సందర్భాలన్నింటిలో బలప్రయోగం అవసరాన్ని బట్టి నేర్పుతో జరగాలి. విచక్షణారహితంగా పశుబలాన్ని పౌరుల మీద ప్రయోగించరాదు.

★ పైన వివరించిన విధంగా, న్యాయపరంగా, బలం ప్రయోగించవచ్చునే తప్ప ఎలాంటి ఇతర పరిస్థితుల్లోను పోలీసులు లేదా ఇతరులు హింసకి పాల్పడటం నేరం. ఇక మనిషి చేసిన నేరం ఎంత తీవ్రమైనదైనా, శిక్ష విధించే హక్కు పోలీసులకు లేదు. పైన వివరించిన విధంగా చట్టపరమైన పద్ధతిలో తప్ప ఇంక ఏ ఇతర పరిస్థితులలోను పోలీసులు ఏ పౌరుడినీ గాయపరచరాదు లేదా చంపరాదు. ఒక

వ్యక్తిని చంపినా, వికలాంగునిగా చేసినా అది పాశవికచర్య. అలాంటి పని పోలీసులు చేసినా, మరొకరు ఎవరు చేసినా వారు నేరస్తులౌతారు. శిక్షార్హులౌతారు.

★ పోలీసులు నేరపరిశోధన చేసేటప్పుడు జోక్యం చేసుకోవటానికి లేదా వారి విధి నిర్వహణలో ప్రభావితం చేసేందుకు ప్రభుత్వానికి గానీ, ఏ రాజకీయ నాయకుడు లేదా పలుకుబడి గల వ్యక్తికి గానీ అధికారం లేదు.

★ దురదృష్టవశాత్తు పోలీసు విధులన్నీ ఒకే బలగం నిర్వహిస్తుండటం వల్ల, పోలీసులు పదవిలో వున్న ప్రభుత్వం అధీనంలో వుండడం చేత, వారిని తమ పక్షపాత స్వప్రయోజనాలకు వాడుకునే ధోరణి వుంటున్నది. పౌరులు దీనిని గట్టిగా వ్యతిరేకించాలి.

★ చాలా మంది రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు కూడా తమ మిత్రులపై వున్న కేసులను తగిన సాక్ష్యాధారాలున్నప్పటికీ నిలిపివేయించడానికి, తమ రాజకీయ ప్రత్యర్థులు అమాయకులైన వారిని ఇరికించడానికి ప్రయత్నిస్తుంటారు. తమను వ్యతిరేకించే వారిని అరెస్టు చేయమని, వేటాడి వేధించమని పోలీసులపై ఒత్తిడి తెస్తుంటారు. ఇవన్నీ ప్రజా సేవకులుగా ఎన్నికైన లేక నియమితులైన మనుష్యులు చేసే చట్ట విరుద్ధమైన చర్యలు.

★ ప్రజాసేవకులెవరూ కూడా ఇలాంటి అధికార, పదవీ దుర్వినియోగం చేయకుండా పౌరులు ఎల్లవేళాలా అప్రమత్తంగా వుండాలి. పోలీసుల పనితీరును మెరుగుపరచడానికి, మరింత సమర్థమైన, సక్రమమైన, నిష్పక్షపాతమైన పోలీసు సేవలు అందేలా సంస్థాగతమైన ఏర్పాట్లు చేయడానికి మనమంతా కలసి ఒత్తిడి తీసుకురావాలి.

★ సామాన్యమైన ప్రజాస్వామిక సూత్రాలను అర్థం చేసుకుని, ప్రాథమికమైన చట్టాలు, విధానాలను గురించి అవగాహన కలిగివుండడం పౌరులుగా మనకు చాలా ముఖ్యం. ఈ రకమైన జ్ఞానం వల్ల మాత్రమే మిమ్మల్ని మీరు రక్షించుకోగలరు. మీ చుట్టూ వున్న సమాజాన్ని రక్షించగలుగుతారు.

★ మీకు ఏదైనా సహాయం సమాచారం కావలసివస్తే దయచేసి స్థానిక 'లోక్‌సత్తా / పార్టీ విభాగాన్ని సంప్రదించండి. అటువంటి శాఖ లేకపోతే జిల్లా విభాగం లేక కేంద్ర సంస్థతో సంప్రదించి ఒక కొత్తశాఖను ఏర్పాటు చేయండి.

## 7.2 పోలీసులకు ఫిర్యాదులు

★ నేర పరిశోధనకు లేదా పౌరుల రక్షణకు సాధారణంగా బాధ్యత వహించే స్థానిక పోలీసు సంస్థ ఒక పోలీసుస్టేషను అలాంటి ప్రతి పోలీసు స్టేషనులో 25 నుంచి 50 మంది వరకు పోలీసులు వుంటారు. వారు మామూలుగా కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు అయివుంటారు. ప్రతి పోలీసుస్టేషనుకు అధికారిగా స్టేషన్ హౌస్ ఆఫీసరు (ఎస్.హెచ్.ఓ) వుంటారు. ఎస్.హెచ్.ఓ సాధారణంగా సబ్ఇన్స్పెక్టరు హోదా కలిగి వుంటారు. నగరాల్లో ఎస్.హెచ్.ఓలు ఇన్స్పెక్టరు హోదా వారై వుండవచ్చును.

★ మన రాష్ట్రంలో దాదాపు ప్రతీ మండలానికి ఒక పోలీసు స్టేషను ఉంది. పట్టణాలు, నగరాల్లో అనేక పోలీసుస్టేషన్లు వుంటాయి ప్రతీ పోలీసు స్టేషనుకు బాధ్యత వహించవలసిన ప్రాంతం నిర్ణీతమై వుంటుంది. కొన్ని పోలీసు స్టేషన్లు కలిపితే ఒక సర్కిలు అవుతుంది. ఇది ఒక సర్కిలు ఇన్స్పెక్టరు (సి.ఐ) క్రింద వుంటుంది. కొన్ని సర్కిళ్ళు చేరి ఒక సబ్‌డివిజను అవుతుంది. ఇదిసబ్ డివిజన్ పోలీసు ఆఫీసరు (ఎస్.డి.పి.ఓ) క్రింద వుంటుంది. సాధారణంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇన్స్పెక్టర్ హోదాలోను, ఎస్.డి.పి.ఓ. - డిప్యూటీ సూపరింటెండెంటు హోదాలోను వుంటారు.

★ ప్రతి జిల్లాలోని పోలీసులు, పోలీసు సూపరింటెండేంటు (ఎస్.పి) క్రిందకు వస్తారు. ప్రతి రెవెన్యూ జిల్లాకు సాధారణంగా ఒక ఎస్.పి. వుంటారు. పట్టణ ప్రాంతాల పోలీసు బలగానికి నగర పోలీసుకమీషనరు వుంటారు. హైదరాబాదు నగరంలో పోలీసు కమీషనరు ఆధీనంలో పెద్ద పోలీసు బలగం వున్నది. డిప్యూటీ పోలీసు కమీషనర్లు (డి.సి.పి) నగరంలోని వివిధ ప్రాంతాలకు బాధ్యత వహిస్తారు.

### ఫిర్యాదు దాఖలు చేయడం ఎలా?

★ దొంగతనం, దోపిడి, దాడి, మోసం మొదలైన నేరాలకు గురైతే, స్థానిక పోలీసుకు మీరొక ఫిర్యాదు దాఖలు చేయాలి. మీ ప్రాంతానికి బాధ్యత వున్న పోలీసుస్టేషను ఎస్.హెచ్. ఓకి వ్రాతపూర్వకంగా ఒక ఫిర్యాదు దాఖలు చేయాలి.

★ సాధారణంగా ఫిర్యాదులో ఈ క్రింది వివరాలు వుండాలి.

- ♦ నేరం జరిగిన సమయం, చోటు
- ♦ జరిగిన నేరం వివరం

- ♦ వర్ణన, నష్టపోయిన ఆస్తులు, తగిలిన గాయాలు
- ♦ నేరం చేసిన మనిషి (మనుష్యులు)
- ♦ నేరం చేసినట్లు అనుమానిస్తున్న వ్యక్తి, వ్యక్తులు
- ♦ నేరస్తులను గుర్తించడంలో పోలీసులకు సాయపడే ఏ సమాచారమైనా
- ♦ సంబంధిత సమాచారం మరేదైనా

★ ఎస్.హెచ్.ఓ. మీ ఫిర్యాదు అందుకొని, రికార్డులోకి ఎక్కించి, అందుకున్నట్టుగా రశీదు యిస్తారు. మీ ఫిర్యాదుకు దాఖలా రికార్డుగా ప్రాథమిక సమాచార రిపోర్టు (ఎఫ్. ఐ. ఆర్)ను ఎస్.హెచ్.ఓ రిజిష్టరు చేసుకుంటారు. సాధారణ డైరీ (జనరలు డైరీ-జి.డి) అనే పుస్తకంలో కూడా ఎక్కిస్తారు. జి.డిలో నమోదు అనేది సాక్ష్యాధారాలలో ఒకటి గనుక ఇది వ్రాసినట్లుగా ఖరారు చేసుకోవాలి. ఇంక నేరపరిశోధన జరిపి, నేరస్తులపై కేసుపెట్టడం పోలీసుల బాధ్యత

★ మీరొక దాడికి గురై గాయపడితే పోలీసులు మీ గాయాన్ని పరీక్షించడానికి మెడికలు ఆఫీసరు వద్దకు తీసుకుని వెడతారు. గాయం లక్షణం, తీవ్రతల గురించి మీకొక సర్టిఫికేటు యిస్తారు.

★ నేరం జరిగిన స్థలాన్ని తనిఖీచేసి, నేరానికి సంబంధించిన వ్యక్తులను, సాక్షులను ప్రశ్నించవలసి రావచ్చును. మీరు పోలీసులకి పూర్తి సహకారం అందించి వారి ప్రశ్నలన్నింటికి నిజాయితీతోను, సంపూర్ణగాను జవాబులివ్వాలి. నేర పరిశోధనలో జాప్యం వుంటే తీవ్రమైన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకపోతే ఆపై ఉన్నతాధికారుల సాయం కోరండి.

★ తగిన రుజువులు, ఆధారాలు లేకుండా వ్యక్తులను అదుపులోకి తీసుకోమని పోలీసులపైన దయచేసి ఒత్తిడి తీసుకుని రావద్దు. కొందరు ఏ సాక్ష్యాలు లేకుండానే ఇంట్లోని పనివారిని ఇరికిస్తారు. నేరం చేసినట్టు బలవంతంగా ఒప్పించడానికి, పోయిన నగలు, సొమ్ము తిరిగి పొందడానికి అనుమానితులను చావకొట్టమని లేదా హింసించమని పోలీసుల మీద దయచేసి ఒత్తిడి తీసుకుని రావద్దు. ఈ మాదిరి ఒత్తిడి వలన అధికార దుర్వినియోగం, హింస, ఒక్కోసారి పోలీసుల రక్షణలోనే మరణం సంభవించవచ్చును.

★ మీ అజాగ్రత్త వల్ల ఆస్తులు పోగొట్టుకుంటే, మీరు పోలీసును నిందించలేరు. మీ డబ్బు, నగలు, దస్తావేజులు మీరు కాపాడుకోవాలి గానీ పోలీసులు కాదు.

★ ప్రతి చిన్న నేరాన్ని, చిల్లర దొంగతనాన్ని పరిశోధించడానికి మామూలుగాపోలీసులకు తీరిక గాని, వనరులు గానీ వుండవు. అల్పమైన విషయాలపై ఫిర్యాదు చేయకండి. దీనివల్ల మీకేమీ లాభం వుండదు. సరికదా, పోలీసుల పని కష్టమౌతుంది.

★ మీకేదైనా సహాయం అవసరమైతే స్థానిక లోక్‌సత్తా /పార్టీ ప్రజాసంఘం వారిని సలహా, సమాచారం కోసం సంప్రదించండి. స్థానికంగా ప్రజాసంఘం లేకపోతే, లోక్‌సత్తా /పార్టీ జిల్లాశాఖ లేదా కేంద్ర సంస్థను సంప్రదించి, మీరే ఒక ప్రజాసంఘాన్ని ప్రారంభించండి.




" నువ్వు పోలీసుల కోసం కేక పెడుతున్నావా? పాపం! ఈ ఊరికి కొత్తగా వచ్చినట్లున్నావు, అవునా?"

## 7.3 వారెంటు లేకుండా అరెస్టు

★ సాధారణంగా, ఏదైనా ఒక నేరారోపణపై పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేసేటప్పుడు, మేజిస్ట్రేటు లేదా అర్హత గల ఏ యితర అధికారి అయినా సంతకం పెట్టిన అరెస్టు వారెంటు చూపించాలి.

★ ఆ విధమైన వారెంటు ఈ క్రింది పరిస్థితుల్లో మామూలుగా జారీ చేస్తారు.

- ♦ ఒక నేరంలో నిందితుడిపైన (మేజిస్ట్రేటు జారీ చేసినది)
- ♦ నేర నిరోధక నిర్భంధ చట్టాల (Preventive detention laws) క్రింద ప్రభుత్వం లేక జిల్లా మేజిస్ట్రేటు లేక తగిన అధికారులు ఇచ్చిన వారెంటు
- ♦ కోర్టులో శిక్షపడ్డ వ్యక్తిని జైలుకి తీసుకువెళ్లేందుకు మరియు
- ♦ కోర్టులో తప్పని సరి హాజరీకై ఒక సాక్షికి (న్యాయమూర్తి జారీ చేసేది)

**వారెంటు లేకుండా పోలీసులు ఎప్పుడు అరెస్టు చేయవచ్చును?**

★ చట్టరీత్యా, ఏ పోలీసు అధికారి అయినా, ఒక వ్యక్తిని, ఈ క్రింది పరిస్థితులలో వారెంటు లేకుండా అరెస్టు చేయవచ్చును. ఏ వ్యక్తి అయినా

- ♦ పెద్ద (Cognizable) నేరం చేసినట్టు ఆరోపణ వుంటే
- ♦ న్యాయ సమ్మతమైన కారణం లేకుండా, ఇళ్లు పగులకొట్టి దోచుకోనేందుకు అవసరమైన పనిముట్లు కలిగివుంటే
- ♦ నేరస్తునిగా చట్టప్రకారం ప్రకటితమైన వాడు
- ♦ పోలీసులు తమ విధిని నిర్వహించకుండా అవరోధం కల్పించేవాడు
- ♦ చట్టపరమైన అదుపునించి తప్పించుకుని పోయినవాడు
- ♦ సాయుధ దళాల నుండి పారిపోయినవచ్చిన వాడు
- ♦ భారతదేశం వెలుపల శిక్షర్హమైన నేరం చేసిన వాడు
- ♦ విడుదలయిన నేరస్తుడు కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినప్పుడు
- ♦ ఒక వ్యక్తిని అరెస్టు చేయమని, మరొక పోలీసు అధికారి నుండి చట్టబద్ధమైన అభ్యర్థన వచ్చినప్పుడు
- ♦ శిక్షార్హమైన నేరం చేసే ఉద్దేశ్యంతో, ఒక వ్యక్తి తన ఉనికిని దాచిపెట్టడానికి జాగ్రత్తలు తీసుకుంటున్నప్పుడు
- ♦ అలవాటుగా నిత్యనేరస్తుడు
- ♦ అతి నిస్సహాయస్థితిలో, ప్రమాదకరమైన సమాజానికి తీవ్ర ప్రమాదకారిగా పరిణమించగల వ్యక్తి.

♦ చిన్న (non-cognizable) నేరం చేసినప్పటికీ, తన పేరు, నివాసము వెల్లడించడానికి నిరాకరిస్తూ గానీ, తప్పుడు సమాచారం ఇస్తూగానీ వున్నట్లయితే

♦ పెద్ద (cognizable) నేరం చేసే పన్నాగం వున్న వ్యక్తిని ఆ నేరం చేయకుండా ఆపడానికి అరెస్టు అవసరమయితే

**ప్రైవేటు వ్యక్తులు, ఇతర వ్యక్తులనుఎప్పుడు అరెస్టు చేయవచ్చును**

★ కొన్నిసార్లు పౌరులు కూడా ఈ క్రింది సందర్భాలలో ఒక వ్యక్తిని అరెస్టు చేయవచ్చును.

♦ ఒక వ్యక్తి బెయిలు లేని, శిక్షార్హమైన పెద్ద (cognizable) నేరం చేసినప్పుడు

♦ నేరస్తుడుగా ప్రకటించబడిన వ్యక్తి

♦ పౌరులు అరెస్టు చేసిన ఇటువంటి సందర్భాలలో, అరెస్టు చేసిన వ్యక్తిని సాధ్యమైనంత త్వరలో దగ్గర్లోని పోలీసు అధికారికి లేదా పోలీసుస్టేషనులో అప్పగించాలి.

**మేజిస్ట్రేటు చేత అరెస్టు**

★ జ్యుడిషియల్ లేదా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలో ఒక నేరం జరిగితే, మేజిస్ట్రేట్ స్వయంగా నేరస్తుణ్ణి అరెస్టు చేయవచ్చు లేదా అరెస్టు చేయమని ఆదేశించవచ్చు. ఆ వ్యక్తిని కస్టడీకి పంపటం గానీ, చట్టప్రకారం బెయిలుపై విడుదల చేయటం గానీ జరగాలి. ఒక వ్యక్తిని అరెస్టు చేయడానికి వారెంటు జారీ చేసేందుకు అధికారం ఒక మేజిస్ట్రేటు ఆ వ్యక్తిని తన సమక్షంలో అరెస్టు చేయవచ్చు.

**వ్యక్తి స్వేచ్ఛకోసం జాగ్రత్తలు**

★ పైన చెప్పిన పరిస్థితులను మించి మరే విధంగా అరెస్టు చేసినా అది చట్ట విరుద్ధమే.

★ అరెస్టు చేసిన వ్యక్తులందరినీ 24 గంటలలోగా కోర్టుముందు లేదా మేజిస్ట్రేటు ఎదుట హాజరుపరచాలి.

★ బెయిలు యిచ్చే నేరానికి వారెంటు లేకుండా ఒక వ్యక్తిని అరెస్టు చేసిన్లయితే అప్పుడు ఆ పోలీసు అధికారి అతడిని బెయిలుపై విడిచిపెట్టాలి. అరెస్టు అయిన వ్యక్తి బెయిలు కోరితే విధిగా 6 గంటలలోపు మంజూరు చెయ్యాలి. ఎటువంటి హామీలు లేకుండా అవసరమైనప్పుడు హాజరయ్యే విధంగా బాండు తీసుకోవటం ద్వారా కూడా అటువంటి వ్యక్తిని విడుదల చేయవచ్చును.

★ అరెస్టు చేసేటప్పుడు గానీ, కస్టడీలో వున్నప్పుడుగానీ పోలీసులు లేదా ఇతరులు అధికార దుర్వినియోగం చేయకుండా చూసేందుకు చట్టపరంగా సవివరమైన

నిబంధనలు వున్నాయి. వివరాల కోసం 7.4 అధ్యాయాన్ని చూడండి. అధికార దుర్వినియోగం జరగకుండా తమను తాము రక్షించుకునేందుకు లేదా తమ చుట్టూతా వున్న వారిని రక్షించేందుకు ఈ విషయాల్లో పౌరులకు ప్రాథమికమైన పరిజ్ఞానం అవసరం.

★ మీకు ఏదైనా సాయం కావాలంటే, దయచేసి మీ స్థానిక 'లోక్‌సత్తా /పార్టీ 'విభాగాన్ని లేదా జిల్లాశాఖ లేక కేంద్ర సంస్థను సంప్రదించండి.




" నిజమే నేను పేరు మోసిన దొంగని, హంతకుణ్ణి. కానీ నామీద సాక్ష్యం నీకు ఛస్తే దొరకదు - అని వాదించాడు. అతను చెప్పిన మాట సబబనిపించింది. అందుకే వదిలేశాను.

# 7.4 పోలీసు నిర్భంధం

★ వారంటు వుండిగానీ లేక గానీ, ఏ కారణం చేతనైనా పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తికి రాజ్యాంగ పరమైన న్యాయమైన హక్కులుంటాయి.

★ ప్రజలను రక్షించడానికి కొందరు వ్యక్తుల అరెస్టు అవసరమైనప్పటికీ, న్యాయస్థానాలకు మాత్రమే వారిపై విచారణ జరిపై బాధ్యత, నేరం రుజువైతే శిక్షలు వేసే అధికారం వున్నాయని గుర్తించాలి.

★ ఈ విషయాలన్నిటిలో చట్టం నిర్దేశించిన పద్ధతిని విధిగా పాటించాలి. ఏ వ్యక్తి గానీ, పోలీసులు గానీ, మానవహక్కులని, వ్యకిగత గౌరవాన్ని, పౌరుడి హుదాతనాన్ని భంగపరచడానికి  వీలులేదు.

★ అరెస్టయిన వారందర్నీ 24 గంటలలోగా బెయిలుపై విడుదల చేయాలి, లేదా న్యాయస్థానం ఎదుట హాజరుపరచాలి. సరైన కోర్టు ఆదేశం లేకుండా ఏ వ్యక్తిని కూడా పోలీసు నిర్భంధంలో వుంచరాదు.

★ అరెస్టు సమయంలోగానీ, నిర్భంధంలో వున్నప్పుడు గానీ పోలీసులు విధిగా పాటించవలసిన జాగ్రత్తలు, నియమాలు ఈ విధంగా వున్నాయి.

- అరెస్టును అమలు జరిపి, అరెస్టయిన వ్యక్తులను ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టే పోలీసు ఉద్యోగులు తప్పులు లేకుండా, స్పష్టంగా  కనిపించే విధంగా వారిపేరు, పదవిని తెలిపే గుర్తింపు ఉత్తర్వులు విధిగా కలిగివుండాలి. అరెస్టయిన వారిని ప్రశ్నించే పోలీసు సిబ్బంది వివరాలన్నీ ఒక రిజిష్టరులో  వ్రాసివుండాలి.
- అరెస్టును అమలు చేసే పోలీసు అధికారి, అరెస్టు మెమోని అరెస్టు చేసే సమయంలోనే తయారు చేసి, దానిపై ఒక సాక్షి సంతకం తీసుకోవాలి. అరెస్టయిన వారి కుటుంబ సభ్యులైనా, లేదా ఆ ప్రాంతంలోని మరే పెద్ద మనిషైనా ఈ సంతకం పెట్టవచ్చును. అరెస్టయిన వ్యక్తి కూడా కూడా 'మెమో' పై సంతకం చేయాలి. అందులో అరెస్టయిన తేదీ, సమయం వుంటాయి.
- అరెస్టయి పోలీసు స్టేషనులో నిర్భంధంలో లేక ప్రశ్నించే కేంద్రంలో లేదా లాకప్‌లో వుంచిన  వ్యక్తి వెంటనే తన మిత్రుడు, తన తాలూకు బంధువు, న్యాయవాది లేక తనకు తెలిసిన మనిషికి లేదా తన క్షేమం పట్ల ఆసక్తి వున్న వ్యక్తికి తనను అరెస్టు చేసినట్టు, ఫలానా ప్రదేశంలో నిర్భంధంలో వుంచినట్టు సమాచారం

యివ్వమని అడిగే హక్కు వుంది. ( మూడు గంటల లోపు స్పందించాలి.)

- ♦ అరెస్టు చేసిన తేదీ, సమయం, నిర్బంధించిన చోటు వివరాలన్నీ అరెస్టు చేసిన 8 నుంచి 12 గంటలలోపుగా ఆ ఊరు, పట్టణం, జిల్లా వెలుపల నివసించే సమీపమిత్రుడు లేక బంధువుకు, ఆ జిల్లాలోని న్యాయ సహాయ కేంద్రం ద్వారా లేక సంబంధిత పోలీసు స్టేషను ద్వారా, టెలిగ్రాం ద్వారా తెలపాలి.
- ♦ తన అరెస్టు, నిర్బంధించిన ప్రదేశం గురించి, ఎవరో ఒకరికి తెలియపరచమని అడిగే హక్కు అరెస్టయిన వ్యక్తికి వున్నట్లు, అతనికి తెలియచెప్పాలి.
- ♦ నిర్బంధిస్తున్న ప్రదేశంలో వున్న డైరీలో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు, అతడి అరెస్టు గురించిన సమాచారం ఫలానా వారికి అందించనట్లు, ఏ పోలీసు అధికారి అధీనంలో వున్నాడో వారిపేర్లు, వివరాలు నమోదు చేయాలి.
- ♦ అరెస్టయిన వ్యక్తి కోరినట్టయితే, అరెస్టయిన సమయంలో వైద్య పరీక్ష చేయించి అతని/ఆమె శరీరం మీద వున్న పెద్ద, చిన్న గాయాలు గుర్తించి ఒక 'మెమో'లో రాయాలి. ఈ 'పరీక్ష మెమో' పైన అరెస్టయిన వ్యక్తి, అతని అరెస్టును అమలు జరిపిన వ్యక్తి కూడా సంతకాలు పెట్టాలి. ఒక కాపీ అరెస్టయిన వ్యక్తికి యివ్వాలి.
- ♦ అదుపులో వున్న కాలంలో అరెస్టయిన వ్యక్తిని ప్రతి 48 గంటలకొకసారి శిక్షణ పొందిన వైద్యుడు పరీక్షించాలి. ఈ డాక్టరు ప్రభుత్వ ఆరోగ్య సేవల డైరెక్టరు ఆమోదించిన ప్యానెల్‌లోని డాక్టరై ఉండాలి.
- ♦ అరెస్ట్ మెమోతో సహా అన్ని వివరాలు స్థానిక మేజిస్ట్రేట్‌కు పంపాలి.
- ♦ అరెస్టయిన వ్యక్తిని ప్రశ్నించే సమయంలో తన న్యాయవాదిని కలుసుకొనేందుకు అనుమతించాలి.
- ♦ జిల్లా పోలీసులకు, రాష్ట్ర పోలీసులకు, అరెస్టు చేసిన వారి వివరాలను అరెస్టయిన 12 గంటలలోపు తెలియచేయాలి. ఈ వివరాలను వారివారి ఆఫీసులలోని నోటీసు బోర్డులలో పెట్టాలి.

**మహిళల అరెస్టు**

★ ఒక మహిళ అరెస్టు చేసినప్పుడు, నిర్భంధంలో ఉంచినప్పుడు ఈ క్రింది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

- ♦ అరెస్టు చేసే సమయంలో ఏ వ్యక్తి మీదనయినా చేయి చేసుకోవటం చట్టవిరుద్ధం.

- ♦ ఒక మగ పోలీసు ఒక మహిళ శరీరాన్ని అరెస్టు సమయంలో కాని, నిర్భంధంలో కాని తాకరాదు.
- ♦ ఒక మహిళా పోలీసు అధికారి మాత్రమే మరొక మహిళను సోదా చేయవచ్చు ఆ సోదా కూడా సభ్యమైన పద్ధతిలో వుండాలి.
- ♦ మహిళల 'లాకప్'లో తనని వుంచమని ఒక మహిళ పట్టుపట్టవచ్చును. ఆ పోలీసు స్టేషనులో మహిళా లాకప్ లేకపోతే అటువంటి సౌకర్యం వున్న మరొక పోలీసు స్టేషనుకి తనని మార్చమని అడుగవచ్చును.
- ♦ ఒక మహిళను లేక 15 ఏళ్ల లోపు మగ పిల్లవాడిని, వారి ఇంటి వద్ద ప్రశ్నించాలి. గానీ, మరెక్కడా కాదు. పోలీసు విచారణ కోసం వారు పోలీసు స్టేషనుకి వెళ్లేందుకు నిరాకరించవచ్చును.

★ మిమ్మల్ని, మన సమాజాన్ని రక్షించుకోవడానికి చట్టరీత్యా మీకున్న చట్టపరమైన రక్షణలు, భద్రతా విధానాలు, తెలుసుకొని వుండడం ముఖ్యం.

★ సకాలంలో, సమర్థవంతంగా నేరస్తుల పైన చర్య తీసుకుని, అదే సమయంలో ప్రాథమిక మానవహక్కులు, న్యాయబద్ధమైన విధానాలను గౌరవించి, అతి జాగ్రత్తగా పాటిస్తేనే మన సమాజంలో శాంతి, స్వేచ్ఛ మనగలుగుతాయి.

★ మీకు ఎప్పుడైనా ఎటువంటి సమస్య వచ్చినా, మీ బంధువులు లేదా స్నేహితులు ఎవరినైనా తగిన ఉత్తర్వులు లేకుండా లేక సక్రమమైన విధానాన్ని పాటించకుండా అరెస్టు చేసిన పక్షంలో సహాయం కోసం ఆ పై అధికారులను సంప్రదించండి.

★ పోలీసుల పైన లేదా మరెవరిమీద గానీ ఫిర్యాదు చేసేముందు వాస్తవాలు నిర్ధారణ పరచుకోండి. ఫిర్యాదు తప్పుడుదని గానీ, నిరాధరామైనదని గానీ రుజువైనట్లైతే, మీపై నమ్మకం తుడిచి పెట్టుకుపోతుంది. అంతేకాక ఫిర్యాదులన్నిటిలో నిజంలేదనే అభిప్రాయం కలుగుతుంది. దీని వల్ల ప్రజాప్రయోజనాలు దెబ్బతింటాయి.

★ మీకేదైనా సహాయం కావలసివస్తే మీ స్థానిక 'లోక్‌సత్తా' /పార్టీ ప్రజాసంఘాన్ని గానీ, జిల్లాశాఖను లేదా కేంద్ర సంస్థను సంప్రదించండి.



"ఏయ్ 203, ఎవరిని అరెస్టు చేస్తున్నావో తెలియక్కర్లా- ? పిచ్చెక్కిందేంటి? ఈ దెబ్బతో నీకు ట్రాన్స్‌ఫర్ ఖాయం!"



" అవును సార్ వదిలేశాను. లేకపోతే ఆఫీసర్లకి చెబుతానని బెదిరించాడు.

# 8.1 లబ్ధిదారుల అజమాయిషీ

★ మనం ఎన్నుకొన్న ప్రతినిధుల చేత ప్రభుత్వం ఏర్పడింది. ప్రతి విషయాన్ని మనమే చేపట్టలేము కాబట్టి, ఆ ప్రభుత్వానికి రాజ్యాంగ బద్ధంగా, చట్టప్రకారంగా అధికారాలను కట్టబెట్టాం.

★ ఇతరుల ప్రయోజనాలు కలసి వున్న సందర్భాల్లో తప్ప, జీవితాన్ని ప్రభావితం చేసే అన్ని విషయాలపైనా మనం అధికారాన్ని కలిగి వున్నాం. ఉదాహరణకి మనం ఏం చదవాలి. ఎవర్ని పూజించాలి. ఎక్కడ జీవించాలి. పిల్లల్ని ఎక్కడ చదివించాలి. కూతురు /కొడుకుల పెళ్లి,.... ఇవన్నీ మీ / కుటుంబ సభ్యుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా జరుగుతాయి. వీటిలో వేలు పెట్టడానికి, ప్రశ్నించడానికి, అదేశించడానికి ఎవరికి అధికారాలు లేవు.

★ పరస్పర సౌకర్యార్ధం మన ఏర్పాటు చేసుకొన్న సేవకుడే, ప్రభుత్వం, ప్రభుత్వమున ప్రభువు కాదు. మన మీద పెత్తనం సాగించడానికి ఉన్న యజమానీ కాదు. మనమే ప్రభువులం. అందుకే ప్రభుత్వం హద్దులు దాటి ప్రవర్తించి మనకి అసౌర్యం కలిగించకుండా, నిత్యం కనిపెట్టుకొని ఉండాలి.

★ నిరంతరం ప్రభుత్వం కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా మాత్రమే మంచి ఫలితాలని సాధించగలం. మన పన్నుల ద్వారా చెల్లించే డబ్బు సక్రమంగా వినియోగమవ్వాలన్నా పౌరుల నిఘా అత్యవసరం.

**స్థానిక ప్రభుత్వాలు**

★ మన అజమాయిషీలో మంచి ఫలితాలు రావాలంటే, మన ఉమ్మడి అవసరాలు తీరాలంటే, మనకి చేరువలో ఉన్న స్థానిక ప్రభుత్వానికే అత్యధిక బాధ్యతలు, అధికారాలు ఉండాలని మనం పట్టుపట్టాలి. మనకి ప్రభుత్వం ఎంత దూరమయితే, అది ఎంత పెద్దదయితే, అంత నిర్లక్ష్యంగా, అంత అసమర్థంగా, అంత బాధ్యతా రహితంగా పనిచేస్తుంది.

★ అందుకే పాలనా బాధ్యతలు మన గ్రామానికి, పట్టణానికి ముందుగా ఉండాలి. అక్కడ చేపట్టలేని కొన్ని పెద్ద పనులు మాత్రమే (ఉదా॥ రెండు గ్రామాల మధ్య రోడ్డు) మండలస్థాయికి బదిలీ చేయాలి. మండలంలో కూడా నిర్వహించటం సాధ్యంకాని కొన్ని కార్యాకలాపాలని మాత్రమే జిల్లాకి బదిలీ చేయాలి. జిల్లాస్థాయి, ప్రజలకి అవసరమయిన పనులలో నూటికి 90 జరగాలి.

★ కొన్ని పనులు జిల్లాస్థాయిలో నిర్వహించలేనివి (ఉదా। పెద్ద నీటి పారుదల ప్రాజెక్టులు, జిల్లాల మధ్య రోడ్లు, విశ్వవిద్యాలయాలు) మాత్రమే రాష్ట్రస్థాయిలో చేపట్టాలి. అక్కడ కూడా చేయలేని కొన్ని జాతీయ అంశాలు మాత్రమే దేశస్థాయిలో ఉండాలి. ఉదాహరణకి దేశరక్షణ, రైల్వేలు, జాతీయ రహదార్లు వగైరా.

**లబ్ధిదారుల అజమాయిషీ**

★ కొన్ని అవసరాలు మనకి వ్యక్తిస్థాయిలో, లేదా కుటుంబస్థాయిలో తీరవు. అయితే గ్రామం మొత్తానికో, మండలంలో ఎన్నికయిన ప్రతినిధులకో మన ఆ అవసరాల పట్ల అవగాహన లేకపోవచ్చు. ఆసక్తి లేకపోవచ్చు అలాంటి సందర్భాలలో అధికారం ఆసక్తి లేని ఎవరిచేతుల్లోనో ఉంటే మనం ఆశించిన రీతిలో ఫలితాలు రావు. మనం కట్టే పన్ను డబ్బు సద్వినియోగం కాదు. అలాంటి సేవల అవసరం ఎవరికుంటుందో ఆ లబ్ధిదారులకే ఆ అంశాలపట్ల ఆసక్తి, శ్రద్ధ, అవగాహన, ఓర్పు ఉంటాయి. వారే ఆసేవలు బాగుండాలని కోరుకుంటారు. అందుకే వీలయినంత మేరకు ప్రభుత్వ సేవల అవసరం ఎవరికుంటుందో వారి చేతుల్లో వాటి నిర్వహణ బాధ్యత కూడా ఉండాలి. అవసరం, అధికారం పెనవేసుకోవాలి.

★ ఉదాహరణకి తమ పిల్లలు పాఠశాలకి వెడుతుంటే, తల్లిదండ్రులకి ఆ పాఠశాల అవసరం ఉంటుంది. దాని పని తీరుపై శ్రద్ధ ఉంటుంది. మిగిలిన వారికి ఏమి అవగాహన, ఆసక్తి ఉంటాయి? అలాగే పంట పొలాలకి నీరు వచ్చేలా చేయడానికి రైతులు కాలువలు/చెరువులపై శ్రద్ధ వహిస్తారు. మార్కెట్ యార్డ్ ద్వారా పంటలను అమ్ముకోవాలనుకొనే రైతులకి సహజంగానే వాటి పనితీరుపై శ్రద్ధ వుంటుంది. రేషన్ కార్డుఉన్న వారే రేషన్ దుకాణాల పని తీరుపై ఆసక్తి కనబరుస్తారు. తమ ఆరోగ్యం పై శ్రద్ధ ఉన్నవారే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల గూర్చి ఆలోచిస్తారు.

★ ఆ విధంగా ఆయా సేవల అవసరం వున్న వారందరికీ వాటి పనితీరుపై పర్యవేక్షణా బాధ్యతను అప్పగించాలి. ఆయా పాఠశాలలు / కాలువలు/మార్కెట్ యార్డ్‌కి కేటాయించిన నిధులన్నిటిని ఆ లబ్ధిదారులు బృందాలకు అందచేయాలి.

★ ఇందుకోసం చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలి. లబ్ధిదారులకి ఆయా అంశాలపై అధికారాలను, వనరులను ఉద్యోగులపై అదుపును పూర్తిగా ప్రజాస్వామికంగా బదిలీ చేయాలి. అప్పుడే అది నిజమైన స్వపరిపాలన అవుతుంది.

**సమిష్టిగా నిలదీయాలి**

- మనం లబ్దిదారులుగా సమిష్టిగా ప్రభుత్వాన్ని నిలదీసి మనకవసరమయిన సేవలని పట్టించుకుంటే దాని ప్రభావం విశేషంగా ఉంటుంది. ఈ దిశగా మీకు ఎలాంటి సమాచారం, సహకారం కావలసి వచ్చినా స్థానిక లోక్‌సత్తా యూనిట్‌ను సంప్రదించండి. స్థానికంగా యూనిట్ లేకపోతే మీరే ఒక లోక్‌సత్తా /పార్టీ యూనిట్‌ను ప్రారంభించండి. వివరాలకు జిల్లా / రాష్ట్రశాఖను సంప్రదించండి.
- మనకి అవసరమున్న సేవలపైన, అదుపుకి మనమంతా తీవ్రంగా పోరాడాలి. ప్రజాస్వామ్య సంస్కరణల ఉద్యమంలో భాగంగా లోక్‌సత్తా /పార్టీ ప్రజలకి ప్రత్యక్ష అధికారం అన్న అంశానికి పూర్తిగా కట్టుబడి ఉన్నది. దయచేసి ఈ ఉద్యమంలో చేరండి. మీ హక్కుల రక్షణ కోసం మీ పిల్లల భవిష్యత్తు కోసం, చేతులు కలపండి.

**" తన నాలికే (పలుకే) తన స్వంతం కాని మనిషి మరే ఆస్తిని స్వంతం అని చెప్పుకో లేడు"**

# 8.2 వార్డు కమిటీలు

★ మామూలుగా ఒక పంచాయతీ 5,000 లోపు జనాభా గల చిన్న సంస్థ, మేజరు పంచాయతీలలో కూడా 25,000 వేలకు జనాభా మించదు. మైనరు పంచాయతీలు యింకా చిన్నవి. కాబట్టి మీరు పన్నులుగా కట్టే సొమ్ము ఏమౌతున్నదో గమనించడం తేలిక.

★ కాని పట్టణాల్లో, నగరాల్లో మాత్రం, స్థానిక ప్రభుత్వంలో కూడా, మనం కట్టే పన్నుల సొమ్ము ఎలా ఖర్చవుతున్నదో, మనకు అందిస్తున్న సేవలకు బాధ్యులెవరో తెలుసుకోవడం కష్టం.

★ తగినంత అధికారాలు, బాధ్యతలు గల వార్డు కమిటీలు, ఒకటి లేక రెండు వార్డులకు కలిపైనా సరే తప్పని సరిగా వుండాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. వార్డు కమిటీలకు తమ వార్డుల్లో పన్నులు వసూలు చేసే బాధ్యత అప్పగించవచ్చును. అందులో అత్యధిక భాగం, అంటే 75 శాతం వరకు, తాము పన్నులు వసూలు చేసిన వార్డు ప్రదేశం లోనే ఖర్చు పెట్టవచ్చును. తమ ప్రాంతం మునిసిపలు ఉద్యోగులను వార్డు కమిటీలు తమ అజమాయిషీలో వుంచుకొని, వారి వేతనాలు స్థానికంగా యివ్వవచ్చును. కనుక వార్డు కమిటీలు సక్రమంగా పనిచేయడం వల్ల మీరు కట్టే పన్నుల సొమ్ము ఎలా ఖర్చు పెడుతున్నారో, మీకు అందించే సేవలు ఎలా నిర్వహిస్తున్నారో తెలుస్తుంది.

★ ఇప్పటి వరకు స్థానిక, రాష్ట్ర జాతీయస్థాయిల్లో ఎన్నికైన ఏ ప్రభుత్వాలైనాగాని, సర్వాధికారాలు తమ వద్ద కేంద్రీకృతం చేసుకోవాలనే భావనతో వున్నాయి.

★ అధికారాలు మనకి సుదూరంగా కేంద్రీకృతం కాకుండా, మనకు వీలైనంత చేరువలో స్థానిక స్థాయిలో పని అమలు చేయించాలని పౌరులుగా మనం పట్టుపట్టి బలవంతం చేయాలి. అప్పుడే మన ప్రభుత్వం మనకు చేసే సేవ, మనసొమ్ము ఖర్చు పెట్టే తీరు అర్థం చేసుకోగలం. మన మీద వేసే పన్నులకి, మనకి ప్రతిఫలంగా అందే సేవలకి మధ్య సంబంధం మనకి స్పష్టంగా తెలియాలి. అందుకు అధికారాన్ని వికేంద్రీకరించి మన కందే సేవలని మన అజమాయిషీలో ఉంచాలని పౌరులుగా మనం గట్టి ఒత్తిడి తేవాలి.

★ ఈ వార్డు కమిటీలను గురించి ఇంకా ఎక్కువగా తెలుసుకోవడానికి 'లోక్‌సత్తా' / పార్టీ స్థానిక శాఖను లేక జిల్లాశాఖను సంప్రదించండి. ఆ విధంగా మీ

పన్నుల సొమ్ము ఎటు పోతున్నదో, మీకు అందిస్తున్న సేవలేమిటో తెలుసుకో గలుగుతారు. ఏ స్థాయిలోనైనా సరే మీ ప్రభుత్వ వ్యవహారాలలో చైతన్యవంతమైన ఆసక్తి కనబరుస్తూ, ఏం జరుగుతోందో తెలుసుకోవాలని పట్టుబట్టండి. మీకేదైనా సమాచారం, సహాయం, సలహా కావాలంటే, మీ స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖను సంప్రదించండి. మీ పట్టణం లేక గ్రామప్రాంతంలో 'లోక్‌సత్తా' /పార్టీ శాఖ లేకపోతే, మీ జిల్లాశాఖ లేక కేంద్ర సంస్థ వారిని సంప్రదించి ఒక విభాగాన్ని ఏర్పాటు చేయండి. అప్పుడు మీరు ప్రభుత్వం మీద మరింత ఎక్కువ నియంత్రణాధికారాన్ని పొందుతారు. మీకు సంబంధించిన అంశాలను మెరుగు పరచేందుకు సామూహికంగా పనిచేయగలుగుతారు.



" ప్రస్తుతానికి ఈ చెత్తని ఇక్కణ్ణుంచి తీసి ఆ పక్కనవేసి తరువాత మళ్ళీ తెద్దాం. ఈ పేవ్‌మెంటుని తవ్వుతున్నారంట.!"

# 8.3 సాగునీటి సంఘాలు

- ★ నీటి వనరుల నిర్వహణలో రైతులకి ఎలాంటి పాత్రా లేకపోవడం వల్ల, చాలా కాలంగా నీటి పారుదల వనరుల నిర్వహణ సరిగా ఉండేది కాదు. అయితే నీటి వినియోగ దారులైన రైతులందరినీ సంఘటిత పరిచే ప్రయత్నాలు ఇటీవలే ప్రారంభం అయ్యాయి. ఈ విధంగా రైతులకి కొంత చట్టపరమైన పాత్ర కలిస్తూ, నీటి వనరుల నిర్వహణా బాధ్యతలను అప్పచెప్పారు.
- ★ సమాజంలో ఒక ప్రభుత్వ సేవ ఎవరికి అవసరమో వారికే నిర్వహణను, దాని నాణ్యతను పాటించవలసిన బాధ్యతను అప్పచెప్పితే వారు దాన్ని ఆనందంగా స్వీకరిస్తారు. సరైన సమయంలో తమ అవసరం తీరకపోతే జరిగే నష్టం గూర్చి వారికి పూర్తి అవగాహన ఉంటుంది. ఫలితంగా వారు తమ కవసరమైన సేవలను, పనులను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారు.
- ★ వివిధ స్థాయిల్లో నీటి వినియోగదారునికి బాధ్యత అప్పచెప్పేందుకు 1997 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక చట్టాన్ని చేసింది. భారీ ప్రాజెక్టుల్లోని కాలువ నీటి పారుదలకి సంబంధించి ఈ నీటి వినియోగ సంఘాలు అంచెల పద్ధతిలో ఏర్పడతాయి. అవి మైనర్ కెనాల్, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలు, ఆపైన రాష్ట్రస్థాయిలో వీటిపైన ఎపెక్స్ కమిటీ ఏర్పాటుకు అవకాశం ఉంది. చెరువుల విషయంలో కేవలం సాగునీటి సంఘాలు ఉంటాయి. అంచెల పద్ధతి ఉండదు.

**సాగునీటి సంఘాలు**

- ★ ప్రాథమిక దశలో, నీటి వినియోగదారుల అతి ముఖ్యమైన సంస్థ సాగునీటి సంఘం. భారీ, మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్టులన్నింటిలోను ఆయకట్టును నీటి వినియోగదారుల ప్రాంతాలుగా విభజించారు. సాధారణంగా ఒక్కొక్క సాగునీటి సంఘం మైనర్ కెనాల్ ఆయకట్టుకి పరిమితమై ఉంటుంది. అది ఒక గ్రామం లేదా కొన్ని గ్రామాలలో విస్తరించి ఉంటుంది. సంఘపరిధిలో కొన్ని వందల ఎకరాల నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉంటాయి.
- ★ మేజర్ ప్రాజెక్టుల విషయంలో సాగు నీటిసంఘం ప్రాంతాన్ని, ప్రాదేశిక నియోజకవర్గాల కోసం ఉపప్రాంతాలుగా క్రింది విధంగా విభజించారు.

| విస్తీర్ణం | ప్రాథమిక నియోజక వర్గాల సంఖ్య |
|---|---|
| - 2500 ఎకరాల వరకు | 4 |
| - 2500 - 3750 ఎకరాల వరకు | 6 |
| - 3750 - 5000 ఎకరాల వరకు | 8 |
| - 5000 వేల ఎకరాల పైబడి | 10 |

మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లు విషయంలో, ప్రాదేశిక నియోజక వర్గాలకోసం ఉప ప్రాంతాల విభజన ఈ క్రింది విధంగా ఉంది

| విస్తీర్ణం | ప్రాథమిక నియోజక వర్గాల సంఖ్య |
|---|---|
| - 500 ఎకరాల వరకు | 4 |
| - 500 - 1000 ఎకరాల వరకు | 6 |
| - 1000 - 1500 ఎకరాల వరకు | 8 |
| - 1500 - 5000 ఎకరాల వరకు | 10 |

**సాగునీటి సంఘాల సభ్యులుగా ఎవరు ఉండాలి?**

- ఆ ప్రాంతంలోని భూమి స్వంతదారులందరు
- కౌలుదారులు
- ఆ ప్రాంతంలో నీటిని వినియోగించే ఇతరులందరూ. అయితే వీరికి ఓటింగ్ అధికారాలు ఉండవు. కేవలం కో-ఆప్టెడ్ సభ్యులు మాత్రమే
- నీటి వినియోగ సంఘంలోని ఉప ప్రాంతంలో ఒకచోటకన్నా ఎక్కువ భూమి ఉన్న వ్యక్తి, ఒక ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడే కాగలడు

**నిర్వహణ కమిటీ**

- ప్రతి సాగునీటి సంఘం నిర్వహణ కమిటీలోనూ ఒక అధ్యక్షుడు, ఒక ఉపాధ్యక్షుడు సభ్యులుగా ఉంటారు. ఈ నిర్వహణ కమిటీ సభ్యులలో మూడవ వంతు మంది ప్రతి రెండేళ్ళకి పదవీ విరమణ చేస్తారు.

  నిర్వహణ కమిటీ ఎన్నికల ప్రక్రియను జిల్లా కలెక్టర్ నిర్వహిస్తారు. నిర్వహణ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ కూడా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుంది. వీరు రెండేళ్ళపాటు బాధ్యతలను స్వీకరిస్తారు.

**సాగునీటి సంఘాల విధులు**

- ప్రాజెక్టు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు రూపొందించిన ప్రణాళిక, కేటాయింపుల అధారంగా ఈ సంఘాలు తమ బాధ్యతలను నిర్వహిస్తాయి. అవి :

1) నీటి పంపిణీ (వారాబందీ)కై ఏర్పాటు చేసి, దాన్ని అమలు చేయడం
2) నీటిపారుదల పద్ధతిపై ఒక నిర్వహణా ప్లానును రూపొందించి, అమలు చేయడం
3) వివిధ గొట్టాల ద్వారా నీటి వాడకాన్ని నియంత్రించడం
4) నీటిని పొదుపుగా వాడేలా చర్యలు తీసుకోవడం
5) నీటి వినియోగరేట్లను నిర్ణయించడం వసూలు చేయడం
6) వివాదాల పరిష్కారం
7) ఎకౌంట్సు ఇతర రికార్డుల నిర్వహణ
8) కాల్వగట్లపై మొక్కలను నాటడం

**అనర్హత**

ఈ క్రింది పరిస్థితులలో ఒక వ్యక్తి మేనేజింగ్ కమిటీ అధ్యక్షునిగా లేదా సభ్యునిగా ఎన్నికయ్యే అర్హత ఉండదు

- ప్రభుత్వ లేదా స్థానిక సంస్థల్లో ఉద్యోగి అయితే
- నేరచరితుడు అయితే
- మతిస్థిమితం లేకపోతే
- దివాలా తీసిన, లేదా ఆ మేరకు కేసు ఉన్న వ్యక్తి
- పంచాయితీలో ఏ స్థాయిలోనైనా కాంట్రాక్టు ఉంటే
- ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే

**రీకాల్**

అధ్యక్షుణ్ణిగాని, నిర్వహణ కమిటీ సభ్యుణ్ణిగాని ఈ దిగువ పేర్కొన్న విధంగా పదవీ చ్యుతుణ్ణి (రీకాల్) చేయవచ్చు.

- నీటివినియోగ సంఘాల సభ్యుల్లో కనీసం 1/3 వంతు రీకాల్ కోరుతూ, రాత పూర్వక నోటీసు ఇస్తే

సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యుల్లో మెజారిటీ సభ్యులు "రీకాల్"కి ఓటు వేస్తే

**డిస్ట్రిబ్యూటరీ కమిటీ**

- ప్రభుత్వ నిర్ణయానుసారం కొన్ని సాగునీటి సంఘాలని కలిపి, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉంటాయి
- సాగునీటి సంఘాల అధ్యక్షులందరూ డిస్ట్రిబ్యూటరీ కమిటీలోని సభ్యులే
- ఈ కమిటీకి ఒక అధ్యక్షుడినీ, ఐదుగురికి మించకుండా మేనేజింగ్ కమిటీని సభ్యులు ఎన్నుకుంటారు

## ప్రాజెక్టు కమిటీ

ఒక్కొక్క ప్రాజెక్టుకు ఒక్కో కమిటీ ఉంటుంది. వీటిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు ఉంటారు. ఒక్కొక్క ప్రాజెక్టు కమిటీకి ఒక మేనేజింగ్ కమిటీ ఉంటుంది. దీనికి ఒక అధ్యక్షుడు, కనీసం ఐదుగురు సభ్యులు ఉంటారు.

## అపెక్స్ కమిటీ

విధానాల నిర్ణయానికి, రైతుసంఘాలకి మార్గదర్శకత్వం వహించడానికి ప్రభుత్వం అపెక్స్ కమిటీని ఏర్పాటు చేయవచ్చు.

## వనరులు

సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, అపెక్స్ కమిటీలకు నిధులు ఈ విధంగా వస్తాయి.

1) నీటి తీరువా (పన్ను)లో వాటా రూపంగా ప్రభుత్వం నుండి వచ్చే గ్రాంటు
2) ఇతర గ్రాంట్లు
3) ఆర్థిక సంస్థలు ఇచ్చే రుణాలు
4) ఆస్తుల ద్వారా ఆదాయం
5) రైతులకి సేవలందించినందుకు వసూలు చేసే రుసుము
6) ఇతర వనరుల నుంచి వచ్చే నిధులు

## నీటిపారుదలకి సంబంధించిన నేరాలు - శిక్ష

నీటిపారుదలకి సంబంధించిన అనేక నేరాలు ఈ క్రింద పేర్కొనడం జరిగింది.

- ఏ నీటిపారుదల నిర్మాణానికైనా అడ్డుతగిలినా, ధ్వంసం చేసినా, మార్పులు చేసినా
- నీటి వేగాన్ని మార్చడం
- ఏ ఉద్యోగి అయినా - నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించడం
- నీటి పంపిణీ అనధికారంగా చేయటం
- నీటిని కలుషితం చేయడం
- నీటి ప్రమాణాలను చూపే మీటర్లను, గేజీలను అక్రమంగా మార్చడం
- తూములను దారి మళ్ళించడం

పై నేరాలకి రెండేళ్ళ జైలుశిక్షగాని, రూ. 5వేల అపరాధ రుసుము గాని లేదా రెండూగాని విధించొచ్చు. సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ ప్రాజెక్టు కమిటీలు వెయ్యిరూపాయల జరిమానాని దోషులనుండి స్వీకరించి, నేరాన్ని మాఫీ చేయవచ్చు.

**వివాదాలు**

రైతులకి సంబంధించిన అన్ని వివాదాలను సాగునీటి సంఘాల మేనేజింగ్ కమిటీలు విచారించి, నిర్ణయాలు చేస్తాయి. ఏస్థాయిలో వివాదం చెలరేగితే, ఆపైస్థాయి కమిటీ వివాద పరిష్కారాన్ని చేపడుతుంది. ఆ పైస్థాయి కమిటీకి అప్పీలు చేసుకోవచ్చు. అన్ని అప్పీళ్ళు 15 రోజుల్లో నిర్ణయం జరగాలి. అప్పీలుపై నిర్ణయం శిరోధార్యం.

**సబ్- కమిటీలు**

నిర్వహణ కమిటీలకి సబ్-కమిటీలు ఉండవచ్చు. ఇవికొన్ని నిర్ణీత బాధ్యతలను చేపడతాయి. ఈ దిగువ పేర్కొన్న సబ్-కమిటీలు ఉండవచ్చు.

1) ఆర్థిక, ప్రణాళిక విషయాలు
2) పనులు
3) నీటి వినియోగం
4) సమీక్ష, శిక్షణ

**ఏయే పనులు చేపట్టాలి ?**

రైతు సంఘాలు ఈ క్రింది తెలిపిన పనుల్లో వేటినైనా చేపట్టి పనులు కొనసాగించవచ్చు :

- పూడిక తీయడం
- కలుపు మొక్కలను ఏరివేయడం
- కాల్వగట్ల మరమ్మతు
- షట్టర్ మరమ్మతు
- రివెట్‌మెంటు
- గేట్ల పెయింటింగ్
- కాల్వలైనింగ్ బాగుచేయడం
- కాల్వగట్టు తెగినప్పుడు పూడ్చేయటం
- ఏ పునర్ నిర్మాణమైనా
- ఆధునికీకరణ

**పై పనులు చేసేటప్పుడు ఈ క్రింది విషయాలను గమనించాలి.**

- రైతు సంఘాలే పనులు చేయించాలి/ చేయాలి. వ్యక్తులు లేదా కాంట్రాక్టరు చేయరాదు
- డిజైన్ చేసిన హైడ్రాలిక్ వివరాలని మార్చరాదు
- చేసే పనుల జాబితా మొత్తం వివరాలతో సహా ఉండాలి
- అందరు రైతులకి రికార్డులు, తగిన రుసుము చెల్లించినప్పుడు అందుబాటులో ఉండాలి
- సభ్యులు ఇతర వనరులను సమీకరించవచ్చు
- పనిచేసిన ఆధారాలు కనపడాలి
- వెయ్యి రూపాయలకి పైబడిన మొత్తానికి చెక్కులు జారీ చేయాలి
- ఈ క్రింది అధికారుల నుండి అయా పనుల కోసం సాంకేతిక అనుమతి పొందాలి.

| హోదా | ఆర్థిక అధికారాలు రు. ॥ లలో |
|---|---|
| అసిస్టెంట్ ఇంజనీర్ (ఎ.ఇ) | 50 వేల వరకు |
| డిప్యూటీఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (డి.ఇ.ఇ) | 50 వేలు - 1 లక్ష |
| ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఇ.ఇ) | 1 లక్ష నుంచి 5 లక్షలు |
| సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్.ఇ) | 5 లక్షల పైబడి |
| ఛీఫ్ ఇంజనీర్ | 5 లక్షలకు పైబడి |

- నీటి పారుదల నిర్వహణలో పాల్గొనడానికి, వాటిపై అజమాయిషీ రైతులకి ఇవ్వడం కోసం ఈ చట్టపరమైన ఏర్పాట్లు చేశారు. రైతులంతా సాగునీటి సంఘాలు, ఇతర కమిటీల్లో చురుగ్గా పాల్గొనాలి. వీటి పనితీరుని తెలుసుకొంటూ ఉండాలి. ఈ సంస్థల వివరాలు అందరికీ తెలిసేలా పట్టుబట్టాలి.

- నేటి వరకు 10,292 సాగునీటి సంఘాలని, 172 డిస్ట్రిబ్యూటరీ కమిటీలని ఏర్పాటు చేశారు. రైతులలో మంచి స్పందన కనిపించింది. ఇప్పటికే కొన్ని సత్ఫలితాలు వచ్చాయి. అవసరం ఉన్న వారికే ప్రభుత్వ సేవల మీద ఆజమాయిషీ ఉండాలన్న వాదానికి ఈ విధంగా మరింత బలం చేకూరింది. అయితే సాగునీటి సంఘాలకి ఇంకా అధికారాలివ్వాలి. సిబ్బంది మీద తగిన అజమాయిషీ, అవసరమైన వనరుల పంపిణీ ఉంటేనే కాని శాశ్వత ప్రాతిపదికపైన మంచి ఫలితాలు రావు. అందుకు రైతులంతా జట్టుకట్టాలి. పట్టుపట్టాలి. ( నోట్: 2005 ఎన్నికలు తరువాత ప్రభుత్వం నీటిసంఘాలకు ఎన్నికలు రద్దు చేసింది.

ఈ విషయం మీద సమాచారం కాని, సలహా కాని కావాలంటే లోక్‌సత్తా/పార్టీ ని సంప్రదించండి.

# వ్యవసాయ మార్కెట్

మనదేశంలో సుమారుగా 67 శాతం ప్రజలు నేటికీ తమ జీవనాధారం కోసం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. అయితే, బహిరంగ ప్రక్రియలో రైతులకి గిట్టుబాటు ధరను అందించవలసిన వ్యవసాయ మార్కెట్లు ఆశించిన మేరకు అభివృద్ధి చెందలేదు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో మనకన్నా అభివృద్ధి చెందిన వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. ఫలితంగా ఉత్పత్తి అధికంగా ఉండి, వ్యవసాయం అభివృద్ధి చెందింది.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయక రాష్ట్రమే అయినా, వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధి పేలవంగా ఉంది. రైతుల్లో అనేకులకి ఈ వ్యవసాయ మార్కెట్లతో నేరుగా సంబంధాలు లేవు. మార్కెట్ సమాచారం కోసం ఈ రైతులు స్థానిక వ్యాపారస్తులపైనే ఆధారపడాలి. ఈ వ్యాపారస్తులే రైతుల వద్ద సరుకునే కొనుగోలు చేస్తారు. వ్యవసాయ ఉత్పత్తులపై ఉన్న గజిబిజి కంట్రోళ్ళు, సరుకు రవాణా, వ్యాపారంపై నియంత్రణలు పరిస్థితిని ఇంకా దిగజార్చాయి.

తెలంగాణాలో వ్యవసాయ మార్కెట్లని సంప్రదాయ బద్ధంగా కొంతవరకు మెరుగైన రీతిలో నిర్వహిస్తున్నారు. చాలా మార్కెట్లు ఎంతో కాలంగా పనిచేస్తూ కొంతమేర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇక కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మార్కెట్ యార్డ్ల పరిస్థితి కడుదీనంగా ఉంది. రైతులకి సహాయపడాల్సిన, లైసెన్స్ ఉన్న కమీషన్ ఏజెంట్లు, రైతుకి అనుకూలమైన స్థలంలో, మంచి ధరకి సరుకును అమ్మాలి. కోస్తా ఆంధ్రప్రాంతంలో కమీషన్ ఏజెంటే కొనుగోలుదారు కూడా. ఫలితంగా రైతును పక్కకునెట్టి తనకి నచ్చిన ధరకి కొనుగోలు చేస్తాడు. బక్కచిక్కిన రైతు బిక్కమోహం వేస్తాడు.

**హక్కుదార్లకే పాత్ర లేదు**

గత చట్టాలన్నీ క్రోడీకరించి ఆంధ్రప్రదేశ్లో 1966వ సంవత్సరం నుంచి ఒక మార్కెటింగ్ చట్టం అమలులో ఉంది. మనకి 834 రెగ్యులేటెడ్ మార్కెట్లు ఉన్నాయి. వీటిపై 282 వ్యవసాయ మార్కెట్ కమిటీల అజమాయిషీ ఉంటుంది.

మార్కెట్ల నిర్వహణలో రైతులకి ఏమీ పాత్ర లేదు. కనుక ఈ చట్టం అప్రజాస్వామికంగా ఉందని చెప్పాలి. ఒక్కొక్క వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈదిగువ తెలిపిన 14 మంది సభ్యులను ప్రభుత్వం నియమిస్తుంది.

ఈ మార్కెట్ కమిటీ నిర్మాణాన్ని పరిశీలిస్తే, పదవులన్నీ ప్రభుత్వమే భర్తీ చేస్తున్నది. ఫలితంగా అవి రాజకీయాశ్రయాలుగా మారుతున్నాయి. తాము ఉత్పత్తి చేసిన వస్తువులతో కళకళలాడే మార్కెట్ల నిర్వహణలో రైతులకి, ఆ మార్కెట్ కమిటీలో ఎలాంటి అధికారం

లేకపోవడంతో రైతుల గోడు వినిపించే అవకాశం లేకుండా పోయింది. కమిటీకి ఎన్నికలు లేనందున రైతు చేష్టలుడిగి చూడటం మిగిలింది.

- రైతుల నుంచి ప్రభుత్వం ఎనిమిది మందిని నామినేట్ చేస్తుంది
- ప్రభుత్వం ఇద్దరు వ్యాపారస్తులను నామినేట్ చేస్తుంది
- సహకార సంఘాల నుంచి ఒకరు నామినేట్ అవుతారు
- స్థానిక సంస్థ ఛైర్మన్/ అధ్యక్షుడు (ఎవరు స్థానిక సంస్థ అధినేతో వారు)
- ఇద్దరు అధికారులు
- మార్కెట్ కాలపరిమితి మూడు సంవత్సరాలు. కావాలనుకుంటే ప్రభుత్వం దీన్ని మరో సంవత్సరానికి పొడిగించవచ్చు

**మార్కెట్ ఫీజు**

★ రైతు తన ఉత్పత్తిని ఎక్కడ అమ్మినా మార్కెట్ ఫీజు రూపంలో రెండు శాతాన్ని చెల్లించాలి. మార్కెట్ యార్డులో అమ్మినా, అమ్మకపోయినా ఈ ఫీజు చెల్లించక తప్పదు. గుర్తించబడిన ఉత్పత్తి అయితే రైతు తన గ్రామంలోనే అమ్మినా పై ఫీజును చెల్లించక తప్పదు.

★ ఫీజును ఈ క్రింది విధంగా చెల్లించాలి.

- కొనుగోలుదారు ద్వారా, కొనుగోలుదారుని గుర్తించలేకపోతే, అమ్మిన రైతే ఫీజును చెల్లించాలి
- నోటిఫైడ్ మార్కెట్ ప్రాంతం నుంచి బయటికి వచ్చిన సరుకు అమ్మినట్టుగా భావిస్తారు. దానికి ఫీజు చెల్లించాలి,
- ఒక మార్కెట్‌లో ఒకసారి విక్రయానికి ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. అదే మార్కెట్‌లో వేరేచోట విక్రయం జరిపినా ఫీజు అవసరం లేదు
- విక్రేత కొనుగోలుదారుణ్ణి గుర్తించాలి, లేదా తానే ఫీజును చెల్లించాలి
- లైసెన్సు ఉన్న కమీషన్ ఏజెంట్ ఫీజును వసూలు చేసే అధికారాన్ని కలిగి ఉంటాడు. వసూలు చేసిన ఫీజును వ్యవసాయ మార్కెట్‌కి చెల్లిస్తాడు
- ఒక ప్రాంతం వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఫీజు చెల్లించి, వేరొక ప్రాంతం వ్యవసాయమార్కెట్‌లో మళ్ళీ సరుకు అమ్మితే దీనికి మళ్ళీ ఫీజు చెల్లించాలి
- పొగాకు బోర్డు ఉన్నందున, పొగాకు విక్రయంలో ఎలాంటి ఫీజునూ చెల్లించనక్కర్లేదు

★ ప్రభుత్వం నియమించిన మార్కెట్ కమిటీలు ఫీజు రూపంలో లెవీని విధించే అధికారం కలిగి ఉంటాయి. మార్కెట్ సౌకర్యాలను ఉపయోగించుకున్నా, లేకపోయినా రైతు ఫీజును కట్టితీరాలి.

★ చట్టప్రకారం రైతుల నుంచి వసూలు చేసే ఫీజును మార్కెట్ల స్థాపనకి, అభివృద్ధికి, మెరుగుదలకి, ఇతరత్రా రైతులకి ప్రయోజనాలను కలిగించే విషయాలపైనా ఖర్చు చేయాలి. అయితే, రైతుల కోసం ఏర్పరిచే మార్కెట్‌లపై రైతులకే అధికారం లేని స్థితిలో ఈ ఫీజు వారి ప్రయోజనాలకోసం వినియోగింపబడడం లేదు.

★ ఆంధ్రప్రదేశ్‌లో వసూలు చేసిన మార్కెట్ ఫీజు వివరాలు, మార్కెట్లపైన అయిన ఖర్చు ( ప్రభుత్వం లెక్కల ప్రకారం)

| **సంవత్సరం** | **ఆదాయం రూ. కోట్లలో** | **వ్యయంరూ. కోట్లలో** |
|---|---|---|
| 1994-95 | 121.77 | 83.25 |
| 1995-96 | 153.50 | 104.08 |
| 1996-97 | 153.03 | 109.02 |

★ ప్రభుత్వం వద్ద పోగుబడ్డ ఖర్చు చేయని మొత్తం నిధులు

| **సంవత్సరం** | **మొత్తం (రూ. కోట్లలో)** |
|---|---|
| 1994-95 | 243.47 |
| 1995-96 | 288.74 |
| 1996-97 | 326.07 |

★ ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో ఖజానాలో ఉన్నాయి. అందువల్ల వీటిపై వడ్డీని పరిగణనలోకి తీసుకోరు. ప్రభుత్వ ఖజానాలోని ఈ నిధులపైన కనీసం బారు వడ్డీ లెక్కగట్టినా దాదాపు రూ.1000 కోట్లు పైచిలుకే అయ్యే అవకాశం ఉంది.

★ వ్యవసాయ మార్కెట్లకి సంబంధించిన కొన్ని గణాంక వివరాలు :

| | | |
|---|---|---|
| • మొత్తం వ్యవసాయ మార్కెట్ కమిటీలు | - | 299 |
| • మొత్తం మార్కెట్లు | - | 889 |
| • చెల్లించే మార్కెట్ ఫీజు | - | 2 శాతం |
| • కమీషన్ ఫీజు | | |
| నిల్వ ఉండని సరుకులపై | - | 4 శాతం |
| ఇతర సరుకులపై | - | 2 శాతం |

**పరిహారాలు**

★ రైతులు మార్కెట్ ఫీజు చెల్లించక పోయినా, వ్యాపార లైసెన్సు నిబంధనలను

అతిక్రమించినా, రూ. 5000 పరిహారం చెల్లించక తప్పదు. నిబంధనలని అతిక్రమిస్తే రోజుకి రూ. 500 పరిహారం, మూడు నెలల జైలుశిక్షలు ఫీజును అపరాధ రుసుముతో పాటు చెల్లిస్తే, వ్యసాయ మార్కెట్ కమిటీ రైతుపై చర్యను నిలిపి వేయవచ్చు.

★ ఈ పరిస్థితిబట్టి చూస్తే ప్రస్తుత చట్టం మార్కెట్ల మెరుగుదలకిగాని, వ్యవసాయ ఉత్పత్తుల మెరుగుకుకాని ఉపయోగం లేనిదిగా ఉంది. నిజానికి మార్కెట్‌యార్డ్‌ల పరిస్థితి దయనీయంగా ఉంది. ఉదాహరణకి కూరగాయల, పండ్ల మార్కెట్లను పరిశీలిస్తే అటు రైతులూ, ఇటు వినియోగదారులు ఇద్దరూ మోసపోయినట్టుగా భావిస్తున్నారు. మౌలిక సదుపాయాలు కూడా అంతంత మాత్రమే. సరుకు నిల్వ ఉంచడానికి సరైన చోటు లేదు. రవాణాకి సరైన రోడ్లు లేవు.

★ మార్కెట్‌ఫీజును వసూలు చేసి ఉండకపోతే, అవి ఇలా ప్రభుత్వ ఖజానాలో ఖర్చు కాకుండా  ఉండేవికావు. రైతుల వద్దే ఆ నిధులు ఉండేవి. చివరికి రైతులకి ఈ బలవంతపు ఫీజు చెల్లింపూ తప్పలేదు. సరసమైన ధర ఆశ మిగలలేదు

★ ఒకరైతుగా మీరు మీ హక్కుల్ని తెలుసుకోండి. మీ మార్కెట్ల నిర్వహణలో సమిష్టిగా వ్యవహరించండి. ప్రస్తుత చట్ట ప్రకారం నామినేటెడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీలు, అధికార్లు, నిధులను రైతుల ప్రయోజనాలకోసం వినియోగించమని ఒత్తిడి తీసుకురండి. వసూలైన ఫీజు, ఎవరెంత ఇచ్చారు, ఎంత మంది లైసెన్సు ఉన్న వ్యాపారస్తులు ఉన్నారు, మరెంత మంది కమీషన్ ఏజెంట్లు ఉన్నారన్న విషయాలను తెలుసుకోండి. ఈ సమాచారం కావాలని పట్టుబట్టండి.

★ చట్టం మీ కోసం చేసింది. అది మీకు మాత్రమే ఉపయోగపడేలా మార్కెట్ల నిర్వహణలో మీ పాత్ర ఉండేలా పట్టుపట్టండి. రాష్ట్ర స్థాయిలోని ప్రభుత్వం అన్ని అధికారాలను ఉపయోగించి రిమోట్ కంట్రోల్‌తో మార్కెట్లను శాసిస్తూ, బాధ్యత లేకుండా ఉంటే మార్కెట్లు ఇక ఎన్నటికీ బాగుపడవు. అందుకే రైతులుగా, మీరు నడుం కట్టాలి. హలం పట్టి పొలం దున్నినట్టే, మీ హక్కుల్ని, బాధ్యతల్ని తెలుసుకొని అధికారం కోసం, నిజమైన ప్రజాస్వామ్యం కోసం పోరు సల్పండి.  అది మీ కర్తవ్యం

★ మీ మార్కెట్ యార్డ్ భవిష్యత్‌పై శ్రద్ధలేనివారు, మీగిట్టు బాటు ధరపై ఆసక్తి లేనివారు, మీనుంచి వసూలు చేసి ఫీజుతో నడిచే మార్కెట్టును శాసించే అధికారం కలిగి ఉండరాదు.

★ రైతులంతా సంఘటితం కండి. మీ మార్కెట్లపైన మీకే పూర్తిస్థాయి, చాలినంత అధికారం వచ్చేలా కృషి చేద్దాము. ఆమేరకు చట్టసవరణ లోక్‌సత్తా /పార్టీ తప్పక చేస్తుంది. ఈ దిశగా మీకు ఏ సహాయం, సమాచారం కావాల్సి వచ్చినా, దయచేసి **లోక్‌సత్తా** /పార్టీ ని సంప్రదించండి. రైతే రాజని గుర్తెరగండి.

# 8.5 విద్యా కమిటీలు

★ సభ్యసమాజంలో, చదువుకన్నా ప్రాముఖ్యతగల అంశం వేరొకటి లేదు, రాదు. మనిషిలోని ఉత్తమ లక్షణాలను బయటకుతీసేది ఈ చదువే. అతడి/ ఆమె శక్తి సామర్థ్యాలను రుజువు చేసుకొనేలా చేసేదీ ఈ చదువే. పుట్టిన ప్రతి బిడ్డలోని అజ్ఞాత శక్తిని రంగరించి నూరిపోసి, విద్యార్థిని సంపూర్ణ పౌరునిగా తీర్చిదిద్ది, ఆధునిక ఆర్థిక వ్యవస్థలో పాలుపంచుకునేలా చేసేది పాఠశాల విద్య.

★ ప్రజలకి అన్ని విషయాలూ తెలియడంపైనా, తెలివైన, వివేకవంతమైన ఆలోచనలపైనా, విజ్ఞతతో చేసే నిర్ణయాలపైనా ప్రజాస్వామ్య మనుగడ ఆధారపడి ఉంటుంది. విద్యావంతులైన పౌరులు తమ ప్రతినిధులను అనుక్షణం కనిపెడుతూ, అజమాయిషీ చేస్తూ ఉండాలి. లేకపోతే స్వయం పాలన పరిహాస పాత్రమవుతుంది. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు విద్య.

★ మనదేశ అక్షరాస్యతాస్థాయి ఘోరంగా ఉంది. ప్రపంచంలోని నిరక్షరాస్యుల్లో సగం మనదేశంలోనే ఉన్నారు. అత్యధిక స్థాయిలో అక్షరాస్యత లేని ఏ దేశం కూడా ఇంతవరకు సమగ్ర ఆర్థికాభివృద్ధిని సాధించలేదు.

★ మనదేశం మొత్తం జనాభాలో అక్షరాస్యులు 2001 జనాభా లెక్కల ప్రకారం 65.4% శాతం మాత్రమే. అక్షరాస్యులలో కూడా సరిగ్గా చదవడం, రాయడం రానివారి సంఖ్య ఎక్కువే.

★ దేశం మొత్తం మీద ఇంత తక్కువ స్థాయిలో అక్షరాస్యత ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో ఇది మరీ చిక్కిపోయింది. మనరాష్ట్ర జనాభాలో61.1% మాత్రమే అక్షరాస్యులు. రాష్ట్రంలోని మహిళల జనాభాలో కేవలం 51.2% మాత్రమే అక్షరాస్యులు.

★ గత 60 సంవత్సరాల్లో ఎంతో సొమ్ము అక్షరాస్యత కోసం ఖర్చుచేశాం. కాని ఫలితం తక్కువ. సిగ్గుతో తల ఒంచుకునే కనీస స్థాయి ఫలితాలను మాత్రమే సాధించగలిగాం. పాఠశాల చదువుపై మరింత శ్రద్ధ పెట్టక తప్పదని గుర్తించాం. ప్రభుత్వ పాఠశాలల్లో డబ్బు ఖర్చు పెడుతున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. పౌరులు అనేకులు ప్రభుత్వ పాఠశాలలపట్ల విశ్వాసాన్ని కోల్పోయారు.

★ స్వతంత్రం వచ్చిన తొలినాళ్ళల్లో పాఠశాలల చదువు వేగంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలలు వేలాదిమంది పిల్లల సుందర భవిష్యత్తుకి దోహదపడ్డాయి. ప్రస్తుతం

ప్రభుత్వ పాఠశాలలను ఎవరూ నమ్మడం లేదు. జనాభాలోని నిరుపేదవారు, బలహీనులూ మాత్రమే ఈ పాఠశాలలకి వారి పిల్లలను పంపుతున్నారు.

★ ఎంతోమంది ఇంగ్లీషు మీడియం పాఠశాలలు కావాలని కోరుకుంటున్నారు. పిల్లల భవిష్యత్‌కి అవి ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వపాఠశాలలకి సమాజంలోని మేధావులు, సంపన్నులు రాజపోషకులుగా లేక పోవడంతో, ఆ పాఠశాలల్లో చదువు నాణ్యత తగ్గిపోయింది. ఇలా నాణ్యత తగ్గిపోవడంతో ఇతర వర్గాల వారు కూడా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉపసంహరించుకుంటున్నారు.

★ఈ విషవలయంలో చివరికి మిగిలింది సమాజంలోని బలహీన, బడుగువర్గాల పిల్లలు మాత్రమే. ఫలితంగా చదువు, ప్రస్తుత రాజకీయ సంస్కృతికి ఆటబొమ్మగా మారింది.

★ఈ విధంగా పాఠశాల అవసరం ఉన్నవారికి పలుకుబడి లేదు. అధికారం, పలుకుబడి ఉన్న వారికి పాఠశాల అవసరం లేదు! ఇలా అవసరానికి, అధికారానికి మధ్య సంబంధం తెగిపోవడం వల్ల మన ప్రభుత్వ పాఠశాలల స్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా చాలా వరకు తమ పిల్లల్ని తాము చదువుచెప్పే పాఠశాలలోనే చేర్పించడానికి వెనుకాడుతున్నారు!!

★ తమ పిల్లలకోసం పాఠశాల కావాలనుకున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, స్థానిక ప్రభుత్వాల చేతిలో నిజమైన పలుకుబడి, పాఠశాల నిర్వహణాధికారం ఉంటే తప్ప మన పాఠశాల విద్యలో ఎలాంటి మార్పూరాదు. అవసరం, అధికారం కలిసినచోటే, ఏ ప్రజా సేవ అయినా, ముఖ్యంగా పాఠశాల విద్య మెరుగుపడుతుంది. లేదంటే వివిధ వనరుల నుంచి విద్యకోసం చేసే ఖర్చు అంతా వృథా అవుతుంది.

## విద్యా కమిటీలు

★ పాఠశాల చదువుల్లో తల్లిదండ్రుల పాత్ర కొంతమేర ఉండేలా 1998లో ఒక చట్టాన్ని తీసుకొని వచ్చారు. దీని వలన అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోనూ తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సంఘాల (పి.టి.ఏ) కనీసం పేరుకైనా ఏర్పడ్డాయి. గ్రామ పంచాయతీలు, మండలాలు, పురపాలక సంఘాలు, జిల్లాస్థాయిల్లో విద్యాకమిటీలు ఏర్పడ్డాయి. రాష్ట్రస్థాయి సలహా బోర్డుని, ప్రభుత్వం నామినేట్ చేస్తుంది.

## తల్లిదండ్రులు - ఉపాధ్యాయ సంఘాలు (పి.టి.ఏ)

★ అన్ని ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లోను, ఇతర ప్రభుత్వ అనియత, వయోజన విద్యా కేంద్రాలల్లోను ఈ సంఘాలు ఉంటాయి. ఈ క్రింది మార్గదర్శక సూత్రాల ఆధారంగా సంఘాలు ఏర్పడతాయి

- పాఠశాలలో నమోదైన పిల్లల తల్లిదండ్రులంతా సభ్యులే
- వీరంతా నెలకి రూపాయి చొప్పున ప్రతి ఆరునెలలకొకసారి ఒకసారి, సభ్యత్వ రుసుమును చెల్లించాలి
- ప్రతి ఏటా జూన్ 30న ఈ సంఘాలు ఏర్పడతాయి
- ఉపాధ్యాయులంతా సభ్యులే
- విద్యార్థులంతా ఈ సంఘాల సమావేశాల్లో పాల్గొంటారు
  నలుగురు సభ్యులున్న ఒక పాఠశాల కమిటీని తల్లిదండ్రులు ఎన్నుకుంటారు
- పి.టి.ఏ సమావేశాలకి మొత్తం సభ్యుల్లో 20 శాతం హాజరైతే కోరం ఉన్నట్టు లెక్క

## ఈ సంఘాల పాత్ర

- నూరుశాతం పిల్లల్ని బడిలో చేర్పించడం
- బడిమానేసే పిల్లల సంఖ్య తగ్గించడం
- పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఉపాధ్యాయ బోధన మెరుగుదలను సాధించడం
- పాఠశాల విద్యా నిధులను సేకరించడం
- పాఠశాల కమిటీ సమర్పించిన బడ్జెట్‌ను, లెక్కలను ఆమోదించడం

**పాఠశాల కమిటీ**

★ పి.టి.ఏ ఎన్నుకొనే ఐదుగురు సభ్యులు ఈ క్రింది విధంగా ఉంటారు.

- నలుగురు సభ్యులను తల్లిదండ్రులు ఎన్నుకుంటారు
- ఇందులో కనీసం ఇద్దరు మహిళలు ఉండాలి
- కనీసం ఒక్కరు ఎస్సి/ ఎస్‌టి/ మైనారిటీకి చెందిన వారై ఉండాలి
- ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారుః
- ఉన్నత పాఠశాలల్లో తొమ్మిదవ తరగతిలో మొదటి ర్యాంకు వచ్చిన విద్యార్థి కమిటీలో ఆరవ సభ్యునిగా ఉంటాడు
- ఎన్నిక ఏకాభిప్రాయ సాధన ద్వారా లేదా చేతులు ఎత్తడం ద్వారా జరుగుతుంది

★ పాఠశాల కమిటీ ప్రధాన బాధ్యత, పి.టి.ఏ కార్యక్రమాలను నిర్వహించడం, పాఠశాలలో ఆరోగ్య కార్యక్రమాన్ని ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. పాఠశాల అభివృద్ధికి వనరులను సమీకరిస్తుంది.

★ ఈ పాఠశాల కమిటీ, అవసరమైనప్పుడు తాత్కాలిక ఉపాధ్యాయులను నియమిస్తుంది.

- ఈ ఉపాధ్యాయుడు స్థానికుడై ఉండాలి
- ఈయన సేవలు సాధ్యమైనంత వరకూ స్వచ్ఛందంగా, ఉచితంగా ఉండాలి
- ఇందుకు అవసరమయ్యే నిధులను పాఠశాల కమిటీ నిధుల ద్వారా సమకూర్చుకోవచ్చు. ఈ కమిటీకి విరాళాల ద్వారా, సభ్యత్వ రుసుం ద్వారా నిధులు సమకూరుతాయి
- ఇలా నియమించబడిన టీచర్లకి శాశ్వత ఉద్యోగార్హత ఉండదు

**పాఠశాల విద్యానిధి**

★ ప్రతి పాఠశాలలోనూ ఈ విద్యానిధులు ఉంటాయి. వీటి అకౌంట్లను ఏ జాతీయ బ్యాంకులోనైనా, పోస్టాఫీసులోనైనా నిర్వహించవచ్చు. నిధులు సమకూరే వనరులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా విడుదలయ్యే గ్రాంట్లు
- చట్టప్రకారం వసూలు చేసే విద్యా సెస్సు దీన్ని పంచాయితీ విద్యానిధి విడుదల చేస్తుంది
- తల్లిదండ్రుల సభ్యత్వ రుసుము
- విరాళాలు

## పంచాయితీ విద్యా కమిటీ

★ ప్రతిగ్రామ పంచాయితీలో విద్యా కమిటీ ఈ క్రింది విధంగా ఏర్పడుతుంది.

- ఒక్కో పాఠశాలనుంచీ ఇద్దరు సభ్యులు, ఒక ఛైర్మన్, ఒక మహిళా సభ్యురాలు
- విద్యారంగంలోని స్వచ్ఛంద సంస్థల నుంచి గాని, దాతల నుంచి గాని 1/3కి ఎక్కువ కాకుండా సభ్యులను కో ఆప్ట్ చేసుకోవచ్చు
- యాభై వేల విరాళం ఇచ్చిన వారు శాశ్వత సభ్యులు అవుతారు
- స్థానిక సర్పంచ్ కమిటి ఛైర్మన్ అవుతారు
- ఆ గ్రామంలో ప్రాథమిక/ ప్రాథమికోన్నత పాఠశాల/ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు
- కో - ఆప్టెడ్ సభ్యుల పదవీ కాలం రెండేళ్ళు

★ పంచాయితీ విద్యా కమిటీ ఈ క్రింది పనులను నిర్వహిస్తుంది.

- పాఠశాలలో విద్యార్థుల చేరిక, పాఠశాల నిర్వహణ
- పాఠశాల క్యాలెండర్, పనివేళల్ని మార్గదర్శక సూత్రాల ఆధారంగా నిర్ణయించడం
- నిర్బంధ ప్రాథమిక విద్యకి ఒక పథకాన్ని రచించి, దాన్ని అమలు చేయడం
- పాఠశాల సౌకర్యాలను మెరుగుపరచడం

## పంచాయితీ విద్యానిధి

★ ప్రతి పంచాయితీ విద్యాకమిటీ, క్రింది విధంగా ఒక విద్యానిధిని ఏర్పాటు చేసుకోవాలి

- ఆంధ్రప్రదేశ్ పాఠశాల చట్టం 1982 ప్రకారం విద్యా సెస్సును వసూలు చేయడం
- విరాళాలు
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విద్యా గ్రాంట్లు
- జాతీయ బ్యాంకు, లేదా పోస్టాఫీసుల్లో ఖాతా తెరవడం
- ఈ ఖాతాను సర్పంచ్, కన్వీనర్ సంయుక్తంగా నిర్వహిస్తారు
- వార్షిక ప్రణాళిక ప్రకారం పాఠశాల కమిటీకి, పంచాయితీ విద్యా కమిటీ గ్రాంట్లను విడుదల చేయాలి. అంతే గాని పంచాయితీ విద్యా నిధుల నుంచి నేరుగా పంచాయితీ విద్యా కమిటీ ఖర్చు చేయలేదు
- పంచాయితీ విద్యానిధులను, లోకల్‌ఫండ్ ఆడిట్ స్టేట్ ఆడిట్ విభాగం తనిఖీ చేస్తుంది
- మార్గదర్శక సూత్రాలను ఉల్లంఘిస్తే, కన్వీనరు ఆ విషయానికి జిల్లా విద్యా శాఖాధికారికి (డి.ఇ.ఓ) తెలియజేస్తారు. డి.ఇ.ఓ సూచనలను పంచాయితీ విద్యా కమిటీ ఆమోదిస్తుంది.

### ఇతర విద్య కమిటీలు

★ పైన పేర్కొన్న విధంగానే మండల, పురపాలక, నగరపాలక జిల్లా స్థాయిలలో కూడా విద్యా కమిటీలు ఏర్పడతాయి. సాంకేతికమైన, విద్యాపరమైన అంశాలను చూసేందుకు జిల్లా విద్యా బోర్డు, రాష్ట్ర విద్యా బోర్డులను నామినేట్ చేస్తారు.

★ ఈ విధంగా కొత్త విద్యా చట్టం వలన పాఠశాల విద్యలో తల్లిదండ్రుల పాత్రకు కొంత పునాది ఏర్పడింది. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం తల్లిదండ్రుల, స్థానిక నాయకుల, స్వచ్ఛంద సంస్థల బాధ్యత.

★ అభివృద్ధి చెందిన దేశాల్లో విద్య ఆషామాషీగా తీసుకోరు. అక్కడి పౌరులు తమ పిల్లల పాఠశాల విద్యపై మిక్కిలి శ్రద్ధ కనబరుస్తారు. అక్కడ సమాజ కార్యకలాపాలు ఎక్కువగా పాఠశాల విద్య చుట్టూనే పరిభ్రమిస్తాయి. ఏస్థాయిలో ఎన్నికలు జరిగినా, పాఠశాల విద్య ప్రధాన చర్చనీయాంశం అవుతుంది.

★ ఇక మనదేశంలో రాజకీయ ప్రక్రియ పాఠశాల విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. తల్లిదండ్రులుగా మీ అధికారాన్ని గుర్తించండి, మీ పిల్లల భవిష్యత్‌ను కాపాడే బాధ్యతను విస్మరించకండి.

★ ఈ విషయంలో మీకు ఎలాంటి సమర్థన, మార్గదర్శకత్వం కావాలన్నా, దయచేసి స్థానిక **లోక్‌సత్తా** /పార్టీ విభాగాన్ని/ జిల్లా శాఖను/ అపెక్స్ యూనిట్‌ను సంప్రదించండి. మన ప్రజాస్వామ్య, సమాజభవితకి పాఠశాల విద్యకన్నా కావాల్సింది ఏమీ లేదు. మీ పిల్లల పాఠశాల విద్య మెరుగుపరచడానికి అవసరమైన మార్గదర్శకత్వాన్ని **లోక్‌సత్తా** /పార్టీ మీకు అందించగలదు.

“ వీళ్ళ సంగతి నాకేం అర్థం కావటం లేదయ్యా- ! ఒక్కళ్ళకి అక్షరం ముక్కరాదు. కాని అందిరికీ బడి కావాలట



# 9.1 వ్యవసాయ అవసరాలు

★ ఈ దేశంలో 60 % ప్రజలు ఇంకా తమ జీవన భృతికోసం వ్యవసాయం పైనే ఆధారపడుతున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన మంచి కిటుకులు, మెళుకువలు ఎప్పటికప్పుడు తెలియజేస్తే, అవి వారి జీవన విధానానికి ప్రాణవాయువులా పనిచేస్తాయి.

★ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక ప్రమాణాలు కాపాడేందుకు వ్యవసాయ శాఖ అధికారులకి విస్తృత అధికారాలు ఉన్నాయి. ఇందుకు కావాల్సిన చట్టాలున్నాయి. నిబంధనలున్నాయి. ఏ నేలలో ఏ పంట వేయాలి, ఏ సీజన్‌లో వేయాలి, ఏ  ఎరువులు వాడాలి అన్న అంశాలపై రైతులను జాగృత పరచాల్సిన కనీస బాధ్యత వ్యవసాయ శాఖలోని విస్తరణ విభాగానిది.

★ అయితే పలు సందర్భాల్లో రైతులు మోసపోయి, తీవ్ర పరిణామాలు ఏర్పడుతున్నాయి. తరచూ పంటలు నష్టపోవడానికి పైరుల నిర్వహణాలోపాలుగాని, లేదా ప్రకృతి సిద్ధమైన కరువు, వరదలు, తుఫానులు కారణమౌతున్నాయి.

★ ఎరువులు, నీరు విద్యుత్‌లపై ప్రభుత్వం భారీ రాయితీలను ఇస్తోంది. అయితే ధరల నియంత్రణ, అమ్మకంపై ఆంక్షలు, తప్పనిసరి లెవీలు కలిసి రైతుకు వచ్చేదానికన్నా, పోయేదే ఎక్కువగా ఉంది. ఈ ఆంక్షల ద్వారా వ్యవసాయ ధరలని కృత్రిమంగా అదుపు చేసి రైతు ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు.

★ ఈ దేశంలో రైతులకి మాత్రమే తమ పంటని తాము నిల్వ ఉంచుకోవడానికి వీలు లేదు. ఎక్కడా స్వేచ్ఛగా మార్కెట్ ధర కనుగుణంగా విక్రయించడానికి వీలులేదు. మిగిలిన ఉత్పత్తిదారులు మాత్రం వారి ఉత్పత్తులను ఎగుమతులు చేసుకోవచ్చు. ఇందుకోసం వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను కూడా ఇస్తోంది. అదే రైతులు తమ ఉత్పత్తిని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేయరాదు, విక్రయించరాదు. అలా చేస్తే వారికి శిక్ష తప్పదు. ఇదెక్కడి న్యాయం! ఇదేం ధర్మం!!

★ ఫలితంగా ప్రపంచంలో, భారతదేశంలో మాత్రమే ప్రభుత్వ విధానాలు రైతులకి మేలుచేయకపోగా, వారికి హాని చేస్తున్నాయి. అమెరికా, యూరపు, ఆసియా తదితర ప్రాంతాలలో దేశాలలో రైతులు 30 - 70 శాతం వరకు రాయితీలు పొందుతున్నారు.

అదే భారతదేశంలో రైతులు తమ ఉత్పత్తుల మార్కెట్ విలువపై 30 శాతం పైగా నష్టపోతున్నారు. దీనికి ప్రధాన కారణం ధరలని, అమ్మకాన్ని నియంత్రించడమే.

★ దీనికితోడు పుండుపై కారం చల్లినట్లు నాసిరకం విత్తనాలు, కల్తీవిత్తనాలు రైతుల పాలిట శాపంగా మారాయి. రైతుల సంరక్షణకి చట్టాలున్నాయి. వాటిని సరిగా అమలుచేసే నాధుడే లేడు. రైతులను జాగృతం చేసే పద్ధతి సరిగాలేకపోవడం వలన రైతు సరికొత్త పద్ధతుల్ని, ఆధునిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోలేక పోతున్నాడు. ఫలితంగా పంటలు పోయి, రైతులకు కష్టం కలిగిస్తున్నాయి.

★ రైతులు జీవన స్థితి మెరుగుపడాలంటే వారికి చట్టాల గురించి, పంట నిర్వహణ గురించి, శాస్త్రీయ విధానాల గురించి కనీస అవగాహన ఉండాలి.



" మీకు సహాయం కావాలంటే - నిర్దేశించిన ఫారంలో దరఖాస్తు పెట్టాలి. మూడు కాపీలు పంపాలి. ఇద్దరు సాక్షుల సంతకాలు, గెజిటెడ్ ఆఫీసరు సర్టిఫికెటు కావాలి. రిజిష్టరు పోస్టులో పంపాలి.

# 9.2 విత్తనాలు

★ వ్యవసాయంలో విత్తనానికి ఉన్న ప్రాముఖ్యత మరిదేనికీ లేదు. విత్తనాల నాణ్యతలో జన్యుపరమైన మెరుగుదల ఏర్పడింది. దాని ఫలితంగా ఆధునిక వ్యవసాయంలో దిగుబడులు బాగా పెరిగాయి. ఈ పెరుగుదల పంట దిగుబడిని పెంచడమే కాక, పైరుకి రోగనిరోధక శక్తిని అందచేస్తోంది. అంతేకాక పైరు క్రిముల దాడి నుండి ప్రతిఘటించే స్థాయికి చేరుకుంది.

★ అయితే, విత్తనాల సరఫరాలో నీతినియమాలు లేని పద్ధతివల్ల రైతులకి నిరంతరం అన్యాయం జరుగుతోంది. నాసిరకం విత్తనాలు వివిధ రకాలుగా ఉండవచ్చు

- విత్తనాల్లో అధికభాగం మొలకెత్తకపోయే అవకాశం ఉంది. సాధారణంగా రైతు ఈ విషయాన్ని చాలా ఆలస్యంగా తెలుసుకుంటాడు. కానీ అప్పటికే అతడు సీజను నష్టపోయి ఉంటాడు
- కొన్ని సందర్భాల్లో విత్తనం మొలకెత్త వచ్చు, కానీ అది రైతు కోరిన రకం విత్తనం కాకపోవచ్చు. పంట ఏపుగా పెరిగి, చేతికొచ్చే సమయానికి గానీ రైతు తాను మోసపోయినట్టు గ్రహించడు. ఈలోగా పంటకోసం చేసిన ఖర్చు వృథా అవుతుంది. పనికిరాని పంట వల్ల కష్టాలు ఇబ్బడిముబ్బడి అవుతాయి
- హైబ్రీడు విత్తనాల విషయంలో, ప్రతి కొత్త పంటనుంచి ఎంపిక చేసిన ఆడ, మగ విత్తనాల సంయోగం ద్వారా ఒక విత్తనాన్ని సృష్టించాలి. ఈ ఎంపిక చాలా జాగ్రత్తగా జరగాలి. స్వయం పరాగ విత్తనాలను తొలగించాలి. ఈ జాగ్రత్త తీసుకోకపోతే, ఈ రకం విత్తనాల వలన రైతు నష్టపోతాడు
- తాజాగా హైబ్రీడు విత్తనాలను ఉత్పత్తి చేయకుండా, నీతీనియమాలు లేని వ్యాపారస్తులు, హైబ్రీడు విత్తనాలను నాటగా వచ్చిన పంట నుంచి తీసిన పనికిమాలిన ఎఫ్ 2 విత్తనాలను విక్రయిస్తున్నారు. చిన్న మొత్తంలోని హైబ్రేడీ విత్తనాలు, పెద్దమొత్తంలో ఎఫ్ 2 విత్తనాలను అందిస్తాయి. వ్యాపారికి వాటివలన విపరీతమైన లాభాలు వస్తాయి. ఇందుకు వారు ఎలాంటి పెట్టుబడిని పెట్టనవసరం లేదు. ఈ మోసానికి బలయ్యేది మాత్రం అమాయక రైతులే.
- విత్తనాన్ని ఎక్కువకాలం నిల్వ ఉంచవచ్చు, సరిగా దాచి ఉంచకపోవచ్చు. విత్తనం చెడటానికి ఆస్కారం లేకుండా సరైన రసాయన ప్రక్రియను జరిపి ఉండకపోవచ్చు. ఇలాంటి అసంబద్ధ ప్రక్రియ, అశాస్త్రీయ నిల్వవలన విత్తనం నాణ్యతను కోల్పోవడమో, చీడలబారిన పడటమో జరుగుతుంది. ఫలితంగా రైతు దెబ్బతింటాడు

★ విత్తనాల నాణ్యత కోసం, విత్తన చట్టం 1966లో రూపొందించారు. ఈ చట్టంలోని కొన్ని ముఖ్యాంశాలు :

- జన్యు ప్రమాణికత, స్వచ్ఛత, ఇతర నాణ్యతల విషయంలో కనీస ప్రమాణాలను పాటించేలా చేయడం
- నాణ్యత కోసం ప్రభుత్వ పరిశోధనాలయాల్లో విత్తనాలను పరీక్షించడం
- విత్తనాలను పరీక్షించి, సర్టిఫికెట్లను జారీ చేయడం
- విత్తన విక్రేతలకి లైసెన్సులు, సర్టిఫికెట్లు జారీ చేయడం
- విక్రయానికి సిద్ధంగా ఉన్న విత్తనాలపై వాటి రకం, నాణ్యతలను తెలియజేసే లేబుళ్ళను అతికించడం
- విత్తన విక్రేతల వద్ద, విక్రయానికి సంబంధించి ప్రభుత్వం జారీచేసిన లైసెన్సు విధిగా ఉండాలి. అంతేకాక ఈ క్రింది నిబంధనలు పాటించాలి.
- విత్తనం ఏ రకానిదో తెలుసుకునేలా ఉండాలి
- స్వచ్ఛత, మొలకెత్తే విషయంలో ప్రభుత్వ నిర్ధారిత కనీస ప్రమాణాలు ఆ విత్తనాలకి ఉండాలి
- ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా తగిన వివరణలతో డబ్బా/ సంచీ/ బస్తాలపై ఏదైనా గుర్తుగాని, లేబుల్‌గాని ఉండాలి

★ రాష్ట్రంలో వ్యవసాయ శాఖ లైసెన్సు జారీ చేసిన విత్తన విక్రేతలు 11,000 మంది ఉన్నారు. వారు విక్రయించే విత్తనాలు రెండు రకాలుగా ఉన్నాయి అవి

**సర్టిఫైడ్ విత్తనాలు**

★ ఈ విత్తనాలను జన్యుపరంగా విత్తన పరీక్షాకేంద్రాల్లో పరీక్షిస్తారు. ఇవి సాధారణంగా మంచి విత్తనాలై ఉంటాయి. వీటి విషయంలో ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్ తొమ్మిది మాసాలు అమలులో ఉంటుంది. ఈ సర్టిఫైడ్ విత్తనాల విషయాల్లో విత్తనం మొలకెత్తే అంశం, పెరుగుదల, పరిణతల పరంగా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుంది. ఈ రకమైన విత్తనాలను సులువుగా గుర్తించేందుకు వీలుగా ఈ సంచులకు నీలిరంగు ట్యాగ్ ఉంటుంది.

**లేబుల్డ్ విత్తనాలు**

★ ఈ రకం విత్తనాల విషయంలో విత్తన ఉత్పత్తిదారుడే విత్తనంపై హామీ ఇస్తూ స్వీయ ప్రకటన చేస్తాడు. వాటిని ప్రభుత్వం పరీక్షించదు. నమ్మకమైన ఉత్పత్తిదారు/ డీలరు నుంచి మాత్రమే ఈ రకమైన విత్తనాలను రైతు కొనుగోలు చేయాలి. ఆ

ఉత్పత్తిదారుని/ డీలరు గతానుభవం పై రైతుకు అపార నమ్మకం ఉంటేనే విత్తనాల కొనుగోలుకు ముందుకు రావాలి. ఈ లేబుల్డ్ విత్తనాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా వీటికి లేత పసుపు రంగు ట్యాగులను కడతారు.

★ అధిక దిగుబడినిచ్చే రకాల నుంచి, రైతే స్వయంగా విత్తనాన్ని ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ విషయంలో విత్తనాలను ప్రత్యేకంగా తయారు చేయాల్సిన అవసరం లేదు. ఒక పంట నుంచి వచ్చిన విత్తనాల నుంచి మెరుగైన విత్తనాలను తీసి తదుపరి పంటకు వాటినే మళ్ళీ వినియోగించవచ్చు.

★ లేబల్డ్ విత్తనాలను, రైతులు ఉత్పత్తి చేసిన అధిక దిగుబడి విత్తనాలను శుద్ధిచేసి అంటు వ్యాధులకి దూరంగా భద్రపరచాలి. విత్తన శుద్ధి పద్ధతిని తోటిరైతుల ద్వారాగానీ, వ్యవసాయ అధికారుల ద్వారాగానీ తెలుసుకోవచ్చు.

★ విత్తనాల కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దయచేసి లైసెన్సున్న విత్తన డీలర్ల నుండి మాత్రమే విత్తనాలను కొనండి
- సర్టిఫైడ్ విత్తనాలతో పాటు ప్రభుత్వ విత్తన ధృవీకరణ సంస్థ జారీచేసిన సర్టిఫికెట్ ఉందా లేదా ధృవీకరించుకోండి. నీలిరంగు ట్యాగు ఉందోలేదో గమనించండి
- బిల్లులో ఈ దిగువ అంశాలు ఉన్నాయో లేదో గమనించండి
  - లాట్ నంబర్
  - ఎన్ని సంచులు కొన్నారు
  - ధర
  - విత్తనాల సీజన్
  - ప్రాసెసింగ్ ప్లాంట్ నంబర్
  - విత్తన ధృవీకరణ అధికారి సంతకం
  - విత్తనం ఉత్పత్తి అయిన ప్రాంతం

**విత్తనంలో లోపం ఉంటే ?**

★ స్థానిక మండల వ్యవసాయాధికారికి దయచేసి వెంటనే ఫిర్యాదు చేయండి. ప్రభుత్వం విత్తన ఇనస్పెక్టర్‌లను నియమించింది. వారు విత్తన విక్రేతల గిడ్డంగులను పరిశీలిస్తారు. విత్తనాల శాంపుల్స్ సేకరించి, వాటి నాణ్యతను పరీక్షిస్తారు.

- విత్తన నాణ్యతపై ఎలాంటి అనుమానం ఉన్నా, ఆ విత్తనాన్ని విక్రయించకుండా 30 రోజులపాటు నిలుపుచేయవచ్చు
- పరీక్షలో ఆ విత్తనం లోపభూయిష్టమైనవని తేలితే మొత్తం స్టాకును జప్తు చేసి, డీలరును విచారిస్తారు

- ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోండి. ఒకసారి కనుక మీరు నాసిరకం విత్తనం కొనుగోలు చేసి వాడితే, ఆ తరువాత డీలరుకి ఏ రకం శిక్షపడుతుందన్న అంశం పక్కనబెడితే, మీరు మాత్రం భారీగా నష్టపోతారు.
- నాసిరకం విత్తనాల వల్ల నష్టపోయిన రైతుకి తగిన నష్టపరిహారం చెల్లించే విషయంలో చట్టంలో సంతృప్తికరమైన విధానం ఏదీలేదు. కాబట్టి సాధ్యమైనంతవరకు విత్తనాల కొనుగోలులో అన్ని జాగ్రత్తలూ తీసుకోండి. వీలైనంతవరకు ప్రభుత్వం సర్టిఫై చేసిన విత్తనాలనే కొనుగోలు చేయండి, లైసెన్సున్న నమ్మకస్తులైన డీలరు నుంచే విత్తనాలను కొనుగోలు చేయండి.
- మంచి విత్తనాల కొనుగోలు విషయంలో రైతు సంఘాలు, మంచి సహకార సంస్థలు, మార్కెటింగ్ సొసైటీలు రైతులకి సహకరిస్తాయి. మీకు మీరే మంచి స్నేహితుల్ని మరవకండి. మీ స్వప్రయోజనం కోసం మిమ్మల్ని మీరు తీర్చి దిద్దుకోండి.

**"ఆలోచన అనే క్లిష్టమైన ప్రక్రియని తప్పించు**
**కోవడానికి మనిషి తొక్కని అడ్డదారి లేదు "**

**- థామస్ ఎడిసన్**

# 9.3 ఎరువులు

★ ఆధునిక వ్యవసాయానికి రసాయనిక ఎరువుల అవసరం ఎంతో ఉంది. ఇవి ప్రధానంగా మూడు రకాలు

| | | |
|---|---|---|
| ఎన్ | - నైట్రోజన్ | - యూరియా |
| పి | - ఫాస్ఫరస్ | - వివిధ ఫాస్ఫేట్‌లు, డి.ఎ.పి మొ॥ |
| కె | - పొటాషియం | - పొటాషియం సల్ఫేటు వగైరా |

★ సాధారణంగా అనేక కలయికలతో కూడిన ఎరువులు ఉంటాయి. వీటినే కాంప్లెక్సులు అంటారు. డిఎపిలో ఎన్, పి రెండూ ఉంటాయి. ఏదైనా ఒక ఎరువును కొనేముందు రైతు నిర్ధారించుకోవాల్సింది, దాని ధర, ఆ ఎరువులో ఉన్న (ఎన్, పి, కె)ల పరిమాణం. ఎరువుకొనేటప్పుడు, అతి తక్కువ ధరకి అతి ఎక్కువ పరిమాణంలో యన్.పి.కెలని కొనే ప్రయత్నం చేయాలి. అధిక ధర పలికి తక్కువ పరిమాణంలో ఉండే కాంప్లెక్సులను కొనుగోలు చేయరాదు. వ్యసాయ ఎక్స్‌టెన్షన్ వర్కర్లు, రైతుసంఘాలు నమ్మకమైన సమాచారాన్ని అందివ్వగలరు.

★ నైట్రోజన్ ఎరువుల ధరపై ప్రభుత్వ అదుపు ఉంది. 1998 అక్టోబరు నాటికి నైట్రోజన్ ఎరువయిన యూరియా ధర ఒక సంచికి రూ. 188.50, ప్రస్తుతం పి,కె లాంటి ఇతర ఎరువుల ధరలపై ప్రభుత్వ అదుపులేదు. కాబట్టి కంపెనీ, లేదా డీలర్ నిర్ధారించే ధరకే ఎరువుల విక్రయం జరుగుతుంది. సరసమైన ధరకి ఎరువులను కొనాలంటే మంచి కంపెనీ/ డీలర్‌ను ఎంపిక చేసుకోండి.

★ నైట్రోజన్ ఎరువులను రైతులు విరివిగా వినియోగించడానికి ఈ క్రింది అంశాలు దోహదపడుతున్నాయి

- నైట్రోజన్ ఎరువువైన యూరియా ధరపై ప్రభుత్వ అదుపు ఉంది. ఇది రాయితీ ధరల్లో దొరుకుతాయి. తక్కువ ధర రైతులకు సహజంగానే ఆకర్షిస్తుంది.
- నైట్రోజన్ ఎరువుల వాడకం వల్ల పంట ఏపుగా ఎదిగినట్లు కనిపిస్తుంది.

★ అయితే అధికంగా నైట్రోజన్ వాడకం వృథా అవుతుంది. కొన్ని సందర్భాల్లో హానికరం కూడా. మంచి పంటకీ, దిగుబడికీ రైతులు (ఎన్, పి, కె)ల మిశ్రమాన్ని వినియోగించాలి.

★ తరచుగా పంటలకు సూక్ష్మ పోషకాలు చిన్న మోతాదులో అవసరమవుతాయి. ఉదాహరణకి మన రాష్ట్రంలోని వరిపంట భూముల్లో జింక్ లోపం ఉందని చాలా మంది రైతులు భావిస్తున్నారు. ఈ స్థితిలో కేవలం ఎన్,పి,కెనీ భారీగా వినియోగించడం వల్ల లాభం లేదు. ఇందుకు తగు మోతాదులో జింకులాంటి సూక్ష్మ పోషకాలు అవసరం అవుతాయి.

★ భూమికి కావాల్సిన ఎరువులను తెలుసుకొనేందుకు, రైతులు అప్పుడప్పుడూ భూసారపరీక్షలను నిర్వహించాలి. రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాకి ఒకటిచొప్పున ఈ భూసార పరీక్షా కేంద్రాలు ఉన్నాయి.

★ కొన్ని పంటల దిగుబడి తర్వాత ఒకసారి, భూసారాన్ని పరిరక్షించే చర్యలు తీసుకోవాలి. ఇవి ఈ క్రింది విధంగా ఉండాలి

- తరచూ పంటలను మార్చాలి
- భూసార పరిరక్షణకు జిప్సంనుగాని, ఇతర రసాయనాలను గాని వినియోగించాలి
- భూసార సమతుల్యం కోసం సేంద్రీయ ఎరువులను వినియోగించాలి
- జీలుగలాంటి కొన్ని ప్రత్యేక పంటలను పండించి, వాటిని కోయకుండానే, భూమిలోకి దున్నడం ద్వారా మట్టిలో కలగలపాలి. ఈ ప్రక్రియ వలన భూమిలో సారం మిగులుతుంది.
- వానపాముల్ని పొలంలో బాగా పెరగనివ్వాలి
- పప్పుధాన్యాలను పండించడం వల్ల భూమిలో నైట్రోజన్ శాతం పెరుగుతుంది
- అనుభవం ఉన్న రైతులు, శాస్త్రవేత్తలు, ఎక్స్‌టెన్షన్ అధికారుల నుంచి రైతులు మంచి సలహాలను స్వీకరించాలి

★ కొన్ని సందర్భాల్లో రసాయనిక ఎరువుల్లో కల్తీ జరగవచ్చు. నకిలీవి ఉండవచ్చు. వాటి ఉత్పత్తిని అదుపు చేయడానికి తగిన నిబంధనలున్నాయి అవి

- ధరలపై అదుపు - ప్రస్తుతం నైట్రోజన్ ఎరువులపైనే ప్రభుత్వ అదుపు ఉంది.
- ఎరువుల విక్రేతల రిజిస్ట్రేషన్, అదుపు
- ఎరువుల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మిక్సింగ్, లేబిలింగ్‌లపై నియంత్రణ

★ రాష్ట్ర వ్యాప్తంగా **16** వేల మంది ఎరువుల విక్రేతలు ఉన్నారు. వ్యవసాయశాఖ అధికారులు వారికి లైసెన్సులను జారీ చేస్తారు. ప్రతి విక్రేతా ఈ క్రింది నియమాలను విధిగా పాటించాలి :

- ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్ ఉండాలి
- సరుకును, ధరలను ప్రదర్శించాలి
- ఉత్పత్తిదారుని పేరు, లాట్‌నంబర్, ఉత్పత్తి అయిన సమయం, స్థలం, ఎరువులస్టాకు, ధర మొదలైన వివరాల రికార్డు ఉండాలి

★ విక్రేతలు తరచూ పాల్పడే అవకతవకలు

- నల్లబజారు విక్రయం - నైట్రోజన్ ఎరువుల విషయంలో (యూరియా వంటివి)వాటి నిర్ధేశిత ధరలకన్నా ఎక్కువకి అమ్మడం, ఇతర ఎరువులను కంపెనీలు నిర్ధేశించిన ధరకన్నా ఎక్కువకి అమ్మడం
- తూకంలో బరువును పెంచేందుకు ఎరువుల్లో చెత్తా చెదారాన్ని కలిపి, రైతులను మోసగించడం

★ ఎరువుల నాణ్యతలో సందేహం వచ్చినా, బ్లాక్ మార్కెటింగ్‌పై ఫిర్యాదు చేయాల్సి వచ్చినా ఈ క్రింది చర్యలను తీసుకోవాలి

- మండల వ్యవసాయాధికారికి, రైతు ఫిర్యాదు చేయాలి
- ఈ దిగువ పేర్కొనబడిన పరీక్షా కేంద్రాలకి ఎరువుల శాంపుల్స్‌ను పంపవచ్చు
  - రాజేంద్రనగర్ (రంగారెడ్డి జిల్లా)
  - బాపట్ల (గుంటూరు జిల్లా)
  - తాడేపల్లిగూడెం ( పశ్చిమగోదావరి జిల్లా)
  - అనంతపురం
- స్థానిక వ్యవసాయాధికారులు, రైతులకి ఎరువుల శాంపిల్స్‌ను పంపడంలో సహకరిస్తారు
- ఫిర్యాదు ఉన్నా లేకపోయినా, వ్యవసాయ అధికారులు ఎరువుల శాంపిల్స్‌ను సేకరించి, పరీక్షా కేంద్రాలకు పంపవచ్చు
- శాంపుల్స్ పరీక్షలో అవి నాసిరకమని తేలినా, బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని రుజువైనా, స్టాకును జప్తు చేసి, విచారణ జరుపుతారు
- లైసెన్స్‌లను తాత్కాలికంగా నిలిపివేయడమో, పూర్తిగా రద్దు చేయడమో చేయవచ్చు
- విక్రేతలను న్యాయస్థానాలల్లో విచారించవచ్చు
- పేరున్న విక్రేతలనుంచి మాత్రమే దయచేసి ఎరువులను కొనండి. రైతు సంఘాల నుంచి, పేరున్న సహకార సంఘాల నుంచి సాధ్యమైనంత వరకూ ఎరువులను కొనుగోలు చేస్తే మంచిది. ఏ ఎరువులు వాడాలి, ఎలా వాడాలి, భూసార పరీక్షా వివరాలు- వగైరాలన్నింటి గురించి పై సంస్థల సహాయాన్ని పొందాలి.

# 9.4 క్రిమి సంహారక మందులు

★ పంటపొలాలకి క్రిమికీటకాదులు, తెగుళ్ళు నుంచి రక్షణ ఉండాలంటే క్రిమిసంహారక మందుల వాడకం తప్పనిసరి. వైరస్ తెగులుకి నివారణ లేదు. తెగులు సోకకుండా కాపాడుకోవడమే మేలు. అలాగే వ్యాధి నిరోధిక విత్తనాలు వాడాలి. సరైన సమయంలో సరైన మోతాదులో మందులను వాడటం ద్వారా బ్యాక్టీరియా, ఫంగస్ తెగుళ్ళను నివారించవచ్చు. అలాగే పంటను నాశనం చేసే కీటకాల బారి నుంచి మందులని వినియోగించడం ద్వారా తప్పించుకోవచ్చు.

★ క్రిమి సంహారకాల అవసరం ఎంత ఉందో, వాటిని జాగ్రత్తగా, తగుమోతాదులో, శాస్త్రీయ పద్ధతి ద్వారా వాడాల్సిన అవసరమూ అంతే ఉంది. క్రిమి సంహారకాలను ఏమాత్రం నిర్లక్ష్యంగా వాడినా డబ్బు వృథా అవడమే కాక, పంట నాశనమయ్యే ప్రమాదమూ ఉంది. అందుకే క్రిమిసంహారకాల వాడకానికి ముందు వాటిపై అవగాహనను పెంచుకొని, సరైన సలహా తీసుకోవాలి.

**క్రిమి సంహారకాల దుర్వినియోగం**

★ శక్తివంతమైన క్రిమి సంహారకాల వాడకం వల్ల ఈ క్రింది తీవ్ర పరిణామాలు ఏర్పడతాయి

- పంటను నాశనం చేసే కీటకాలు, క్రమంగా క్రిమి సంహారకాలకు అలవాటు పడినవాటిని నిరోధించే శక్తిని పొందుతాయి. తద్వారా వీటి సంఖ్య విపరీతంగా పెరిగి, పంటను దెబ్బతీస్తాయి. దాని వల్ల వ్యవసాయరంగం సంక్షోభంలోపడి, విస్తృత ప్రాంతాల్లో దీని ప్రభావం ఉంటుంది. ఉదాహరణకి: పత్తిపంటని ఆశించే శనగపచ్చ పురుగులు, ఎక్కువగా పైరిత్రాయిడ్‌లు అనే క్రిమిసంహారకాలని వాడటం వలన వాటికి అలవాటు పడిపోయి, క్రిమిసంహారం పనిచేయని స్థితికి చేరుకుంది. దాదాపు గత దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మరెన్నో రాష్ట్రాల్లో ఈ శనగపచ్చ పురుగులు విపరీతంగా వ్యాపించి ఎన్నో రకాల పంటలని నాశనం చేశాయి.

- క్రిమిసంహారకాల వాడకం ఎక్కువైతే, మనకి మేలుచేసే కీటక భక్షిణిలు (హానికరమైన ఇతర కీటకాలను తినేవి) చనిపోతాయి. ఫలితంగా హానికర కీటకాలురెచ్చిపోయి, ఏకుమేకు అయ్యి కూర్చుంటాయి. ఉదాహరణకి సింథిటిక్ పైరిత్రాయిడ్ల వాడకం ఎక్కువ అవడంవలన, తెల్లదోమ విపరీతంగా

పెరిగిపోయాయి. ఫలితంగా పత్తి, ఇతరపంటలను అవి తీవ్రంగా దెబ్బతీశాయి. ఒకొక్క సందర్భంలో ఈ తెల్లదోమలు రోడ్లపైకి వచ్చేయడం వల్ల దారి కనిపించక ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురైన సంఘటనలు ఉన్నాయి.

★ ఈ క్రిమిసంహారకాల్లో చాలామట్టుకు మనిషికి హానిచేస్తాయి. ఇవి కళ్ళు, చెవులు, చర్మం, నోరు, ముక్కు పుటాలు మొదలైన వాటి ద్వారా రక్తంలోకి ప్రవేశిస్తాయి. శాస్త్రవేత్తలు, ఉత్పత్తిదారులు చెప్పిన ప్రకారమే తగుజాగ్రత్తలు తీసుకొని క్రిమిసంహారకాలను కలపడం, పంటపై చల్లడం చేయాలి. ఇవి పొరపాటున మనిషి శరీరంలోకి ప్రవేశిస్తే, వెంటనే వైద్య చికిత్స చేయాలి. వైద్య సదుపాయాలు లేని గ్రామీణ ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న ఇద్దరు యువకులకి ప్రాథమిక వైద్య శిక్షణ ఇచ్చి సిద్ధంగా ఉంచాలి. ఇలాంటి అవసరాలు వచ్చినప్పుడు వారు అండగా ఉంటారు.

★ ఈ విషానికి విరుగుడుగా పనిచేసే అట్రోపిన్ మందును ఎప్పుడూ దగ్గర ఉంచుకోవడం మంచిది. అయితే దాన్ని ఎలా వాడాలో ముందుగా తెలుసుకోవడం మంచిది.

★ దేశంలో 204 రకాల క్రిమి సంహారకాలు రిజిస్టర్ అయ్యాయి. రాష్ట్రంలో 13,000 డీలర్లు ఉన్నారు. క్రిమి సంహారకాల లేబుళ్ళను మార్చేసి రకరకాల విన్యాసాలన్నీ చేయడం మన రాష్ట్రంలో సర్వసాధారణం. చాలా క్రిమి సంహారకాల ధరలు ఆకాశాన్నంటడం, వ్యాపారులపాలిట వరమైంది. వారు తమ ఇష్టానుసారం, కల్తీలు చేసి భారీ లాభాలను గడిస్తున్నారు.

★ ఆంధ్రప్రదేశ్ లో క్రిమి సంహారక మందుల వాడకం ఎక్కువ. గుంటూరులాంటి ప్రాంతాల్లో పత్తి, మిరపపైర్ల కోసం క్రిమిసంహారకాల వాడకం ప్రపంచం మొత్తంలోనే అతి ఎక్కువ. శాస్త్రీయమైన పద్ధతిలో క్రిమిసంహారకాలని ఎలా వాడాలన్న అంశంపై రైతులకి అవగాహన ఉండటం అవసరం. అలాగే చట్టబద్ధ నియమాలు, పద్ధతులు మొదలైనవి కూడా రైతులు తెలుసుకోవాలి.

**జాగ్రత్తలు**

★ క్రిమి సంహారకాల విక్రయదారులంతా ఇన్‌సెక్టిసైడ్స్ చట్టానికి లోబడి లైసెన్సు పొందాలి. ఏ వ్యాపారి వద్దనుంచైనా క్రిమి సంహారకాలను కొనుగోలు చేసేటప్పుడు రైతులు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి.

- సరైన రశీదు కోసం పట్టుపట్టండి
- కొనుగోలు చేసిన క్రిమి సంహారకం వివరాలు రాసుకోండి. ఈ వివరాల్లో లాట్

నంబర్, ఉత్పత్తి అయిన స్థలం, తేదీ, కంపెనీ సీలు సరిగా ఉందా లేదా, క్రిమి సంహారకాల్లో ఏయే మందులు ఏ పాళ్ళలో ఉన్నాయి, మందు ఎప్పటి దాకాపని చేస్తుంది మొదలైన వివరాలన్ని రాసుకోవటం మంచింది

- ఏ క్రిములను సంహరించాలని మీరు కోరుకుంటున్నారో, అందుకు సంబంధిత క్రిమి సంహారకాన్నే కొనుగోలు చేయండి. దాని వాడకానికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోండి
- క్రిమి సంహారకాన్ని వెదజల్లే స్ప్రే గొట్టం సరిగా ఉందో, లేదో పరీక్షించండి. ఒక చుక్క కూడా వృథా కాకుండా చూడండి
- రాజేంద్రనగర్, గుంటూరు, అనంతపురం, తాడేపల్లిగూడెంలో క్రిమి సంహారక కల్తీ పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. క్రిమి సంహారక నాణ్యతపై మీకు ఎలాంటి సందేహం వచ్చినా, స్థానిక వ్యవసాయాధికారి ద్వారా, దాన్ని పై పరీక్షా కేంద్రాలకి పంపండి. పరీక్షలన్నీ ఉచితంగా చేస్తారు
- సమయానుకూలంగా ఆయా క్రిమి సంహారకాలను పరీక్షించే అధికారం వ్యవసాయాధికారులకి ఉంటుంది. అవసరమైతే నిల్వలను జప్తుచేసి, లైసెన్స్‌లను తాత్కాలికంగా రద్దు చేసే అధికారం కూడా వీరికి ఉంటుంది
- కల్తీ రుజువైతే డీలరు లైసెన్సు రద్దు అవుతుంది. డీలర్ని విచారిస్తారు. నిల్వలనీ స్వాధీనపరుచుకొంటారు. బ్రాండ్ పేరును దుర్వినియోగపరిచినా, తారుమారు చేసినా ఉత్పత్తిదారులపై కూడా పై చర్యలు తీసుకోవచ్చు
- నమ్మదగిన, ఎన్నదగిన డీలర్ల్లా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే దయచేసి క్రిమి సంహారకాలను కొనుగోలు చేయండి
- రైతు సంఘాలు, పేరున్న సహకార సంఘాల సలహాలని క్రిమి సంహారకాల కొనుగోలు సమయంలో తీసుకోవాలి. వీరు క్రిమి సంహారకాల సరఫరా, శాస్త్రీయ వినియోగం తదితర అంశాలపై సలహాలు, సూచనలు ఇస్తారు.



"నన్నేం చెయ్యమంటారు సార్! వాళ్ళంతా నీళ్ళకి మొహంవాచి పోయినట్లున్నారు. నీళ్ళు చూడగానే తాగటం, బట్టలుతకటం, స్నానం చెయ్యటం, వంట చెయ్యటం మొదలు పెట్టారు.



"మన్నించండి సార్. అలా గొడవ జరుగుతుందనుకోలేదు. అసలా ఊళ్ళో నూటికి 99 మందికి చదువురాదు. చదువుకున్న ఆ ఒక్కడే మనపేరు ప్రతిష్ఠలు దిగజారటానికి కారణం!"

# 10.1 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

★ మీ ఆరోగ్య రక్షణకి సంబంధించి సాధారణంగా మీరు ముందుగా సంప్రదించవలసింది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని. మన రాష్ట్రంలో ప్రతి మండలంలోనూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. టీకాలు, గర్భిణీ స్త్రీల రక్షణ, పిల్లలకి చికిత్స, కుటుంబ సంక్షేమ సేవలు మొదలైనవి ఈ కేంద్రాల్లో లభ్యమవుతాయి. సాధారణ వ్యాధులకి ముందుగా సంప్రదించాల్సింది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నే.

★ ఆస్పత్రిలో చేరాల్సి వచ్చినప్పుడు, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి వచ్చినప్పుడు రోగులు 30 పడకల ఆస్పత్రికి వెళ్ళాలి. ఇది సాధారణంగా పాత తాలూకా కేంద్రంలో ఉంటుంది లేదా ప్రధాన పట్టణాల్లోని లేదా జిల్లా కేంద్రంలోని 300 పడకల ఆస్పత్రిలో చేరాలి.

★ ఆధునాతన వైద్యం కావాల్సిన వారు వైద్య కళాశాలకి అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రుల్లో చేరాలి. గుండె శస్త్ర చికిత్స మొదలైన అవసరాలున్న వ్యాధులకు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్‌సెస్ (నిమ్స్) లో చేరడం మంచిది.

★ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో ప్రయివేటు నర్సింగ్ హోమ్‌లు, అత్యంతాధునిక డయోగ్నస్టిక్ కేంద్రాలు, కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రయివేటు డాక్టర్లు ఉన్నారు. ఈనాడు ఎక్కువగా ఈ సంస్థలే వైద్య సేవల్ని అందిస్తున్నాయి.

★ ప్రాథమిక వైద్య విధానం చాలా బలహీనంగా, అక్కరకు రానిదిగా ఉండటం వలన వీటిపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. దీనివల్ల చిన్నపాటి నివారణ చర్యలూ, అంటువ్యాధుల వైద్యం సైతం సకాలంలో అందటం లేదు. అందువల్ల చిన్న రోగాలకి కూడా పెద్ద ఆసుపత్రులకే వెళుతున్నారు.

★ ఏ సమాజంలో అయినా ప్రాథమిక ఆరోగ్యసేవా పద్ధతి అతిముఖ్యమైనది. ఈ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తూ సమాజం వైద్య అవసరాలను తీర్చడానికి ఎంత ధనం ఖర్చుచేసినా సరిపోదు. ఇప్పటి ఆస్పత్రి వ్యవస్థ భారీ సంఖ్యలో ఉన్న రోగులను తట్టుకోలేదు. వారంతా గత్యంతరం లేక చిన్న సమస్యలకి కూడా ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

★ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి ఉదయం ఔట్ పేషంట్ విభాగంలో ఒక్కో డాక్టరు, ఒక్కో విభాగం నుంచి 200-300 మంది పేషంట్లని చూస్తూ ఉంటారు. అంత భారీ స్థాయిలో ఉన్న రోగుల వ్యాధులను జాగ్రత్తగా పరిశీలించి మందులు ఇవ్వడం మానవ మాత్రుల తరం కాదు.

★ ఇదే విధంగా ప్రయివేటు ఆసుపత్రులలోను ఎందరో రోగులు పేరుకుపోతున్నారు. వీరందరికీ సరైన వైద్యం లభించడం లేదు. ప్రాథమికంగా వైద్య చికిత్స కరువైతే, ఆ తర్వాత రోగం ముదిరి స్కానింగ్‌ల మీద, ఎక్స్‌రేల మీద, అధునాతన వైద్యం మీద ఖర్చు విపరీతంగా అవుతుంది.

★ ప్రపంచంలో అత్యంత సంపన్న దేశాలైన అమెరికా, బ్రిటన్, జర్మనీ లాంటి దేశాలు కూడా తమ ప్రజలందరికీ అత్యంత ఆధునికరమైన, బాగా ఖరీదైన వైద్యాన్ని ఇప్పించలేవు. అమెరికా లాంటి దేశాలలో కూడా అందుకే ఇప్పుడు ప్రాథమిక ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నాయి.

★ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల పనితీరు మెరుగుపడితే, ఆరోగ్య రక్షణలో నాణ్యతను మెరుగుపర్చవచ్చు. ఇవి మన సంస్థలు. మన పన్నులతో ఇవి ఏర్పడ్డాయి. అక్కడ పనిచేసే డాక్టర్లు, నర్సులు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, కాంపౌండర్లు అందరూ జీతాలు తీసుకుంటున్నది మనం చెల్లించే పన్నులనుంచే. మనకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం పొందాల్సిన హక్కు ఉంది.

★ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపైన స్థానికుల అదుపు లేకుండా, వాటి పనితీరుపై అదుపు ఎక్కడో కేంద్రీకృతమై చాలా ఆరోగ్య కేంద్రాలు నిస్తేజంగా మారాయి, నిర్వీర్యమైపోయాయి. కానీ ఏ కేంద్రంలోనైనా డాక్టరు శ్రద్ధ తీసుకుని పనిని పర్యవేక్షిస్తే, ఆ కేంద్రం నుంచి ప్రజలు అభినందించే రీతిలో సేవలు అందుతున్నాయి.

★ ఈ కేంద్రాల్లో వైద్యుల, ఇతర సిబ్బంది నియామకాలు పూర్తిగా రాజకీయం అయిపోయాయి. స్థానిక రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఈ కేంద్రాలను తమ సొంత ఆస్తిగా భావిస్తున్నారు. వారి తాబేదార్లకు ఈ కేంద్రాలన్నీ ఉపాధి కల్పనా కేంద్రాలుగా మారుస్తున్నారు. స్థానిక ప్రజలు నడుంకట్టి ఈ కేంద్రాల పనితీరుపై ఒక పట్టు పట్టేవరకూ ఇవి బాగుపడవు.

**ప్రజలపాత్ర**

★ ఏ ఇతర ప్రజాసేవలాగానే, ఆరోగ్య రక్షణ సేవ కూడా ప్రజలకోసమే. మనం, అంటే ప్రజలం యజమానులం. ఇతర ఆరోగ్య సిబ్బంది, సీనియర్ అధికారులు, మంత్రులు అంతా మన సేవకులే. మనమంతా కలిసికట్టుగా ఈ కేంద్రాల మెరుగుకు కృషి చేయాలి. ఇందుకు మనకు వీటి నిర్మాణం, పనితీరుపై కొంత అవగాహన ఉండాలి.

★ ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బాగా నడిచినా, వనరులు మనకి చాలినంత లేవు. ఈ కేంద్రాలు మరింత బాగా పనిచేయడానికి మనకోసం, మనమే వనరులను సమీకరించుకోవాలి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బడ్జెట్‌పై ప్రజలు శ్రద్ధ తీసుకోవాలి. అవసరాలు గుర్తించి, వాటిని తీర్చడానికి వనరులను సమీకరించాలి.

★ మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ దిగువ సేవలు లభ్యం కావాలి

- వైద్య సహాయం
- కుటుంబ సంక్షేమం
- పారిశుధ్యం
- అంటువ్యాధుల నివారణ
- ఆరోగ్య గణాంక వివరాలు
- ఆరోగ్య అవగాహన ప్రచారం
- జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు
- సిబ్బందికి శిక్షణ

★ ఒక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సాధారణంగా ఇద్దరు లేక ముగ్గురు డాక్టర్లు ఉంటారు. ఆంధ్రప్రదేశ్ కొన్ని కొత్త కేంద్రాల్లో ఒక్కరే డాక్టర్ ఉండవచ్చు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి **5-6** ఉపకేంద్రాలు ఉంటాయి. ప్రతి ఉపకేంద్రంలోనూ ఒక ఆక్సిలరీ నర్సు మిడ్‌వైఫ్ (ఎ.ఎన్.ఎమ్) ఇన్‌చార్జిగా ఉంటారు. ఈ ఎ.ఎన్.ఎమ్ సాధారణంగా టీకాలు వేయడంతోపాటు గర్భిణీ స్త్రీ లకు, పిల్లలకు సేవలను అందిస్తుంటారు.

★ ఆరోగ్య కేంద్రాలు పాఠశాల వైద్య కార్యక్రమాల్లో పాల్గొంటాయి. ప్రతి పాఠశాలకు డాక్టర్లు, నర్సులు వెళ్ళి పిల్లల ఆరోగ్యాన్ని పరీక్షిస్తారు. అవసరమైతే పాఠశాల వద్దనే టీకాలు వేస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, జిల్లావైద్య, ఆరోగ్య అధికారి అధీనంలో ఉంటారు. పరిపాలనాపరంగా స్థానిక కమిటీలు లేదా స్థానిక పౌర ప్రభుత్వాలకి వీటిపై ఎలాంటి అజమాయిషీ లేదు. ఫలితంగా అనేక కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్యం మృగ్యమయ్యింది. చాలా కేంద్రాల్లో డాక్టర్లు, నర్సులు ఉండరు.

★ మంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్యవంతమైన సమాజానికి అవసరం. మనకు ఇలాంటి ప్రాథమిక కేంద్రం ఉండాలన్న హక్కు ఉంది. మనం వారి సేవలకి డబ్బు చెల్లిస్తున్నాం. తగిన సేవలు రాబట్టుకోవాల్సిన అవసరం ఉంది. కాబట్టి మన తృప్తి మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగానీ, ఉప-కేంద్రం పనిచేసేలా కలిసి కట్టుగా కృషి చేద్దాం! అందుకోసం చేయీ చేయీ కలుపుదాం!!




" నిన్నే చేర్చారతన్ని, - అప్పుడే ఠారెత్తి పారిపోతున్నాడు. పాపం అతని తప్పేం లేదు. ఈ హస్పటల్ పరిస్థితి ... అంత గొప్పగా వుంది.

# 10.2 కొన్ని ఆరోగ్య సూత్రాలు

**టీకాలు (అంటురోగాల నుంచి రక్షణ)**

★ సూక్ష్మ క్రిముల వల్ల వచ్చే వ్యాధులను చాలామటుకు నివారించగలిగే ముఖ్య పద్ధతి టీకాలు. ''వైరల్" వ్యాధులకు చికిత్స లేదు. టీకాల ద్వారా అవి రాకుండా నిరోధించగలం. ఉదాహరణకి ప్రపంచ వాప్తంగా మశూచి నిర్మూలన ఈ టీకాల వల్లనే సాధ్యమయ్యింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అంటువ్యాధులను టీకాల ద్వారా పూర్తి అదుపులో ఉంచారు.

★ ఈ క్రింది వైరల్ వ్యాధులకి టీకాలు లభిస్తాయి

- పోలియో
- మశూచి
- పొంగు
- రాబీస్ (పిచ్చికుక్క కాటుకు)
- గవదబిళ్ళలు (మంప్స్)
- రుబెల్లా
- హెపటైటిస్ -బి (రక్తం ద్వారా వచ్చే కామెర్లు)

★ బ్యాక్టీరియా వల్ల వచ్చే అనేక వ్యాధులను కూడా టీకాల వల్ల నివారించవచ్చు అవి

- డిఫ్తీరియా (కంఠసర్పి)
- కోరింత దగ్గు
- ధనుర్వాతం
- క్షయ
- టైఫాయిడ్
- కలరా

★ నివారింపతగిన అన్ని వ్యాధులనుంచీ మీ బిడ్డను కాపాడేందుకు టీకాలు వేయించండి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సి), ప్రభుత్వ ఆస్పత్రుల్లోను, టైఫాయిడ్, ఎం.ఎం.ఆర్, హెపటైటిస్ -బి వ్యాధులకు తప్ప, మిగిలిన అన్నింటికీ టీకాలు ఉచితంగా లభిస్తాయి. ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవడం ద్వారా మీ బిడ్డ ప్రాణాన్ని, మంచి ఆరోగ్యాన్ని సదా కాపాడుకోండి.

**టీకాల నిలువ**

★ అన్ని టీకా మందులను, సాధారణంగా $2^0$ సెంటీగ్రేడ్ నుంచి $4^0$ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత మధ్య నిల్వ ఉంచాలి. టీకా మందు ఉత్పత్తి అయిన దగ్గర నుంచి అది రోగి శరీరంలోకి వెళ్ళేదాకా దాన్ని పైన పేర్కొన్న ఉష్ణోగ్రతలోనే ఉంచి తీరాలి. దీన్ని ''కోల్డ్‌చైన్" అంటారు. ఈ విధానాన్ని అవలంభించకపోతే, అలాంటి టీకా మందు ఎందుకూ పనికిరాదు.

★ సాధారణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ, పిహెచ్‌సిల్లోనూ, వాటి ఉపకేంద్రాలల్లోనూ ఈ టీకా మందులను "కోల్డ్‌చైన్" విధానంలోనే భద్రపరుస్తారు. కాబట్టి అవి పని చేస్తాయని నమ్మవచ్చు. బయట కొనుగోలు చేసే టీకా మందులు, పైన పేర్కొన్న తక్కువ ఉష్ణోగ్రత భద్రపరిచే అవకాశం ఉండకపోవచ్చు. వేసవిలో మందుల షాపుల్లో కోల్డ్‌చైన్ అమలు కష్టం కావచ్చు. మీరు ఏదన్నా టీకా మందుకొనేముందు, అది "కోల్డ్‌చైన్" పద్ధతిన నిల్వ ఉంచారో, లేదో రూఢీగా తెలుసుకోండి. అది మీ బిడ్డ మంచి కోసమే. అనుమానం ఉంటే మీ వైద్యుని సలహాను తీసుకోండి.

★ నిపుణుల సిఫార్సు చేసిన టీకాల పట్టికను మీ కోసం .......పేజీలో ఇస్తున్నాం. అలాగా ఇంతవరకు టీకాలు వేయించని బిడ్డలకోసం వేరే టీకాలు పట్టికను అదే....... పేజీలో చూడవచ్చు.

★ డాక్టరు సలహామేరకు మీ బిడ్డకు హెపటైటిస్ -బి టీకాను ఇప్పించండి. హెపటైటిస్ -బి రక్తం ద్వారా సంక్రమించే తీవ్రమైన కామెర్ల వ్యాధి. ఈ వ్యాధి ఎయిడ్స్ వ్యాధిలాగానే వ్యాపిస్తుంది. అయితే దీనికి టీకా ఉంది. ఇది మూడు విడతలుగా తీసుకోవడం ముఖ్యంగా పిల్లల్లో చాలా మంచిది.

★ టీకాలు లభ్యమవుతున్న ఇతర వ్యాధులకు కూడా టీకాలని డాక్టర్ సలహామేరకు ఇప్పించండి. అయితే ఈ అదనపు టీకామందులు కొంచెం ఖరీదు ఎక్కువ. అదే ప్రభుత్వ ఆస్పత్రుల్లో లభ్యమయ్యే మామూలు టీకా మందులు ఉచితంగా అందుబాటులో ఉంటాయి.

★ ఎయిడ్స్‌లాంటి వ్యాధికి చికిత్సలేదు. ఈ వ్యాధి రాకుండా నిరోధించగలగడం ఒక్కటే చేయగలిగింది.

★ కుక్క, గబ్బిలం, నక్కలు కరవడం వలన రేబిస్ వ్యాధి వస్తుంది. అవి కరవగానే రేబిస్ వ్యాధినివారించేందుకు టీకాలు చేయించుకోవాలి. మిమ్మల్ని వీధి కుక్క లేదా పెంపుడు కుక్క ఏది కరిచినా వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళి ఇమ్యునైజేషన్ పూర్తి కోర్సు తీసుకోవడం మరవకండి.

★ రేబిస్ వ్యాధికి మాత్రమే రోగి శరీరంలో వ్యాధి క్రిములు ప్రవేశించినా టీకా వేయించడం సాధ్యపడుతుంది. టీకాలు ఇవ్వకపోతే ఆ వ్యాధి రోగి ప్రాణాలు తీస్తుంది. ప్రతిరోజు దాదాపు వందమంది పిల్లలు 'రేబిస్' వ్యాధి వలన మరణిస్తున్నారు. దయచేసి ఊరకుక్కలకి దూరంగా ఉండండి. మీ వీధిలోని ఊరకుక్కల్ని తొలగించమని మీ పురపాలక సంఘంపై ఒత్తిడి తీసుకురండి. మిమ్మల్ని, మీబిడ్డల్ని రక్షించుకోవడానికి ఖర్చులేని చికిత్స టీకాలు.

**రుమాటిక్ గుండె జబ్బు (ఆర్.హెచ్.డి)**

★ భారతదేశంలో ప్రతి ఏటా దాదాపు ఆరు లక్షలమంది ఈ వ్యాధి బారినపడుతున్నారు. ఈ వ్యాధి వలన గుండె కవాటాలు దెబ్బతింటాయి. వాటిని ఖరీదైన శస్త్రచికిత్స ద్వారా తిరిగి అమర్చవలసి ఉంటుంది. కొన్నిసార్లు ఖరీదైన వైద్యం కూడా రోగి ప్రాణాలను కాపాడలేదు.

★ అందుకు ఆర్‌హెచ్‌డి రాకుండానే నిరోధించగలగాలి. ''స్ట్రెప్టోకోకై'' (Streptococci)అనే బ్యాక్టీరియా వలన వచ్చే 'గొంతునొప్పి' (Sore throat) ఆర్‌హెచ్‌డి వ్యాధికి దారి తీస్తుంది. ఐదు నుంచి పదిహేను సంవత్సరాల వయస్సులోపు పిల్లలకి ఈ 'గొంతునొప్పి' వస్తే అది తరువాత దశలో ఆర్‌హెచ్‌డి వ్యాధికి దారి తీయవచ్చు. కొన్ని సంవత్సరాల తర్వాత మాత్రమే గుండె జబ్బు ఉన్నట్టు తెలుస్తుంది. గొంతునొప్పి వచ్చిన ప్రతి పిల్లాడికీ ఆలస్యం చేయకుండా వెంటనే యాంటీబయోటిక్స్ ఇప్పించాలి. దానివలన తదుపరి దశలో ఆర్‌హెచ్‌డి రాకుండా నివారించవచ్చు.

★ గతంలో 'గొంతునొప్పి' వచ్చిన బిడ్డకి, జ్వరం, కొద్దిగా కీళ్ళనొప్పులు ఉంటే వెంటనే వైద్య చికిత్స చేయించండి. ఈ జ్వరాన్ని ''రుమాటిక్'' జ్వరం అంటారు. దానికి తొలిదశలోనే చికిత్స చేస్తే గుండెకు జరిగే హానిని నివారించవచ్చు లేదా తగ్గించవచ్చు. ఈ జ్వరం కీళ్ళకి కాస్త ఇబ్బంది కలిగిస్తుంది. కానీ గుండెను నమిలేస్తుంది. దయచేసి మీ బిడ్డను సకాలంలో రక్షించుకోండి.

**పరిశుభ్రత**

★ పరిశుభ్రతను పాటించడం వలన చాలా రకాల అంటువ్యాధులను నివారించవచ్చు. నీటి వలన వ్యాపించే వ్యాధులు టైఫాయిడ్, హెపటైటిస్ 'ఎ' (కామెర్లు), పోలియో, వాంతులు, కలరా, డిసెంటరీ మొదలగునవి. కలుషిత నీటిని తాగితే మీ శరీరంలోకి చొరబడి అంటువ్యాధులకి దారి తీస్తుంది. చెత్తా, చెదారం కలుషిత నీటి ద్వారా ఈ వ్యాధులు సంక్రమిస్తాయి.

★ మీరు తినే ఆహారం, త్రాగేనీరు పరిశుద్ధంగా ఉండేందుకు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి

- క్లోరిన్ వేయడం ద్వారాను, ఫిల్టర్ చేయడం ద్వారా నీటిని కాచివడపోయటం వల్ల, నీటిని కాలుష్య రహితంగా ఉంచవచ్చు. మీరు త్రాగే నీరంతా పరిశుభ్రంగా ఉండాలని గుర్తుంచుకోండి. ప్రతిసారీ మంచినీరు త్రాగి, ఒక్కసారి కలుషిత నీరు తాగినా వ్యాధి రాకతప్పదు

- ఆహారాన్ని ఎవరు తయారు చేసినా అది శుభ్రంగా నిర్ధారించుకోండి. మలవిసర్జనకెళ్ళిన ప్రతిసారీ మీరు, పిల్లలు కూడా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి
- వంటవండే ముందు, తినేటప్పుడు, పాత్రను శుభ్రంగా (తాగే) మంచినీటితో కడగాలి
- పిల్లలు లేదా ఇతరులెవరైనా ఆహారాన్ని తినేటప్పుడుగానీ, వండేటప్పుడు గానీ చేతివేళ్ళకు పొడవాటి గోళ్ళు ఉండకూడదు. వాటిలో దుమ్ము పేరుకొని, అంటువ్యాధులకి దారి తీస్తుంది
- నీటి గ్లాసుల్లో వేళ్ళను ముంచరాదు
- వంటలను ఉత్తి చేతులతో వడ్డించరాదు
- తినేముందు పాలనుగానీ, ఆహారాన్ని గానీ, వేడిచేసి తినడం మంచిది

## ఓరల్ డీ హైడ్రేషన్

★ అంటువ్యాధుల వలన తరచూ పిల్లలు డయేరియా (విరేచనాలు)తో బాధపడుతూ ఉంటారు. కలుషిత ఆహారాన్ని, నీటిని, పాలను సేవించడం అంటువ్యాధులకి దారి తీస్తుంది. నోట్లో వేళ్లు పెట్టుకొని చీకడం, బొమ్మలను నోటితో కరచిపట్టు కోవడం లాంటి అలవాట్లు కూడా ఈ వ్యాధులకు కారణం. తల్లిదండ్రులు ఎంత శ్రద్ధ తీసుకొన్నప్పటికీ ఈ విరేచనాలను (డయేరియా) నివారించడం కష్టం.

★ విరేచనాలవల్ల అసౌకర్యం ఒక్కటే సమస్యకాదు. శరీరం నుంచి నీరు, లవణాలు విరేచనాల ద్వారా బయటకుపోతాయి. శరీరంలోని ద్రవ పదార్థాలు బయటకు పోవడం వలన, అది డిహైడ్రేషన్ దారితీయవచ్చు. సరైన సమయంలో వైద్యసహాయం అందకపోతే మనిషి ప్రాణాలు దక్కడం కూడా కష్టమే.

★ ఇలాంటి సందర్భాల్లో మందులూ, మాకులూ కన్నా, ముందుగా శరీరం నుంచి బయటకు వచ్చిన నీటిని, లవణాలని తిరిగి శరీరంలో భర్తీ చేయాలి. డయేరియా తొలిదశలో ఉన్నప్పుడు మీ బిడ్డ రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము. సమస్య తీవ్రంగా ఉంటే తక్షణం వైద్య సహాయాన్ని పొందండి.

- పిల్లలు వాంతి చేసుకోకుండా తాగినంత నీటిని, లవణాలని ఇవ్వండి. ఈ క్రింది ద్రవ పదార్థాలను కూడా ఇవ్వవచ్చు

- మజ్జిగ
- ఉప్పు కలిపిన గంజి
- కొబ్బరి నీళ్ళు
- తేలికపాటి టీ

- ఇంట్లో ఈ క్రింది వస్తువులను ఉపయోగించి మిశ్రమాన్ని సిద్ధం చేసుకొని తరచు పిల్లవానికి ఇవ్వవచ్చు
  - ఒక లీటర్ నీళ్ళు
  - ఒక టీస్పూన్ ఉప్పు (5 గ్రా)
  - 8 టీస్పూనుల పంచదార (40 గ్రా)
  - వీలైతే ఒక నిమ్మకాయ రసం
- డయేరియా ఎక్కువకాలం కొనసాగితే అది డీహైడ్రేషన్‌కి దారి తీయవచ్చు. అప్పుడు ఈ క్రింది పేర్కొన్న విధంగా మిశ్రమాలను చేసి పిల్లవానికి ఇవ్వవచ్చు
  - గ్లూకోజు - 20 గ్రా
  - ఉప్పు - 3.5 గ్రా
  - ట్రైసోడియం సిట్రేట్ -3 గ్రా లేదా సోడియం బైకార్బోనేట్ - 2.5 గ్రా
  - పొటాషియం క్లోరైడ్ - 1.5 గ్రా
  - వీటిని ఒక లీటరు నీటిలో కలిపి కొద్ది కొద్దిగా తాగించాలి.
- డయేరియా ఉన్న పిల్లలకి పాలు ఇవ్వవద్దు. పాలలో బ్యాక్టీరియా అధికంగా పెరిగే అవకాశం ఉంది. అది మరిన్ని సమస్యలను తెచ్చిపెట్టవచ్చు
- గ్లూకోజ్ కలిపిన 'లవణాలు' బజారులో వివిధ బ్రాండ్‌ల పేరిట దొరుకుతాయి. వాటిని కూడా పిల్లలకి పట్టించవచ్చు
- సమస్య తీవ్రమైనప్పుడు తక్షణం వైద్య సహాయం పొందండి.
  వైద్య సహాయం అందేవరకూ పైన చెప్పిన విధంగా మీ బిడ్డకి నీరు, లవణాలు అందిస్తూ ఉండండి.

**శానిటేషన్ (పారిశుధ్యం)**

★ భారతదేశంలో బహిరంగ మల విసర్జన ఎక్కువగా ఉండటమే అంటువ్యాధులు వ్యాపించడానికి ప్రధాన కారణం. దేశంలో అధిక శాతం మంది ప్రజలకి సరైన మరుగుదొడ్లు లేవు. ఫలితంగా మలిన పదార్ధాలు దుమ్ములోను, నీటిలోను, ఆహారంలోను చేరి వ్యాధులకు దారితీస్తున్నాయి.

- ప్రతి పౌరునికి ఈ క్రింది కారణాల వలన సరైన మరుగుదొడ్ల అవసరం ఉంది
  - పరిశుభ్రత, ఆరోగ్యం
  - సౌకర్యం
  - ప్రజల హుందాతనం
  - వెగటు కలగకుండా ఉండటం

★ ఆధునికంగా, శుభ్రంగా ఉండే మరుగుదొడ్డి నిర్మించడం పెద్ద ఖర్చుతోకూడుకొన్న పనికాదు. వీటిలో సాధారణ మోడల్ నిర్మాణానికి రూ. 3000/- కన్నా ఎక్కువ ఖర్చుకాదు. ప్రకృతి సహజంగా, మలం బ్యాక్టీరియా కారణంగా విచ్ఛిత్తి చెందుతుంది. ఇలా విచ్ఛిత్తి చెందిన మలం సెప్టిక్ ట్యాంక్‌లో కొంత కాలం తర్వాత పూర్తిగా విచ్ఛితి చెంది ఎరువుగా మారుతుంది. ఈ ప్రకృతి లక్షణాన్ని వినియోగించి తక్కువ ఖర్చుతో మరుగుదొడ్లను ప్రతి ఇంట్లోనూ ఏర్పాటు చేసుకోవచ్చు.

★ దురదృష్టవశాత్తు, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డిని ఏర్పాటు చేసే ప్రయత్నమేమీ మన దేశంలో జరగలేదు. చవకగా, శాస్త్రీయపద్ధతిలో మరుగుదొడ్ల నిర్మాణానికి వీలవుతుందని ప్రజలకు తెలియక, వారు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాక ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో ప్రజా చైతన్యం తీసుకురావడానికి మనమంతా కృషి చేయాలి. ప్రతి ఇంటికీ శుభ్రమైన మరుగుదొడ్డి ఉండేలా చూడాలి.

★ మొత్తం అందరికీ మరుగుదొడ్లు నిర్మించడానికి, శాశ్వతంగా ఈ సమస్య పరిష్కారానికి ఒక సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 20శాతం మాత్రమే ఖర్చు అవుతుంది.

★ వేలాది కోట్ల రూపాయల్ని జీతభత్యాల కోసం, ఎన్నో పథకాల కోసం ఖర్చుపెడుతున్నది ప్రభుత్వం. ఒక్క ఏడాదిలో గాని, నాలుగైదు ఏళ్ళలో కలిపి గాని రూ.3000 కోట్లు ఖర్చు పెడితే మరుగు దొడ్ల సమస్యని రాష్ట్రమంతటా శాశ్వతంగా పరిష్కరించవచ్చు.

★ మరుగుదొడ్లు ఉన్నచోట వాటిని ఈ క్రింది విధంగా వాడాలి

- మురుగు కాలువలు ఉంటే, మరుగుదొడ్లని వాటికి కలపాలి
- వినియోగించిన టాయ్‌లెట్‌పేపర్‌ను, నీటిని తప్ప మరిదేన్ని మరుగుదొడ్లలో 'ఫ్లష్' చేయరాదు. కాగితం, దూది, శానిటరీ ప్యాడ్స్, ప్లాస్టిక్ వగైరా కాలువలకి అడ్డుగా ఉండి, మురుగు కాలువలు పొంగిపొర్లుతాయి
- సరిగ్గా నీటిని కొట్టడం, ఎప్పటికప్పుడు టాయ్‌లెట్ పెనాన్ని శుభ్రం చేయడం తప్పని సరి
- 'సెప్టిక్ ట్యాంక్' కు జతచేయబడ్డ మరుగుదొడ్లను యాంటీసెప్టిక్ పదార్థాలైన డెట్టాల్ తదితర వాటితో శుభ్రం చేయరాదు. దీనివల్ల మలవిచ్ఛిత్తి చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. సబ్బు పౌడర్ మాత్రం వాడవచ్చు

**కొన్ని సాధారణ ఆపోహలు**

★ ఆరోగ్య విషయాల్లో ఇప్పటికీ అనేక మూఢనమ్మకాలు ఉన్నాయి. ఇవన్నీ అబద్ధాలు. వీటని నమ్మకూడదు. వాటిగురించి సరైన విధంగా, శాస్త్రీయ పద్ధతిలో వివరణ ఇవ్వాలి. దయచేసి ఈ క్రింది వాటిని గమనించండి.

- పప్పుధాన్యాలను తినడం వల్ల చీము పడుతుందని ఒక నమ్మకం. శరీరం నిర్మాణానికి అవసరమైన ప్రొటీన్లు ఉండే పప్పుధాన్యాలను తినడం మంచిది. ఇవి రోగాలతో పోరాడి, వాటిని తగ్గిస్తాయి
- జ్వరంతో బాధపడుతున్న వ్యక్తిని, లంకణం పరమ ఔషధం అని చెప్పి, తిండి పెట్టకుండా మాడ్చకూడదు. ఒక్క టైఫాయిడ్, జాండిస్ (కామెర్లు) వచ్చినప్పుడు తప్ప, మిగిలిన అన్ని సందర్భాల్లోనూ మంచి పౌష్టికాహారాన్ని ఇవ్వాలి. దానివలన వ్యాధితో పోరాడటానికి రోగికి మంచి శక్తి లభ్యమవుతుంది
- ప్రకృతి సిద్ధమైన అన్ని రకాల పండ్లు, వండిన పదార్థాలను తినవచ్చు. కొన్ని రకాలైన కాయకూరలు మాత్రమే తినాలని ఎక్కడా లేదు. పథ్యం పేరుతో దేన్నీ విసర్జించనక్కర్లేదు
- మీకు తగిలిన గాయాన్ని ఎప్పుడూ శుభ్రమైన నీటితో, సబ్బు ఉపయోగించి శుభ్రపరచాలి. అవసరం అని భావిస్తే టించర్ ఐడిన్‌ను వాడాలి. గాయం మీద మట్టి, ఆవుపేడ లాంటి వాటిని వేయవద్దు. దానివల్ల ధనుర్వాతంలాంటి వ్యాధులు రావచ్చు.
- కాలిన గాయంపై తక్షణం చల్లటి నీటిని పోయాలి. దీని వలన గాయం తీవ్రతని తగ్గించవచ్చు. పాతకాలపు చిట్కాల పేరిట, వెన్ననిగానీ, నూనెనుగానీ, నవనీతాన్ని గానీ కాలిన గాయానికి పూయవద్దు
- యాంటీబయోటిక్స్‌ను వైద్య సలహా లేకుండా యథాలాపంగా వాడరాదు. అనవసరంగా వాడినా, చాలినంత వాడకపోయినా, సరిగా వినియోగించకపోయినా యాంటీబయోటిక్స్ వల్ల ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉంది

\- రోగికి పడకపోతే, ప్రమాదకర రియాక్షన్ రావచ్చు

\- అనవసరంగా మందులు వాడితే వృథా ఖర్చు; అంతేకాదు చిన్న పేగుల్లో మనకు మేలుచేసే సూక్ష్మ క్రిములను చంపే ఈ అనవసర మందుల వాడకం శరీరాన్ని బలహీన పరుస్తుంది.

- ఈ యాంటీబయోటిక్‌ని సరిగా వాడకపోయినా, తగినంత మోతాదులో వాడకపోయినా శరీరంలో వీటిని తట్టుకునే క్రిములు ప్రవేశిస్తాయి. ఆ రోగితో పాటు, సమాజమూ నష్టపోతుంది.

- పాతకాలంనాటి పద్ధతి ప్రకారం పిల్లలకి/ పెద్దలకి సుఖ విరేచనానికి ఆముదం వాడతారు. అది మంచిది కాదు. అనవసరం కూడా. దాని వల్ల ప్రేగుల్లో విపరీతమైన అవసరంలేని కదలిక ఏర్పడి, తీవ్ర పరిణామాలకు, వ్యాధులకు దారితీయొచ్చు




"ఇదిగోనయ్యా", నీకు మంజూరయిన రూ.5000 సబ్సిడీలు, ఖర్చులు పోగా మిగిలిన రూ.98. మిగతా డబ్బంతా ఈ లోను కోసం సాయం జేసిన ఆఫీసర్లకి పంచాను.

## పిల్లలకి సిఫార్సు చేసిన టీకా మందులు

| వయస్సు | వెయ్య వలసిన టీకా మందులు |
|---|---|
| పుట్టినప్పుడు | జోరో పోలియో చుక్కలు, బిసిజి |
| 2 నెలలు | డిపిటి, ఓపివి1 |
| 3 నెలలు | డిపిటి, ఓపివి2 |
| 4 నెలలు | డిపిటి, ఓపివి3 |
| 9 నెలలు | పొంగు నిరోధక టీకాలు |
| 12 నెలలు | హెపటైటిస్ -బి (3 డోసులు) మొదటి డోసు తరువాత ఒక మాసానికి, ఆరునెలల తరువాత ఈ డోసును వాడాలి. |
| 15 నెలలు | ఎమ్ ఎమ్ ఆర్, డిపిటి, ఓపివి (బూస్టర్) |
| 2 సంవత్సరాలు | టైఫాయిడ్ (2 డోసులు) ఒకనెల వ్యవధిలో రెండుసార్లు |
| 5 సంవత్సరాలు | డిపిటి, పోలియో |
| 10 సంవత్సరాలు | టిటి |
| 16 సంవత్సరాలు | టిటి |
| ప్రతి ఐదు సంవత్సరాలకి ఒకసారి | టిటి |
| గర్భిణీ స్త్రీలకి | మొదటి నెలలో ఒకసారి టిటి, రెండు నెలల వ్యవధి తరువాత మరోసారి టిటి. |

## టీకాలు వేయించని పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలు

| | 1నుంచి 5 సంవత్సరాలలోపు | 5 సంవత్సరాలకు పైబడి |
|---|---|---|
| తొలిసారి | బిసిజి, డిపిటి, ఓపివి | డిటి |
| రెండోసారి (4 - 8 వారాలలోపు) | డిపిటి, ఓపివి | డిటి, బిసిజి |
| మూడోసారి (4 - 8 వారాలలోపు) | డిపిటి, ఓపివి, పొండు | |
| ఒక సంవత్సరం తరువాత | డిపిటి, ఓపివి | డిటి |
| రెండు నుంచి మూడు సంవత్సరాల తరువాత | టైఫాయిడ్ రెండు డోసులు | టైఫాయిడ్ రెండు డోసులు |



''ఎందుకు చెత్తంతా ఎత్తేస్తున్నారు. ముఖ్యమంత్రి గారేమన్నా సర్‌ప్రైజ్ ఇన్‌స్పెక్షన్‌కి వస్తున్నారా?''



'' నేను నా ప్రజలకి దగ్గరవ్వాలి. నగటు మనిషిలాగా బతికి, వాళ్ళు తినేదే తింటాను.'' అని వెళ్ళి రెండు రోజులన్నా గడపలేదు డాక్టరుగారూ!''

# 11.1 వివాహ రిజిస్ట్రేషన్

★ మీరు రిజిస్టర్ పెళ్ళి చేసుకోవాలంటే మీ ప్రాంత వివాహాల సబ్-రిజిస్ట్రార్‌ను కలవాలి. ఆస్తి విక్రయ పత్రం మొ॥ వాటిని రిజిస్టర్ చేసేది కూడా ఈయనే.

★ మీరు కనుక హిందూ వివాహం చేసుకోవాల్సి వస్తే ఈ క్రింది పద్ధతిని అనుసరించాలి

- పెళ్ళికొడుకు వయసు కనీసం 21 సంవత్సరాలు, పెళ్ళికూతురు వయస్సు కనీసం 18 సంవత్సరాలు ఉండాలి
- ఫారం ఎ (దయచేసి 187 పేజీని చూడండి)లో దరఖాస్తును నింపి, సబ్-రిజిస్ట్రార్‌కి అందజేయాలి
- రిజిస్ట్రేషన్ రుసుము పదిరూపాయలు
- మీరు ఇద్దరు సాక్షులతో (వీలైతే ఉభయుల తల్లిదండ్రులు) సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్ళాలి
- పెళ్ళి శుభలేఖను, ఫొటోలు మొదలైన వాటని సాక్ష్యంగా మీరు అందచేయాలి
- పెళ్ళి జరిగిన ఆరునెలల లోపల పై విధంగా దరఖాస్తు చేస్తే సబ్-రిజిస్ట్రార్ వివాహాన్ని రిజిస్టర్ చేస్తారు

★ వివాహం జరిగిన ఆరునెలల తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోదలిస్తే మీ జిల్లా రిజిస్ట్రార్‌కి, ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ దరఖాస్తు (దరఖాస్తు కోసం188 పేజీని చూడండి) చేయాలి. పెళ్ళి అయిన మూడు సంవత్సరాల తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోదలిస్తే, పై ఫారమ్‌లోనే హైదరాబాద్‌లోని ఇన్‌స్పెకర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌కు ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ దరఖాస్తు చేయాలి.

**వివాహ వేదిక వద్ద రిజిస్ట్రేషన్**

★ వివాహ వేదిక వద్దనే మీరు రిజిస్టర్ చేసుకోవలిస్తే, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసి, సబ్- రిజిస్ట్రార్‌ను వేదిక వద్దకి రావాల్సిందిగా కోరాలి. ఇందుకుగాను ఈ క్రింది పేర్కొన్న విధంగా రుసుము చెల్లించాలి.

- దరఖాస్తు ఫీజు పదిరూపాయలు
- రుసుము పదిహేను రూపాయలు - రిజిస్ట్రార్‌కు రవాణా ఖర్చులు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి దూరంగా వేరే ఊళ్ళో వేదిక ఉంటే, సబ్ రిజిస్ట్రార్‌కి, ప్రభుత్వం నిర్దేశించిన దినసరి బత్తెం చెల్లించాలి

## ప్రత్యేక వివాహాల చట్టం పరిధిలోని వివాహాల రిజిస్ట్రేషన్

★ మతపరంగా, వివాహం జరగనప్పుడు అలాంటి వివాహాన్ని ప్రత్యేక వివాహాల చట్టం ప్రకారం రిజిస్టర్ చేయవచ్చు. ఇలాంటి వివాహాలని, పెళ్ళిరోజే రిజిస్టర్ చేయాలంటే, ఇందుకోసం కనీసం ఒకనెల ముందుగా రిజిస్ట్రార్ కార్యాలయంలో తెలియజేయాలి. ఈ క్రింది అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

- పెళ్ళి కూతురు వయసు 18, పెళ్ళికొడుకు వయసు 21 సంవత్సరాలు ఉండాలి. వయస్సును నిర్ధారించే ధృవపత్రాన్ని జతచేయాలి
- దరఖాస్తు రుసుము పదిరూపాయలు చెల్లించాలి
- నోటీసు ఫీజుగా రెండు రూపాయలు చెల్లించాలి
- ఈలోగా, ఈ వివాహంపై ఎవరికన్నా అభ్యంతరాలు ఉంటే వాటిని తెలియజేసేందుకు, సబ్‌రిజిస్ట్రార్ తన కార్యాలయం నోటీసుబోర్డుపైన ఒక నోటీసు అంటిస్తారు. ఈ నోటీసు 30 రోజులపాటు ప్రజలు చూడడం కోసం అందుబాటులో ఉంటుంది.
- అభ్యంతరం వ్యక్తం చేయదలచిన వ్యక్తి, అభ్యంతర రుసుము యాభై రూపాయలను చెల్లించి, తగిన కారణాలను చూపుతూ పిటిషన్ వేయాలి. (ఉదా: పెళ్ళికుమారుడు/ కుమార్తెలకి ఇంకా వివాహవయసు రాలేదని/ బలవంతపు వివాహమని/ ఇద్దరిలో ఒకరికి ఇదివరలోనే పెళ్ళి జరిగిందని)
- ఈ పిటిషన్‌పై సబ్ రిజిస్ట్రార్ విచారణ జరిపించి, పిటిషన్‌లోని ఆరోపణలు నిజమని తేలితే, వివాహ రిజిస్ట్రేషన్ కోసం చేసుకున్న దరఖాస్తును తిరస్కరిస్తారు
- ఎలాంటి సబబైన అభ్యంతరాలూ రాకపోతే, 30 రోజుల తర్వాత వివాహాన్ని రిజిస్టర్ చేస్తారు

★ వివాహం తర్వాత కూడా, హిందూవివాహ రిజిస్ట్రేషన్ తరహాలో, ప్రత్యేక వివాహాల చట్ట పరిధిలో రిజిస్టర్ చేసుకోవచ్చు. అయితే ఇందుకు ప్రత్యేక దరఖాస్తు ఉంది. సాక్షులు ఉండాలి. పెళ్ళి జరిగినట్టు రుజువు ఉండాలి.

# పాస్‌పోర్టు

పాస్‌పోర్టు ప్రతి పౌరుడి హక్కు. విదేశాల్లో పర్యటించడానికి పాస్‌పోర్టు తప్పనిసరి. పౌరసత్వపు రుజువు పాస్‌పోర్టు. మీరు పర్యటించే దేశాల పర్మిట్లు లేదా వీసాలు పాసుపోర్టుతో పాటు ఉంటాయి.

**పాస్‌పోర్టుకి దరఖాస్తు చేయడం ఎలా?**

ఈక్రింది తెలిపిన చోట్ల రూ 10/- చెల్లించి పాస్‌పోర్టు దరఖాస్తు పొందవచ్చు

1) దేశంలోని అన్ని పాస్‌పోర్టు కార్యాలయాలు

2) ఎంపికచేసిన తపాలా కార్యాలయాలు

3) జిల్లా కలెక్టర్ కార్యాలయాలు

4) అధీకృత టూర్, ట్రావెల్ ఏజెన్సీలు

5) అధీకృత ప్రచురణా సంస్థలు

6) ఎంపిక చేసిన ఇ-సేవా కేంద్రాలు (ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే)

www.passport.nic.in వెబ్‌సైట్ నుండి దరఖాస్తు పొందవచ్చు. అయితే ఇండెక్స్ కార్డ్‌ను మాత్రం పాస్‌పోర్ట్ కార్యాలయం నుండి తీసుకొని జతపర్చాలి.

**దరఖాస్తుతోపాటు జతపరచవలసినవి**

**పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం:** ఎస్ఎస్‌సి లేదా స్కూల్‌ఫైనల్ నుండి పొందిన బదిలీ సర్టిఫికెట్ కాని, మార్కుల జాబితా కాని జతపరచాలి. నిరక్షరాస్యులైతే నోటరీ ద్వారా అఫిడవిట్ జతచేయాలి.

**నివాసధృవీకరణ పత్రం :** దీని కోసం, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, టెలిఫోన్ బిల్లు, కరెంటుబిల్లు, మంచినీటి కుళాయిబిల్లు, ఓటరు గుర్తింపు కార్డు, ఆదాయపు పన్ను మదింపు పత్రాలు కానీ (గత మూడుసంవత్సరాలు) తహసీల్‌దారు లేదా సంబంధిత అధికారులు జారీ చేసిన నివాసధృవీకరణ పత్రం కానీ జత చేయాలి.

**ఫోటోలు :** ఇటీవల తీయించి ఉన్న కలర్ ఫొటోలు 7 అవసరం అవుతాయి. పోలరాయిడ్ కెమెరా, డిజిటల్ కెమెరాతో తీసిన ఫోటోలు ఉపయోగించకూడదు. తప్పనిసరిగా నెగెటివ్ నుంచి ప్రింట్ చేసిన ఫొటోలు మాత్రమే ఉపయోగించాలి. ఫోటో తీయించుకునేటప్పుడు నల్లకళ్ళద్దాలు పెట్టుకోకూడదు, నిండురంగు బట్టలు వేసుకోకూడదు, కెమెరా వైపు చూస్తూ ఉండాలి, ఫోటోలు 3.5 సెం.మీ × 3.5 సెం.మీ సైజులో ఉండాలి.

**రుసుము :** సంబంధిత రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి పేరిట డి.డి ద్వారా నిర్ణీత రుసుము చెల్లించాలి. దరఖాస్తును స్వయంగా అందజేసేటట్లయితే పాస్‌పోర్ట్ కార్యాలయానికి నగదు కౌంటర్‌లో కూడా చెల్లించవచ్చు.

**నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ( యన్.ఓ.సి ) :** ప్రభుత్వోద్యోగులు, పబ్లిక్ సర్వెంట్ నిర్వచనంలోకి వచ్చేవారు, సంబంధిత శాఖలోని ఉన్నతాధికారి నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని జతపరచాలి.

**ఫీజు వివరాలు :**

10 సంవత్సరాల కాలపరిమితి గల కొత్త పాస్‌పార్టు కోసం (36 పేజీలు) -రూ. 1000/-

10 సం॥ కాలపరిమితి గల కొత్త పాస్‌పోర్టు కోసం (60 పేజీలు) -రూ. 1500/-

15 సం॥ లోపు వయసుగల వారికి 5 సం॥ కాలపరిమితి -రూ. 600/-

పాత/పోగొట్టుకున్న పాస్‌పోర్టు స్థానంలో మరొకదాని కోసం (36 పేజీలు)-రూ.2,500/-

పాత/ పోగొట్టుకున్న పాస్‌పోర్టు స్థానంలో మరొకదాని కోసం (60 పేజీలు)-రూ. 500/-

**తత్కాల్ పథకం ద్వారా :**

10 రోజులలోపు పాస్‌పోర్టు కావాలంటే -రూ. 1500/-

11 నుండి 35 రోజులలోపు కావాలంటే -రూ. 1000/-

డూప్లికేట్ పాస్‌పోర్టు 10 రోజుల లోపు కావాలంటే -రూ. 2,500/
-

11 నుండి 35 రోజుల లోపు కావాలంటే -రూ. 1500/-

గడువు పూర్తయిన పాస్‌పోర్టు స్థానంలో కొత్త దాని కోసం

10 రోజులలోపు కావాలంటే -రూ. 1500/-

11 - 35 రోజులలోపు కావాలంటే -రూ. 1000/-

**దరఖాస్తును ఎక్కడ సమర్పించాలి ?**

పూర్తి చేసిన దరఖాస్తులను ఈ క్రింద తెలిపిన కార్యాలయాల వద్ద ఎక్కడైనా అందజేయవచ్చు

1) దేశంలోని అన్ని పాస్‌పోర్టు కార్యాలయాలు

2) ఎంపికచేసిన తపాలా కార్యాలయాలు

3) ఇ-సేవా కేంద్రాలు (ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే)

4) జిల్లా కలెక్టర్ కార్యాలయాలు

పోస్ట్ ద్వారా దరఖాస్తు చేసేవారు ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాలకు పంపించాలి.

# 11.3 డ్రైవింగ్ లైసెన్సు

★ డ్రైవింగ్ లైసెన్స్‌కి అర్హత పొందాలంటే ఈ క్రింది నిబంధనలను పాటించాలి

- మీకు 18 సంవత్సరాలు కనీసం ఉండాలి
- మీరు డ్రైవింగ్‌లైసెన్సు కోసం దరఖాస్తు చేసిన ప్రదేశంలో నివశిస్తూ ఉండాలి. లేదా అక్కడ వ్యాపారం చేస్తూ ఉండాలి
- ముందుగా నేర్చుకునే (లెర్నర్) లైసెన్సు పొందాలి
- డ్రైవింగ్ నేర్చుకొన్న తర్వాత, శాశ్వత లైసెన్స్‌కి దరఖాస్తు చేయాలి. మోటారు వాహనాల ఇన్స్‌పెక్టర్ (ఎం.వి.ఐ) నిర్వహించే "డ్రైవింగ్ టెస్ట్" లో విజయం సాధించాలి
- అప్పుడు ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్‌టిఓ) శాశ్వత లైసెన్సును ఇస్తారు

**లెర్నర్ లైసెన్సును పొందటం ఎలా ?**

★ నిర్దిష్ట ఫారంలో (ఫారం 2 కొరకు 191 పేజీలో చూడండి) లెర్నింగ్ లైసెన్స్ కొరకు ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్‌టిఒ)కి మీరు దరఖాస్తు చేయాలి. ఆ దరఖాస్తు ఫారాన్ని జాగ్రత్తగా, తప్పులు లేకుండా నింపి, ఈ దిగువ తెలిపిన అంశాలతో సహా, ఆర్‌టిఒకి అందజేయాలి.

- ఇటీవలే తీయించుకున్న మూడు పాస్‌పోర్టు ఫొటోలు (5సెం.మీ × 6సెం.మీ)
- వివిధ రకాల వాహనాలకీ ఒక్కొక్క రకానికి 60 రూపాయల ఫీజును చలాన్/రసీదు రూపంలో చెల్లించాలి
- రేషన్ కార్డు కాపీ (కార్డులేనివారు, మరే ఇతర నివాస ధృవపత్రాన్నైనా సమర్పించవచ్చు)
- జనన ధృవ పత్రం కాపీ (డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, వయసు రుజువు)
- విద్యార్హత పత్రం పాఠశాల/ కళాశాల/ విశ్వవిద్యాలయం ఇచ్చినవి
- ఆరోగ్యం దృఢంగా ఉన్నట్టు వైద్య ధృవీకరణ సర్టిఫికెట్టు, దాన్ని ఫారమ్ -1(ఏ) లో వైద్యుడు జారీ చేయాలి
- రవాణా వాహనాల కోసం ఫారమ్ -1(ఎ) ని వినియోగించాలి. (దయచేసి 190 పేజీ చూడండి) ఇతరులు ఇదే ఫారంలో చూపిన విధంగా స్వీయ ప్రకటన ఇవ్వవచ్చు

★ లెర్నర్ లైసెన్స్ 180 రోజుల చెల్లుబాటు అవుతుంది. శాశ్వత లైసెన్సుకు దరఖాస్తు చేసేముందు, మీకు సంపూర్ణంగా డ్రైవింగ్ వచ్చి, ట్రాఫిక్, డ్రైవింగ్ నిబంధనలన్నీ క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకి, తేలిక, మధ్య, భారీ వాహనాలకి లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్సుల్లో వ్యత్యాసం ఉంటుంది.

**శాశ్వత లైసెన్సు**

★ శాశ్వత డ్రైవింగ్ లైసెన్సు పొందడానికి, ఫారమ్ -4లో (దయచేసి 192 పేజీని చూడండి) ఆర్.టి.ఓ.కి దరఖాస్తు చేయాలి. ఈ దరఖాస్తుతో పాటు ఈ క్రింది అంశాలు సైతం జతచేయాలి.

- 30 రోజుల ముందుగా జారీచేసి, అమలులో ఉన్న లెర్నింగ్, అమలులో ఉన్న లెర్నింగ్ లెర్నింగ్ లైసెన్స్
- ఇటీవల తీయించుకున్న 4 పాస్‌పోర్టు ఫోటోలు
- రూ. 390/- చలానా ఫీజు
- ప్లాస్టిక్ కార్డుకోసం రూ. 25/- చలానా
- పరీక్షా (టెస్ట్) ఫీజుగా రూ. ........../- చలానా (ఒక్కో రకం వాహనానికి విడివిడిగా)
- లెర్నింగ్ లైసెన్స్ దరఖాస్తుతోపాటు అందజేసిన అన్ని డాక్యుమెంట్లు

★ మీరు మీ ప్రాంతీయ ఆర్.టి.ఒ. కార్యాలయంలో మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ వద్ద డ్రైవింగ్ పరీక్షకి హాజరు కావాలి. మీరు ఏ రకమైన వాహనం డ్రైవింగ్ కోసం దరఖాస్తు చేసారో, అలాంటి వాహనాన్ని మంచి కండిషన్‌లో ఉంచి తీసుకొని వెళ్ళాలి. మీరు గనుక డ్రైవింగ్ టెస్ట్‌లో పాసయితే మీకు డ్రైవింగ్ లైసెన్స్ జారీ అవుతుంది.

**రెన్యువల్**

★ డ్రైవింగ్‌లైసెన్స్ సాధారణంగా 20 సంవత్సరాల వరకు లేదా 50 సంవత్సరాల వయస్సు వరకూ చెలామణిలో ఉంటుంది. ప్రతి పది సంవత్సరాల అనంతరం లైసెన్సు రెన్యువల్ కోసం అందచేయాలి. రెన్యువల్ చివరి తేదీ లోపుగాని, లేదా తేదీ అయిన 30 రోజుల్లో గాని దరఖాస్తు చేయాలి.,

- రెన్యువల్ కోసం ఫారమ్ నం.9లో దరఖాస్తు చేయాలి. దీనితోపాటు ఫీజు రూ. 15/- చలానా రూపంలో చెల్లించాలి. మూడు తాజా పాస్‌పోర్టు ఫోటోలను ఇవ్వాలి.
- రెన్యూవల్ తేదీ ముగిసిన 30 రోజుల తర్వాత రెన్యువల్ కోసం దరఖాస్తు చేస్తే అదనపు ఫీజును చెల్లించాలి. రెన్యువల్ తేదీ ముగిసిన ఐదు సంవత్సరాల తర్వాత, రెన్యువల్ కోసం దరఖాస్తు చేస్తే మీరు మళ్ళీ తాజాగా డ్రైవింగ్ టెస్టులో పాల్గొనాలి.
- మీకు 50 సంవత్సరాలు దాటితే డాక్టర్ ఇచ్చే సర్టిఫికెట్‌తో సహా రెన్యువల్ కోసం దరఖాస్తు చేయాలి

**అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్**

★ మీరు విదేశాల్లో వాహనం నడపదలచుకుంటే, అందుకు అంతర్జాతీయ డ్రైవింగ్

లైసెన్స్‌ని పొందాలి. అంతర్జాతీయంగా డ్రైవింగ్ లైసెన్స్ విషయంలో ఒప్పందం కుదుర్చుకొన్న దేశాల్లో, ఏడాది పాటు ఈ లైసెన్సు అమలులో ఉంటుంది. మీ అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా, అనేక దేశాల్లో మీరు తాత్కాలిక డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందాల్సి ఉంటుంది. విదేశాల్లో డ్రైవింగ్ చేసేముందు, ఆయా దేశాల్లోని డ్రైవింగ్ నిబంధనలని తెలుసుకోండి.

★ అంతర్జాతీయ లైసెన్స్ కోసం ఆర్.టి.ఒకి నిర్దిష్ట ఫారంలో (దయచేసి 195 పేజీని చూడండి) ఈ క్రింది వాటిని జతపరచి దాఖలు చేయాలి

- ఇటీవలి మూడు పాస్‌పోర్టు ఫోటోలు
- భారతీయ డ్రైవింగ్ లైసెన్సు
- పాస్‌పోర్టు

★ డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం, అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌ను జారీ చేస్తారు.

★ **డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించిన ఫారాలు, ఫీజు**

| | **కావాల్సిన ఫారాలు** | |
|---|---|---|
| **ఏ లైసెన్సు** | **ఇతర డాక్యుమెంట్లు** | **ఫీజు** |
| లెర్నర్ లైసెన్స్ | ఫారమ్ -2, ఫారమ్ -1<br>వయసు రుజువు, నివాసం రుజువు | రూ. 60/-<br>అదేరోజు |
| కొత్త లైసెన్స్ | **నివాస రుజువు**<br>ఫారం -4<br>లెర్నర్ లైసెన్స్ | **ప్రతి రకానికి**<br>లైసెన్స్ రూ. 390/-<br>అదేరోజు |
| రెన్యువల్ | ఫారం -9<br>ఫారం -1ఎ<br>(50 సంవత్సరాలు దాటినా/<br>రవాణా వాహనాలకయినా)<br>ఫారం -1 (ఇతరులకీ) | రూ. 330/-<br>అదేరోజు |
| అంతర్జాతీయ లైసెన్సు | ఐ.డి.టి ఫారం<br>పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, 3 ఫోటోలు | రూ. 350/- |

- ★ డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందటంలో ఏ ఇబ్బంది ఎదురైనా, విపరీత జాప్యం జరిగినా ఆర్‌టిఒను లేదా రవాణా విభాగ అసిస్టెంట్ కమిషనర్ లేదా డిప్యూటీ కమిషనర్‌ను కాని కలవండి.
- ★ ఇంకా మీకు సరైన సేవలు లభించకపోతే, దయచేసి స్థానిక లోక్‌సత్తా /పార్టీ శాఖ లేదా జిల్లా శాఖను లేదా ప్రధాన కార్యాలయాన్నిగాని సమాచారం కోసం, మార్గదర్శకత్వం కోసం సంప్రదించండి.

**"నా కోసం నేను చేసుకోకపోతే, మరెవరు చేస్తారు? నేను నా కోసం మాత్రమే చేసుకుంటే, అసలు నేనెవర్ని? ఇప్పుడు కాకపోతే మరెప్పుడు"**

**- ఒక హిబ్రూ రుషి**

# 11.4 ప్రమాదాలు - పౌరుల పాత్ర

★ వాహనాల రద్దీ పెరుగుతున్న కొద్దీ, ప్రమాదాల సంఖ్య పోటీపడి పెరుగుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే, మన దేశంలోని వాహనాల వేగం తక్కువ. అయినా ప్రతి వెయ్యి వాహనాలకి సగటున లెక్కిస్తే ప్రపంచం మొత్తం మీద భారత్‌లోనే ప్రమాదాలు ఎక్కువ. ప్రమాదాల్లో మరణాలూ ఎక్కువే.

★ ప్రతియేటా మనదేశంలో దాదాపు లక్షమంది పౌరులు వాహనాల ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులే ఎక్కువగా ఉన్నారు. మెరుగైన రోడ్లు, ట్రాఫిక్ నిబంధనలకి కట్టుబడి ఉండటం, సరైన సమయంలో వైద్య సహాయం వంటి అంశాలు తోడైతే ఈ తరహా ప్రమాదాల్లో చాలా వాటిని నివారించవచ్చు. ప్రమాదం జరిగిన చాలా సేపటికిగానీ వైద్య సహాయం అందక అనేకులు మరణిస్తున్నారు.

★ ఈ ప్రమాదాల విషయంలో పౌరుల పాత్రపై అనేక అపోహలున్నాయి. అవి:

- పోలీసులు వచ్చేవరకు ప్రమాదానికి గురైన వ్యక్తిని తాకరాదనీ
- ప్రమాదం జరిగిన తర్వాత అది మెడికో- లీగల్ కేసుగా నమోదై, పోలీసులకి ఫిర్యాదు అందేవరకూ గాయపడిన వ్యక్తిని చికిత్స అందించరాదనీ
- ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి కేవలం ప్రభుత్వ వైద్యుడే చికిత్స చేయాలని, ప్రయివేటు వైద్యుడు చికిత్స చేయరాదనీ

★ ఇవన్నీ కేవలం అపోహలే కానీ, నిజాలు ఎంత మాత్రం కావు. ఈ రకం అపోహలకి ఎన్నో నిండు జీవితాలు బలి అవుతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు, సంఘటనాస్థలంలో ఉన్న వ్యక్తులు గాయపడిన వ్యక్తిని ముందుగా సమీపంలోని వైద్యుని వద్దకు తీసుకొని వెళ్ళాలి అది వారి బాధ్యత. గాయపడిన వ్యక్తికి తక్షణం చికిత్స చేయడం వైద్యుని కర్తవ్యం. ఈ విషయంలో చట్టం చాలా స్పష్టంగా ఉంది. ముందు నిలపాల్సింది ప్రాణాన్ని, ఆ తర్వాతే మెడికోలీగల్ కేసుగా నమోదు చేయాలి. బాధితుణ్ణి పౌరులు అన్ని విధాలా ఆదుకోవాలి. గాయపడిన వ్యక్తి ప్రాణాలు కాపాడటానికి చేయాల్సిన ప్రయత్నాలు అన్నీ చేయడం వైద్యుని నైతిక, చట్టపరమైన బాధ్యత. ప్రభుత్వ, ప్రయివేటు వైద్యులిద్దరికీ ఇది వర్తిస్తుంది.

★ పౌరుల/ వైద్యుని నిర్లక్ష్యం కారణంగా ఒక క్షతగాత్రుడు ప్రాణాలు కోల్పోతే వారు నేరపూర్వక అలసత్వం, నరహత్య వంటి అపరాధాలు చేసినంత దోషులు. క్షతగాత్రుడు ఎవరో అనామకుడు కావచ్చు, ప్రముఖుడు కావచ్చు. కాపాడటం, కనీసం అందుకు ప్రయత్నించడం పౌరునిగా మీ బాధ్యత. క్షతగాత్రుడు రేపు మీ బాబో/ పాపో కావచ్చు. అందుకే దయచేసి గాయపడ్డవారిని రక్షించడానికి మీవంతు ప్రయత్నం మీరు చేయండి.

**ప్రమాదస్థలంలో మీరు చేయాల్సినవి**

- ప్రమాదస్థలానికి కొంచెం దూరంగా, బాగా ఎడమవైపున, ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా మీ వాహనాన్ని నిలపండి
- ప్రమాద సంఘటనా స్థలానికి చేరేటప్పుడు అక్కడ పెట్రోలు/ డీజిల్ కారడం లేదని నిర్ధారించుకోండి
- నిప్పుకాని, నిప్పురవ్వలు కాని లేవని ధృవపరుచుకోండి
- సంఘటనా స్థలంలో, వాహనం ఇంజను 'ఆన్'లో ఉంటే, వెంటనే దాన్ని 'ఆఫ్' చేయండి
- ఎంత రాత్రి అయినా సరే చమురు 'లీక్' అవడం లేదని నిర్ధారించుకొన్న తర్వాతే, అగ్గిపెట్టెని వెలిగించండి. ఎప్పుడూ మీ వెంట టార్చిలైట్‌ను ఉంచుకోవడం మంచిది
- క్షతగాత్రుణ్ణి ఎట్టి పరిస్థితిల్లోనూ ఒక ఉదుటన కదపడానికి ప్రయత్నించకండి. ''ఇగ్నీషన్'' ఆఫ్ చేసేముందుకూడా, మరీ అవసరమైతే తప్ప కదపకండి
- క్షతగాత్రుడు చేతనావస్థలో ఉంది, ఊపిరి ఆడుతుంటే ప్రమాదకరమైన దెబ్బలు ఏమన్నా తగిలాయేమో పరిశీలించండి
- దెబ్బలకి రక్తస్రావం అవుతూంటే, గాయానికిపైన చేతి రుమాలుతో గానీ, శుభ్రమైన బట్టతోగానీ గట్టిగా కట్టుకట్టండి. దాని వల్ల రక్తస్రావం తగ్గుతుంది. కట్టును, ప్రతిమూడు నిముషాలకు ఒకసారి వదులు చేస్తూ ఉండండి. చెయ్యికాని, కాలుగాని గాంగ్రీసుకు గురవ్వకుండా ఉండాలంటే రక్త ప్రసరణని ఇలా కొనసాగించడం అవసరం
- తర్వాత గాయాల తీవ్రతని పరిశీలించండి. క్షతగాత్రుడు స్పృహలో ఉండి చేతుల్ని లేదా కాళ్ళని కదపలేని స్థితిలో ఉంటే, వెన్నుముక దెబ్బతిన్నదని భావించాలి. కనుక ఆ వ్యక్తిని ఆదుర్దాగా కదపరాదు, కదిపితే గాయం ప్రమాదకారిగా తయారు కాగలదు.

వైద్య సాయం కోసం కబురు పంపి, అంబులెన్స్ కోసం చూడండి

- క్షతగాత్రుడు స్పృహతప్పి, ఊపిరాడకుండా ఉంటే, మరో వ్యక్తి సాయంతో కారులో నుంచి ఆవ్యక్తిని బయటికి లాగి నేలపై జాగ్రత్తగా పడుకోబెట్టండి
- ఊపిరి అందని సమయంలో క్షతగాత్రుని నోటిలో నోరుపెట్టి ఈ క్రింది విధానాన్ని అనుసరించండి:
  - ముక్కులోను, నోట్లోను ఉన్న రక్తాన్ని శ్లేషాన్ని తుడిచి శుభ్రం చేయండి
  - క్షతగాత్రునికి ఒక పక్కగా కూర్చుని, ముక్కుమూసి గడ్డాన్ని చేతితో పట్టుకోండి
  - దీర్ఘంగా ఊపిరి తీసుకొని క్షతగాత్రుని నోట్లో నోరుపెట్టి గాలి ఊదండి. కాసేపు ముక్కు, నోరూ రెండూ మూయండి. తరువాత నోరు తెరవండి
  - ప్రతి ఐదు సెకండ్లకి ఒక మారు ఈ విధానాన్ని అనుసరించండి
- నాడి, గుండె కొట్టుకోకపోతే గుండెపై మర్దన చేయండి. ఇలా చేస్తూ, నోటి ద్వారా కూడా ఊపిరి ఇవ్వండి. అరచేతి మీద చెయ్యి పెట్టి ఛాతీకి ఎడమపక్కన సెకండుకి ఒకసారి బలంగా నొక్కాలి. మధ్య మధ్యలో 5 సెకండ్లకొకసారి నోటి ద్వారా ఊపిరినివ్వాలి
- ఈ విధానం తర్వాత క్షతగాత్రుడు ఊపిరి తీసుకోవడం ప్రారంభిస్తే, సాధ్యమైనంత త్వరగా వైద్య సహాయాన్ని అందించండి
- క్షతగాత్రుణ్ణి వైద్యసహాయానికి తరలించేటప్పుడు, ఒడుపుగా వాహనంలోకి తీసుకోండి మెడ, తల కదలకుండా జాగ్రత్తలు తీసుకోండి
- ప్రథమ చికిత్సలో కొద్దిగా శిక్షణ పొందితే, ఇలాంటి సందర్భాల్లో అక్కరకు వస్తుంది. మనిషి ప్రాణాలు కాపాడుతుంది
- మీరు చూసినది పోలీసులకి చెప్పండి. వారితో పూర్తిగా సహకరించండి
- ప్రమాదం జరిగిన సందర్భంలో, సంఘటనకి బాధ్యుడైనా, కాకపోయినా ఎదుటి పక్షం డ్రైవర్‌తో వివాదానికి దిగకండి. వివాదం వల్ల పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా తయారు అవుతుంది

# 11.5 తూనికలు కొలతలు

★ మనం కొనే ధాన్యాలు, అపరాల తూకాల్లో మోసాలు, కొనే పాలు, నూనె కొలతల్లో తేడాలు ఇదీ మనం నిత్యం చూస్తున్న స్థితి. అనేకమంది స్వార్ధపూరిత వ్యాపారస్తులు వినియోగదారులని మోసగించడమే పనిగా పెట్టుకొంటున్నారు.

**ఇలా జరిగే మోసాల్లో కొన్ని:**

- తనిఖీ చేసి ముద్రవేసిన తూనికరాళ్ళను, కొలమానాలను అరగదీయడం ద్వారా ఖాతాదారులను మోసగించడం
- తనిఖీచేయని/ పరీక్షించని తూనికరాళ్ళను, కొలమానాలను వినియోగించడం
- తూనికలలో అవకతవకలను జరపడానికి త్రాసుద్వారా ఈ క్రింది విధానాలను అనుసరిస్తారు
  - తూచేటప్పుడు చేతివాటాన్ని ప్రదర్శించడం
  - సరుకు ఉన్న తక్కెడ కింద అయస్కాంతాన్ని ఉంచడం
  - త్రాసులో బరువులు వేసేవైపు తక్కెడని మూలాధారానికి దగ్గరగా జరపడం
  - వాషర్లను తీసివేయడం ద్వారా త్రాసులోని సమతుల్యాన్ని దెబ్బతీయడం
  - స్ప్రింగుల ద్వారా తూకాలు జరిపే యంత్రాలలో తూకాన్ని సూచించే కొలబద్దను ఒత్తిడికి గురిచేసి కొనుగోలుదార్లను మోసగించడం
  - పెద్ద పెద్ద బరువులను (లారీలు, ట్రిప్పర్లు) తూచే ప్లాట్ ఫారం యంత్రాలలో సమతూకపు పరికరాన్ని దుర్వినియోగం పరచడం ద్వారా వినియోగదారుని మోసగించడం
  - డయల్ తరహా త్రాసుల్లో లీడ్ చార్డర్‌ను అటు ఇటు కదపడం ద్వారా మోసగించడం

**కొలమానాల్లో మోసాలు**

- సీళ్ళు, మీటర్లపై చేతి వాటాన్ని ప్రదర్శించడం
- కొలమానాల హ్యాండిలుకు దగ్గరగా రంధ్రాలు వేసి ద్రవం కార్చి పరిమాణం తగ్గేలా చేయడం

**కొలతల్లో మోసాలను, తూకాల్లో దగాలను ఎదుర్కోవడం ఎలా?**

- కొలమానాల, తూనిక రాళ్ల సీళ్ళు సరిగా ఉన్నాయో లేవో తెలుసుకోండి
- త్రాసును ఏదైనా కొక్కానికి తగిలించాలి గాని చేతితో పట్టుకోరాదు
- 10, 20, 50, 100, 200 తదితర గ్రాముల కొలతలనే బరువుతూయించి కొనుగోలు చేయండి. పావుకేజీ కొలత లేదు అని గుర్తుంచుకోండి
- మెట్రిక్ యూనిట్లను మాత్రమే వాడండి
- పాలను లీటరు కొలమానం ద్వారా మాత్రమే కొనుగోలు చేయండి
- వివిధ రకాల తూనికలు, కొలతలపై అవగాహనను పెంచుకోండి
- వస్తువుకి ధర చెల్లించండి గాని అది ఉన్న పాకెట్‌కి కాదు
- ప్యాకేజీ వస్తువులపై బరువును సూచించే గుర్తులు ఉన్నాయో లేదా అని పరిశీలించండి
- పెట్రోలు పోయించుకునేటప్పుడు ఎప్పుడూ కొలతలు కనబడే ప్లాస్టిక్ క్యానును (5లీటర్ల పరిమాణం కలది) మీ వెంట ఉంచుకోండి. అందులో 5 లీటర్లను పోయమని అడగండి. మీటరును వెంటనే తనిఖీ చేయండి. మీటరు గాని 5 లీటర్ల కన్నా ఎక్కువ పరిమాణాన్ని చూపినట్లయితే వెంటనే ఫిర్యాదు చేయండి. అప్పుడప్పుడూ ఇలాచేస్తే మీటరులో మోసం ఆగిపోతుంది.
- ప్రతి పెట్రోలు బంకులో ఫిల్టరు కాగితం ఉండాలి. దానిపైన కొన్ని చుక్కలు పెట్రోలు పోస్తే మరకమిగిలితే కల్తీ ఉండే అవకాశం ఉంది. ప్రతి పెట్రోలు బంకువద్ద కొలిచే క్యాను ఉండాలి. దానితో తరచు కొలమానాన్ని సరిచూచుకోండి
- తూనికలు, కొలతలు శాఖకి వాటిలో లోపాలు ఉంటే ఫిర్యాదు చేయండి
- స్థానికంగా లోక్‌సత్తా / పార్టీ ప్రజాసంఘం ఏర్పాటు చేసుకొని తూనికలు కొలతలపై అవగాహన పెరిగేలా చూడండి

**"ఏ స్వేచ్ఛ లేకపోయినా ఫరవాలేదు. విషయాలని తెలుసుకోవడానికి, మాట్లాడడానికి, నా అంతరాత్మ చెప్పిన మేరకు వాదించడానికి మాత్రం స్వేచ్ఛ ఇవ్వండిచాలు"**

**- జాన్ మిల్టన్**

# 12 సమాచార హక్కు చట్టం - 2005

ప్రభుత్వాధికారుల్లో జవాబుదారీ తనాన్ని పెంపొందించటం, దాపరికం లేని పరిపాలన అందించడం కోసం భారత ప్రభుత్వం ఈ చట్టాన్ని అక్టోబరు 12, 2005 సం॥ నుండి అమలులోకి తెచ్చింది.

## సమాచార హక్కు ద్వారా ఏం తెలుసుకోవచ్చు

- పనులకు చెందిన వివరాలు
- రికార్డులు, పత్రాలు మొ॥ వాటి నకళ్లు, సారాంశము, నోట్సు
- మెటీరియల్‌కు చెందిన నమూనాలు
- ప్రింట్లు, డిస్కులు, ఫ్లాపీలు, టేపులు, వీడియో క్యాసెట్లు ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాల సమాచారం మొ॥ పొందవచ్చు.

## ప్రభుత్వ సంస్థలో ఏమి ప్రచురించాలి

- సంస్థల వివరాలు, విధులు
- సంస్థలో పనిచేసే అధికారులు, సిబ్బంది అధికారాలు, బాధ్యతలు
- నిర్ణయాలు తీసుకునే విధానం, పర్యవేక్షణ, జవాబుదారీతనం
- సిబ్బంది విధి నిర్వహణకై ఏర్పరచబడ్డ నియమనిబంధనలు, మార్గదర్శకాలు
- విధి విధానాల రూపకల్పనలో, అమలులో ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు
- అధికారులు, సిబ్బంది వేతనాలు, ఇతర సదుపాయాలు, సంస్థకు కేటాయించిన నిధులు, ఖర్చులు మొత్తం
- కార్యక్రమ అమలు, కేటాయించిన మొత్తాలు, వీటి లబ్ధిదారుల వివరాలు
- సమాచారం పొందటానికి పౌరులకు అందుబాటులో ఉన్న సౌకర్యాల వివరాలు, గ్రంధాలయం/ రీడింగ్ రూం ఉంటే అవి తెరచి ఉండేవేళలు, పౌర సమాచార అధికారుల పేర్లు, హోదా మొదలైనవి. అయితే సమాచార చట్టం సెక్షన్ (8) ప్రకారం, భారత సార్వభౌమత్వానికి భంగం కలిగించే సమాచారం, కోర్టు నిషేధించిన సమాచారం, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభలకు భంగం కలిగించే సమాచారం మొదలైన సమాచారం వెల్లడి చేయనవసరం లేదు. (కానీ గ్రామ పంచాయితీ పరిధిలో వెల్లడి చేయనవసరం లేని సమాచారం ఏమీ ఉండదని భావించడం జరిగింది. కాబట్టి పంచాయితీ కార్యదర్శి యివ్వటానికి నిరాకరించే సమాచారం ఏదీ ఉండదు.)

**ప్రజా సమాచార అధికారులు**

ఈ చట్టం క్రింద ప్రతీ ప్రభుత్వ సంస్థ పౌరులకు సమాచారం యివ్వటానికి తన పరిపాలన యూనిట్‌లో ఒక ప్రజా సమాచార అధికారిని నియమించాలి.

**ప్రజా సమాచార అధికారి బాధ్యతలు**

-దరఖాస్తు అందిన వెంటనే సమాచారం యివ్వాలి.

- దరఖాస్తులు అందిన 30 రోజుల్లోగా నిర్ణీత రుసుం వసూలు చేసి సమాచారం యివ్వాలి. లేదా సమాచారం ఏ కారణం చేత ఇవ్వటం లేదో లిఖితపూర్వకంగా తెలపాలి.
- సమాచారం వ్యక్తి జీవన, మరణ సమస్యకు సంబంధించినదైతే కోరిన 48 గం॥లలో యివ్వాలి.
- గడువులోగా దరఖాస్తుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే తిరస్కరించబడినట్లు భావిస్తారు.
- కోరిన సమాచారం 3వ పార్టీ యిచ్చేదయితే, 5 రోజుల్లోగా వారికి రాతపూర్వక నోటీసు యిచ్చి వారి వాదనలను 10 రోజుల గడువుతో కూడా తెలుసుకోవాలి.

**సమాచారం కోరటానికి కారణాలు తెలపాల్సిన అవసరం లేదు**

దరఖాస్తు సమయంలో చెల్లించాల్సిన రుసుము

ఎ) గ్రామస్థాయి ప్రభుత్వ కార్యాలయాలు - ఫీజులేదు

బి) మండలస్థాయి ప్రభుత్వ కార్యాలయాలు - ప్రతి దరఖాస్తుకు రూ 5/-

సి) ఆపై స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు - ప్రతి దరఖాస్తుకు 10/-

**సమాచారం పొందేందుకు ఫీజు**

మ్యాపులు, ప్లాఫీలు ప్లానులు, సిడిలు మొ॥ వాటిని నిర్ణయించిన వాస్తవ ధర చెల్లించాలి. మిగిలిన వాటికి క్రిందవిధంగా ఉండాలి.

- ఎ 4 లేదా ఎ3 పేపర్‌పై ముద్రించిన సమాచారం ప్రతి పేజికి రూ. 2/-
- ఎ 4 ఎ3 కన్నా పెద్ద పేపర్‌పై ముద్రించిన సమాచారం - వాస్తవ ఖర్చు
- మ్యాపులు, ప్లానులు మరియు నమూనాలు - వాస్తవ ఖర్చు

- ఎలక్ట్రానిక్ రూపంలో వున్న సమాచారం
  - ఎ) ఫ్లాపీ 1.44 యం.బి. రూ. 50/- చొ॥న
  - బి) సి.డి. 700 యం.బి. రూ. 100/- చొ॥న
  - సి) డివిడి రూ. 200/- చొ॥న
- రికార్డుల పరిశీలన - మొదటి గంటకు ఫీజు లేదు. ఆపై ప్రతి 15 ని॥ రూ 5/- చొ॥న
- సమాచారం తపాలా ద్వారా పొందుటకు - వాస్తవ ఖర్చుతో పాటు వాస్తవ తపాలా ఖర్చులు అదనం

**రుసుము చెల్లించాల్సిన విధానం**

పైన వివరించబడిన రుసుము నగదు, డి.డి. లేదా చెక్కు రూపంలో సంబంధిత కార్యాలయంలోని నగదు అధికారి లేదా నియమించబడిన అధికారికి చెల్లించి తగు రశీదు పొందాలి.

**అప్పీలు చేసుకోవాల్సిన అధికారులు**

మొదటి అప్పీలును గడువు ముగిసిన తర్వాత లేదా నిర్ణయం తెలిపిన 30 రోజుల లోపు అదే సంస్థలోని ప్రజా సమాచార అధికారికి పై హోదా గల అధికారికి అప్పీలు చేసుకోవాలి. (సరైన కారణం చూపినచో ఆలస్యంగా అప్పీలు చేసుకోవటాన్ని పై అధికారి అనుమతించవచ్చు.

**రెండో అప్పీలు**

మొదటి అప్పీలేట్ అధికారి నిర్ణయం తీసుకున్న 90 రోజులలోపు రాష్ట్ర/జాతీయ సమాచార కమీషన్‌కు అప్పీలు చేసుకోవాలి. 'సరైన కారణాన్ని చూపించగలిగితే ఆలస్యంగా అప్పీలు చేసుకోవటాన్ని అధికారి అనుతించాలి.

మూడో పార్టీ అప్పీలు చేసుకున్నట్లయితే మొదటి అప్పిలేట్ అధికారికి 30 రోజులలోపు (మొదటి అప్పీలు నిర్ణయంపై 90 రోజులలోపు రెండవ అప్పిలేటు అథారిటి న్లియంపై 90 రోజులలోపు రెండవ అప్పిలేట్ సంస్థ అయిన కమీషన్‌కు దరఖాస్తు చేయాలి.

- సమాచారం యివ్వకపోవటం స్వయంబద్దమైనదని నిరూపించాల్సిన బాధ్యత ప్రజాసమాచార అధికారిది.

**చట్టం ఉల్లంఘిస్తే చర్యలు**

దిగువ పేర్కొన్న సందర్భాలలో ప్రజా సమాచార అధికారికి రోజుకు రూ. 250/- చొ॥న రూ. 25,000/- మించకుండా జరిమానా విధించవచ్చు.

- దరఖాస్తు స్వీకరణకు నిరాకరణ
- సరైన కారణం లేకుండా సమాచారం యివ్వటంలో జాప్యం.
- దురుద్దేశంతో సమాచారాన్ని నిరాకరించటం
- తెలిసి అసంపూర్తి, తప్పుడు, పక్కదారి పట్టించే సమాచారాన్ని యివ్వడం.

కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషనర్లకు ఈ శిక్ష వేసే అధికారం ఉంది. తప్పు చేసిన ప్రజా సమాచార అధికారిపై క్రమశిక్షణ చర్యకు సిఫారసు చేసే అధికారం కూడా వుంది.

# 13. సంక్షిప్తంగా - సిటిజన్ ఛార్టర్లు

# (పౌరసేవాపత్రాలు)

## I గ్రామ పంచాయతీ కార్యాలయం

### ఎ. ధృవపత్రాల మంజూరు

| | |
|---|---|
| 1. స్థానిక ధృవపత్రం మంజూరు | 2 రోజులు |
| 2. నివాస ధృవపత్రం మంజూరు | 2 రోజులు |
| 3. కుల ధృవీకరణ పత్రం మంజూరు కై సిఫారసు | 2 రోజులు |
| 4. ఆదాయ ధృవపత్రం మంజూరుకై సిఫారసు | 2 రోజులు |
| 5. జనన, మరణ ధృవపత్రం మంజూరు | 2 రోజులు |

(జి.ఓ. నం. 276 పం.రా.ఆర్‌జి (మం. II ) తేది 18-7-2002)

### బి. రిజిస్ట్రేషన్‌లు / లైసెన్సులు

| | |
|---|---|
| 1. జనన మరణాల రిజిస్ట్రేషన్ | 3 రోజులు |
| 2. ఆస్తి విలువ మదింపు, ఇంటినెంబరు కేటాయింపు | 15 రోజులు |
| 3. భవన నిర్మాణ దరఖాస్తుల అనుమతులు మంజూరు నిరాకరణ | 15 రోజులు |
| 4. ప్రయివేటు కుళాయిల మంజూరు | 30 రోజులు |
| 5. లే అవుటు మంజూరుకై సిఫారసు | 15 రోజులు |
| 6. ఆస్తి బదిలీ (మ్యూటేషన్) | 15రోజులు |
| 7. వృత్తి వ్యాపారాలకు లైసెన్సుల మంజూరు | 5 రోజులు |

### సి. ఇబ్బందుల నివారణ

| | |
|---|---|
| 1. పైపులైన్ల మరమ్మత్తులు | 24 గంటలు |
| 2. వీధిలైట్ల మరమ్మత్తులు | 2 రోజులు |
| 3. మురుగు కాల్వల మరమ్మతులు | 2 రోజులు |
| 4. రోడ్లపై అడ్డంకులు తొలగించటం | 3 రోజులు |
| 5. చెత్త చెదారాల తొలగింపు | 2 రోజులు |
| 6. వ్యక్తుల బాకాయిల వివరాలు | 5 రోజులు |

## II మండల పరిషత్ కార్యాలయం

1. చేతి పంపుల మరమ్మతులు 2 రోజులు
2 పింఛనుల మంజూరుకై సిఫారసు 7 రోజులు
(సమావేశం జరిగిన తదుపరి)
3. రుణాల మంజూరుకై సిఫారసు 7 రోజులు
(సమావేశం జరిగిన తదుపరి
4. రుణాల మంజూరుకై సంబంధిత సంస్థలకు సిఫారసు7 రోజులు
(సమావేశం జరిగిన తదుపరి)
5. వికలాంఒగులకు మూడు చక్రాల సైకిల్ సిఫారసు 7 రోజులు
(సమావేశం తదుపరి)

## III తహశీల్దార్ కార్యాలయం

1. కులధృవీకరణ పత్రాల మంజూరు 1 రోజు
2. ఆదాయం, నివాస ధృవపత్రాలు 1 రోజు
3. జనన, మరణ పత్రాలు, అడంగల్ నకల్లు, 3 రోజులు
ఎఫ్.లైన్ పిటిషన్లు మంజూరు, పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు
4. సబ్‌డివిజన్ సర్వే, డూప్లికేటుపట్టా, పొసెషన్ సర్టిఫికెట్టు,
ఒక షాపునుండి మరో షాపుకు 7 రోజులు
రేషన్ కార్డు మార్పు, వారసత్వ ధృవీకరణ పత్రాలు, భూమి విలువ
పత్రాలు, కిరోసిన్, చౌకధరల దుకాణాల మంజూరు
5. లీజుపై వ్యవసాయ భూమి మంజూరు 15 రోజులు

## IV మున్సిపల్ కార్యాలయం

1. ఆస్తి విలువ మదింపు, ఇంటి నంబర్ కేటాయింపు 15 రోజులు
2. నిర్మాణాల అనుమతుల మంజూరు/ నిరాకరణ 15 రోజులు
3. నీటి సరఫరా కనెక్షన్
ఎ. సాధారణ కేటగిరీ 30 రోజులు
బి. ఓ.వై.టి. కేటగిరి 10 రోజులు
4. జననమరణాల ధృవపత్రాలు మంజూరు 5 రోజులు
5. చెత్త చెదారాల తొలగింపు 1 రోజు
6. మురుగు కాల్వలలో అడ్డంకుల తొలగింపు 2 రోజులు
7. దోమల నిర్మూలనకై యాంటిలార్వా ఆపరేషన్ 2 వారాలకోసారి

| | |
|---|---|
| 8. చెత్తకుండీల ఏర్పాటు | 2 రోజులు |
| 9. పైపులైన్ల మరమ్మత్తులు | 1 రోజు |
| 10. వీధిలైట్ల మరమ్మత్తులు | 5 రోజులు |
| 11. రోడ్ల అడ్డంకుల తొలగింపుకు | 7 రోజులు |

పై నిబంధనల ప్రకారం సేవలు అందనిచో,
దరఖాస్తుదారునకు రోజుకు రు. 50/- నష్టపరిహారం ఇవ్వాలి.

## V ఎ.పి. ట్రాన్స్‌కో కార్యాలయం

| | |
|---|---|
| 1. ఓల్టేజీ సమస్యల పరిష్కారం | 4 గంటలు |
| 2. విద్యుత్ బిల్లుల సమస్యల పరిష్కారం | 7 నుండి 15 రోజులు |
| 3. పట్టణాలు, సిటీలలో ఫ్యూజులు మార్చటానికి | 4 గం,, |
| 4. గ్రామీణ ప్రాంతాలలో ఫ్యూజులను మార్చటానికి | 12 గంటలు |
| 5. పట్టణ ప్రాంతాలలో లైను బ్రేక్‌డౌన్ సమస్యల పరిష్కారం | 6 గం,, |
| 6. గ్రామీణ ప్రాంతాలకు లైన్ బ్రేక్‌డౌన్ సమస్యల పరిష్కారం | 24 గం,, |
| 7. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్ సమస్యల పరిష్కారం పట్టణాలలో | 24 గం,, |
| గ్రామీణ ప్రాంతాలలో | 48 గం,, |
| 8. విద్యుత్ మీటర్ సమస్యల పరిష్కారం | 7 రోజులు |
| 9. కొత్త కనెక్షన్ల మంజూరు/ అధిక లోడు మంజూరు | 10 నుండి 30 రోజులు |
| 10. ట్రాన్స్‌ఫార్మర్ సర్వీసుల మార్పిడి | 30 రోజులు |
| 11. కొత్త కనెక్షన్ మంజూరు | |
| 1. దరఖాస్తు పరిశీలన | 15 రోజులు |
| 2. ఎస్టిమేట్ ఛార్జీలు, ఇతర ఛార్జీల ప్రకటన | 30 రోజులు |
| 3. సప్లయి గూర్చిన అంతిమ నిర్ణయ ప్రకటన | 60 రోజులు |
| 4. హైటెన్షన్ కనెక్షన్ మంజూరు | 120 రోజులు |
| 5. అధిక హైటెన్షన్ (ఇ.హెచ్.టి) కనెక్షన్ మంజూరు | 180 రోజులు |

(కొత్త కనెక్షన్‌కై ధరఖాస్తు నమూనా)

## VI సబ్‌రిజిష్ట్రారు కార్యాలయం

| | |
|---|---|
| 1. డాక్యుమెంట్ల తయారీ | |
| నిర్ణీత నమూనాలో | 30 నిమిషాల నుండి 1 గం,, |
| 2. మార్కెట్ విలువ నిర్ధారణ | 10 నిమిషాలు |
| 3. నగదు రశీదు | 10 నిమిషాలు |
| 4. ఆస్తి రిజిస్ట్రేషన్ | 1 గం,, |
| 5. ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్టు మంజూరు | 10 - 20 నిమిషాలు |
| 6. స్పెషల్ మారేజి రిజిస్ట్రేషన్ | 30 రోజులు |
| 7. హిందూ వివాహ రిజిస్ట్రేషన్ | పెళ్లైన తదుపరి 2 గం,, |

## VII వాణిజ్య పన్నుల శాఖ

| | |
|---|---|
| 1. కంపెనీల చట్టం 1956 ప్రకారం రిజిస్ట్రేషన్ | 7 రోజులు |
| 2. మ్యాను ఫాక్చరింగ్ యూనిట్ల మంజూరు | 7 రోజులు |
| 3. రిటైల్ డీలరుషిప్పు మంజూరు | 5 రోజులు |
| 4. ఇతర సేవలు | 30 రోజులు |
| 5. పన్నుల చెల్లింపు రశీదులు | 2 రోజులు |
| 6. దరఖాస్తుల క్లియరెన్సు | 3 రోజులు |
| 7. వాయిదాల మంజూరు దరఖాస్తుల పరిష్కారం | 15 రోజులు |
| 8. రిఫండు విడుదల | 90 రోజులు |
| 9. నిలిపివేసిన వాహనాల విడుదల | 48 గం,, |
| 10. ఉత్తర్వుల నకలు మంజూరు | 7 రోజులు |

## VIII ఆర్.టి.ఎ. కార్యాలయం

| | | |
|---|---|---|
| 1. డ్రైవింగ్ లైసెన్సు మంజూరు | రు. 300 | అదేరోజు |
| 2. లెర్నింగ్ లైసెన్సు | రు. 60 | అదేరోజు |
| 3. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ | | |
| ద్విచక్ర వాహనాలు | రు. 160 | అదేరోజు |
| నాలుగు చక్రాల వాహనాలు | రు. 400 | అదేరోజు |
| వాహనాల ధృఢత్వ సర్టిఫికెట్లు | | |
| 4. మూడు చక్రాల వాహనాలు | రు. 230 | అదేరోజు |

| | | |
|---|---|---|
| 5. లైట్ మోటారు వాహనాలు | రు. 360 | అదేరోజు |
| 6. మధ్యస్థ మోటారు వాహనాలు | రు. 460 | అదేరోజు |
| 7. హెవీ మోటారు వాహనాలు | రు. 560 | అదేరోజు |
| 8. డ్రైవింగ్ లైసెన్సులు | | |
| రెన్యువల్ | రూ. 330 | 2 గంటలు |
| డూప్లికేట్ | రూ. 315 | 2 గం,, |
| అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సు | రూ. 350 | 2 గం,, |
| 9. వాహనాల రిజిస్ట్రేషన్ | రూ. 330 | |
| తాత్కాలిక - రెండు చక్రాలు | రూ. 65 | 2 గం,, |
| నాలుగు చక్రాలు | రూ. 65 | 2 గం,, |
| 10. యాజమాన్య మార్పిడి | | |
| మోటారు సైకిల్ | రూ. 130 | అదేరోజు |
| లైట్ మోటారు వాహనం | రూ. 300 | అదేరోజు |

# సిటిజన్ ఛార్టర్లు

# మున్సిపల్ కార్యాలయాలు

| | |
|---|---|
| 1. ఆస్తి పన్ను విధింపు, ఇంటి నెంబరు కేటాయింపు | 15 రోజులు |
| 2. భవన నిర్మాణ ఎగుమతుల పరిష్కారం | 15 రోజులు |
| 3. మంచినీటి కుళాయిల మంజూరు | |
| 1. సాధారణ | 30 రోజులు |
| 2. ఓ.వై.టి | 10 రోజులు |
| 4. జనన మరణ ధృవపత్రాల మంజూరు | 5 రోజులు |

నిర్ణీత కాలంలో పై సేవలు పరిష్కరించకుంటే జి.వో. నెం. 158 తేది: 25-4-2001 ప్రకారం రోజుకు రూ. 50/- చొ॥న నష్ట పరిహారం యివ్వబడుతుంది.

## తహశీల్దారు కార్యాలయాలు

| | |
|---|---|
| 1. ప్రభుత్వ భూములు /సీలింగ్ మిగులు భూములు వ్యవసాయం నిమిత్తం పట్టా మంజూరు | 60 రోజులు |
| 2. వ్యవసాయం నిమిత్తం పట్టా మంజూరు చేసిన వారికి భూముల స్వాధీనం | 15 రోజులు |
| 3. భూ తగాదా కేసుల పరిష్కారం | 10 రోజులు |
| 4. పట్టా భూములను సబ్ డివిజన్ చేయుట | 30 రోజులు |
| 5. ప్రభుత్వ భూములను తాత్కాలిక ప్రాతిపదికన 1 సం॥ కౌలుకు యిచ్చుట | 15 రోజలు |
| 6. రక్షిత కౌలుదార్ల పేర్లను రెవెన్యూ రికార్డులలో నమోదు చేయుట | 15 రోజులు |
| 7. బలహీన వర్గాలకు గృహ నిర్మాణ ప్రతిపాదనలు | 10 రోజులు |
| 8. ప్రభుత్వ భూములను ఇళ్ళ స్థలాలకు పట్టాలు మంజూరు చేయుట | 30 రోజులు |
| 9. మ్యూటేషన్ మంజూరు చేయుట | 45 రోజులు |
| 10. భూమి కొలతలు సరిచూచుట/సవరించుట | 10 రోజులు |
| 11. పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ జారీ | 10 రోజులు |
| 12. మనీ లెండింగ్ లైసెన్సులు జారీ | 10 రోజులు |
| 13. రిటైల్ పప్పు ధాన్యాలు లైసెన్సులు జారీ | 10 రోజులు |
| 14. కులం, నివాసం, జనన, మరణం, ఆదాయ ధృవపత్రాల జారీ | 5 రోజులు |
| 15. రేషన్ కార్డుల మంజూరు | 15 రోజులు |
| 16. ఒక షాపు నుండి వేరే షాపుకు కార్డుల బదిలీ | 7 రోజులు |
| 17. ఆపద్బంధు రిలీఫ్ ప్రతిపాదన | 10 రోజులు |
| 18. అత్యాచార కేసులో నివేదిక సమర్పించుట | అదేరోజు |
| 19. ప్రకృతి వైపరీత్యాల రిలీఫ్ మంజూరు | 2 రోజులు |
| 20. వారసత్వ ధృవీకరణ పత్రాల జారీ | 20 రోజులు |
| 21 పెన్షన్ల జారీ | నెలవారీ |
| 22. ధృవీకరణ పత్రాల నకలు మంజూరు | |
| 1. ప్రస్తుత సం॥ పహాణీ నకలు పత్రాల జారీ | 7 రోజులు |
| 2. గత సం॥ పహాణీ నకలు పత్రాల జారీ | 7 రోజులు |
| 3. జనన, మరణ రిజిస్టర్ల నకలు జారీ | 7 రోజులు |

# తుదిపలుకు

ప్రభుత్వ సేవలపైన ప్రజల అజమాయిషీ కోసం, పాలనాయంత్రాంగంపైన పౌరుడి సార్వభౌమత్వాన్ని సుస్థిరం చేయడం కోసం జరిగే పోరాటంలో స్వరాజ్య ఉద్యమం తొలిమెట్టు మాత్రమే. సంఘటితంగా, పరిజ్ఞానంతో ప్రజలు నిలదీయడం నేర్చుకున్నప్పుడు, ఖచ్చితంగా ప్రభుత్వ సేవలలో గణనీయమైన మార్పువచ్చి తీరుతుంది. అయితే మన పాలనా సంక్షోభం మొత్తానికి స్వరాజ్యం ఉద్యమం సర్వరోగనివారిణి కాదు. అవినీతి, దుష్పరిపాలన మన రాజకీయ పాలనా స్రవంతిలో విడదీయరాని అంతర్భాగమయిపోయాయి. వాటిని నిర్మూలించాలంటే మౌలికమైన ప్రజాస్వామ్య సంస్కరణల ద్వారా రాజ్యవ్యవస్థలో సమూలమైన పరివర్తన సాధించవలసిందే.

అయితే 'స్వరాజ్యం' ఉద్యమం సాధించే పరిమిత ఫలితాలు కూడా పౌరుల ఆత్మ విశ్వాసం పెంచుతాయి. వ్యవస్థలో ఉన్న కుళ్ళుని బయట పెడతాయి. గజిబిజిగా ఉన్న మన పాలనా వ్యవస్థలో ఉన్నలొసుగుల్ని, వివిధ సంస్థలకి, ప్రక్రియలకి మధ్య గాఢంగా పెనవేసుకుపోయిన సంబంధాన్ని వెలికితీస్తాయి. నిరంకుశ రాజకీయ పార్టీ వ్యవస్థ; విపరీత వ్యయంతో కూడిన లోపభూయిష్ట ఎన్నికలు, అపరిమిత అధికార కేంద్రీకరణ నామ మాత్రంగా తయారయిన పౌరుడి పాత్ర, తుమ్మితే ఊడేముక్కులా ఉన్న ప్రభుత్వాల అస్థిరత్వం; విశృంఖలమైన విచక్షణాధికారం; ఒక వంక బాధ్యతారాహిత్యంతోను, మరోవంక అతి వినయంతోను పేలవమయిన పాలనాయంత్రాంగం; మందకొడిగా, అసమర్థంగా ఉన్న న్యాయవ్యవస్థ; అంతులేని అధికార దుర్వినియోగాన్ని నిలువరించలేని దుస్థితి - ఇవన్నీ విడదీయరానంతగా పెనవేసుకుపోయి దుష్పరిపాలనకి దారితీస్తున్నాయి.

స్వరాజ్య ఉద్యమం ద్వారా పౌరులకే ఈ వ్యవస్థ పూర్తి స్వరూపం గోచరిస్తుంది. మన జాతి సమూల పరివర్తనకి కావాల్సిన అజేయశక్తిగా మన ప్రజలని ఈ అవగాహన తీర్చి దిద్దుతుంది. స్వపరిపాలన జీవన సరళిగా మారి, ప్రజలు తమ సేవకుల్ని శాసించడం నేర్చుకుంటారు. భారత రిపబ్లిక్‌కి స్వంత దారులవుతారు.

ప్రజలలో గూడు కట్టుకున్న అసహనాన్ని, జుగుప్సని, వేదనని ఇంధనాలుగా చేసి, జనబలాన్ని సక్రమమార్గం పట్టించటమే స్వరాజ్య ఉద్యమ లక్ష్యం. మనందరికి మన పరిస్థితుల్ని స్థానికంగా మెరుగుపరచే అవకాశం ఉంది. తద్వారా దేశాన్ని సంస్కరించే శక్తీ ఉంది. అందుకు కావాల్సింది లక్ష్యందిశగా, వడివడిగా అడుగులు వేసే ప్రయత్నం. చరిత్ర మన కోసం వేచి ఉంది. ఖాళీ పుటల్లో రాసే చేవ మనకు ఉంది. భుజం భుజం కలుపుదాం.. ఆగకుండా అడుగులు వేద్దాం...

# అనుబంధం - 1

రూ. 2 కోర్టు ఫీజు
స్టాంపు అతికించాలి

తహశీల్దారు గారికి,
...................................మండలం,
(ఆం.ప్ర)

విషయం : నివాస ధృవ పత్రం - జారీకై, అభ్యర్థనా పత్రం.

ఆర్యా!

.............................................................................. గారి కుమారుడు/ భార్య/ కుమార్తె అయిన ........................................... అను నేను, .................................................................చిరునామాలో నివసిస్తున్నాను. మీ పరిశీలనకోసం, తదనంతరం అనుకూల ఉత్తరువుల కోసం ఈ క్రింది విషయాలను తెలియజేస్తున్నాను.

............................................ మండల పరిధిలోని చిరునామాలో నేను నివసిస్తున్నాను. నా నివాసాన్ని ధృవపరిచే కాపీలను, విద్యాసర్టిఫికెట్లను మీ పరిశీలనకోసం సమర్పిస్తున్నాను. దయచేసి నాకు ''నివాస ధృవీకరణ" పత్రాన్ని అందజేయగలరు. మీ నుంచి ధృవీకరణ పత్రం రాగానే, నేను దాన్ని.......................................................... లో ........................................ నిమిత్తం సమర్పిస్తాను.

కాబట్టి దయచేసి నాకు నివాస ధృవీకరణ పత్రాన్ని అందజేయగలరు.

తేదీ................................
స్థలం .....................................
భవదీయుడు
జతపరబడినవి : టి.సి/ బోనఫైడ్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ, రేషన్ కార్డు జిరాక్స్

---

## నివాస ధృవీకరణ పత్రము

........................................................... గారి కుమారుడు/కుమార్తె/ భార్య అయిన శ్రీమతి/శ్రీ/ కుమారి ............................................ నంబరు గల ఇంట్లో గత ............................................సంవత్సరాలుగా నివసిస్తున్నాను.

నాకు అతడు/ ఆమె తెలుసు. అందువలన, **2.8.1989**వ తేదీన రెవెన్యూ (ఎ) శాఖ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు నంబరు **554; 6.8.1989**వ తేదీన సాంఘిక సంక్షేమ **(జి2)** శాఖ జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వు నంబరు **178, 28.11.1988**వ తేదీన సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు నంబరు: **288** అను అనుసరించి ఈ ధృవీకరణ పత్రాన్ని జారీ చేస్తున్నాను.

గెజిటెడ్ అధికారి సంతకం :
అధికార ముద్ర :
హోదా :
పేరు :
తేదీ :

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## రెవెన్యూ శాఖ

తహశీల్దారు గారి కార్యాలయం
కార్యాలయం..............................
మండలం ..................................
నం తేది తేదీ :.........................................

### నివాస ధృవీకరణ పత్రము

ఈ క్రింది అధికారి జారీచేసిన సర్టిఫికెట్‌ల ఆధారంగా

1.

2.

...................................... గారి కుమారుడు/కుమార్తె/ భార్య అయిన శ్రీమతి/శ్రీ/ కుమారి .......................................... గారు .............................................చిరునామాలో గత నాలుగేళ్లుగా నివసిస్తున్నట్టు ధృవీకరణ పత్రాన్ని జారీచేస్తున్నాను. ఈ ధృవీకరణ పత్రాన్ని ఉద్యోగాన్వేషణలోను విద్యా ప్రవేశంలోను గుర్తిస్తారు.

స్థలం : హైదరాబాద్ తహశీల్దారు
తేదీ:................................. .........................మండలం

---

### రిజస్టరు చేయని జనన/ మరణాల సర్టిఫికేట్

జనన, మరణాల తేదీ :...............................
రిజిస్ట్రార్ గారికి,
సర్కిల్ నం.( )
.............................................మండలం
.........................................పట్టణం/ నగరం

ఆర్యా!

దయ ఉంచి ఈ దిగువ పేర్కొనబడ్డ వివరాల ప్రకారం నాకు జనన/మరణాల ధృవీకరణ పత్రాల ( ) కాపీలను ఇప్పించగలరు.

1. పుట్టిన/ మరణించిన తేదీ :
2. పుట్టిన/ మరణించిన స్థలం :
3. పేరు :
4. తల్లిపేరు :
5. తండ్రి పేరు :
6. స్త్రీ/ పు :
7. నోటిఫికేషన్ నం :
   తేదీ :

కృతజ్ఞతలతో
చిరునామా : భవదీయుడు

రెండు రూపాయల కోర్టుఫీజు
స్టాంపు అతికించాలి

తహశీల్దారు గారికి
.................................. మండలం
.................................. జిల్లా

**విషయం : ఆదాయ ధృవీకరణ పత్రం, జారీకై వినతి**

ఆర్యా !

.......................................... గారి కుమారుడు/కుమార్తె/ భార్య అయిన ..........................................అను నేను ..........................................నంబరు గల ఇంట్లో ఉంటున్నాను. నా ఆదాయం వివరాలను (ఇద్దరు గెజిటెడ్ అధికారుల ధృవీకరణతో సహా), రేషన్ కార్డు కాపీని, మీ పరిశీలనార్థం అందచేస్తున్నాను.

గోల్కొండ మండల పరిధిలోని పై చిరునామాయే నా నివాసం. ఇదే అంశాన్ని ఇద్దరు గెజిటెడ్ అధికారులు ధృవీకరించారు. కాపీలను మీకు సమర్పించాను. మీ వద్ద నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం రాగానే నేను దాన్ని ..........................................లో..................................................కోసం సమర్పిస్తాను.
కనుక దయ ఉంచి నాకు ఆదాయ ధృవీకరణ పత్రాన్ని ఇప్పించగలరు.

కృతజ్ఞతలతో భవదీయుడు

తేదీ: .................................
స్థలం: ......................................
జతపరచినవి :
1. ఇద్దరు గెజిటెడ్ అధికార్ల సంతకాలు
(అభ్యర్థి సంతకం)
2. రేషన్ కార్డు జిరాక్స్ కాపీ
3. బోనఫైడ్ సర్టిఫికెట్
4. నోటరీ ద్వారా రూ. 10ల స్టాంపు పేపర్ పైన అఫిడవిట్

---

**ఆదాయ ధృవీకరణ పత్రం**

........................................ గారి కుమారుడు/కుమార్తె/ భార్య అయిన శ్రీమతి/ శ్రీ/కుమారి ..........................................చిరునామాలో నివసిస్తున్నాను.

అన్ని వనరులనుంచీ అతని/ ఆమె ఆదాయం నెలకి రు..............................................(అక్షరాల....................మాత్రమే). ఈ మొత్తం ఆదాయం ఏడాదికి రూ.................................. (అక్షరాల............................మాత్రమే)

తేదీ: ........................... సంతకం ...........................
స్థలం :.......................... హోదా ...............................

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## రెవెన్యూ శాఖ

తహశీల్దారు గారి కార్యాలయం
కార్యాలయం..........................
మండలం ..............................
తేదీ :.....................................

ఎల్.డిఐజి. నం.డి/ / 199

### ఆదాయ ధృవీకరణ పత్రము

దిగువ పేర్కొన్న అధికారులు జారీచేసిన ధృవీకరణ పత్రాల ఆధారంగా

1.

2.

.................................. గారి కుమారుడు/తండ్రి అయిన ................................ గారు ....................................చిరునామాలో నివసిస్తున్నారు. వీరి ఆదాయం అన్ని వనరుల నుంచి కలుపుకొని ఈ గిగువ తెలిపిన విధంగా ఉందని ధృవీకరిస్తున్నాము.

భూమి :
భవనం :
భార్యా, భర్త ఉభయులూ :
ఉద్యోగస్తులైతే వారి జీతం :
కూలా/ భత్యం :
అభ్యర్థనా పత్రంలో పేర్కొన్న ఇతర సేవల ద్వారా :
ఆదాయం :

మొత్తం రూ......................................................
(అక్షరాలా........................................................... రూపాయలు మాత్రమే)

స్థలం : హైదరాబాద్ తహశీల్దారు
తేదీ:................................. .........................మండలం

గమనిక: తండ్రి జీవించి ఉండకపోతే, సంరక్షకుని ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది.

## షెడ్యూలు తరగతులు/ షెడ్యూల్డు తెగల వెనుకబడిన తరగతుల కుల ధృవీకరణ పత్రానికై అభ్యర్థనా పత్రం నమూనా

తహశీల్దారు గారికి
.................................. మండలం
(ఆం.ప్ర)

1. అభ్యర్థి పేరు :
(పూర్తి పేరు, విడి అక్షరాల్లో)
2. తండ్రి పేరు :
3. స్త్రీ/ పు :
4. స్వస్థలం (జిల్లాపేరు) :
5. ప్రస్తుత చిరునామా :
6. కులం :
7. జతపరచబడినవి :గుర్తింపు పొందిన పాఠశాల/ కళాశాల నుంచి టి.సి కుటుంబంలో వేరెవరికైనా గతంలో కుల ధృవీకరణ పత్రం జారీ అయితే, దాని కాపీ :
8. అఫిడెవిట్‌తో సహా ప్రస్తుత వయసు :
9. రేషను కార్డు కాపీ :
10. ఇద్దరు రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడ్ అధికారుల సర్టిఫికెట్ :

### స్వీయ ప్రకటన

పై అభ్యర్థనా పత్రంలో పేర్కొన్న విషయాలన్నీ వాస్తవాలని తెలియజేస్తున్నాను. ఇచ్చిన సమాచారం తప్పని రుజువైతే భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 199, 200 క్రింద నేను శిక్షార్హుణ్ణి.

అభ్యర్థి సంతకం
(          )

## కుల ధృవీకరణ పత్రం

........................................ గారి కుమారుడు/కుమార్తె/ భార్య అయిన శ్రీమతి/ శ్రీ/ కుమారి .................................... గారి క్లెయిమ్‌ను ధృవీకరిస్తున్నాను. ఆమె/ అతడు ......................... చిరునామాలో .................... తాలూకాలో.......................................జిల్లాలో .................................... రాష్ట్రంలో నివసిస్తున్నారు.

అతడు/ ఆమె ............................................... క్రింది షెడ్యూల్డు కులం/ షెడ్యూల్డు తెగ/ వెనుకబడిన తరగతులకి చెందుతారు.

2. శ్రీ/ శ్రీమతి/ కుమారి............................................ ఆమె/ అతడి కుటుంబ సభ్యులు ............................ గ్రామంలో................................ నంబరు గల చిరునామాలో నివసిస్తున్నారు. ఇది ........................................ రాష్ట్రంలో ..........................................జిల్లాలో ఉంది.

గెజిటెడ్ అధికారి సంతకం :
తేదీ :
హోదా :
అధికార ముద్ర :
పేరు :

---

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**(రెవెన్యూ శాఖ)**

తహశీల్దారు గారి కార్యాలయం

నం. తేదీ: ......................... ..............................మండలం,

తేదీ ...............................

## అనుబంధం 3 (బి)

## కులధృవీకరణ పత్రం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ..........................జిల్లా.................................... మండలం పరిధిలోని........................ నంబరు గల చిరునామాలో నివసిస్తున్న...................................గారి కుమారుడు/ కుమార్తె/ భార్య అయిన శ్రీ/ శ్రీమతి/ కుమారి...............................గారి క్లెయిమ్‌ను నిబంధనలకి లోబడి ధృవీకరిస్తున్నాను.

ఆమె/ అతడు ............................................కులానికి చెందుతారు. ఈ కులాన్ని.................................. గ్రూపు క్రింద సీరియల్ నం ............................ ద్వారా షె.కు/ షె.తె/ వెనుకబడిన తరగతిగా గుర్తించారు.

2. శ్రీ/ శ్రీమతి/ కుమారి............................ గారి కుటుంబ సభ్యులు ............................... నంబరు గల చిరునామాలో నివసిస్తున్నారు. ఈ చిరునామా ఆంధ్రప్రదేశ్‌లోని .................................జిల్లా పరిధిలోనిది. ఈ ధృవీకరణ పత్రం విద్యార్జనకు/ ఉద్యోగాన్వేషణకు మాత్రమే ఉపయోగపడుతుంది.

స్థలం : .................................... తహశీల్దారు
తేదీ : ...................................... మండలం

తహశీల్దారు గారికి,

మండలం,

ఆర్యా!

**విషయం : చట్టపర వారసత్వ ధృవీకరణ/ కుటుంబ సభ్యత్వ ధృవీకరణ పత్రానికై, అభ్యర్థనా పత్రం**

మా ............................................... గారు,................................................... ఇంటి నివాసి,........................................తేదీన మరణించారు. ఆమె/ అతడు పెన్షనరు.

అతడు/ ఆమె ........................................... కార్యాలయంలో ............................ ఉద్యోగం చేస్తూ ఉండగా మరణించారు.

కుటుంబసభ్యుల వివరాలు :

| వరుస సంఖ్య | కుటుంబ సభ్యుని పేరు | వయస్సు | మరణించిన వారితో బంధుత్వం | వివాహితుడు/ వివాహితురాలు అవును/ కాదు |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | | | | |
| 3 | | | | |
| 4 | | | | |
| 5 | | | | |
| 6 | | | | |

పై కారణాల దృష్ట్యా నాయందు దయ ఉంచి నాకు చట్టబద్ద వారసత్వ ధృవీకరణ పత్రము/ కుటుంబ సభ్యత్వ పత్రము ఇప్పించగలరు. మరణించిన వ్యక్తి మరణ ధృవీకరణ పత్రాన్ని వరుస నం................................తేదీ........................., పెన్షన్ పేమెంట్ వీటిని/ సర్వీసు సర్టిఫికెట్‌ను మీ పరిశీలనార్థం, తదనంతర చర్యల కోసం సమర్పిస్తున్నాను.

కృతజ్ఞతలతో

తేదీ :...................................

భవదీయుడు

చిరునామా :.......................................

పేరు ...................................

(విడి అక్షరాలల్లో)

..................................గారి భార్య/

కుమార్తె/ కుమారుడు

# సాక్షి ప్రమాణ పత్రము

...................................... గారి కుమారుడు (............వయస్సు) ........................ పనిచేస్తున్నాడు. అతడు..............................చిరునామాలో నివసిస్తున్నాడు. అతడి ప్రమాణ పూర్తి వాంగ్మూలాన్ని.........................న రికార్డు చేయడమైనది.

................................ అయిన నేను సత్య నిష్టతో, ప్రమాణ పూర్తిగా పేర్కొంటున్న విషయం. నాకు ఈ కేసు సంబంధించి అన్ని వివరాలు తెలుసు. నాకు చనిపోయిన............................తెలుసు. అతడు/ ఆమె .....................................చిరునామాలో నివసించేవాడు. అతడు/ ఆమె..................................... లో ఉద్యోగం చేసేవాడు. అతడు/ ఆమె/ ఆమె సర్వీసులో/ పదవీ విరమణ తర్వాత మరణించాడు. అతగి చట్టబద్ద వారసుల/ కుటుంబ సభ్యుల పేర్లు ఈ దిగువ పేర్కొనబడ్డాయి.

| వరుస సంఖ్య | సభ్యుని పేరు | వయస్సు | మరణించిన వారితోసంబంధం | స్థలం |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | | | | |
| 3 | | | | |
| 4 | | | | |
| 5 | | | | |
| 6 | | | | |

పై జాబితాలోని సభ్యులు (   ) తప్ప ఇంకెవ్వరూ, చనిపోయినా వ్యక్తికి చట్టబద్ధ వారసులు/ కుటుంబ సభ్యులు లేరు. చనిపోయిన శ్రీ ................................ కి భార్య ఒక్కతే. చనిపోయిన వ్యక్తి జీవిత కాలంలో రెండో వివాహం చేసుకోలేదు.

నాకు తెలిసినంత వరకూ పై వివరాలన్నీ నిజాలని నమ్ముతున్నాను. వీటిపై నేను మొత్తంగా బాధ్యత వహిస్తాను.

ఈ వాంగ్మూలాన్ని నా మాతృభాష ............................................లో వినిపించడం జరిగింది. నేనీ ఈ వాంగ్మూలాన్ని ఆమోదిస్తున్నాను.

" నాచేత రికార్డు చేయబడినది "

యు.బి.ఆర్.ఐ (     ) సర్కిల్ 　　　　　　　　　　　　సాక్షి

**............ వ సర్కిల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నివేదిక**

తహశీల్దారు గారికి తేదీ :..........................

మండలం, ఆర్యా!

విషయం : చట్టబద్ద వారసత్వ ధృవీకరణ/ కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాల జారా/ఎ/ సి...................గారి కుమారుడు................... నివాసి

ఉల్లేఖనం : ఎం.ఆర్.ఓ/ సూపరింటెండెంట్ ఎండార్స్‌మెంట్ తేదీ :............................ ఎకౌంట్ ..............................

పై ఉల్లేఖనానికి కొనసాగింపుగా సంబంధిత గ్రామానికి విచారణకై వెళ్ళాను.

...................................... గారి కుమారుడు/ భార్య అయిన శ్రీ/ శ్రీమతి ............................ అభ్యర్థనా పత్రం ఇచ్చిన వ్యక్తికి భర్త/ భార్య/ తల్లి/ తండ్రి రూపకంగా బంధువు. చనిపోయిన వ్యక్తి......................నంబరు గల చిరునామాలో నివసించేవాడు...................... కార్యాలయంలో పనిచేసేవాడు. అతడు........................... తేదీ............................. వద్ద...................... లో చనిపోయాడని, నా విచారణలో తేలింది. ఇతడి చట్టబద్ద వారసుల/ కుటుంబ సభ్యుల పేర్లు ఈ దిగువన పేర్కొనబడ్డాయి.

| వరుస సంఖ్య | కుటుంబ సభ్యుని పేరు | వయస్సు | మరణించిన వారితో బంధుత్వం | వివాహితుడు/వివాహితురాలు అవును/ కాదు |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | | | | |
| 3 | | | | |
| 4 | | | | |
| 5 | | | | |

పైన పేర్కొన్న వారు మినహా మరణించిన వ్యక్తికి చట్టబద్ధవారసులుగాని, కుటుంబ సభ్యులుగాని లేరు. చనిపోయిన వ్యక్తి జీవితంలో ఒకే/ ఇద్దరు భార్య(లు) కలిగి ఉన్నాడు.

పెన్షను, ఇతర ప్రయోజనాలను పొందేందుకు చట్టబద్ద వారసత్వ ధృవీకరణ పత్రం/ కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం అవసరం అవుతాయి.

ఇందుకు సంబంధించిన నిజపత్రాలను, మరణించిన వ్యక్తికి బాగా తెలిసిన ఒక ప్రభుత్వ ఉద్యోగి వాంగ్మూలాన్నీ తిరిగి ఇచ్చివేస్తున్నాను.

భవదీయుడు

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సర్కిల్

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## (రెవెన్యూ శాఖ)

తహశీల్దారు కార్యాలయం,
...................... మండలం,
............................ ఆం.ప్ర

సం.తేదీ : తేదీ :...............................

## చట్టబద్ధ వారసత్వ ధృవీకరణ పత్రం

మండల రెవెన్యూ గిర్ద్వార్ ఇన్స్పెక్టర్, .......................................... మండలం, వైడ్ నం.......................... నంబరు గల చిరునామా నివాసి, ............................................... గారి కుమారుడు/ భార్య అయిన శ్రీమతి/ శ్రీ ....................................పెన్షనరు. ఆమె/ అతడు సర్వీసులో ఉండగా ............................................. తేదీన చట్టబద్ధ వారసులు

ఈ క్రిందివారు, అతడు/ ఆమె చట్టబద్ధ వారసులు

| వరుస సంఖ్య | పేరు | వయస్సు | మరణించిన వారితో బంధుత్వం | వివాహితుడు/వివాహితురాలు అవును/ కాదు |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | | | | |
| 3 | | | | |
| 4 | | | | |
| 5 | | | | |

ఈ ధృవీకరణపత్రాన్ని మరణించిన వ్యక్తి పెన్షను కోసము, సర్వీసు ద్వారా రావాల్సిన ఇతర ప్రయోజనాలకోసమూ మాత్రమే జారీ చేయడం జరిగింది.

తహశీల్దారు
............................ మండలం

## ఫారమ్ 1 ఎ

**(5 (1) (బి) నిబంధనలను చూడండి)**

క్లెయిమ్‌దారుని పేరు:

శాశ్వత చిరునామా :

### క్లెయిముల పూర్తికి నమూనా

**175 పేజి  అడ్డంగా రావాలి.**

## సాధారణ అన్వేషణ (జనరల్ సర్చ్)కై అభ్యర్థనా పత్రం

జి.ఎస్.నం:..............................

దరఖాస్తుదారుని
పూర్తిపేరు, చిరునామా :
(విడి అక్షరాలల్లో)
సబ్ రిజిస్ట్రార్ గారికి,

ఆర్యా!

దయ ఉంచి ఈ దిగువ పేర్కొనబడిన ఆస్తిపై ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ అందజేయగలరు.

1. ఆస్తి పూర్తి వివరాలు
   ఆస్తి సరిహద్దులు
   ఉత్తరం
   దక్షిణం
   తూర్పు
   పడమర
2. ............................... తేదీ నుంచి .................................. తేదీ వరకూ అన్వేషణ జరపాలి.

ఈ ఆస్తినా/ మాదేనని, ఇది ఏకాండి ఆస్తి అని ప్రకటిస్తున్నాను/ ము.

జనరల్ సర్చ్ నం :
దరఖాస్తు రుసుము :
అన్వేషణ రుసుము :
మొత్తం :

దరఖాస్తుదారుని సంతకం

# ఫారమ్ -6 (ఎ)

## (చట్టంలోని సెక్షన్ 4 (1) తో సహా రూలు 18ని గమనించండి)

## హక్కుల స్వాధీనాన్ని తెలియపరిచే సమాచారం

.....................................................
రికార్డింగ్ అథారిటీ/ తహశీల్దార్ గారికి,
...................................... మండలం

.................................... గారి కుమారుడైన, ................................. అను నేను ............................ మండలంలోని .................................... గ్రామ నివాసిని, ఈ దిగువ పేర్కొనబడిన బహుమతి/ లీజు/ మరే ఇతర కారణాల వల్లగాని, నేను స్వాధీన పరుచుకొన్నానని, స్వంత దారునిగా/ పట్టాదారునిగా/ తాకట్టు పెట్టుకొన్న వానిగా మీకు తెలియజేస్తున్నాను. వివరాలు ఈ దిగువ పేర్కొనబడ్డాయి.

| | జిల్లా | మండలం | గ్రామం |
|---|---|---|---|
| నం: | సర్వే నంబర్లు/ సబ్‌డివిజన్‌లు | భూమి విస్తీర్ణం | స్వాధీన వివరాలు |

తేదీ :.........................................

సమాచార కర్త సంతకం

ప్రకటన పత్రము నం: .......................... ఆదాయ వర్గము: ............................
సర్కిల్ నం: ............................ మొత్తం సభ్యుల సంఖ్య....................
దుకాణము నం: ............................. వయోజనలు: ................................
ఎల్.పి.గ్యాస్ నం: ............................. పిల్లలు : .................................
ఎల్పి.గ్యాస్ డీలర్ పేరు : ........................... ముఖ్య ఆహారం: .........................

**ధృవపత్రము**

1............................... అనుపేరు, ఇ.నెం .................................. అను నివాసము (చిరునామా) లో నేను మరియు దిగువ పట్టికలో తెలిపిన కుటుంబ సభ్యులు, పైన వ్రాసిన చిరునామాగల ఒకే కుటుంబంలో ఉంటున్నామని, మా ముఖ్య ఆహారం.............................. అని, అందులో తెలిపిన వివరాలు నిజమైనవని, సరైనవని ఇందుమూలంగా ధృవీకరిస్తున్నాను.
2. దీనిని కుటుంబ యజమాని పూరించవలెను/ కుటుంబ యజమాని అక్షరాస్యుడు కాని సందర్భంలో విచారణాధికారి పూరించాలి.

| వరుస సంఖ్య | ఒకే కుటుంబంలోని సభ్యులు పేర్లు కుటుంబయజమాని | వయస్సు | తండ్రి/భర్త (వివాహిత) స్త్రీ విషయంలో పేరు | కుటుంబ యజమానితో సంబంధం | వృత్తి | వార్షికఆదాయం భూమి ఇతరములువలన (ఏ)భూమిద్వారా (బి) ఇతర | విశేషాంశాలు |
